పదమూడో జన్మదిన ప్రత్యేక సంచిక

వీక్షణం

VEEKSHANAM, TELUGU MONTHLY
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 13 సంచిక : 1 హైదరాబాద్ 162 జనవరి 2015 పేజీలు : 80 రు. 25

- ప్రశ్నిద్దామా, వద్దా అనేదే అసలు ప్రశ్న
  - రొమిల్లా థాపర్ ప్రత్యేక వ్యాసం
- ఆంధ్రప్రదేశ్ రాజధానిపై రెండు వ్యాసాలు
- ఆర్ఎస్‌రావు స్మారక సదస్సు 2014 పత్రాలు
- ప్రభుత్వాలు మారాయి, మరి విధానాలో?
- ఆరోగ్యరంగంలో రావలసిన మార్పులు
- కృష్ణ అయ్యర్, రెహనా సుల్తానా సంస్మరణ
- పెషావర్ మారణకాండ

దాతలందరికీ ధన్యవాదాలు!

మీ ఆదరణే వీక్షణం మనుగడకు ఆధారం!

వీక్షణం డిసెంబర్ సంచిక వెనుక కవర్‌పై తెలుగు సమాజంలోని ప్రభావశీలురైన పద్దెనిమిది మంది పెద్దలు 'వీక్షణంను ఆదుకొండి' అని ఇచ్చిన పిలుపుకు గణనీయమైన స్పందన వస్తున్నది. ఆ విజ్ఞప్తిని నవంబర్ 29న వీక్షణం ఫేస్‌బుక్ పేజి మీద, సంపాదకుడి ఫేస్‌బుక్ పేజి మీద పెట్టినప్పటి నుంచీ విరాళాల రూపంలోను, వాగ్దానాల రూపంలోను మంచి స్పందన ఉంది. సంపాదకుడి ఫేస్‌బుక్ పేజి మీద పెట్టిన విజ్ఞప్తిని 61 మంది మిత్రులు తిరిగి తమ పేజిల మీద పోస్ట్ చేశారు. ఆ పేజి మీద ఎంతో మంది తమ హార్దిక సంఘీభావాన్ని ప్రకటించారు. ఎలక్ట్రానిక్ పద్ధతిలో విరాళాలు పంపగలిగినవారు వెంటనే పంపించడం ప్రారంభించారు. పత్రిక అందిన తర్వాత మరెందరో ఆ విజ్ఞప్తికి స్పందించారు. వీక్షణం కార్యాలయానికి వచ్చి, ఫోన్ చేసి తాము ఏ రూపంలో సహాయం అందించగలమో చెప్పారు. వీక్షణం నిర్వాహక బృందం ఈ దాతలందరికీ సవినయంగా ధన్యవాదాలు ప్రకటిస్తున్నది. ఈ ఆదరణ మా కర్తవ్య దీక్షను మరింత పెంచిందనీ, మా బాధ్యతను నెరవేర్చడంలో మేం మరింత జాగ్రత్తగా, మెరుగ్గా ఉంటామనీ హామీ ఇస్తున్నాం. మీ ఆదరణే వీక్షణంకు ఆధారం. – సం.

నా పేరుతో చిన్న విరాళంగా రు.10 వేలు పంపిస్తున్నాను. పేర్లు పడతాయనీ, ఫొటోలు వేస్తారనీ విరాళాలు ఇచ్చే పద్ధతి సమాజంలో ఎప్పుడూ ఉంది. అందుకే ఏ విరాళానికీ గతంలో నా పేరు ఇవ్వడం నేను ఎప్పుడూ చేయలేదు. కానీ, ఈ పరిస్థితి వేరు. ఈ పత్రిక నిలబడాలని సంతకం నేనూ చేశాను. సంతకం పెట్టినవాళ్లే డబ్బు ఇవ్వలేదంటే, అది హాస్యాస్పదం. నేను సంతకం పెట్టడమేగాక ఇవ్వగలిగినంత ఇచ్చినట్టు పాఠకులకు తెలియాలి. అందుకే నా పేరు కూడా చెప్పుకుంటున్నాను ఇప్పుడు.

– రంగనాయకమ్మ, హైదరాబాద్

కొన్ని నెలలుగా వీక్షణం ఆన్‌లైన్ చదువుతున్నాను. మా నాన్న కోసం ఒక సంవత్సర చందా కూడా కట్టాను. ప్రధాన స్రవంతి పత్రికలకూ వాస్తవానికీ మధ్య తేడా తెలుసుకోవడానికి వీక్షణంలోని వ్యాసాలు చాల ఉపయోగ పడుతున్నాయని ఆయన కూడ అన్నారు. వీక్షణం మరెన్నో సంవత్సరాలపాటు కొనసాగాలి. నేను నా బాధ్యతగా ఇప్పుడే నా విరాళం రు. 5000 పంపుతున్నాను. **– కిరణ్ సుజాత సాంబయ్య,** అమెరికా

వీక్షణం వంటి ప్రత్యామ్నాయ గళాలు ఎప్పుడైనా ఉనికిలో ఉండాలి. మౌలిక సమస్యల మీద అవగాహన పెంచడానికి మీరు చేస్తున్న కృషిని నేను బలంగా సమర్థిస్తున్నాను. నా విరాళం పంపుతున్నాను.

– మధు పెమ్మరాజు, అమెరికా

నేటి సామాజిక పరిస్థితులలో వీక్షణం లాంటి పత్రికల అవసరం చాలావుంది. తలా ఒక చెయ్యి వేద్దాం. రండి.

– ఆనంద్ ఎ.ఎం.ఆర్., గుంటూరు

సామాజిక స్పృహ ఉన్న ప్రతి ఒక్కరూ వీక్షణం నడవటానికి తలా ఒక చెయ్యి వెయ్యాలి. **– రాజేంద్రప్రసాద్ యలవర్తి,** హైదరాబాద్

ప్రస్తుత సందర్భంలో అన్ని ప్రత్యామ్నాయ గళాలనూ కాపాడుకోవలసిన అవసరం ఉంది. కొన్ని అభిప్రాయాలతో కొంత విభేదం ఉన్నప్పటికీ వీక్షణంకు సహాయం చేయడం మానను.

– అక్కిరాజు భట్టిప్రోలు, హైదరాబాద్

వీక్షణంకు మనందరి సహాయం కావాలి. ఒక ప్రత్యామ్నాయ అభిప్రాయాన్ని సజీవంగా ఉంచడానికి, తద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి సహకరించండి. **– ప్రసాద్ చరసాల,** అమెరికా

వీక్షణంను ఆదుకుందాం! **– జి.వి. రామాంజనేయులు,** హైదరాబాద్

వీక్షణం ఆగడానికి వీల్లేదు. **– తుషార్‌కాంతి భట్టాచార్య,** నాగ్‌పూర్

వీక్షణం పత్రికను రక్షించుకోవటం మనందరి బాధ్యత. ఏదో ఒక రూపంలో వీక్షణం పత్రికను ఆదుకుందాం. **– కవిని ఆలూరి,** హైదరాబాద్

వీక్షణంకు సహకరిద్దాం. అబద్ధాలు కలలుగా ప్రచారమవుతున్న వేళ, నిజాలు చెప్పేవాళ్ళు కొందరైనా ఉండాలి.

– కె.వి. కూర్మనాథ్, హైదరాబాద్

అందిన విరాళాలు (నవంబర్ 29 నుంచి డిసెంబర్ 25 వరకు)

ఎం. కోదండరాం, హైదరాబాద్	రు. 1,000
ఎం. క్రాంతి, హైదరాబాద్	రు. 2,000
వేములపాటి అజయకుమార్, హైదరాబాద్	రు. 10,000
రంగనాయకమ్మ, హైదరాబాద్	రు. 10,000
అక్కిరాజు భట్టిప్రోలు, హైదరాబాద్	రు. 5,000
పి. వరవరరావు, హైదరాబాద్	రు. 1,000
ఎ. విజయలక్ష్మి, హైదరాబాద్	రు. 1,000
కిరణ్ సుజాత సాంబయ్య, అమెరికా	రు. 5,000
బి సుప్రసేనా రెడ్డి, అమెరికా	రు. 2,000
పున్నా నర్సింహ, చెన్నై	రు. 1,000
డా. పి. యాదగిరి, హైదరాబాద్	రు. 2,000
శ్రీనివాస్ ఎం. పెమ్మరాజు, అమెరికా	రు. 7,500
మహేశ్ తిప్పర్తి, అమెరికా	రు. 19,300
జెయుబివి ప్రసాద్, అమెరికా	రు. 10,000
శ్రేయోభిలాషి	రు. 3,000
కె. రమేశ్, విజయవాడ	రు. 1,000
ముత్యంరెడ్డి, హైదరాబాద్	రు. 5,000
కొండ్రాయుడు, కడప	రు. 500
పి. శివరాంప్రసాద్, నర్సాపూర్	రు. 576
ఎస్. హజరత్అలి, వేమూరు	రు. 100
శ్రేయోభిలాషి, హైదరాబాద్	రు. 10,000
చరసాల ప్రసాద్, అమెరికా	రు. 10,000
డైనా మెడికల్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్	రు. 10,000
ఘంటసాల కరీముల్లా, గుంటూరు	రు. 500
షేక్ కరీముల్లా, గుంటూరు	రు. 500
డా. కె. జగదీశ్‌రెడ్డి, హైదరాబాద్	రు. 5,000
కె. స్వామిరెడ్డి, హైదరాబాద్	రు. 5,000
చిరంజి యుగంధర్, పెద్దపల్లి	రు. 1,116

పాఠకులకు, రచయితలకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు, న్యూస్ ఏజెంట్లకు

2015 నూతన సంవత్సర శుభాకాంక్షలు

ISSN 2231-6892

162

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

జనవరి 2015
సంపుటి : 13
సంచిక : 1

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – జి.యాదగిరి; నల్గొండ – జి. వెంకటేశ్వర్లు; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎం. రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్.

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; ప్రకాశం – కర్ణ సతీష్‌బాబు; విశాఖపట్నం – పి.వి. రమణ; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత

ప్రింటర్స్
దక్కన్ ప్రెస్ /
చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
మైత్రీ రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 20	రు. 20
సంవత్సరం	రు. 240	రు. 200
మూడు సంవత్సరాలు	రు. 600	రు. 540
ఐదు సంవత్సరాలు	రు. 1000	రు. 900
పది సంవత్సరాలు	రు. 2000	రు. 1700

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపేవారు మాత్రమే బ్యాంక్ స్లిప్‌లపై 'veekshanam' అని రాసి వీక్షణం అకౌంట్ నెంబర్ – **01391101002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

వీక్షణం చాలామందికి ఇచ్చి, చదివించి, చందాలు కట్టిస్తున్నాను. ప్రచారం అన్నా చేయాలని నా సంకల్పం. కానీ దానిని శ్రద్ధగా చదివేవారు కరువైనారు. వీక్షణంలో అచ్చయిన ప్రతి వ్యాసం విలువైనదే. తెలంగాణ వచ్చేదాక పోరాడారు. వచ్చిన తర్వాత, అది ఉద్యమాన్ని అణిచివేస్తుందని బాధపడుతున్నారు. తెరాస పాలనలో తెలంగాణ వాదపు విలువలు లేవనీ, కనుమరుగైపోతున్నాయనీ ఇప్పుడు బాధపడితే లాభం ఏమిటి? రాష్ట్రం కోసం ఒక రోజు జీతం, సమైక్యం కోసం మరోరోజు జీతం, సమైక్యాంధ్ర కోసం మరో రోజు జీతం, నూతన రాజధాని కోసం చందాలు, దందాలూ! కిందపడ్డా పైనపడ్డా, గెలుపు దోపిడీదే! వరదన పడ్డా షావుకారుకి లాభ దృష్టేకదా?

– ఎస్. హజరత్ అలి
వేమూరు

జీవితం చాలా చిన్నది. ఈ చిన్న కాలం ఎంతో విలువైనది. అసహజ మరణాల సూచి ద్వారా అకాల మృత్యువు బారిన పడి కాలగర్భంలో చేరి కనుమరుగైపోతున్న వారి సంఖ్యను ఒకచోట చేర్చి పాఠకులకు తెలియజేస్తున్న వీక్షణం పత్రికకు కృతజ్ఞతలు. అసహజ మరణాలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక కారణాలు ఎన్నో ఉన్నాయి. కాని రహదారి ప్రమాదాలకు మాత్రం పైవేవీ కారణం కాదు. ప్రభుత్వ నిర్లక్ష్యం, రోడ్డు నియమావళి పాటించకపోవడం, రోడ్డు భద్రత, అధికారుల నిర్లక్ష్యం, డ్రైవింగ్ లైసెన్స్ జారీలో అధికారుల అవినీతి, లైసెన్స్ ఉన్నవారు నియమాలు పాటించకపోవడం, యాక్సిడెంట్ చేసిన డ్రైవర్లకు కఠినశిక్షలు లేకపోవడం, రోడ్డు నియమాలను పాటించేలా ట్రాఫిక్ సిబ్బంది ఎక్కువ లేకపోవడం వంటి అనేక కారణాలు ఉన్నాయి. రోడ్డు భద్రత నియమాల విషయంలో గట్టి చర్యలు తీసుకుంటే ఇలాంటి మరణాలను కొన్నింటినైనా తగ్గించవచ్చు.

– శనిగరం తిరుపతి
రామచంద్రాపూర్, కరీంనగర్

వీక్షణం డిసెంబర్ సంచికలో వి. హనుమంతరావు రాసిన 'కుంభకోణాల చిట్టా' వ్యాసం, వి.ఎచ్. కాలమ్ రెండూ కూడా ప్రభుత్వాలు మారినా మారని ఈ వ్యవస్థ స్వభావాన్ని తెలుపుతూ రాసినవే. కాని ఇలాంటి సమాచారం దినపత్రికలలో దినాం వస్తుంది. వీక్షణం లాంటి పత్రికలో విశ్లేషణతో కూడిన వ్యాసాలు, పాఠకుల ఆలోచనకు పదునుపెట్టే వ్యాసాలు వస్తే సమాజానికి ఇంకా ఎంతో మేలు చేసిన వారవుతారని కోరుకుంటున్నాను.

– రవి, కరీంనగర్

వీక్షణం పత్రికలో వేస్తున్న కార్టూన్‌లు చాలా అరుదైనవిగా, అర్థవంతంగా ఉంటున్నాయి. ప్రాంతాలు, రాష్ట్రాలు, దేశాలు వేరయినా పాలకుల స్వభావం ఎలా ఉంటుందో వారి విధానాల్లో అసమానతలు ఎలా రాజ్యాంగ బద్ధంగానే ఉంటాయో, అట్లాగే మీడియా విలువలు నశించి సెన్సేషనల్ వైపు ఎలా పరుగుపెడుతుందో, మొత్తంగా పాలకులు తమ ఆధిపత్యం కోసం ప్రాంతాలను, దేశాలను, తమ అధీనంలో ఉంచుకోవడానికి ఎలాంటి కుట్రలు చేస్తున్నారో కార్టూన్ల ద్వారా తెలిపి మాకు కార్టూన్ల లోటును పూడ్చినందుకు కృతజ్ఞతలు.

– రాజు, వరంగల్

వీక్షణం నవంబర్ 2014 సంచికలో వచ్చిన 'స్టీల్ సిటీ వెలుగుల కింద చీకటి బతుకులు' అనే వ్యాసం చాలా బాగుంది. కార్పొరేట్ శక్తులు ఎంత దుర్మార్గంగా తమ లాభాల కోసం పేద ప్రజానీకం బతుకుల్ని ఎలా ఛిద్రం చేస్తున్నారో చాలా గొప్పగా రాశారు రచయిత. విచ్ఛిన్నమవుతున్న తెలుగు మీడియా వ్యాసంలో రచయిత జాతీయోద్యమంలో పాదుకొనబడిన మానవతా విలువలు ఏ విధంగా క్రమానుగతంగా క్షీణగతికి చేరుకున్నాయో చాలా వివరంగా రాశారు. సమాచార రంగాన్ని ఎట్లా క్రమానుగతంగా దోపిడి వర్గాలు చేజిక్కించుకున్నాయో విమర్శనాత్మకంగా రాశారు. అనాది నుండి విద్యను కొన్ని వర్గాలు గుత్తసొమ్ముగా తీసుకొని అట్టడుగు ప్రజానీకానికి అందకుండా చేశారో అందరికి తెలిసిందే కదా! విద్య మీద ఎవరికైతే హక్కు కలిగి ఉంటుందో ఆ విద్యను దూరం చేసి, ప్రజల్ని అమాయకుల్ని చేసి అజ్ఞానంలో ముంచెత్తి పెట్టుబడిదారులు తమ దోపిడీని సజావుగా కొనసాగించుకుంటున్నారో ఈ వ్యాసం బాగా వివరించింది.

– కడియాల సుబ్బనాచారి
నెల్లూరు

వీక్షణం డిసెంబర్ 2014 సంచికలో వచ్చిన సంపాదకీయ వ్యాఖ్య 'రాజధాని పేరిట ఆశ్రితులకు నీరాజనాలు'లో కాస్తంత సూక్ష్మంగా పలు విషయాలు చోటు చేసుకున్నాయి. సంపాదకులు పేర్కొన్నట్లుగా నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు ముమ్మాటికీ అత్యంత ఆందోళనకరమే. 'ప్రజా రాజధాని' టైటిల్‌తో ఆ ప్రాంతంలో భూములు కలిగి ఉన్న వారిని రాజధాని నిర్మాణంలో బలవంతంగా భాగస్వాములను చేయడానికి, ముఖ్యంగా నిరుపేద రైతులపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత క్రూరమైన దాడికి పూనుకుంటుంది. వారి భూములను సామ, దాన, భేద, దండోపాయాలతో మోసపూరితంగా గుంజుకోవడానికే తెగించింది. నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజధాని అనుకూల ప్రాంత అధ్యయనం కోసం నియమింపబడిన శివరామకృష్ణన్ కమిటీ సమర్పించిన నివేదికపై కనీసం నామమాత్ర చర్చకు కూడా అధికార, మిత్ర, ప్రతిపక్షాలు (టిడిపి, బిజెపి, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ) అవకాశం ఇవ్వకుండా మరుక్షణమే నివేదిక బుట్టదాఖలుకు పూనుకున్నాయి. విజయవాడను ఆమోదించని నివేదిక ఏదైనా బుట్టదాఖలే అన్నట్లుగా ప్రవర్తించాయి. నీలం సంజీవరెడ్డి నుంచి కిరణ్ కుమార్‌రెడ్డి – మళ్లీ చంద్రబాబు నాయుడు వరకు పదవులు రాయలసీమకు, ప్రయోజనాలు ఆంధ్ర పెత్తందార్లకు అన్నట్లుగా కొనసాగుతుంది తెలుగు నేలపై సుదీర్ఘ రాజకీయ కాలం. అందుకే విజయవాడ రాజధాని అయితే మాకు (వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి) ఎలాంటి అభ్యంతరం లేదంటూ ప్రధాన ప్రతిపక్ష నేతగా వై ఎస్ జగన్మోహన్ రెడ్డి తొలి పలుకులతో విజయవాడ రాజధానికి స్వాగతం పలికాడు. శ్రీబాగ్ ఒడంబడిక ఉల్లంఘన నాటి నుంచి అన్యాయానికి గురయ్యామని భావించే రాయలసీమ ప్రజలు, నూతన రాజధాని ఎంపిక నేపథ్యంలో తిరిగి కర్నూలును రాజధానిగా ప్రకటించాలంటూ చేసిన ప్రజాఉద్యమం రాజకీయ పార్టీల మద్దతు లభించక ఒక్కరోజుకే పరిమితమైంది. ఎల్లప్పుడూ ముఖ్యమంత్రి పదవులను ఆశించే నాలుగు జిల్లాల రాయలసీమ నాయకుల మనుగడకు ఆంధ్ర మద్దతు తప్పితే మరో ప్రత్యామ్నాయ దిక్కు లేదిప్పుడు. అందుకే ఆంధ్ర పెత్తందార్ల ప్రయోజనాలకు వంతపాడడం మినహా వారికి మరో మార్గం లేకపోయింది. మరి రాయలసీమకు ఏమిస్తారు? అనే ప్రశ్న బలపడక ముందే 'రాయలసీమకు నేనే పెద్ద ప్యాకేజీ' అంటూ సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమ ప్రయోజనాల ప్రశ్నను పలుచన చేశాడు, పైగా చులకన చేశాడు. నేడు ఆ 'పెద్ద ప్యాకేజీ చంద్రబాబు' రాయలసీమ ప్రాంతానికి చెందిన అత్యంత విలువైన వనసంపదను (ఎర్రచందనం) విక్రయించి తద్వారా వచ్చే రాబడి వేల కోట్ల రూపాయలను విజయవాడ సుందరీకరణలో కుమ్మరించడానికి సన్నద్ధమయ్యాడు.

శివరామకృష్ణన్ కమిటీ నివేదిక ప్రకారం విజయవాడ పరిసర ప్రాంతం రాజధానిగా ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. అక్కడి భూములు కడు సారవంతమైనవి, పైగా కడు ఖరీదైనవి. చట్టప్రకారం విజయవాడలో భూ సేకరణ కూడా చాలా ఖర్చుతో కూడుకున్న పని. కేవలం కొద్దిపాటి భూ సేకరణకే భారీ వ్యయం కేటాయించడం సమంజసం కాదంటూ శివరామకృష్ణన్ కమిటీ తేల్చింది. అయితే, చట్టం మాకు పట్టదన్నట్లు వ్యవహరిస్తుంది రాష్ట్ర ప్రభుత్వం. భూ సమీకరణ పేరుతో ప్రజలకు అభూత కల్పనలు కల్పించి, వారిని అయోమయానికి గురిచేస్తుంది. భారీ స్థాయిలో, అంచలంచెలుగా సుమారు లక్ష ఎకరాల భూమి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. నిన్నామొన్నటి వరకూ 'ప్రత్యేక ఆర్థిక మండళ్లు' పేరుతో దేశంలో సాగు భూములపై జరిగిన ఎన్నో దురాగతాలను మించిపోయే విధంగా తాజా చంద్రబాబు ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా సంపూర్ణ సాగుయోగ్యమైన భూమి సమీకరణకు సిద్ధమైంది. ఇకముందు బాధితులు ఎంతమందో మరి! ఒకవేళ భూ సేకరణ చేపట్టినప్పటికీ, అందుకు సహకరించిన రైతులకు ఇవ్వాలనుకున్న నామమాత్రపు చెల్లింపులు వాయిదాల పద్ధతిలో పది సంవత్సరాల కాలపరిమితిని నిర్ణయించింది ప్రభుత్వం. అంటే రాజధాని నిర్మాణం కోసం రైతులు ప్రభుత్వానికి సహకరించి తమ భూమిని విక్రయిస్తే (ధర మాట దేముడెరుగు) తమకు రావాల్సిన మొత్తం సొమ్ము కోసం పది సంవత్సరాల పాటు ప్రభుత్వంపై ఆధారపడుతూ నిరీక్షించాలన్నమాట. ఇది రైతులకు ప్రభుత్వం అధికారికంగా అందిస్తున్న ఆఫర్. కలగాపులగం వింతలతో కూడిన ఇలాంటి అనేక గందరగోళమైన ఆఫర్లను రైతులపై రుద్ది వారి భూమిని చేజిక్కించుకోడానికి

(మిగతా 22వ పేజీలో...)

ఘర్‌వాపసీ కాదు, మతవిద్వేష రక్తపిపాస

జర్మనీని ఆర్యభూమిగా పునరుద్ధరిస్తానని, ఆర్యేతరులందరినీ నిర్మూలించే కార్యక్రమంలో భాగంగా మొదట యూదులను హతమారుస్తానని నియంత అడాల్ఫ్ హిట్లర్ స్పష్టంగానే చెప్పుకున్నాడు. నరేంద్ర మోడీ నాయకత్వంలో బహుసంస్కృతుల భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చడానికి, ప్రధానంగా ముస్లింల పట్ల, క్రైస్తవుల పట్ల ద్వేషభావాలు రెచ్చగొట్టడానికి జరుగుతున్న ప్రయత్నం, హిట్లర్ పాలనా విధానాల కొనసాగింపు విజయవంతంగా సాగుతున్నదనడానికి ఉదాహరణ. గత కొద్ది వారాలుగా సాగుతున్న ఘర్ వాపసీ అనే కార్యక్రమపు ప్రచారం, ఆచరణ ఇప్పటివరకూ జరిగిన మత విద్వేష కార్యక్రమాలన్నిటిలోనూ అత్యంత హేయమైనవి, భయానకమైనవి. ఘర్ వాపసీ – ఇంటికి తిరిగిరావడం – అనే ఆత్మీయ పునరాగమనాన్ని, పునర్మిలనాన్ని సూచించే తటస్థమైన, బహుశా ప్రేమ నటిస్తున్నట్టు కనబడుతున్న మాట వెనుక దాగిన అసలు లక్ష్యం మాత్రం మతాల మధ్య, మనుషుల మధ్య భేదాన్ని, అనుమానాన్ని, విద్వేషాన్ని, రక్తపిపాసను, హంతక దాడులను ప్రోత్సహించి, మతం పెట్టుబడిపై రాజకీయ లాభాలను సంపాదించదలచిన క్షుద్రక్రీడ.

భారతదేశంలో ఉన్నవారందరూ హిందువులు కావలసిందే, హిందూ ధర్మాన్ని పాటించవలసిందే అనే సంఘపరివార్ శక్తుల నినాదానికి కొనసాగింపు ఈ ఘర్ వాపసీ. మిగిలిన మతాల మీద, మతస్తుల మీద ద్వేష భావాన్ని రెచ్చగొట్టడానికి ఈ దేశంలో ప్రస్తుతం హిందువులు కానివారి పూర్వీకులు హిందువులేనని, వారిని ఆయాకాలాలలో పాలకులు, ఇతర మతబోధకులు బెదిరించీ ప్రలోభపెట్టీ మతాంతరీకరణ జరిపారని అనడం దశాబ్దాలుగా సంఘపరివార్ శక్తుల అలవాటుగా మారింది. ఇటీవలనే కేంద్ర మంత్రివర్గంలో చేరిన భారతీయ జనతా పార్టీ నాయకురాలు సాధ్వి నిరంజన్ జ్యోతి ఒక బహిరంగ సభలో 'మీరు ఢిల్లీలో రాముని బిడ్డల పాలన కోరుకుంటారా, అక్రమ సంతానపు పాలన కోరుకుంటారా' అంటూ, హిందువులు కాని వారందరూ అక్రమ సంతానమేనని ప్రకటించడం ఈ సంఘపరివార భావజాలంలో భాగమే. అలాగే లవ్ జిహాద్ పేరుతో ముస్లిం యువకులు హిందూ యువతులను ఆకర్షించి పెళ్లి చేసుకుని, హిందూ మతస్తుల సంఖ్యను తగ్గించడానికి కుట్ర చేస్తున్నారని సంఘ పరివార్ శక్తులు కొన్ని సంవత్సరాలుగా అబద్ధ, విష ప్రచారం చేస్తున్నాయి. దానితో ఆగక ఉత్తర ప్రదేశ్ భాజపా నాయకులు 'బహు లావో – బేటీ బచావో' అనే కొత్త నినాదంతో, ఇతర మతాల యువతులను హిందూ యువకులు పెళ్లి చేసుకోవాలని, హిందూ యువతులను మాత్రం ఇతర మతాల యువకుల నుంచి రక్షించాలని పిలుపిచ్చారు.

ఈ మత విద్వేష కార్యక్రమంలో భాగంగానే సంఘ పరివార్ శక్తులు దశాబ్దాలుగా మతాంతరీకరణలను వ్యతిరేకిస్తూ ప్రచారం చేస్తున్నాయి. ఇతర మతాలలోకి ఇష్టపూర్వకంగా వెళ్లినా, ప్రలోభాలతో వెళ్లినా అసలు మతాంతరీకరణనే ఒప్పుకోబోమని, మతాంతరీకరణ నిషేధ చట్టం తెస్తే తప్ప మత మార్పిళ్లు ఆగవని వాదిస్తున్నాయి. భారత రాజ్యాంగ పీఠిక లోని లౌకిక వాదం మీద మాత్రమే కాదు, ప్రాథమిక హక్కులలోని మతస్వేచ్ఛ మీద, ఆదేశిక సూత్రాలలోని శాస్త్రీయ దృక్పథ ప్రాధాన్యత మీద దాడి ఇది.

ఈ విష విద్వేష ప్రచారానికి, కార్యక్రమానికి కొనసాగింపుగా బజరంగ్‌దళ్, హిందూ జన జాగృతి సమితి నాయకులు డిసెంబర్ 10న ఆగ్రాలో దాదాపు 350 మంది వీధి బాలలను, ఫుట్ పాత్ నివాసులను, అనాథలను పోగుచేసి వారిని శుద్ధి చేసి ఘర్ వాపసీ పేరుతో మళ్లీ హిందూ మతంలో చేర్చుకున్నారు. దానికి కొనసాగింపుగా దేశమంతా ఘర్ వాపసీలు నిర్వహిస్తామని, 2012 నాటికి క్రైస్తవులు, ముస్లింలు లేని, హిందువులు మాత్రమే ఉండే భారతదేశాన్ని తయారు చేస్తామని ధర్మ్ జాగరణ్ మంచ్ నాయకుడు ప్రకటించాడు. ఆర్ ఎస్ ఎస్ అధిపతి మోహన్ భగవత్ భారతదేశం హిందువులది మాత్రమేనని ప్రకటించాడు. దేశవ్యాప్తంగా బజరంగదళ్, శివసేన, భాజపా, ధర్మ జాగరణ్ మంచ్ వంటి సంఘ పరివార్ సంస్థలన్నీ చిన్నా పెద్దా ఘర్‌వాపసీ కార్యక్రమాలు చేపట్టి, కొందరు ముస్లింలను, క్రైస్తవులను బెదిరించో, ప్రలోభపెట్టో మళ్లీ హిందువులుగా మార్చడం మొదలు పెట్టాయి. అయితే కుల అంతరాలే ప్రధానమైన హిందూ మతంలోకి తిరిగి రావడమంటే ఏ కులంలోకి రావడం అనే ప్రశ్నను సంఘ పరివార్ శక్తులు తెలివిగా పక్కకు పెడుతున్నాయి. పూర్వీకుల కులంలోకే వెళతారని కొందరు, కోరుకున్న కులంలోకి వెళ్లవచ్చునని కొందరు అంటున్నారు. ఈ జవాబులు అర్థరహితమైనవి. అసలు జరిగేది, ఉద్దేశించేది ఏ కొందరో హిందూ మతంలోకి రావడం కాదు, ఈ బెదిరింపుతో మైనారిటీ మతస్తులను లొంగదీయడం, నిరంతర భయ భీతావహ స్థితిలో ఉంచడం. పాఠ్యప్రణాళికలను మార్చడానికి ప్రయత్నించడం, ప్రగతిశీల చరిత్ర గ్రంథాలను నిషేధించడం, తగుల బెట్టాలని పిలుపులివ్వడం, భగవద్గీతను జాతీయ గ్రంథంగా ప్రకటించాలనడం, క్రిస్మస్ సెలవు దినాన్ని తొలగించి, ఆ రోజున సుపరిపాలనా దినం పేరిట ప్రభుత్వ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం, గాంధీ హంతకుడు, సంఘ పరివార్ నాయకుడు గాడ్సేను కీర్తించడం వంటి ప్రత్యక్ష, పరోక్ష మతోన్మాద చర్యలు ఈ ఘర్‌వాపసీకి అదనపు బలాన్ని చేకూరుస్తున్నాయి.

ఇటువంటి మతవిద్వేష చర్యల మీద పెదవి విప్పని ప్రభుత్వం మతాంతరీకరణను నిషేధిస్తూ చట్టం తేవాలని, మతం మారాలంటే ప్రభుత్వ అనుమతి ఉండాలని నిబంధన పెట్టాలని ఆలోచిస్తున్నది. ఏ మతాన్నయినా విశ్వసించే, ఆచరించే, ప్రచారం చేసే వ్యక్తిగత హక్కుకు రాజ్యాంగం హామీ ఇచ్చింది. బలవంతంగా గాని, ప్రలోభం ద్వారా గాని మత మార్పిడి జరిగితే అవి భారత శిక్షా స్మృతి కింద నేరాలే గనుక రుజువు చేసి శిక్ష విధించవచ్చు. మరొక ప్రత్యేక చట్టం తేవడం మైనారిటీ మతస్తులను, హిందువులు కానివారందరినీ బెదిరించడానికి, రెండోతరగతి పౌరులుగా మార్చడానికి తప్ప మరొకందుకు కాదు. ఘర్ వాపసీ గాని, మతాంతరీకరణ నిషేధ చట్టం తీసుకురావడానికి జరుగుతున్న ప్రయత్నాలు గాని రాజ్యాంగ వ్యతిరేకం. వ్యక్తి స్వేచ్ఛకు వ్యతిరేకం. సమాజ శాంతికి భంగకరం.

వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

ఎవరి మేలు కోసమీ పారిశ్రామిక విధానం?

ప్రతి ప్రభుత్వానికీ తన పాలనలోని ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు అవసరమైన విధానాలు ప్రకటించవలసిన బాధ్యతా, ప్రకటించే హక్కూ ఉంటాయి. ఆధునిక ఆర్థిక వ్యవస్థను వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలుగా విభజించిన తర్వాత, ఆ మూడు రంగాల సమతులాభివృద్ధికి పథకాలు రచించడం కూడ ప్రభుత్వాలు చేయవలసిన పనే. అయితే ప్రజా ప్రయోజనాల కోసం అనే పేరు మీద ఆశ్రితుల, స్వార్థపరశక్తుల ప్రయోజనాలను నెరవేర్చే విధానాలను ప్రవేశపెట్టడం ప్రజాద్రోహమే. తెలంగాణ శాసనసభలో నవంబర్ 27న ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త పారిశ్రామిక విధానం ఇంతకాలంగా తెలంగాణ సమాజం ప్రకటించిన ఆకాంక్షలకూ, ఉద్యమకారులు చేసిన వాగ్దానాలకూ అనుగుణంగా లేకపోవడం విచారకరం. తప్పనిసరిగా తెలంగాణలో పారిశ్రామికీకరణ జరగవలసిందే. అయితే ఆ పారిశ్రామికీకరణ లక్ష్యం ఏమిటి? పారిశ్రామికీకరణ అంటే అభివృద్ధి అని, ఉద్యోగావకాశాలని, మెరుగైన జీవన ప్రమాణాలని తెలంగాణ సమాజం భావించింది. అంతకుముందు జరిగిన పారిశ్రామికీకరణ ఇతర ప్రాంతాల పెట్టుబడిదారుల లాభాపేక్ష కోసం జరిగిందని, అందువల్ల వారు తెలంగాణ వనరులను కొల్లగొట్టుకు పోయారని, తెలంగాణ అవసరాలు తీర్చలేదని, తెలంగాణ భూమిపుత్రులకు ఉద్యోగకల్పన కూడ చేయలేదని భావించింది. తెలంగాణ సమాజానికి ఏదో ఒకమేరకు ఉపయోగపడుతున్న ప్రభుత్వరంగ పరిశ్రమలను కూడ ఉమ్మడి రాష్ట్ర పాలకులు ధ్వంసం చేసి మూసివేశారని ఫిర్యాదు చేసింది. ఈ అక్రమాలను సరిదిద్దడానికే స్వరాష్ట్రం కావాలని ఆకాంక్షించింది. ఇవాళ ప్రభుత్వాధికారంలో ఉన్న ఆనాటి ఉద్యమ నాయకులు ఈ ఆకాంక్షలను నెరవేరుస్తామని పదేపదే ప్రకటించారు. కాని ఇప్పుడు తయారయిన పారిశ్రామిక విధానంలో తెలంగాణ వనరులను తెలంగాణ కోసమే వినియోగించాలనే మాట లేదు. భూమిపుత్రుల ఉద్యోగావకాశాల మాట లేదు. కొత్త ప్రభుత్వరంగ పరిశ్రమల స్థాపన గాని, పాత ప్రభుత్వరంగ సంస్థల పునరుద్ధరణ గాని లేదు. రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు రాయితీలు, అన్ని అనుమతులూ ఒక్కచోటనే 30 రోజులలోగా ఇవ్వడం, రెండు లక్షల డెబ్బై ఐదు వేల ఎకరాల భూమిని పరిశ్రమల కోసం కేటాయించడం, పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు చేయడం వంటి చాల విషయాలున్నాయి గాని వాటి వల్ల తెలంగాణ ఆకాంక్షలు ఎలా నెరవేరుతాయో లేదు. ప్రకటించిన పరిశ్రమల్లో అత్యధికభాగం పెట్టుబడి ఆధారిత, ఉన్నత సాంకేతిక నైపుణ్య పరిశ్రమలు గనుక వాటిలో ఉద్యోగకల్పన ఎక్కువగా ఉండే అవకాశం లేదు. వారికి ఇస్తున్న ఇబ్బడి ముబ్బడి రాయితీలు, మినహాయింపుల వల్ల ప్రభుత్వ ఖజానాకూ వచ్చేది లేదు. తెలంగాణ వనరులు తెలంగాణ ప్రజలకు దక్కాలనే మౌలిక ఉద్యమ లక్ష్యం సాధించే దిశగా చర్యలు లేవు. ఇతర ప్రాంత పెట్టుబడిదారుల వల్ల ఆరుదశాబ్దాలు నష్టపోయిన ప్రాంతం ఆమేరకైనా ఏర్పరచుకోవలసిన రక్షణలు, ఆంక్షలు, నిబంధనలు లేవు. ఈ పారిశ్రామిక విధానం ఎవరికి మేలు చేస్తుంది? వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

చుట్టాల ప్రయోజనాలకే రాజధాని చట్టం

ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిసెంబర్ 20న ఆంధ్రప్రదేశ్ కాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ బిల్లును ఆమోదించి చట్టరూపం ఇవ్వడంతో ఆంధ్రప్రదేశ్ రాజధాని చర్చకు తెరపడి, రాజధాని నిర్మాణ ప్రయత్నాలకు చట్టబద్ధత దొరికినట్టయింది. అయితే ఇది చట్టబద్ధ నిర్ణయమే గాని న్యాయబద్ధమైన నిర్ణయం కాదని చూపడానికి అనేక నిదర్శనాలున్నాయి. మొట్టమొదట ఇది ఐదు కోట్ల ప్రజల పాలనా అవసరాలు తీర్చే రాజధానిని ఏర్పాటు చేసే చట్టంగా కాక ఒక పిడికెడు మంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాలకోసం తయారయినట్టుగా ఉంది. అన్ని వనరులనూ అవకాశాలనూ పథకాలనూ సంపదనూ పాలనా విభాగాలనూ కేంద్రీకరించినందువల్ల ఉమ్మడి రాష్ట్రపు రాజధాని హైదరాబాద్ ఎంత సమస్యాత్మకంగా మారిందో, అది దాని నాలుగు శతాబ్దాల చరిత్రను కోల్పోయి రియల్ ఎస్టేట్ వివాదాల మాఫియా కేంద్రంగా మారిందో స్పష్టంగా తెలిసిన పాలకులే ప్రస్తుతం కొత్త రాజధాని నిర్మించుకునే అవకాశం వచ్చినప్పుడు ఆ గుణపాఠాలేమీ నేర్చుకోకుండా కేంద్రీకృత కాంక్రీటు అరణ్యానికి పథకాలు రచించడం దురదృష్టకరం. ఇక ఇప్పుడు రాజధాని నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం కృష్ణా నదీ తీరం కావడం వల్ల, అక్కడి పుష్కలమైన నీటివసతి ఉన్న జరీబు భూముల వ్యవసాయాన్ని దెబ్బతీసి, ఆ వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్‌గా మార్చి ఎకరాల్లో కొని గజాల్లో అమ్మే దళారులకు అప్పగించడానికి మార్గం సుగమం చేయడం, ప్రభుత్వమే అధికారిక రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా పనిచేయడానికి సిద్ధపడడం మరింత విచారకరం. పైగా నదీ తీరంలో లక్షలాది జనాభాతో ఒక నగరాన్ని రూపొందిస్తున్నప్పుడు ఆ నది కలుషితం కాకుండా, పర్యావరణ విధ్వంసం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాల అవసరం కాగా, అసలు అటువంటి ఆలోచనే లేకపోవడం ఆశ్చర్యకరం. ఇటువంటి భారీ పథకాలకు చట్టబద్ధంగా అనివార్యంగా జరగవలసిన బహిరంగ ప్రజా విచారణ జరపాలని అటు ప్రభుత్వమూ అనుకోవడం లేదు, ఇటు ప్రజా జీవనం గురించి ఆలోచించేవాళ్లూ అడుగుతున్నట్టు వినబడడం లేదు. అటు అమరావతి నుంచి ఇటు మంగళగిరి, ఉండవల్లి దాకా ఎన్నో చారిత్రక, సాంస్కృతిక స్థలాలకు నిలయమైన ఆ ప్రాంతంలో ఇంత భారీ ఎత్తున నిర్మాణాలు రావడానికి, వ్యాపార ధోరణి ప్రబలడానికి అవకాశం ఇస్తున్నప్పుడు ఆ చారిత్రక సంపదను పరిరక్షించే ముందుజాగ్రత్త చర్యలెన్నో తీసుకోవలసి ఉంటుంది. కాని పాలకుల, అధికారుల ప్రవచనాల్లో అటువంటి చారిత్రక, సాంస్కృతిక వారసత్వ స్థలాల పరిరక్షణ ఊసే వినబడడం లేదు. భవన నిర్మాణాలలో వాటా, నష్ట పరిహారం, వార్షిక ఆదాయం, భవిష్యత్తు ఆదాయం వంటి మాయ మాటలతో కొందరు రైతులను ఆకర్షించి వారి భూమి సేకరించవచ్చు గాని, ఆ ప్రాంతంలో భూమి లేని నిరుపేదలకు, వ్యవసాయం మీద, ఇతర సేవావృత్తుల మీద ఆధారపడిన లక్షలాది ప్రజలకు అర్థవంతమైన, గౌరవప్రదమైన ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాల గురించి మాట మాత్రమైనా లేదు. ఈ రాజధాని పాలకుల ఆశ్రితుల కోసమా, ప్రజల కోసమా?

వీ


పెషావర్‌లో రాలిన పసిమొగ్గలు

పాకిస్తాన్‌లోని ఉత్తర వజీరిస్తాన్‌లో పెషావర్ నగరంలో సైన్యం నడిపే ఒక ఉన్నత పాఠశాలలోకి ప్రవేశించిన ఆరుగురు సాయుధులు, ఎనిమిది గంటలపాటు పాఠశాలను తమ అధీనంలో ఉంచుకుని, విద్యార్థుల మీద, ఉపాధ్యాయుల మీద విచ్చలవిడిగా జరిపిన కాల్పుల్లో 132 మంది చిన్నారి పిల్లలతో సహా మొత్తం 141 మంది చనిపోయారు. పాకిస్తాన్ సైన్యం నిర్వహించే ఈ పాఠశాలలో 10 నుంచి 18 ఏళ్ల వయసు గల 500 మంది సైనికుల పిల్లలు, సాధారణ పౌరుల పిల్లలు కూడ చదువుకుంటున్నారు. ఈ దాడి తామే చేశామని, పాకిస్తాన్ సైన్యం ఉత్తర వజీరిస్తాన్ లో తమ మీద జరుపుతున్న దాడులకు, ప్రత్యేకించి జర్బ్ ఎ అజ్బ్ పేరిట 1600 మంది తిరుగుబాటుదారుల ను చంపిన దాడికి ఇది తమ జవాబు అని, చిన్న పిల్లలను వదిలిపెట్టి, పెద్ద వయసు ఉన్న విద్యార్థులను చంపమని తామే ఆదేశించామని, తాము అనుభవిస్తున్న బాధ సైనికులకు తెలిసిరావాలనే ఈ చర్య చేశామని తెహ్రీక్ ఎ తాలిబన్ పాకిస్తాన్ అనే సంస్థ ఆ రోజే ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ కారణాలూ, పాకిస్తాన్ సైనిక బలగాల అకృత్యాలపై వారి కోపమూ సరైనవే అయినప్పటికీ చిన్నారి పిల్లలపై ఇంత దుర్మార్గమైన మారణకాండ జరపడం ఎంతమాత్రమూ అంగీకరించడానికి వీలు లేదు. ఏ యుద్ధంలోనైనా ఆ యుద్ధంలో నేరుగా పాల్గొనని వారిని చంపడం యుద్ధనీతి కాదు. ఒకవేళ ఆ పిల్లల తండ్రులు సైనికులుగా జర్బ్ ఎ అజ్బ్ హత్యాకాండలో బాధ్యులుగా ఉన్నప్పటికీ వారి నేరాలకు వారి పిల్లల మీద శిక్ష విధించడానికి వీలులేదు. ఇది తప్పనిసరిగా అర్థరహిత, ఉన్మాద హింసాకాండ. ఈ పాశవిక దమనకాండకు మొదటి ముద్దాయిగా, నేరస్తురాలిగా తెహ్రీక్ ఎ తాలిబన్ పాకిస్తాన్ తప్పనిసరిగా బోనెక్కి శిక్షను అనుభవించవలసిందే. అయితే, ఈ సమస్య అంతటితో అయిపోదు. ఇటువంటి సంస్థలను తయారుచేస్తున్న అసలు ముద్దాయి, హంతక నేర సామ్రాజ్యాధిపతి అమెరికన్ పాలకవర్గాల గురించి ఆలోచించకుండా, వారి పాత్రను చర్చించకుండా ఈ చర్చ సమగ్రం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఇస్లామోఫోబియాను ప్రచారం చేసి, ఇస్లాంను ప్రపంచం ఎదుట నేరస్తురాలిగా నిలబెట్టి, తన చమురుదాహం కోసం, మార్కెట్ల దాహం కోసం ప్రపంచాన్ని బెగ్గంపాడు చేస్తున్న అమెరికన్ పాలకవర్గాలు కనీసం ఏడు దశాబ్దాలుగా చేజేతులా ఇస్లామిక్ తీవ్రవాదాన్ని పెంచి పోషించాయి. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా ప్రత్యక్షంగా తామే సృష్టించిన తీవ్రవాదులు కావచ్చు, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, ఇరాన్, సిరియా, పాలస్తీనా, లిబియా వంటి అనేక దేశాల మీద తాము జరిపిన దురాక్రమణ వల్ల పరోక్షంగా పుట్టుకు వచ్చిన తీవ్రవాదులు కావచ్చు, మొత్తానికి అమెరికన్ పాలకవర్గాల పాత్రనూ, దాని బంటుగా పాకిస్తాన్ పాలకవర్గాల పాత్రనూ చర్చించకుండా పెషావర్ మారణకాండ గురించి సమగ్రంగా చర్చించలేం. చనిపోయిన అమాయకపు లేడి పిల్ల కోసం కన్నీరు కార్చడం సరే, ఆ లేడిని చంపిన తోడేలును ఖండించినంతమాత్రాన కూడ సరిపోదు, ఆ తోడేలు వెనుక ఉన్న పులి గురించీ ఆలోచించాలి.


వీ

మనం ఓ రాజీకొద్దాం, సరేనా? ఈ భూమీ, ఖనిజాల హక్కులూ, సహజ వనరులూ, చేపలూ, కలపా మా వాటా. వీటన్నిటికి సాంప్రదాయిక యజమానుల హోదా మీదేనన్నమాట. మేమది గుర్తిస్తాం. సరేనా!






❖ **అన్వేషణ కథలు** – రేగులపాటి కిషన్‌రావు – ప్రచురణ : విజయలక్ష్మి ప్రచురణలు –124 పేజీలు, 1/8 డెమీ, రు. 120, ప్రతులకు : రేగులపాటి విజయలక్ష్మి కవితా నిలయం, ఇం.నెం. 10-1-436, సంతోష్‌నగర్, రాంనగర్, కరీంనగర్ – 505 001 సెల్ నెం : 7396036922, 9640606404



❖ **కార్మికులకు ఒక ప్రపంచం ప్రపంచానికి ఒక భవిష్యత్తు** – న్యూ సోషలిస్ట్ ఇనీషియేటివ్ – 68 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు : ప్లాట్ నెం. 3, ధనలక్ష్మి నగర్, నంద్యాల రోడ్, కర్నూలు – 518 002, లేదా ప్లాట్ నెం. 4305, జనప్రియ అవెన్యూ సత్యనగర్, న్యూ మారుతీనగర్ వద్ద, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్




❖ **వెన్నెల జలపాతం కవితా సంపుటి** – గుండాల నరేంద్రబాబు – ప్రచురణ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం – 60 పేజీలు, 1/8 డెమీ, రు. 50,


ప్రతులకు : ఇం.నెం. 25-1-890, నేతాజీనగర్, 3వ వీధి, పద్మావతి సెంటర్, ఆంధ్రకేసరి గర్ల్ పోస్ట్, నెల్లూరు –524 004 ఫోన్ నెం : 9493295992




❖ **మనిషి లోపల** – వారాల ఆనంద్ – ప్రచురణ : ప్రోజ్ పోయెట్రీ ఫోరమ్ – 122 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు : వి. ఇందిరా రాణి, ఇం.నెం. 8-4-641, హనుమాన్ నగర్, కరీంనగర్ – 505 001, సెల్ నెం. 94405012881




❖ **దర్పణం** – డా. ఎ.వి. వీరభద్రాచారి – ప్రచురణ : విశ్వకళ పీఠం – 145 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక షాపులలో



❖ **మన కాళోజి వ్యాసాలు** – లోచన్ – ప్రచురణ: సముద్రం ప్రచురణలు – 32 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు : లోచన్, 1-8-331, బాలసముద్రం, హనుమకొండ, వరంగల్ – 506 001; సెల్: 9346483577




❖ **చెరుకూరి సత్యాన్వేషణ** – సంపాదకులు సాకం నాగరాజు, కోట పురుషోత్తం – ప్రచురణ : చెరుకూరి మిత్రులు – 304 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : సాకం నాగరాజు వరదరాజపురం, తిరుపతి ఫోన్ : 9440331016




❖ **ఏంలేదు** – కథలు – నాయుని కృష్ణమూర్తి – ప్రచురణ : వియన్నార్ బుక్‌వరల్డ్– 158 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : వియన్నార్ బుక్‌వరల్డ్ చౌడేపల్లె – 517 257, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ ఫోన్ నెం. 08581-256234


email : vijayavani_printers@yahoo.com



❖ **పోడు సేద్యం ఆదివాసీల జన్మహక్కు** – టాన్యా – ప్రచురణ : అఖిల భారత రైతు – కూలీ సంఘం–31 పేజీలు, 1/8 డెమీ, రు. 15,




❖ **వర్గం కుల – జెండర్ అణిచివేత – స్త్రీ విముక్తి** – టాన్యా – ప్రచురణ : అఖిల భారత రైతు – కూలీ సంఘం– 36 పేజీలు, 1/8 డెమీ, రు. 20,




❖ **ప్రపంచ విప్లవాల్లో మహిళల పాత్ర** – టాన్యా – ప్రచురణ : అఖిల భారత రైతు – కూలీ సంఘం – 100 పేజీలు, 1/8 డెమీ, రు. 60,

ప్రతులకు : టాన్యా, కేరాఫ్ ఐఎఫ్‌టియు ఆఫీస్: ఇం.నెం. 2-1-716 (బి-6, ఎఫ్-4) ఎస్‌వివిఎస్ స్కూలు ఎదురుగా, ఒయు మెయిన్ రోడ్, విద్యానగర్ హైదరాబాద్–500044; ఫోన్ : 27668471



❖ **బిజెపి, మోడీల విజయం కార్పొరేట్ శక్తుల విజయమే** – ప్రచురణ : కేంద్ర కమిటీ సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ – 39 పేజీలు, 1/8 డెమీ, రు.15, ప్రతులకు : సాధినేని వెంకటేశ్వర రావు, కేరాఫ్ ఐఎఫ్‌టియు ఆఫీస్: ఇం.నెం. 2-1-716 (బి-6, ఎఫ్-4) ఎస్‌వివిఎస్ స్కూలు ఎదురుగా, ఒయు మెయిన్ రోడ్, విద్యానగర్ హైదరాబాద్–500044,ఫోన్ : 27668471




❖ **టి.ఎస్.ఎ. కథ 2013** – టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి – ప్రచురణ : కళా ప్రచురణలు – 88 పేజీలు, 1/8 డెమీ, రు. 72, ప్రతులకు : టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి

3-169-16 రామారావు కాలనీ, బాపూజీ మునిసిపల్ స్కూల్ దక్షిణపు వీధి, మదనపల్లె – 517 325, ఫోన్ : 08571 – 221963, సెల్ : 93472 98942.




❖ **హింస పాదు** – బమ్మిడి జగదీశ్వరరావు – ప్రచురణ : సిక్కోలు బుక్ ట్రస్ట్ – 286 పేజీలు, 1/8 డెమీ, రు. 180, ప్రతులకు : సిక్కోలు బుక్ ట్రస్ట్, ఎంఐజి 100, హౌసింగ్‌బోర్డు కాలనీ, జిల్లా పరిషత్ ఎదురుగా, శ్రీకాకుళం 532001, ఫోన్ : 9989265444



❖ **కా. దేవులపల్లి వెంకటేశ్వరరావు రచనలు –7 – భారత జనతా ప్రజాతంత్ర విప్లవం మౌలిక డాక్యుమెంట్లు** – కా.దేవులపల్లి వెంకటేశ్వరరావు – ప్రచురణ : పోరునేల –390 పేజీలు, 1/8 డెమీ, రు. 150,

ప్రతులకు : రాష్ట్రంలోని ప్రముఖ పుస్తక కేంద్రాలు



❖ **కా. దేవులపల్లి వెంకటేశ్వరరావు రచనలు – 8 – విప్లవ ప్రజాపంథా కోసం భారతదేశపు గ్రేట్ డిబేట్**– కా.దేవులపల్లి వెంకటేశ్వరరావు – ప్రచురణ : పోరునేల –582 పేజీలు, 1/8 డెమీ, రు. 200,

ప్రతులకు : రాష్ట్రంలోని ప్రముఖ పుస్తక కేంద్రాలు

ప్రశ్నిద్దామా వద్దా అనేదే అసలు ప్రశ్న

***మానవ పరిణామంలో ప్రశ్న పాత్ర గురించీ, యూరప్ చరిత్రలో, భారత చరిత్రలో ప్రశ్నించే సంప్రదాయపు పాత్ర గురించీ వివరిస్తూ ఇవాళ ప్రశ్నలు సంధించే ప్రజాహిత మేధావుల అవసరాన్ని చెపుతున్నారు* రొమిల్లా థాపర్**

మెయిన్‌స్ట్రీమ్ పత్రిక స్థాపక సంపాదకుడు నిఖిల్ చక్రవర్తి సామాజిక అంశాలపై మేధోపూర్వక, విద్యాసంబంధమైన అభిప్రాయాన్ని గౌరవించేవారు. సమాజానికీ రాజకీయాలకూ మధ్య అంతస్సంబంధపు స్వభావాన్ని ప్రశ్నించిన వారికి తన పత్రికలో అవకాశం ఇచ్చేవారు. ఇవాళ అటువంటి అవకాశాలు తగ్గిపోతున్నాయి. మేధో ప్రమాణాలు తరిగిపోతున్నాయి. ప్రజాహిత మేధావుల పట్ల అధికారపీఠాల మీద ఉన్నవారికీ, ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసేవారికీ గతంలో కన్న తక్కువ గౌరవం ఉన్నట్టు అనిపిస్తున్నది. ఇలా ఎందుకు జరుగుతున్నదో, ఎలా జరుగుతున్నదో తెలుసుకోవాలనే ఆసక్తి నిఖిల్ చక్రవర్తికి తప్పనిసరిగా ఉండేదని నా అనుమానం. మనం ఏ రకమైన సమాజం కావాలనుకుంటున్నామో, ఎందుకు కావాలనుకుంటున్నామో దానికి సంబంధించిన కీలకమైన విషయం ఇది.

మొదట ప్రజాహిత మేధావుల అవసరం గురించి క్లుప్తంగా వివరిస్తాను. చరిత్ర పరిశోధకురాలిగా నేను చరిత్రలోకీ గతంలోకీ వెళ్లడం సహజమే. ఆధునికకాలంలో ప్రజాహిత మేధావులు తలెత్తడానికి దారితీసిన ఆలోచనలకు సంబంధించి కొందరు గతకాలపు యూరపియన్ల ప్రస్తావనతో ప్రారంభిస్తాను. భారతీయ సంప్రదాయంలో కూడ సరిగ్గా అటువంటి పాత్రనే పోషించిన వారిని కూడ ప్రస్తావిస్తాను. ఈ రెండు రకాల వ్యక్తుల మధ్య సంబంధమేమీ లేదు. బహుశా చాల రకాలుగా వారు సమాంతరంగా వెలికివచ్చారు. చివరిగా ప్రజాహిత మేధావుల పాత్ర ఏమిటో, ఇవాళ్టి మన సమాజంలో అటువంటి వ్యక్తులు మరింత ఎక్కువగా కనబడవలసిన అవసరం ఏమిటో వివరిస్తాను.

ప్రజాహిత మేధావులు సాధారణంగా సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ మానవహక్కుల సమస్యలనూ, సమాజం నడుస్తున్న తీరునూ పట్టించుకుంటారు. నిజానికి ఈ సమస్యల పరిధి విశాలమైనది. అటువంటి వాటిలో కొన్నిటినే, ప్రధానమని నేననుకుంటున్నవాటినే, నేనిక్కడ ప్రస్తావించదలిచాను. మొదటిది, అది మతం అయినా, రాజ్యం అయినా, అప్పటి చర్చను బట్టి మరొకటేదైనా, మనం దేన్ని అధికారంగా గుర్తిస్తామనేదీ, ఎంపికను ఎలా అంచనా కడతామనేదీ. రెండవది, మనం జ్ఞానాన్ని ఎలా గ్రహిస్తామనేదీ, దాన్ని ఏ అవసరాలకు వినియోగిస్తామనేదీ. ఉదాహరణకు, కొత్త జ్ఞానం అమలులో ఉన్న ఛాందసాలను, లేదా సువ్యవస్థిత అధికారాలను వ్యతిరేకించాలని తప్పనిసరిగా ఆశిస్తాం. అయితే ఈ వ్యతిరేకతతో మనం ఎలా వ్యవహరిస్తాం? మనచుట్టూ ఉన్న ప్రపంచం గురించీ, దాని గతం గురించీ సహేతుకమైన, తార్కికమైన వాదనకే ప్రాధాన్యత అనేదానిమీద ఇది ఆధారపడి ఉంటుంది. హేతుబద్ధత గురించి నొక్కి చెపుతున్నప్పుడు నేనేమీ ఒక ఆలోచనా సరళిగా ఊహాశక్తి ప్రాధాన్యతను కొట్టివేయడం లేదు. కాకపోతే ఆ రెంటి మధ్య తేడాను విస్మరించడానికి వీలు లేదు.

ఇటువంటి ఆలోచనలు కొత్తవి కావు. వీటి మూలాలు ప్రాచీన కాలంలో ఉన్నాయి. ఇవే ప్రశ్నలు ఎన్నో శతాబ్దాల వెనుక తలెత్తాయి. సమాజగతిని నిర్ణయిస్తున్నవారిని ప్రశ్నలు అడిగే మన వర్తమాన హక్కుకు పునాదులైన ఆలోచనలు చేసిన కొందరు గతకాలపు వ్యక్తుల గురించి నేనిక్కడ ప్రస్తావించదలచాను. తొలిరోజుల్లో ఈ ప్రశ్నలు ఎక్కువగా హేతుబద్ధ వాదన నుంచీ, తార్కిక ఆలోచన నుంచీ తలెత్తాయి. మానవ స్థితి గురించిన గుర్తింపుతో పదునెక్కాయి. ఆ ప్రశ్నల జవాబులు భూమి మీద ఒక మెరుగైన సమాజం వస్తుందనే ఊహాత్మక భవిష్యత్తుకు ముగింపు పలకలేదు. ఆ భవిష్యత్తు కోసం స్వర్గం వైపో, పునర్జన్మ వైపో వేచి చూడాలని చెప్పలేదు. అటువంటి ఆలోచనంతా తన సంప్రదాయమేనని యూరప్ అంటుంది. అటువంటి ఆలోచనలే భారతదేశంలోనూ ఉన్నాయనే మాట తరచుగా విస్మరణకు గురవుతుంది. కాని నేను ఆ విస్మరణను సవాలు చేస్తున్నాను. సమాజాలు ఏవైనా తప్పనిసరిగా ఛాందసం మీద, అధికారం మీద ప్రశ్నలు సంధించడానికి, కనీసం సంక్షుభిత సమయాలలోనైనా, అనుమతించవలసిందే. అలా అనుమతించకపోతే ఆ సమాజాలు అతి వేగంగా మరణశయ్య ఎక్కుతాయి.

ఇప్పుడు యూరపియన్ గతాన్ని చూద్దాం. ప్రజాహిత మేధావుల సంప్రదాయపు ప్రారంభకులు తాత్విక ప్రశ్నలు సంధించారు. అయితే ఆ ఆలోచనాధోరణి రాజకీయ రంగంలోకి కూడ చొచ్చుకువచ్చింది. సామాజిక కార్యాచరణ ప్రతిపాదనలను ప్రతిఫలించింది. కొన్ని సందర్భాలలో అటువంటి వ్యక్తులు, సోక్రటీస్ లాగ, ప్రశ్నలు వేసినందుకు మూల్యం చెల్లించవలసి వచ్చినప్పటికీ, అధికారాన్ని ప్రశ్నించే హక్కును నిలుపుకున్నారు. దైవం ఉనికి ప్రశ్నించినందుకూ, ఏథెన్స్ లో న్యాయవ్యవస్థ పద్ధతులను విమర్శించినందుకూ ఎథీనియన్ గ్రీక్ అధికారవర్గం ఆయనను తప్పు పట్టింది. అందుకు ఆయన విషపాన శిక్షను అనుభవించవలసి వచ్చింది.

అయితే ఆ క్రీ.పూ. ఐదో శతాబ్దపు సోక్రటీస్ నెలకొల్పిన పద్ధతికి తాము వారసులమని చెప్పుకునే ఒక కీలకమైన యూరపియన్ ఆలోచనాధోరణి ఉంది. ఏదైనా ఒక ప్రకటన ఉందంటే దాన్ని అనేక రకాలుగా ప్రశ్నించాలి. దానిలోని అంతర్గత అంశాల మధ్య అంతస్సంబంధాలను పరిశీలించడానికి దాన్ని చీల్చి చూడాలి. ఆ అంతర్గత సంబంధాలను ఒక కార్యకారణ ప్రాతిపదికతో ముడివేయాలి.

ఆ ప్రాతిపదికను మళ్లీ పరీక్షకు గురిచేయాలి. ఒక ప్రతిపాదనను సరిగ్గా దాని వ్యతిరేక ప్రతిపాదనతో ఎదుర్కోవడమనేది వాదనలో గతితార్కిక పద్ధతికి దారి తీస్తుంది. ఇతర రోమన్ పాలకుల అవినీతిని బహిర్గతం చేసిన క్రీ.పూ. మొదటి శతాబ్దికి చెందిన రోమన్ వక్త సిసిరో దేన్నైనా సరే ప్రశ్నించడానికి హక్కు ఉండాలన్నాడు. తన న్యాయశాస్త్ర ప్రజ్ఞాపాటవాలను ఆ ప్రశ్నలకు ఉపయోగించాడు.

చర్చ్‌ను ప్రశ్నించడం

క్రీ.శ. రెండో సహస్రాబ్దిలో కాథలిక్ చర్చ్ రాజుల మీద తిరుగులేని అధికారాన్ని చలాయించింది. ఆ తర్వాత ఆ అధికారం ప్రశ్నలను ఎదుర్కొంది. జ్ఞానోదయంగా ప్రసిద్ధమైన ఉద్యమానికి యూరపియన్ ఆలోచనను రగిలించిన అనేక అంశాలలో అది ఒకటి. మనకు చిరపరిచితమైన తత్వవేత్తలు – లాక్, హ్యూమ్, వోల్టేర్, మాంటెస్క్యూ, డిడెరో రూసో, తదితరులందరూ సాంప్రదాయిక జ్ఞానాన్నీ ఆచరణనూ ప్రశ్నించడం ప్రారంభించారు. వారిలో వారికీ, వారితో ఇతరులకూ భిన్నాభిప్రాయాలుండేవి. కాని మొత్తంగా చూసినప్పుడు వారి ప్రశ్నలు విమర్శనాత్మక హేతుబద్ధత పైన ఆధారపడినందువల్ల ఆమోదం పొందాయి. ఇవాళ మనం పౌర సమాజం అని పిలుస్తున్న విషయాలపై ప్రత్యేకంగా కాథలిక్ చర్చ్ కు ఉండిన నైతిక అధికారాన్ని వారందరూ ఉమ్మడిగా సవాలు చేయడంతో పాటు, వారు ఉపయోగించిన విమర్శనాత్మక హేతుబద్ధతే వారిని ఏకం చేసింది. ఆ పౌర సమాజం అనేదాన్ని ఇవాళ ప్రధానంగా లౌకిక సంస్థలుగా చూస్తున్నాం. వాటిలో కొన్నిటిని రాజ్యం కూడ నిర్వహిస్తున్నది. అప్పుడు మత మినహాయింపును, అసహనాన్ని అభివృద్ధి నిరోధకమైనవిగా భావించారు. ప్రగతి అనేది సమ్మిళితం చేస్తుందని, భిన్నాభిప్రాయాల పట్ల సహిష్ణుతను పాటిస్తుందని వాదించారు.

మతాన్ని దానికదిగా వ్యతిరేకించాలనే కోరికతో చర్చ్ ను విమర్శించడం కాదది. కుటుంబం, విద్య, పాలన, న్యాయం వంటి సామాజిక సంస్థలపై మతానికి ఉండిన గట్టి పట్టు పట్ల వ్యతిరేకత అది. ఈ సంస్థలకు దైవిక సమ్మతి ఉన్నదనడాన్ని వారు నిరాకరించారు. అందువల్ల పాలనాధికారానికి వనరు ప్రజల మధ్య సామాజిక ఒప్పందం మాత్రమేననే ఆలోచన చేశారు. విశ్వాసాన్ని అనుసరించి దైవవచనాన్ని ఉటంకించడం కాక, హేతుబద్ధ విశ్లేషణ మీద మొగ్గు, మిగిలిన విషయాలతో పాటు సమాజపు పనితీరుకు మూలాలేవో గుర్తించడానికీ, అవసరమైన చోట్ల సమాజంలో మార్పులు సూచించడానికీ మార్గం సుగమం చేసింది.

అయితే తత్వవేత్తల కన్న భిన్నంగా, ప్రత్యేకంగా ప్రజాహిత మేధావి అనే గుర్తించదగిన రూపం పందొమ్మిదో శతాబ్దిలో, డ్రైఫస్ వ్యవహారం అనే దానితోనే తలెత్తారు. డ్రైఫస్ అనే వ్యక్తి ఫ్రెంచి సైన్యంలో కెప్టెన్ గా పనిచేస్తుండిన యూదు. సైనిక రహస్యాలు జర్మన్లకు చేరవేశాడనే తప్పుడు ఆరోపణపై ఆయనను నిర్బంధించారు. ప్రధాన సైనికాధికారి రాజకీయవేత్తలతో కుమ్మక్కై డ్రైఫస్ ను అన్యాయంగా శిక్షించాడని ఈ నిర్బంధాన్ని వ్యతిరేకించినవారు వాదించారు. ఈ వాదనను అక్షరబద్ధం చేసిన నవలాకారుడు ఎమిలీ జోలా తన వాదనకు అనుకూలంగా పెద్ద సంఖ్యలో రచయితలను, కళాకారులను, విద్యావేత్తలను సమీకరించాడు. వారందరినీ కలిపి ఉమ్మడిగా %%మేధావులు%% అని పిలవడం ప్రారంభించారు. చిట్టచివరికి భావోద్వేగాలు లేకుండా, యూదు వ్యతిరేకత లేకుండా జరిగిన విచారణ డ్రైఫస్ నిర్దోషి అని ప్రకటించి ఉద్యోగంలో తిరిగి చేర్చుకుంది. అలా మొదలైన %%మేధావి%% అనే మాటకు అర్థం ఆ వ్యక్తికి పాండిత్యమేమీ అవసరం లేదని భావించింది. మేధావి అంటే ఏదో ఒక గుర్తించదగిన వృత్తి నైపుణ్యం ఉన్నవారూ, అధికారంలో ఉన్నవారి బహిరంగ చర్యలకు సంజాయిషీ అడిగేవారూ అని అర్థం. ఆ సంజాయిషీలు పాలకులనూ, అధికారాన్నీ విమర్శించేవైనా సరేనని అర్థం స్థిరపడింది.

సమాజాన్ని విమర్శనాత్మక విశ్లేషణకు గురిచేసే మేధో సంప్రదాయం ఉన్నచోటనే ఇటువంటి ప్రశ్నలు సులభంగా మొలకెత్తుతాయి. ఆధారాలను పరీక్షించడం, విశ్లేషించడం ద్వారానే వాదనలను ఆమోదిత హేతుబద్ధ పద్ధతుల మీద నిలబెట్టగలం. కాకపోతే చారిత్రక సందర్భంలో మార్పులు ఆ ప్రశ్నలు వేసే పద్ధతిలో మార్పులు కలిగించవచ్చు. (ఇంకా చెప్పాలంటే, ఈ పద్ధతే ఇప్పుడు విజ్ఞానశాస్త్రాలలో మాత్రమే కాదు, సామాజిక శాస్త్రాలలోనూ మౌలిక పద్ధతిగా ఉంది. ఆ పద్ధతివల్లనే సామాజిక రాజకీయ వ్యవస్థల గురించీ, కార్యకలాపాల గురించీ అర్థవంతమైన వివరణలు దొరుకుతున్నాయి. అయితే దురదృష్టవశాత్తూ ఈ పద్ధతిని చారిత్రక పరిశోధనకు అన్వయించి సాంప్రదాయిక అభిప్రాయాలను ప్రశ్నించినప్పుడు మాత్రం అన్ని సమయాల్లోనూ ఆమోదం దొరకడం లేదు.)

అయితే హేతుబద్ధ వాదన అనే భావన గత రెండు శతాబ్దాలలో విమర్శలను ఎదుర్కొంది. ఆ భావనలో హేతుబద్ధత మీద ఉన్న కేంద్రీకరణ మీద ప్రశ్నలు వచ్చాయి. హేతుబద్ధతకు అంత ఘనమైన స్థానం ఇస్తే సంపూర్ణ వివరణలకు అవకాశం దొరకదనీ, హేతుబద్ధమైనవైనా కాకపోయినా అన్ని వివరణలూ సాధ్యమైనవేననీ వాదన వచ్చింది. అలాగే హేతుబద్ధ ఆలోచన మీద ఆధారపడిన విమర్శలు కూడ వాటి ఆధారాలను బట్టీ, వాటి కార్యకారణ సంబంధాలలోని తర్కాన్ని బట్టీ విభిన్నంగా ఉండే అవకాశం ఉంది. ఏమైనప్పటికీ, మారుతున్న చారిత్రక సందర్భాలను బట్టి విమర్శనాత్మక హేతుబద్ధత నుడికారం విభిన్నంగా ఉన్నప్పటికీ, విమర్శనాత్మక హేతుబద్ధత దానికదిగా కొనసాగుతుంది, కొనసాగాలి కూడ.

మనను మనం మధ్యయుగాలకూ, భూస్వామ్యానికీ చెందినవారం కామని చూపుకోవడానికి మనం అనుసరించే ఉదారవాద విలువలు, ప్రజాస్వామ్యం వంటి ఆధునిక ఆలోచనాపద్ధతుల మూలాలలో చాల భాగం ఈ తత్వవేత్తలకూ ఇతరులకూ జరిగిన చర్చలలోనే ఉన్నాయి. అంతేకాదు, ఈ చర్చలు యూరప్ కు మాత్రమే పరిమితమైనవి కూడ కాదు. ఈ భావనలలో కొన్ని మొదట వలసవాదం మీద స్వారీ చేస్తూ ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో ప్రవేశించినప్పుడు వాటిని నిర్ధారించడమో, తిరస్కరించడమో కూడ జరిగింది.

ఇప్పుడిక నేను భారతీయ సంప్రదాయంలో అప్పటికి కొనసాగుతున్న భావనలనూ ఆచరణలనూ సవాలు చేసిన కొద్దిమంది వ్యక్తులను ప్రస్తావిస్తాను. వారు మార్పు కొరకు హేతుబద్ధ, తార్కిక వివరణలను

ప్రచారం చేశారు. మన పూర్వీకులకు జ్ఞాన సముపార్జనా మార్గంగా హేతుబద్ధత అనే భావనే లేదనే సిద్ధాంతం మన మెదళ్లలో కూరిపెట్టారు గనుక సాధారణంగా మన హేతుబద్ధ ఆలోచనా వారసత్వాన్ని విస్మరిస్తూ ఉంటాం.

బుద్ధుడు

వారిద్దరూ సుదూరమైన విభిన్న ఖండాలలో, ఎటువంటి సంబంధం లేకుండా జీవించినప్పటికీ. ప్రశ్నలను ప్రోత్సహించిన, కార్యకారణ సంబంధాలనూ, హేతుబద్ధ వివరణలనూ అన్వేషించిన భారతీయ తత్వవేత్త క్రీ.పూ. ఐదో శతాబ్దిలోని సోక్రటీస్ కు సన్నిహిత సమకాలికుడు. నేను చెప్పదలచినది బుద్ధుడి గురించి. అదృష్టవశాత్తూ ఈ భారతీయ తత్వవేత్త గ్రీకు తత్వవేత్త లాగ విషం తాగాలనే శిక్ష అనుభవించలేదు. కాని ఆయన బోధనలను తొలి బ్రాహ్మణ ఛాందసం అత్యంత తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ బోధనలు మాయావాదమనీ, తప్పుదారి పట్టించేవనీ వర్ణించింది. బౌద్ధం భారతదేశం నుంచి క్రమక్రమంగా కనుమరుగైపోవడానికి చాల కారణాల్లో ఆ వర్ణన కూడ ఒకటి. బౌద్ధం పొరుగుదేశాలలోకి వెళ్లి అక్కడ వికసించింది గాని కొన్ని చోట్ల అది కూడ ఛాందసంగా మారిపోయింది.

సమాజాలు తమలో రూపొందుతున్న వ్యవస్థల గురించి విభిన్న వివరణలు ఇచ్చుకునే పద్ధతి చరిత్రకు సంబంధించిన అద్భుతమైన విషయాలలో ఒకటి. ప్రభుత్వం పుట్టుకకు కారణాలేమిటని అడిగినప్పుడు, బుద్ధుడు మొట్టమొదట ఒక నైసర్గికమైన ఊహాస్వర్గం ఉండేదని, అక్కడ ప్రతిఒక్కరూ సమానమని, అన్ని వనరుల మీద అందరికీ సమానమైన అవకాశం ఉండేదని అన్నాడు. సమాజ శకలాలుగా కుటుంబాలు విడిపోయినప్పుడు మొట్టమొదటి మార్పు వచ్చిందని, ఆ తర్వాత భూమిని సొంత ఆస్తిగా యాజమాన్యం ప్రకటించుకోవడం మొదలైందని అన్నాడు. ఈ మార్పుల ఫలితంగా గందరగోళం, ఘర్షణ తలెత్తిందని, కనుక చివరికి ప్రజలు ఒక్కచోటికి వచ్చి తమలోంచి ఒకరిని – మహా సమ్మత్ – ఎంపికైన మహావ్యక్తి – ఎన్నుకొని తమను పాలించే, గందరగోళాన్ని పరిష్కరించే చట్టాలు రూపొందించే బాధ్యత అప్పగించారని అన్నాడు. అంటే అది అన్నిరకాలు గానూ సామాజిక ఒప్పందం (సోషల్ కాంట్రాక్ట్) అన్నమాట. ఇక్కడ వ్యంగ్యంగానైనా ఒక మాట చెప్పాలి. సోషల్ కాంట్రాక్ట్ సిద్ధాంతం ప్రతిపాదించిన జీన్ జాక్ రూసో గాని, కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యం పుట్టుక రాసిన ఫ్రెడరిక్ ఎంగెల్స్ గాని బౌద్ధ గ్రంథాలేవీ చదవలేదు!

ఈ అంశాల గురించి బ్రాహ్మణ కథనాలతో బౌద్ధ వివరణ విభేదిస్తుంది. ఆ కథనాల ప్రకారం దేవతలకు రాక్షసులకూ జరిగిన యుద్ధంలో దేవతలు పరాజయం పాలవుతూ తమకు సహాయం చేయమని దేవాధిదేవుడైన ప్రజాపతిని వేడుకున్నారు. దేవతలకు నాయకత్వం వహించి విజయం సాధించమని ఆ ప్రజాపతి తన కొడుకైన ఇంద్రుడిని ఆదేశించాడని కొన్ని కథనాలు చెపుతాయి. ఈ చర్యలోనే పాలనకు మూలాలు ఉన్నాయి. దేవతలను వేడుకోవడం, దైవానుమతి లభించడం అనేవి ఇక్కడ ప్రధానమైన విషయాలు. అధికారం పట్ల ఎటువంటి వైఖరి ఉండాలని నిర్ణయించేవి అవే. మహా సమ్మత్ – ఎన్నికైన మహావ్యక్తి అనే బుద్ధుడి భావన ఈ రాజు అనే భావనకు తారుమారైన రూపం. ఇక్కడ రాజును భగవంతుడు నియమిస్తాడు. ఆ రాజు సమస్త అధికారాన్నీ తన దగ్గర కేంద్రీకరించుకుంటాడు. ఈ రెండూ కల్పనలే అయినప్పటికీ వాటి ప్రాతిపదికలు భిన్నమైనవి.

ఈ తొలి గ్రంథాలలో మతం అనే మాట వచ్చినప్పుడెప్పుడూ అది హిందూమతం ప్రస్తావన కాదు. ఎందుకంటే హిందూ అనే మాటే ఆ తర్వాతెప్పుడో పుట్టింది. భారతీయ మతం అనే దానిలో ఎన్నెన్నో శాఖలు ఉండగా వాటన్నిటినీ వాటి పేర్లతోనే గుర్తించేవారు. సాధారణార్థంలో చెప్పినప్పుడు కూడ అవన్నీ రెండు ప్రవాహాలుగా ఉండేవి. ఒకటి బ్రాహ్మణ – అంటే బ్రాహ్మణ విశ్వాసాలతో ఉండేది, మరొకటి శ్రమణ – అంటే బౌద్ధ, జైన బోధనలతో కూడినది. (బౌద్ధ సన్యాసులను శ్రమణకులు అనేవారు). క్రీ.పూ. మూడో శతాబ్దిలో అశోకుడి శాసనాల నాటి నుంచి, క్రీ.శ. 11 శతాబ్దిలో భారతదేశం గురించి రాసిన అల్ బిరూనీ దాకా వెయ్యి సంవత్సరాలకు పైగా మతాలను ప్రస్తావించినది ఈ రూపంలోనే. ఈ రెండు మతాల మధ్య సంబంధం పాముకూ ముంగిసకూ మధ్య సంబంధం లాంటిదని క్రీ.శ. మొదటి సహస్రాబ్ది ప్రారంభంలో రాసిన సంస్కృత వ్యాకరణకర్త పతంజలి ఒక అదనపు దృక్పథాన్ని జోడించాడు. అంటే వీరి మధ్య చర్చలు విద్వేషపూరితంగా ఉండేవనేది స్పష్టమే. ప్రశ్నలు లేకుండా చెప్పిందంతా వినేవాళ్లు కొందరూ, ప్రశ్నలు వేసేవాళ్లు కొందరూ ఉండే అన్ని సమాజాలలోనూ ఇటువంటి తీవ్రమైన చర్చలు జరుగుతాయి.

చార్వాకులు

ఆ తర్వాత చార్వాకులు వచ్చారు. వారినే లోకాయతులని కూడ అంటారు. వాళ్లు అప్పటికి ఉన్న అన్ని తాత్విక ధోరణులనూ వ్యతిరేకించారు. వారు జీవితం గురించి భౌతికవాద వివరణకు కట్టుబడి, మరొక రకమైన ఆలోచనాధోరణికి ఎంతమాత్రం అవకాశం ఇవ్వలేదు. వారి గ్రంథాలేవీ ఇవాళ లభ్యం కావడం లేదు. కాని మనకు తెలిసిన గ్రంథాలలో సందులలో, మూలల్లో అనూహ్యమైన చోట్ల వారి గురించి ప్రస్తావనలు తలెత్తుతుంటాయి. వీరిలో కొన్ని శాఖలవారి వాదనలు 'పాపమీను కదలికల' లాగ ఉంటాయని బుద్ధుడు వర్ణించాడు.

క్రైస్తవ శకం ప్రారంభమయ్యే సమయానికి బౌద్ధం జనాదరణతో పాటు రాజుల, వర్తకుల, భూస్వాముల పోషణను కూడ సంపాదించింది. అప్పుడు ప్రధాన బ్రాహ్మణ గ్రంథాలు వారిని నాస్తికులుగా, సంప్రదాయ వ్యతిరేకులుగా, అవిశ్వాసులుగా అభివర్ణిస్తూ తీవ్రంగా వ్యతిరేకించాయి. బ్రాహ్మణ దృక్కోణం నుంచి చూసినప్పుడు శ్రమణకులు, చార్వాకులు, ఆజీవకులు, నిరీశ్వరవాదులు, భౌతికవాదులు, హేతువాదులు అందరూ నాస్తికులు అనే ఒకే తరగతికి చెందుతారు. ఎందుకంటే వారందరూ కూడ భగవంతుడి అస్తిత్వాన్ని ప్రశ్నించారు. వారు వేదాలనూ, అవి అపౌరుషేయాలనీ, భగవంతుడే ప్రకటించాడనీ అనడాన్నీ ప్రశ్నించారు. కులాచారాల నియమాలను ప్రశ్నించారు. ఆత్మ ఉనికిని ప్రశ్నించారు. కర్మ విషయంలో వారి అభిప్రాయాలు భిన్నంగా ఉన్నప్పటికీ వారిలో కొందరు కర్మ సిద్ధాంతాన్ని పూర్తిగా తిరస్కరించారు. (ఇది చెపుతున్నప్పుడు మన కాలంలో హిందుత్వ వాదులు కూడ తమను సమర్థించనివారందరూ ఒకటే అన్నట్టుగా, అందరినీ ఒకే గాటన కట్టి మార్క్సిస్టులుగా

అభివర్ణించడం గుర్తొచ్చింది! అలాగే భారతదేశంలో ముస్లిం మత ఛాందసవాదులు కూడ తమ ఛాందసాన్ని వ్యతిరేకించే ఉదారవాద ముస్లింలందరినీ ఒకే గాటన కట్టి మార్క్సిస్టులు అని పిలుస్తారనేదీ ఆసక్తికరమైన విషయమే.)

సంప్రదాయ వ్యతిరేకుల పట్ల మనుధర్మశాస్త్రం మానసిక రుగ్మత లాంటి అనుమానాన్ని ప్రదర్శించింది. వారిని నాస్తికులనీ, తప్పుడు సిద్ధాంతాల బోధకులనీ పిలిచింది. వారు రోగగ్రస్తులైన మనుషులనీ, తమస్సుకు మూలాలనీ పిలిచింది. నిజంగానే కొన్ని రకాలుగా చూసినప్పుడు ఛాందసానికి అది కష్టకాలమే. కొన్ని ప్రధాన తాత్విక శాఖలు నాస్తికవాద ఛాయలతో నిండిపోయాయి. కాని అదే ఆ కాలం మేధోపరంగా ఉత్సాహభరితమైన కాలంగా మార్చింది.

ఈ సంప్రదాయ వ్యతిరేకులకు జనాదరణ ఎంత ఎక్కువగా ఉంటే వారి మీద దాడి అంత ఎక్కువగా జరిగింది. క్రీ.పూ. తొలి శతాబ్దాలకు చెందిన విష్ణు పురాణంలో మాయామోహుడనే వ్యక్తి మీదా, అతని అనుయాయుల మీద లెక్కలేనన్ని వ్యతిరేక ప్రస్తావనలున్నాయి. మాయామోహుడనే పేరే మాయ, మోహం కలిగించేవాడనడానికి గుర్తు. ఆ బృందం ప్రజలకు మాయనూ, మోహాన్నీ కలిగిస్తుందని విష్ణు పురాణం చెప్పదలచిందన్నమాట. మాయామోహుడు అసురులనూ, దైత్యులనూ, అటువంటి దుష్ట శక్తులన్నిటినీ పోగు చేసి వారిని తన ఆలోచనల అనుయాయులుగా మార్చేస్తాడట. ఎరుపు రంగు దుస్తులు ధరించడం, శిరోజాలు తొలగించుకోవడం, తంతులను పాటించకపోవడం, భిక్ష మీద బతకడం వంటి మాయామోహుడి అనుచరుల ఆచారాలుగా చెప్పినవి బౌద్ధుల, జైనుల ఆచారాలే. వారితో చర్చ జరపడం నిషిద్ధం. ఎందుకంటే అటువంటి చర్చలు సంకరానికి దారి తీస్తాయి. అటువంటి సంభాషణ నమోదై దొరికి ఉంటే అద్భుతంగా ఉండేది, కాని కేవలం క్లుప్తమైన ప్రస్తావనలు మాత్రమే దొరుకుతున్నాయి.

ఎప్పుడూ ప్రత్యక్షంగా కనబడకపోయినా చార్వాకులు మొత్తంగా మన ఆలోచనల రంగస్థలం మీద కొనసాగుతూనే వచ్చారు. క్రీ.శ. తొమ్మిదో శతాబ్దిలో శంకరాచార్యుడు ఆత్మ కన్న భౌతిక పదార్థమే ప్రాథమికమని వారు చెప్పిన సిద్ధాంతాన్ని ప్రస్తావించాడు. పద్నాలుగో శతాబ్దిలో అప్పటికి ఉన్న ప్రధానమైన తాత్విక ధోరణులన్నిటినీ సంకలితం చేసిన మధ్వాచార్యుల సర్వదర్శన సంగ్రహం ప్రారంభంలోనే చార్వాక ఆలోచనల ప్రాసంగికత గురించి సుదీర్ఘ చర్చ ఉంటుంది. అది చివరికి చార్వాక ఆలోచనను తిరస్కరించినప్పటికీ, దీర్ఘంగానే చర్చిస్తుంది. చార్వాకుల ఆలోచనలకు ప్రభావమేమీ లేనట్టయితే, వాటిని విస్మరించడమే జరిగేది, ఇంతలా చర్చించడం జరిగేది కాదు. అయితే ఆ విస్మరణ కూడ జరిగింది. పందొమ్మిదో శతాబ్ది వలసవాద పాండిత్య ప్రపంచంలో అది జరిగింది. కొంతమంది వలసవాద రచయితలు భారత నాగరికతలో అసలు హేతుబద్ధ ఆలోచన అనేదే లేదని, అదే భారతీయుల వెనుకబాటుతనానికి కారణమని వాదించారు. ఈ వాదన జాతీయవాద ఆలోచనకు ఆమోదయోగ్యం కానప్పటికీ, భారతీయ పండితులు గణనీయమైన పద్ధతిలో ఆ వాదనను ఎదుర్కోలేదు. ఎటువంటి నిరంకుశ అధికారానికైనా ప్రశ్నలు అడిగేవారంటే గిట్టదు. అలాగే హిందూ మతం మాత్రమే పునాదిగా ఏకైక జాతీయ అస్తిత్వాన్ని నిర్మించ తలపెట్టినవారు బ్రాహ్మణ ఆలోచనలతో విభేదించిన బోధనల ప్రాధాన్యతను అంగీకరించలేకపోయారు.

ఛాందసవాదం సంప్రదాయ వ్యతిరేకులను కొట్టిపారేసింది. కాని, వారి భావాలలో కొన్నిటి గురించి, అటువంటి ఇతర భావాల గురించి క్రీ.శ. తొలి శతాబ్దాల తాత్విక ధోరణులలో అన్వేషణ జరపక తప్పలేదు. పండిత స్థాయిలో, విజ్ఞులైన బ్రాహ్మణులకూ, బౌద్ధులకూ మధ్య జరిగిన చర్చలలో విభిన్నమైన, ప్రశంసనీయమైన తాత్విక ధోరణులు రూపు దిద్దుకున్నాయి. తర్కమూ, హేతువిచారణా పద్ధతులూ పదును దేరాయి. భావవాద తత్వశాస్త్రానికి సన్నిహితమైన ఇతర ఆలోచనా పద్ధతులు కూడ మెరుగుతీరాయి. ఈ సమయంలో ప్రధానమైన తార్కికులలో ఎక్కువమంది, ఉదాహరణకు నాగార్జునుడు, వసుబంధుడు, దిగ్నాగుడు, ధర్మకీర్తి వంటి వారు, బౌద్ధులే కావడం ఆసక్తికరమైన అంశం. వీరిలో కొందరు బ్రాహ్మణులుగా పుట్టి, ఆ పద్ధతిలోనే విద్యావంతులై, బౌద్ధులుగా మారారు. వారు భావాలతో క్రీడలాడారు. మరీ ముఖ్యంగా నాస్తికవాదపు సూక్ష్మ అంశాల గురించి చాల చర్చ జరిపారు. ఆ భావాలు ఒకే రకమైనవేమీ కావు. విస్తారంగా చర్చ జరిగింది. వాదనలు కొన్నిసార్లు దాదాపు గతితార్కిక రూపం తీసుకున్నాయి.

దురదృష్టవశాత్తూ ఇప్పుడు లభించడం కష్టం గాని, విమర్శనాత్మక హేతుబద్ధతను ఉపయోగించిన ఈ తత్వవేత్తలకూ, హేతుబద్ధ ఆలోచనకు మరింత సన్నిహితులైన ఖగోళ, గణితశాస్త్రవేత్తలకూ జరిగిన సంభాషణలు దొరికితే వాటికి చాల ఎక్కువ మేధో ప్రాధాన్యత ఉంటుంది. గణితశాస్త్ర లెక్కల ఆధారంగా ఆర్యభట్టు భూమి సూర్యుని చుట్టూ తిరుగుతున్నదని వాదించాడు. కోపర్నికస్, గెలీలియోల కన్న వెయ్యి సంవత్సరాల ముందు ఆయన ఆ సిద్ధాంతం చెప్పాడు. ఈ సిద్ధాంతానికి బైబిల్ ను, అంటే సమాజం మీద చర్చ్ అదుపును తిరస్కరించే శక్తి ఉందని యూరప్ లో కాథలిక్ ఛాందసవాదం గుర్తించి భయపడింది. గెలీలియో తన మాటను వెనక్కి తీసుకోవలసి వచ్చింది. భారతదేశంలో ఖగోళ శాస్త్రవేత్తల మధ్య ఈ సూర్యకేంద్రక సిద్ధాంతం మీద చర్చ జరిగింది. కాని ఆ సిద్ధాంతపు విస్తృత పర్యవసానాలు విస్మరణకు గురయినట్టున్నాయి. బహుశా ఇక్కడ కాథలిక్ చర్చ్ వంటిది లేకపోవడం కారణం కావచ్చు. అయితే, సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ఆమోదిస్తే కొన్ని జ్యోతిష్యశాస్త్ర గణనాలు తప్పయి ఉండేవనేది మరొక కారణం కావచ్చు. అప్పుడు రాజుల అధికారాన్ని తమ అదుపులో ఉంచుకోవడానికి మత ఛాందసవాదం జ్యోతిష్యశాస్త్రాన్ని ఒక సాధనంగా వాడింది. అందువల్ల చాల ప్రాంతాలలో పాత జ్ఞానమే చెక్కుచెదరకుండా కొనసాగింది. గణిత శాస్త్రంలోనూ, ఖగోళ శాస్త్రంలోనూ భారతీయ సిద్ధాంతాలు వాటికవి సృజనాత్మకంగా విస్తరించాయి. కాని విచిత్రంగా అవి అప్పటి పురావిజ్ఞానశాస్త్ర కేంద్రమైన బాగ్దాద్ కు వెళ్లిన తర్వాత మాత్రమే ఎక్కువ ప్రభావశీలంగా మారాయి.

ఈలోగా, భారతదేశంలో ఇతర మతశాఖలు ఇటువంటి ప్రశ్నలు రేకెత్తడానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించాయి. మతాధిపతులూ, పాలకులూ ఎత్తిపట్టిన నమ్మకాలనూ ఆచారాలనూ పండితులు ప్రశ్నించారు. వారు బ్రాహ్మణేతర ఛాందసాలను కూడ ప్రశ్నించారు. అలా ప్రశ్నించినవారిలో కొందరు ఆండాళ్, అక్కమహాదేవి, మీరాల

లాగ స్త్రీలు. వారు కుల నియమాలను ధిక్కరించారు. వారు చెప్పేవి ప్రజలు విస్తారంగా, శ్రద్ధగా విన్నారు. ఆ ప్రజలు తమవైన సామాజిక ధర్మాలను ఏర్పాటు చేసుకున్నారు. కాని మనం ప్రధానంగా మతం మీద దృష్టి పెడుతూ, ఆ సంవాదాలలోని ఈ అంశం మీద తగినంత శ్రద్ధ చూపడం లేదు.

అమీర్ ఖుస్రో ఢిల్లీ సుల్తాన్ లకు తెలియనివాడేమీ కాదు. ఆయన పద్నాలుగో శతాబ్దిలో ఒక సాంప్రదాయిక చరిత్ర రూపంగా రాసిన తుఘ్లక్ నామా లో రాజాస్థాన రాజకీయాల గురించి కవితాత్మక దృక్పథం ప్రకటించాడు. అయితే సూర్యకేంద్రక విశ్వం సిద్ధాంతంతో ఆయన ప్రకటించిన ఖగోళశాస్త్ర ఆలోచనలు ఆయనను ఛాందస ఇస్లాం నుంచి దూరం చేశాయి. ఆ ఆలోచనలు ఆమోదిత సత్యాలను సవాలు చేశాయి. ఆయన కవిత్వమూ సంగీత సమ్మేళనాలూ ఆయనకు ఒక హోదానూ, అనుచరవర్గాన్నీ ఇచ్చాయి. ఆయనను ఆస్థాన కవిగా గుర్తించిన సుల్తాన్లూ ఛాందసులూ ఆయనతో శత్రుత్వం మంచిది కాదనుకున్నారు. చిష్తీ సంప్రదాయపు సూఫీ నిజాముద్దీన్ ఔలియా ఆయనకు పోషకుడిగా, స్నేహితుడిగా సుల్తాన్ల నుంచి ఆయనను కాపాడాడు. వారి మధ్య దూరాన్ని నిర్వచించాడు.

కొన్ని శతాబ్దాల తర్వాత మహారాష్ట్రలో ఏకనాథ్ కూడ మతానికి ఉన్న అదుపును ప్రశ్నించాడు. భాగవత పురాణాన్నీ, రామాయణాన్నీ ఆయన తిరగరాసిన తీరు ఆయనకు ఉండిన బ్రాహ్మణ పాండిత్యాన్ని చూపుతుంది. ఆ పాండిత్యం ఉన్నప్పటికీ కొనసాగుతున్న సామాజిక ధర్మపు ఔచిత్యాన్నీ, కులాచారాల ఔచిత్యాన్నీ ప్రశ్నించడంలో ఆయన ఎక్కడా వెనుకకు తగ్గలేదు.

కొత్త పూజావిధానాన్ని ప్రబోధించిన ప్రతి ఒక్కరూ అధికారాన్ని ప్రశ్నించారని అనలేం. కాని అలా ప్రశ్నించినప్పుడు మాత్రం గుర్తించకుండా ఉండడం సరికాదు. మనం అలా గుర్తించడానికి ఎందుకు సంకోచించామంటే ఆ కాలంలో సామాజిక వ్యాఖ్యానం ఏ రూపాలలో జరిగిందో ఆ రూపాలన్నిటితో మనకు పరిచయం లేదు. అటువంటి వ్యక్తులు విశ్వాసం గురించీ, ఆరాధన గురించీ ప్రస్తావించిన విషయాలను మినహాయించి మిగిలినవాటన్నిటినీ పక్కకు తోసేశాం. ఆ రోజుల్లో మత విశ్వాసమే అన్ని అంశాలనూ కలుపుకుని ఉండేదని, సమస్త జీవిత విషయాల గురించీ మాట్లాడేదని మరచిపోయాం. అందువల్ల ప్రాథమికంగా మత బోధకులైనవారు కూడ సమాజం మీద, సామాజిక విలువల మీద తమ అభిప్రాయాలు ప్రకటించారు. ఆ అభిప్రాయాలు చెప్పుకోదగినంత ఆసక్తిని రేకెత్తిస్తాయి. ప్రత్యేకించి మత శాఖలు విస్తృత వనరుల నుంచి భావాలను తమలో కలుపుకుంటున్న చారిత్రక సమయాల్లో ఆ అభిప్రాయాలు ఆసక్తిదాయకమైనవి.

జాతీయవాదపు ప్రశ్నలు

ఇక ఆధునిక కాలంలోకి వస్తే, జాతీయవాదపు భావజాలం సమాజాన్ని పునర్వ్యవస్థీకరించడానికి ప్రయత్నాలు చేసింది. ఆ జాతీయవాదం వలసవాదాన్ని వ్యతిరేకించి ఉండవచ్చు గాని వలసవాద విజ్ఞానం నుంచి సిద్ధాంతాలను గ్రహించడాన్ని అన్నివేళలా వ్యతిరేకించలేదు. బ్రహ్మ సమాజం, ప్రార్థనా సమాజం, ఆర్యసమాజం వంటి అగ్రవర్ణ హిందూమతానికి సంబంధించిన సంఘ సంస్కరణ ఉద్యమాలు కొత్త రకమైన హిందూ మత సంస్థలను, కులం పాత్రను సూచించాయి. రాజా రామమోహన రాయ్ గురించీ, ఆయన నడిపిన సంఘ-మత సంస్కరణ గురించీ మనందరికీ తెలుసు. కాని సరిగ్గా ఆయనకు సమకాలికుడైన, తంజావూరుకు చెందిన ఒక చిన్న మహారాజు రెండవ శరభోజి గురించి చాల తక్కువ తెలుసు. ఆయన విద్యావ్యవస్థ సారం మీద కేంద్రీకరించి ఛాందసాన్ని ప్రశ్నించాడు. యూరపియన్ విజ్ఞానోదయ రచయితలను అధ్యయనం చేసి జ్ఞానం హేతుబద్ధ వాదనా క్రమం మీదనే ఆధారపడి ఉంటుందనే విశ్వాసానికి చేరాడు. ఆ హేతుబద్ధ వాదనా క్రమాన్ని విద్య ద్వారా నేర్పాలని నమ్మాడు. ఆయన నెలకొల్పిన పాఠశాలలు సరిగ్గా ఈ లక్ష్యాన్ని ఉద్దేశించినవే. అలాగే ఆ లక్ష్యంతోనే ఆయన సరస్వతీ మహల్ గ్రంథాలయం స్థాపించి దానికోసం పుస్తకాలనూ వస్తువులనూ సేకరించాడు.

ఈ కదలికలేవీ మేధో సంప్రదాయాలను విమర్శనాత్మకంగా ప్రశ్నించడానికి ఉద్దేశించినవి కానప్పటికీ, అవి అప్పుడప్పుడూ అయినా ఉపరితలాన్ని గోకాయి. మతం సాధికారత కల్పించిన కుల అంతరాల వ్యవస్థకు కీలక స్థానం ఉన్నప్పటికీ, మతానికీ కులానికీ మధ్య అంతస్సంబంధాన్ని పరిశోధించడానికి ప్రయత్నం జరగలేదు. ఆర్యులు తమ ధృవప్రాంతపు జన్మస్థలం నుంచి భారతదేశం దాకా సాగివచ్చినప్పటికీ భారత నాగరికతకు, అగ్రవర్ణ సంస్కృతికి ఆర్య పునాదులు ఉన్నాయనే సిద్ధాంతాన్ని పందొమ్మిదో శతాబ్దిలో బాల గంగాధర తిలక్ సమర్థించాడు. కాని అదే సమయంలో కింది కులాల మీద సాగుతున్న అణచివేతకు తార్కిక వివరణ ఆర్యుల రాక లోనే ఉందని జ్యోతిబా పూలే భావించాడు. శూద్రులైన స్థానిక నివాసులను బ్రాహ్మణులైన ఆర్యులు పీడనకు గురిచేశారని ఆయన అన్నాడు. ఇలా అప్పటికి ఉనికిలో ఉన్న సమాజాన్ని వివరించడానికి తిలక్ ఆమోదిత అభిప్రాయాన్ని విస్తరించగా, పూలే దాన్ని ప్రశ్నించాడు. ఈ రెండు వ్యాఖ్యానాలూ చారిత్రకంగా పొరపాటే, కాని పూలే నిశితమైన ప్రశ్న అడిగాడు.

కులానికి ఉన్న సాధికారతను ప్రశ్నించినవారూ, బ్రాహ్మణ విశ్వాసాల పట్ల విమర్శనాత్మకంగా ఉన్నవారూ ఇతరులు కూడ ఉన్నారు. పెరియార్ లేదా ఇవిఆర్ విద్యావేత్త కాకపోయినప్పటికీ ఆయన సమకాలికులైన విద్యావేత్తలతో సమానంగా చదువుకున్నవాడు. హిందూ పురాణాలలోని వైరుధ్యాలను ఒక హేతువాదిగా ఆయన విమర్శనాత్మకంగా చూశాడు. అవన్నీ ఇండో-ఆర్యన్ ప్రజలు కల్పించిన కట్టుకథలని కొట్టిపారేశాడు. సామాజిక సమానత్వం కోసం, ప్రత్యేకించి మహిళల సమానత్వం కోసం చాల బలంగా వాదించాడు.

నేను ఇప్పటివరకూ ప్రస్తావించిన వ్యక్తులందరూ ఆధునిక అర్థంలో ప్రజాహిత మేధావులు కారు. మెరుగైన సమాజాన్ని సాధించడానికి ఒక సాధనంగా అప్పటికి ఉన్న వాస్తవికత మీద ప్రశ్నలు సంధించినవారు. వారు తమ తమ భిన్నమైన వృత్తులలో గౌరవాన్ని పొందినందువల్ల వారి బోధనలను ప్రజలు విన్నారు. వారు వేసిన ప్రశ్నలు ఒకేరకమైనవా కాదా అనేది సమస్య కాదు. ఆయా కాలాల సమస్యలకు తగినట్టుగా వారి ప్రశ్నల స్వభావం మారినప్పటికీ వారు వాదించిన పద్ధతి

ప్రధానమైనది. ఆ ప్రశ్నలు యధేచ్ఛగా వేసినవి కావు. వాటిని గుర్తించదగిన విమర్శనాత్మక హేతుబద్ధత నిర్ణయించింది. అంతేకాదు, అలా ప్రశ్నలు వేసేవారు అప్పుడైనా, ఇప్పుడైనా గణనీయమైన చారిత్రక మార్పుల సమయాన్ని వ్యక్తీకరిస్తారు.

చారిత్రక మార్పుల సమయాలు సమాజాన్ని పునర్వ్యవస్థీకరించే కొత్త పద్ధతుల అన్వేషణతో కలిసివస్తాయి. భారతీయ గతంలోనూ ఆ పునర్వ్యవస్థీకరణ ప్రయత్నాలు అప్పుడప్పుడు జరిగాయి. సామాజిక ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి, అవి సమాజానికి ఒక రూపాన్ని ఎలా ఇస్తాయో తెలుసుకోవడానికి మనకిప్పుడు లోతైన, నిశితమైన మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఈ సంబంధాలను అన్వేషించవలసి ఉంది. అటువంటి అన్వేషణలు జరపడానికి, మన మేధో వారసత్వంలోని హేతుబద్ధ ఆలోచనల సంప్రదాయాలను వ్యక్తీకరించడానికి గుర్తించదగిన పాత్ర నిర్వహించే ప్రజాహిత మేధావుల అవసరం ఉంది. ఆ ప్రజాహిత మేధావుల సంప్రదాయాన్ని ధ్వంసం చేయడానికి ప్రస్తుతం పథకం ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయి.

వలస-వ్యతిరేక భారత జాతీయోద్యమ ప్రధాన స్రవంతీ, లౌకికంగా ఉండాలని ఆకాంక్షించిన ఉదారవాద ప్రజాస్వామ్య ఆవిర్భావమూ ఆ ప్రజాహిత మేధావుల దృశ్యమానమైన ఉనికికి తగిన స్థలం ఇచ్చాయి. ప్రత్యేకంగా స్వాతంత్ర్యం వెనువెంటనే కొద్ది సంవత్సరాల పాటు చాల మందే ఈ పాత్ర నిర్వహించడానికి ముందుకొచ్చారు. విస్తారమైన చర్చలు జరగడానికి వారే కారణం. కాని ఆ తర్వాతి పరిణామాలు, అది ఎమర్జెన్సీ కావచ్చు, లేదా మత మైనారిటీల ఊచకోతలు కావచ్చు, కనీసం అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా గళమెత్తడానికి, అడ్డుకోవడానికి ప్రజాహిత మేధావులు అవసరమనే అవగాహనను పెంచాయి. నిఖిల్ చక్రవర్తి, రమేష్ థాపర్ వంటి వారెందరో అన్నిరకాల సెన్సార్ షిప్ నూ, ప్రత్యామ్నాయ గళాలను నిశ్శబ్దంలో ముంచే ప్రయత్నాలనూ వ్యతిరేకించారని మనం గుర్తు చేసుకోవలసి ఉంది.

విద్యావేత్తల మౌనం

ఇవాళ మనకు విభిన్న వృత్తులలో ప్రత్యేక నైపుణ్యం సాధించినవారున్నారు. కాని వారిలో అత్యధికులు తమ ప్రత్యేక విభాగానికి బైట ప్రపంచంలో ఏమి జరుగుతున్నదో పట్టించుకోవడం లేదు. వీరు ప్రజాహిత మేధావుల స్థానాన్ని ఆక్రమిస్తున్నారని కూడ వింటున్నాం. కాని ఈ ప్రత్యేక నిపుణులూ ప్రజాహిత మేధావులూ ఒకటి కాదు. ఉదాహరణకు, గతంలో కూడ లెక్కలేనంతమంది విద్యావేత్తలు ఉండేవారు. కాని వారిలో చాలమంది అధికారాన్ని ఎదుర్కోవడానికి, కనీసం ఆ అధికారం స్వేచ్ఛాలోచనా మార్గాన్ని అడ్డుకుంటున్నప్పుడు కూడ, సిద్ధపడలేదు. ఇందుకు కారణం వారు తమ జ్ఞాన సముపార్జనా క్రమాన్ని నిరాటంకంగా కొనసాగించదలచుకోవడమా, లేదా, అధికారం ఆజ్ఞాపిస్తే వారు తమ జ్ఞానాన్ని కూడ వదిలేయడానికి సిద్ధంగా ఉండడం వల్లనా?

ప్రజాహిత మేధావిని నిర్వచిస్తూ చాల రచనలే వచ్చాయి. ఆ పేరుతో పిలవాలంటే ఒక వ్యక్తి అధికారంలో ఉన్నవారి నుంచి స్వతంత్రమైన వైఖరి తీసుకోవాలి. తద్వారా ఆ భావాలను ఎవరు ప్రచారం చేస్తున్నారనేదానితో సంబంధం లేకుండా చర్చనీయ అంశాల మీద ప్రశ్నలు లేవనెత్తడానికి ఆ వ్యక్తికి అవకాశం దొరుకుతుంది. హేతుబద్ధ విమర్శ ప్రధానమైన నాందిగా ఉంటుంది. ప్రజాహిత మేధావి వీలయినంతవరకు స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించడం మాత్రమే కాదు, అంతకన్న ఎక్కువగా స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరిస్తున్నారని ఇతరులు అనుకునేలా ఉండాలి.

సుప్రసిద్ధమైన వృత్తి నిపుణుల స్థాయి ఉంటే స్వతంత్ర ప్రతిపత్తి నెరపడం కొంతవరకు సులభమవుతుంది. ఇవాళ్టి ప్రజాహిత మేధావికి ఆ స్థాయితో పాటు అదే సమయంలో పౌరుల హక్కులు ఏమిటనే విషయంలోనూ, ప్రత్యేకించి సామాజిక న్యాయపు అంశాలలోనూ అభినివేశం ఉండడం అవసరం. అంతేకాదు, ప్రజావిధాన వ్యవహారాలను లేవనెత్తే సంసిద్ధత కూడ ఉండాలి.

సమాజం తరఫున మాట్లాడడమే, ఒక రకమైన నైతిక అధికారాన్ని కలిగి ఉండడమే ఈ విమర్శకు సమర్థన. విశాలమైన వృత్తి నైపుణ్య గౌరవాన్నీ, సమాజం పట్ల పట్టింపునూ కలగలపడమే కొన్నిసార్లు ఆ వ్యక్తికి నైతిక అధికారాన్ని సంతరించిపెడుతుంది. అదే ప్రజా మద్దతును సమకూరుస్తుంది. ఇది ప్రజలు ఆమోదించిన అర్హతే తప్ప కొలవదగిన అర్హత కాదు. గతంలో సమాజం నుంచి తమను తాము దూరం చేసుకున్నవారికి మాత్రమే వారు సూచించే మార్పులలో స్వార్థప్రయోజనాలు ఉండవని అనుకునేవారు. కాని అది అన్ని సందర్భాలలోనూ నిజం కాదు. మన కాలంలో ఒక రాజకీయ పార్టీతో క్రమబద్ధ అనుబంధం ఉండడమే స్వేచ్ఛాలోచనకూ, ఆచరణకు సిద్ధపడడానికీ ఆటంకం కావచ్చు. అలా రాజకీయ పార్టీ సాన్నిహిత్యం సులభంగా మద్దతు సమకూరుస్తుందనే అవకాశం ఉన్నప్పటికీ.

వృత్తిపరమైన నిపుణులకు, విద్యావేత్తలకు ఒక మానసిక ధోరణి లాగనే స్వతంత్ర ప్రతిపత్తి ఉండాలి. అటువంటి వ్యక్తులు విశాలమైన సమాజపు సమస్యల గురించి ప్రత్యామ్నాయ మార్గాలలో ఆలోచించడం ఎట్లాగో సూచిస్తారు. ఈ పని వారు మాత్రమే చేస్తారని కాదు. ఆ ఆలోచన హేతుబద్ధ తార్కిక విశ్లేషణ నుంచి రూపొందుతుంది. అయినా, ఇవాళ విద్యావేత్తలు స్థూలంగా ప్రత్యామ్నాయం అనేదాన్ని ప్రకటించే హక్కును సమర్థించడానికి కూడ సంకోచిస్తున్నారు. ఎంత సున్నితంగా వ్యక్తీకరించిన హేతుబద్ధ వ్యాఖ్యానాలనైనా సమర్థించడం గురించి చెప్పనే అక్కరలేదు. ఇవాళ ఎంత సులభంగా పుస్తకాలను నిషేధిస్తున్నారో, దుకాణాల నుంచి ఉపసంహరించి ధ్వంసం చేస్తున్నారో, పుస్తకాలను తగులబెట్టమని పిలుపులు ఇస్తున్నారో, మత, రాజకీయ ఒత్తిడులతో, రాజ్యం జోక్యంతో పాఠ్య ప్రణాళికలను మారుస్తున్నారో చూస్తేనే మన విద్యావేత్తల సంకోచం అర్థమవుతుంది. పేరుపొందిన ప్రచురణకర్తల వెన్నెముకలు కూడ పక్షవాతానికి గురవుతున్నాయి. ఇటువంటి చర్యలు జరిగిపోతుంటే చాల మంది విద్యావేత్తలలో, వృత్తినిపుణులలో అంత తక్కువ ప్రతిస్పందన కనబడుతున్నదెందుకు? సాధారణంగా వినబడే జవాబు, ఈ పనులన్నీ చేస్తూ రెచ్చగొడుతున్నవారు రాజకీయ అధికారపు అండ ఉన్నవారనే భయం అని. అదొక్కటేనా జవాబు?

గత కొన్ని దశాబ్దాలలో ఉదారవాద స్థలం కుంచించుకుపోతున్నదని చాల మంది వ్యాఖ్యానిస్తున్నారు. ఒకప్పుడు అది జరగకుండా పోరాడి

అడ్డుకున్నాం. ఇప్పుడది మళ్లీ మనమీదికి వస్తున్నది. సాంప్రదాయిక అధికారానికి ప్రాతినిధ్యం వహించేవారిని, ప్రత్యేకించి వారు న్యాయాన్ని పాతిపెట్టేవారయినప్పుడు, ప్రశ్నించడం, బాధ్యతాయుతంగా ప్రవర్తించమని అడగడం పదే పదే చేయవలసిన పనులు. కొత్తగా వచ్చిన సోషల్ మీడియా స్వేచ్ఛాస్థలమని అంటుంటారు. అది కొంతవరకు నిజమే. కాని అక్కడ కూడ మత కార్యకలాపాల పైననో, సమకాలీన రాజకీయాల పైననో విమర్శనాత్మక వ్యాఖ్యలను పంచుకుంటే తమ మీద చర్యలు జరుగుతాయేమో అని భయపడే స్థితి వచ్చింది. మరీ ముఖ్యంగా మత అస్తిత్వాలకూ, వాటి రాజకీయాలకూ సంబంధించిన విషయాలలో కొన్ని నిర్దిష్ట మతాల గురించి అర్థరహితమైన పుక్కిటి పురాణాలతో ప్రచారాలు జరుగుతున్నాయి. వీటితో మనం నేరుగా తలపడడం లేదు.

మతం పేరు మీది చర్యలు

ఇటువంటి ప్రశ్నలు అడగడమంటే, మత ఉద్దేశాలను ప్రకటిస్తూ, తమ అధికారాన్ని మతేతర లక్ష్యాల కోసం వినియోగించే సంస్థల పట్ల, వ్యవస్థల పట్ల విమర్శనాత్మకంగా ఉండడమే. ఆ సంస్థలూ వ్యవస్థలూ తమ చర్యలను సమర్థించుకోవడానికి వ్యవస్థీకృత మతపు నియమ నిబంధనలను చూపెడుతూ ఉంటాయి. ఆ నియమ నిబంధనలు ఇటీవల కనిపెట్టినవి కూడ కావచ్చు. వారి చర్యలు హత్యలకూ అత్యాచారాలకూ విధ్వంసానికీ సంబంధించినవి కూడ కావచ్చు. ఆ సంస్థలతో సంబంధం లేనివారు మత విశ్వాసాలూ విలువలూ ఎటువంటి హింసనూ ప్రబోధించవని చెపుతూ ఉంటారు. కాని అసలు విషయం అది కాదు. అన్ని మతాలూ సద్గుణాలనూ మంచి విలువలనూ ప్రకటిస్తాయన్నమాట నిజమే. కాని ఇవాళ సవాలునెదుర్కొంటున్నది ఆ విలువలు కావు. మతం పేరు మీద పనిచేసే ఈ సంస్థలు ఏ నమ్మకాలతో ఉన్నాయి, ఏ చర్యలు సాగిస్తున్నాయి అనేది ప్రశ్న. వారి చర్యలు అన్ని సమయాల్లోనూ మతం ప్రబోధించే విలువలకు అనుగుణంగా ఉండడం లేదు. హిందూ మతంతో, ఇస్లాంతో, సిక్కు మతంతో తమను తాము ముడివేసుని, హింసనూ భయోత్పాతాన్నీ పెచ్చరిల్లజేయడానికి ఎంతమాత్రం సందేహించని అటువంటి సంస్థలు మనకు సుపరిచితమే. మతం పేరు మీద మాట్లాడుతున్నప్పటికీ, చట్టానికి భంగకరంగా ప్రవర్తిస్తున్న ఇటువంటి వారి మీద చట్టాన్ని ప్రయోగించాలని అడగగలమా? అటువంటి చర్యలను ఖండించడం, శిక్షించడం అవసరమే గాని, దానితో ఆగిపోవడానికి వీలులేదు. మతాన్ని పరిరక్షించడమనే పేరు మీద అటువంటి చర్యలు ఎందుకు జరుగుతున్నాయో అర్థం చేసుకోవలసి ఉంది. వాటికి ఎట్లా ముగింపు పలకగలమో ఆలోచించవలసి ఉంది. మతంతో తమను తాము ముడివేసుకునే ఆస్తికులు ఇటువంటి చర్యలను ఆమోదిస్తారా? ఆమోదించకపోతే, తమ మత అస్తిత్వాన్ని వాడుకుంటూ అటువంటి హింసా బీభత్స చర్యలకు పాల్పడుతున్న వారి నుంచి తమను తాము దూరం చేసుకుని తమ మత విలువలను పరిరక్షించుకోవడం వారి బాధ్యత కాదా?

ప్రజాహిత మేధావి పతనానికి చాల కారణాలున్నాయి. నేనిక్కడ కొన్ని మాత్రమే ప్రస్తావించగలను. అన్నిటికన్న ఎక్కువ కనబడేదీ కాని అతి తక్కువగా ఆమోదించబడేదీ, నయా ఉదారవాద సంస్కృతి వల్ల తలెత్తిన అభద్రతలు. ఇప్పటికే ఉన్న దురాక్రమణలకు తోడు ఉద్యోగాలు అంతకంతకూ ఎక్కువ పోటీమయం అయిపోవడం మానవ సంబంధాల పట్ల విశ్వాసం తరిగిపోవడానికి దారితీస్తున్నది. సంపదలో అసహ్యకరమైన అంతరాలు ఆ దురాక్రమణలను మరింత పెంచుతున్నాయి. ఆడంబరమైన ప్రదర్శనలే ఆమోదయోగ్యమని చెప్పే కాకిబంగారమే విలువలకు ప్రమాణం అవుతున్నది. అవినీతిని అతి సులభంగా అంగీకరించడం సర్వసాధారణమైపోయింది. ధనికులు ఆడంబరంగా పూజించే కొత్త దేవతగా డబ్బు అవతరించింది. మిగిలినవాళ్లందరూ అది బొట్లు బొట్లుగా ఎప్పుడు జారిపడుతుందా అని ఆదుర్దాగా వేచిచూస్తున్నారు. సమానత్వం కోరుకునే హక్కు ఉందనే సంతోషానికీ, కొత్తగా రూపొందుతున్న కుల, ధన అధికారపు రూపాల వల్ల ఆ హక్కు కాలరాయబడడానికీ మధ్య ఘర్షణ సాగుతున్నది.

ఈ నయా ఉదారవాద సంస్కృతినీ ఆర్థిక వ్యవస్థనూ సులభంగా మార్చడం సాధ్యం కాదు. కాని వాటి దుష్పరిణామాలను తగ్గించవచ్చు. కాకపోతే, ఆ పని జరగాలంటే, సమాజపు వనరుల మీద పౌరులందరికీ హక్కులు ఉన్నాయనీ, సంక్షేమం కోసం, సామాజిక న్యాయం కోసం అడిగే హక్కు ప్రజలకు ఉందనీ, ఆ హక్కుల పునాది పైననే సమాజం నిర్మాణం కావాలనీ మనకు స్పష్టత ఉండాలి. నిజానికి స్వాతంత్ర్య సమయంలో, మన జాతి రాజ్యం నిర్మాణమవుతున్న సందర్భంలో ఈ అవగాహనే ఉండింది. పౌరులందరికీ సైద్ధాంతికంగా మాత్రమే కాక వాస్తవంలో సమానహక్కులు ఉండే సమాజాన్ని నిర్మించడం ఎట్లా అని 1960లలో, 1970లలో జరిగిన వాదనలు నాకింకా గుర్తున్నాయి. ఒక చలనశీల సమాజంలో లాగ, మన సమాజంలో కూడ అటువంటి చర్చలు కొనసాగవలసి ఉంటుంది. ప్రశ్నలు లేవనెత్తవలసి ఉంటుంది. అందుకు మనం ప్రజాహిత మేధావుల దగ్గరికి వెళ్లక తప్పదు. వారిని ముందుకు తేక తప్పదు. అయితే దానికన్న ముఖ్యంగా మనకు అటువంటి ప్రశ్నలు అడగడం అవసరమని భావించే ప్రజాబాహుళ్యం కూడ కావాలి.

మరి, ఏమి చర్చించాలో, ఎందుకు చర్చించాలో అవగాహన ఉన్న ప్రజాబాహుళ్యాన్ని ఎలా తయారు చేయగలం? విమర్శనాత్మక హేతుబద్ధతతో లేవనెత్తే ప్రశ్నలకు ప్రతిస్పందించే ప్రజాబాహుళ్యాన్ని ఎలా తయారు చేయగలం? ప్రతిస్పందన అంటే ఏది సూచిస్తే దాన్ని యథాలాపంగా ఆమోదించడం అని కాదు, కాని కనీసం ప్రత్యామ్నాయ భావాలను చర్చకు పెట్టాలి, పరిష్కారాలను సూచించాలి. ఇది జరగాలంటే, మొట్టమొదట, విద్యావంతులైన ప్రజా బాహుళ్యం ఉండాలి. ఆ ప్రజాబాహుళ్యం ప్రజాహిత మేధావుల పాత్రను అంగీకరించేది మాత్రమే కాకూడదు, వారి అవసరాన్ని గుర్తించేదిగా ఉండాలి.

మనకు మనం విద్యావంతులం కావడం

విద్యావంతులైన ప్రజాబాహుళ్యంగా మారాలంటే మనకు మనం ఎటువంటి విద్యాశిక్షణ పొందాలి? ఈ ప్రశ్న ఇటు విభిన్న శాఖలలోని వృత్తి నిపుణులకూ, అటు ఎందరో ప్రజాహిత మేధావులకూ సంబదంధించినది. ఈ ఇద్దరూ కూడ తమ ప్రత్యామ్నాయ అధికారాన్ని తమ వృత్తిపరమైన స్థాయి నుంచే పొందుతారు. ఇవాళ మనకు మనం

విద్యాశిక్షణ పొందడానికి ప్రధానంగా రెండు వనరులున్నాయి. మొదటిది, మౌఖిక రూపంగా అసంఘటిత దృశ్య శ్రవణ మాధ్యమాలు. రెండవది, క్రమబద్ధమైన విద్యా సంస్థల వ్యవస్థ. ఈ రెండిటికీ మధ్యంతరంగా ఉన్నది ఇంటర్నెట్. మిగిలిన రెండిటి లాగనే ప్రస్తుతం దీని ప్రభావ పరిధి కూడ మొత్తం సమాజానికీ విస్తరించినది కాదు. టివి చానళ్లు అరుదైన మినహాయింపులతో ఒకదాన్ని మరొకటి అనుకరిస్తుంటాయి. వాటి చర్చలలో పాల్గొనేవారు ఒక ఛానల్ నుంచి మరొక ఛానల్ కు కుప్పిగంతులు వేస్తుంటారు. ప్రతి ఒక్క విషయాన్నీ, అది ఎంత అసంగతంగానైనా సరే, ప్రస్తుత రాజకీయాల దృష్టి నుంచే చూస్తారు. అందువల్ల ప్రతి చర్చ లోనూ ప్రతి ఒక్క రాజకీయ పార్టీ ప్రతినిధులతో నిండిపోయేలా చూస్తారు. ఆ రాజకీయపార్టీల ప్రచారార్భాటం కింద నిజమైన చర్చ అణగిపోతుంది. ఆ పార్టీ ప్రతినిధుల ప్రకటనల వెనుక వాస్తవమేమిటో పరిశోధించడానికి ఏ ఒక్క కార్యక్రమమూ ప్రయత్నించదు. టెలివిజన్ మీద ఒక ప్రత్యామ్నాయ ఛానల్ అవకాశమే లేదా అని నాకు ఆందోళన కలుగుతున్నది. ఒకవేళ అందుకు తగిన ఆర్థిక వనరులు సమకూర్చడం కష్టమైతే, కనీసం వ్యాపార లాభాల మీద మాత్రమే దృష్టి లేని ఒక రేడియో ప్రసార కేంద్రమైనా సాధ్యం కాదా అనుకుంటున్నాను. ప్రత్యామ్నాయ భావాలను, పరిష్కారాలనూ అన్వేషించడాన్ని ప్రోత్సహించే వేదిక, ఒకే ఒక్క బైట్ ను దాటి అన్వేషించే వేదిక, విమర్శనాత్మక విచారణ సాగించాలనే ప్రేరణ ఉన్న వేదిక సాధ్యం కాదా? మరుసటి ఎన్నికల ప్రయోజనాలు అనే క్షణికమైన ఆసక్తిని మించి సమాజం పట్ల ఆసక్తి గల వారి గళాన్ని వినిపించే వేదికను ఎట్లా ఏర్పాటు చేయగలం? అటువంటి వేదిక భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నవారెవరు?

ఇక మరొక విద్యాశిక్షణల వనరు ఉంది. అది క్రమబద్ధమైన విద్యారంగం. దీన్ని రెండు స్థాయిలలో చూడవలసి ఉంది. మొదటిది విద్య పాఠ్య ప్రణాళికల సారాంశం. రెండవది, విద్యా సంస్థల స్వతంత్ర ప్రతిపత్తి. క్రమక్రమంగా విద్య విద్యావేత్తల చేతినుంచి దూరమవుతూ రాజకీయవేత్తల, రాజకీయ సంస్థల చేతుల్లోకి చేరుతున్నది. ఆ రాజకీయ సంస్థలు తమను తాము సాంస్కృతిక, మత సంస్థలుగా చెప్పుకుంటున్నాయి. ఇవాళ్టి రాజకీయవేత్తలు మేధావులతో అసలు సంబంధాలంటూ పెట్టుకుంటే ఎటువంటి సంబంధాలు పెట్టుకుంటున్నారనేది అర్థం చేసుకోవడం చాల ముఖ్యం.

ఒక వ్యక్తిని విశ్లేషణాత్మక, తార్కిక, స్వతంత్ర పద్ధతుల్లో ఆలోచించేలా తయారుచేయడమే ఆదర్శవంతమైన స్థితిలో విద్యాశిక్షణ సారాంశం కావాలి. విద్యాశిక్షణ వ్యక్తికి సృజనాత్మక ఆలోచననివ్వాలని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. విద్యాశిక్షణ పొందిన వ్యక్తి కేవలం హేతుబద్ధ ఆలోచనా శక్తిని ఉపయోగించాలి. సాంకేతిక పరిజ్ఞాన రూపంలో తనకు అందుతున్న జ్ఞానానికి ఒక నిర్దిష్ట నేపథ్యం ఉన్నదనీ, ఆ నేపథ్యమే ఆ జ్ఞానాన్ని ఉత్పత్తి చేసి, దాన్ని పెంచి పోషిస్తుందనీ వాస్తవాన్ని గ్రహించాలి. జ్ఞానం శూన్యం నుంచి ఊడిపడదు. ఇరవయో శతాబ్దిలోని విశిష్ట సాంకేతిక అన్వేషణలు ఆ శతాబ్దిలో మాత్రమే జరగడానికి అవకాశం ఉంది. ఆ అన్వేషణలు మూడు వేల సంవత్సరాల కింద సాంకేతిక, అనుబంధ జ్ఞానం లేకుండా వెలువడడానికి అవకాశం లేదు. ఏ శాస్త్రీయ అన్వేషణకైనా సుదీర్ఘకాలం పడుతుంది. విజ్ఞానశాస్త్ర చరిత్రకారులు ఆ సుదీర్ఘకాలం ఎలా పట్టిందో ఆధారాలతో రుజువు చేస్తారు. ఒక అన్వేషణను సాధ్యం చేసిన సాంకేతిక పరిజ్ఞానమూ జ్ఞానమూ చరిత్రలో ఒకానొక ప్రత్యేక సందర్భంలో ఎలా తలెత్తాయో, ఎలా పురోగమించాయో చూపుతారు.

శాస్త్రవిజ్ఞాన పాత్ర

మన సమాజంలో విజ్ఞానశాస్త్రం పురోగమించిందని మనం చెప్పుకోదలచుకుంటే, గతంలో జ్ఞానస్థాయిలోనూ, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అన్వయ స్థాయిలోనూ ఆ విజ్ఞానశాస్త్రం నిర్వహించిన పాత్ర ఏమిటో వెలికితీయవలసి ఉంటుంది. ఇరవయో శతాబ్ది అన్వేషణలు వేల సంవత్సరాల కింద ప్రాచీన భారతంలోనే ఉన్నాయని గొప్పలు చెప్పుకునే బదులు అప్పుడు మన దగ్గర ఉండిన విజ్ఞానశాస్త్రపు, సాంకేతిక పరిజ్ఞానపు స్వభావం ఏమిటో పరిశోధించవలసి ఉంటుంది. మన చరిత్ర క్రమంలో ఉన్నదని కచ్చితమైన ఆధారాలున్న విజ్ఞాన శాస్త్రం ఏమిటో, సాంకేతిక పరిజ్ఞానం ఏమిటో, వాటితో మనం ఏమి చేశామో పరిశోధించవలసి ఉంటుంది. క్రీ.శ. 15వ శతాబ్దిలోనే కేరళ గణిత శాస్త్రజ్ఞులు కలన గణితాన్ని కనిపెట్టారనుకుంటే, మొత్తంగా జ్ఞానాన్ని పురోగమింపజేసే పద్ధతిగా ఆ అన్వేషణ ఎందుకు ఉపయోగపడలేదు?

విద్యాశిక్షణలో మొట్టమొదటి అడుగు అప్పటికి ఉనికిలో ఉన్న జ్ఞానం గురించిన సమాచారాన్ని అందించడం. ఆ తర్వాతి అడుగు, ఆ ఉన్న జ్ఞానం స్థానంలో విద్యార్జనాక్రమం ద్వారా కొత్త, మెరుగైన జ్ఞానాన్ని చేర్చవలసిన అవసరం ఉందా అని అంచనావేయడం. ఇవాళ ఉన్న విద్యావ్యవస్థ చాల పాఠశాలల్లో మొదటి అడుగుకే చేరడం లేదు. కావలసిన పాఠశాలలకన్న అతి తక్కువ పాఠశాలలు ఉండడం, ఉన్నవి కూడ దారుణమైన స్థితిలో ఉండడం బహుశా ఉద్దేశపూర్వక విధానమేమో అని కొందరు అనుమానిస్తున్నారు. పౌరులందరూ అక్షరాస్యులు మాత్రమే కాక విద్యావంతులు కూడ అయితే తమకు ప్రమాదమని పాలకులు భావిస్తున్నందువల్లనే ఈ విధానం అని అనుమానిస్తున్నారు. గత అర్థ శతాబ్దంలో పాఠశాల విద్య విషయంలో కొట్టవచ్చినట్టుగా కనిపించే నిర్లక్ష్యం అందువల్లనే. విశ్వవిద్యాలయాల సంగతి అలా ఉంచి, ఉన్నతపాఠశాలలో చేరడానికైనా తగిన విధంగా జ్ఞానం అందించలేక పోవడంతో మనం ఒక అర్థరహితమైన స్థితికి చేరాం. అయినా మనం మరిన్ని విశ్వవిద్యాలయాలు, ఐఐటిలు, ఐఐఎంలు, వగైరా వగైరా ఏర్పాటు చేయడానికి ఉవ్విళ్లూరుతున్నాం. ఈ పరిస్థితి అనివార్యంగా విద్యను పలుచబరచి చివరికి నిరర్థకస్థితికి చేరుస్తుంది. ఇది మనను కనిష్ట సామాన్య గుణిజం స్థాయికి, అంటే క.సా.గు. విద్య స్థాయికి, అట్టడుగుకు చేరుస్తుంది. పరిశోధనాత్మక మేధస్సును పెంపొందించే అత్యవసరమైన ఆలోచనా పద్ధతులను చిన్నారి పిల్లలలో మొద్దుబార్చడమే మన విద్యా వ్యవస్థ చేస్తున్నది. అంటే ప్రజాహిత మేధావులకు ప్రతిస్పందించగలిగే మేధస్సు తయారు కాకుండా పోతున్నది. విద్యావ్యవస్థ ఇలా ఉన్నప్పటికీ స్వతంత్రంగా, సృజనాత్మకంగా ఆలోచించగల శక్తి ఉన్నవారు కొందరు తయారవుతున్నందుకు సంతోషించాలి. కాని వారి సంఖ్య మనకు ఎంతమంది కావాలో దానికన్న చాల తక్కువ. విద్యార్థులు

ప్రశ్నలు అడగడానికి ప్రోత్సహించే, స్వతంత్రంగా ఆలోచించడానికి ప్రేరేపించే విద్యా భావననే మనం అనుసరించి ఉంటే మనది ఎంత శక్తిమంతమైన, ఆలోచనాత్మకమైన సమాజం అయి ఉండేదో ఒక్కసారి ఊహించండి.

వర్తమాన ప్రజాహిత మేధావులు లేవనెత్తగలిగిన సమస్యలేమిటని ఎవరైనా అడగవచ్చు. నిరాదరణకు గురవుతున్న పౌరులకు, ఆ మాటకొస్తే భారతీయులలో అత్యధిక సంఖ్యాకులకు, సుపరిపాలన అందాలంటే వలసవాద మూలాలతో నిర్మాణమైన కాలం చెల్లిన వ్యవస్థ అవశేషాలతో నడుస్తున్న ప్రస్తుత పద్ధతులను మార్చవలసి ఉంటుంది. జాతీయ సంపద అన్యాయమైన పద్ధతిలో పంపిణీ అవుతున్నందువల్ల పేదరికం హెచ్చు స్థాయిలో ఉంది. వలసవాద విధానం సృష్టించిన వర్గీకరణనే వాడుకుంటూ కుల మత ప్రాధాన్యతలు అదేవిధంగా కొనసాగుతున్నాయి. వలసవాద ప్రభుత్వం మెజారిటీ మతం, మైనారిటీ మతం అనే తరగతులు కనిపెట్టి, మత అస్తిత్వ రాజకీయాలను ప్రోత్సహించింది. వాటిని ప్రస్తుతం శాశ్వత తరగతులుగా పరిగణిస్తున్నారు. ప్రజాస్వామ్యమంటే ఏ సమస్యకు ఆ సమస్యను బట్టి మెజారిటీ, మైనారిటీలు ఏర్పడతాయి గనుక ఈ శాశ్వత తరగతులు ప్రజాస్వామ్య నిర్వహణనే అనుమతించడం లేదు. విద్యలో, ఉద్యోగాలలో రిజర్వేషన్ విధానాన్ని శాశ్వత ప్రాతిపదికన కొనసాగిస్తే, వాటివల్ల స్వల్పమైన ప్రయోజనాలు ఉన్నప్పటికీ, మత, కుల అస్తిత్వాలను పునరుద్ధరించడమే జరుగుతుంది. ఈ వలసవాద అస్తిత్వాలను పక్కనపెట్టి, సంపద సమాన పంపిణీకి ప్రయత్నాలు చేస్తూ మన సమాజాన్నీ, ఆర్థిక వ్యవస్థనూ ఒక భిన్నమైన పద్ధతిలో పునర్నిర్మించడం లోనే అసలైన పరిష్కారం ఉంది.

లౌకికంగా ఉండవలసిన అవసరం

ఒక ప్రజాస్వామిక వ్యవస్థ అంతిమంగా విజయం సాధించాలంటే ఆ సమాజం లౌకికంగా ఉండాలి. అంటే ఆ సమాజం అన్ని మతాల సహజీవనాన్ని దాటి చూడగలగాలి. ఆ సమాజ సభ్యులు పౌరులుగా సమానమైన సామాజిక, ఆర్థిక హక్కులు కలిగి ఉండాలి. తమ మతంతో ప్రమేయం లేకుండా ఆ హక్కులను వినియోగించుకోగలిగి ఉండాలి. ఈ హక్కుల వినియోగానికి సంబంధించిన కార్యకలాపాలలో సమాజం మత సంస్థల అదుపు నుంచి స్వతంత్రంగా ఉండాలి. ఆ సమాజ సభ్యులకు తమ ఇష్టం వచ్చిన మతాన్ని అవలంబించడానికి గాని, ఏ మతాన్నీ అవలంబించకుండా ఉండడానికి గాని స్వేచ్ఛ ఉండాలి. ఇటువంటి లౌకికీకరణ ఎలా ఉంటుందో, ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో అది ఎందుకు అవసరమో వివరించే పని, ఆ లౌకికీకరణ క్రమాన్ని పరిరక్షించే పని చేయవలసింది ప్రజాహిత మేధావులే.

మన సమాజంలో ప్రజాహిత మేధావులు లేకుండా పోలేదు. వారిని ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోనక్కరలేదు. నేను ముందే చెప్పినట్టు వారికి మన సమాజంలోనే పూర్వీకుల పరంపర ఉంది. అయితే చారిత్రక మార్పులవల్ల వారి పాత్ర, ఇంతకు ముందరి మేధావులకు పూర్తిగా భిన్నంగా కాకపోయినా, విస్తరించవలసిన అవసరం మనకాలంలో ఏర్పడిందని గుర్తించవలసి ఉంది. మన సమాజాన్ని అర్థం చేసుకోవడంలో మన ప్రజాహిత మేధావుల పూర్వీకులు కొత్త కోణాలను అదనంగా చేర్చారు. మానవస్థితిని హేతుబద్ధ, తార్కిక వాదనల ద్వారా వివరించడానికి ప్రయత్నించారు. సమాజాన్ని అదుపు చేసే వారి మీద లౌకిక నైతిక అధికారాన్ని నెరిపిన గతకాలపు భిన్నవాదాలు ఆ ప్రజాహిత మేధావులను అంతర్గతంగా పోషించాయి. మనకాలానికి సమీపకాలంలో ఆ ఆలోచనలే వలసవాద ఆధిపత్యాన్ని తోసిరాజన్నాయి. విమర్శనాత్మక హేతుబద్ధతను పాటించే ప్రజాహిత మేధావులు ఈ ఉజ్వల పరంపరకు వారసులు.

ఈ ఉపన్యాసం శీర్షిక ప్రశ్నించడం గురించి గనుక ఒక సుదీర్ఘమైన ప్రశ్నతోనే ముగించదలచాను. స్వతంత్రంగా ఆలోచించగలిగినవారికీ అవసరమైన ప్రశ్నలు వేసేవారికీ మనదగ్గర కొదవలేదు. కాని తరచుగా ఏమవుతున్నదంటే, గొంతులు వినబడవలసినవేళ మౌనం రాజ్యమేలుతున్నది. మనం వ్యవస్థను ఆమోదించే సౌఖ్యానికి సులభంగా లోబడి జీర్ణమైపోయామా? ప్రశ్నిస్తే రాగల, వచ్చే ప్రతీకారానికి భయపడిపోతున్నామా? ఆలోచించడానికీ, ఉమ్మడిగా ఆలోచించడానికీ మనను ప్రోత్సహించే స్వతంత్ర స్థలం కావలసి ఉందా?

(ఈ ఉపన్యాసం ఇతివృత్తం ఎంచుకోవడం ఇబ్బందికరంగా ఉండింది. నిఖిల్ చక్రవర్తి బహుముఖ ప్రజ్ఞాశాలి అని తెలిసిందే. ఆయన చాల ఆర్ద్రమైన, ప్రేమాస్పదుడైన స్నేహితుడు. ఆయనకు మనుషులన్నా, రాజకీయాలన్నా, చుట్టూ ఉన్న ప్రపంచమన్నా చాల ఆసక్తి. మా ఇద్దరికీ ఉమ్మడిగా ఉన్న విషయాలూ ఉన్నాయి. ఇద్దరమూ కూడ పద్మ అవార్డును తీసుకోవడానికి మర్యాదగా తిరస్కరించాం. ఆ అవార్డు జర్నలిస్టుగా తన స్వతంత్ర ప్రతిపత్తికి ఆటంకమవుతుందని ఆయన భావించాడు. విద్యావేత్తగా నాకూ అంతే అవుతుందని నేననుకున్నాను. రాజకీయ కబుర్లలో ఆయన ఛలోక్తులు చాల ఆసక్తిదాయకంగా ఉండేవి. ప్రస్తుతం అందరూ రాస్తున్న జ్ఞాపకాల వెల్లువను చూస్తున్నప్పుడు, ఆయన తన జ్ఞాపకాలను రాసి ఉంటే టివి ఛానళ్లు పేలిపోయి ఉండేవని నాకనిపిస్తుంది.)

(అక్టోబర్ 26 న ఢిల్లీలో రొమిలా థాపర్ చేసిన నిఖిల్ చక్రవర్తి మూడో స్మారకోపన్యాసం. మొదట ది బుక్ రివ్యూ డిసెంబర్ 2014 సంచికలో, తర్వాత ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ డిసెంబర్ 13, 2014 సంచికలో అచ్చయిన పూర్తిపాఠానికి అనువాదం)

వీ

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. – సం.*

పెషావర్ మారణకాండ - కొన్ని ఆలోచనలు

చిన్నారి పిల్లలను కాల్చిచంపిన పాశవిక దాడిని ఖండించవలసిందేనని, అదే సమయంలో అంతకు మించిన మారణకాండలు సాగిస్తున్న సామ్రాజ్యవాదం గురించి ఆలోచించాలని అంటున్నది **జెఎన్‌యు డెమొక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్**

పెషావర్‌లో డిసెంబర్ 16న 130 మంది పాఠశాల విద్యార్థులను పాశవికంగా కాల్చిచంపిన ఘటన దిగ్భ్రాంతి కరమైనదీ, విషాదకరమైనదీ మాత్రమే కాదు, అత్యంత దుర్మార్గమైనదీ, తీవ్రంగా ఖండించవలసినదీ. పౌరుల మీద, ముఖ్యంగా చిన్నారి పిల్లల మీద అటువంటి దాడి ఎవరు జరిపినా ఖండించవలసిందే. ఈ మారణకాండ తామే జరిపామని తెహ్రీక్ ఎ తాలిబాన్ (పాకిస్తాన్) ప్రకటించింది. ప్రపంచమంతా దాన్ని ఖండిస్తున్నది. అయితే, సామ్రాజ్యవాద చరిత్ర, ఫాసిజం చరిత్ర తెలిసినవారెవరైనా ఇటువంటి దారుణ ఘటన వెనుక ఎవరి చేతులున్నాయో కచ్చితంగా చెప్పలేరు.

చిలీలో ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చడానికి సైనిక కుట్రను రచించడం నుంచి ఇరాక్ పై దుర్మార్గమైన దురాక్రమణ సాగించడానికి 'జన విధ్వంసక ఆయుధాలు' ఉన్నాయనే సాకు చూపినదాకా, తిరుగులేని అధికారాన్ని స్థాపించు కోవడానికి హిట్లర్ పన్నిన 'రీచ్‌స్టాగ్ దహనకాండ' పన్నాగం నుంచి, అమెరికా పౌరుల మీద, సైనికుల మీద 'తీవ్రవాద దాడుల' నాటకం జరిపి, దాన్ని ఉపయోగించుకుని ఆపరేషన్ నార్త్‌వుడ్స్ పేరుతో క్యూబా మీద యుద్ధం ప్రకటించినదాకా, వియత్నాం దురాక్రమణకు మద్దతు కూడగట్టడానికి తయారుచేసిన 'టోన్‌కిన్ అఖాతం ఎదురుకాల్పుల' బూటకం నుంచి గల్ఫ్ యుద్ధానికి మద్దతు కూడగట్టడానికి సిఐఎ కల్పించి రాసిన 'నయిరా వాంగ్మూలం' దాకా – ఈ జాబితాకు అంతులేదు.

చివరికి మన దేశంలో కూడ మక్కా మసీదు, మాలేగాంవ్ పేలుళ్లు, సమ్‌ఝౌతా ఎక్స్‌ప్రెస్ విధ్వంసం వంటివన్నీ ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థలు చేసినవేనని ఆ తర్వాత రుజువైనప్పటికీ, మొదట సుదీర్ఘకాలం పాటు అవి 'ఇస్లామిక్ తీవ్రవాద' చర్యలేనని, అంతేకాదు, ఆ చర్యలు తామే చేశామని కొన్ని సంస్థలు 'బాధ్యత' ప్రకటించాయని ప్రచార సాధనాలు అన్నాయి. ముస్లిం యువకులను వేధించడానికి, బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపడానికి వాడుకున్న ఈ అబద్ధాన్ని మనందరమూ నమ్మేలా చేశాయి. అలాగే 'పార్లమెంటుపై దాడి', లేదా దారుణమైన '26/11 ముంబై తీవ్రవాద దాడులు' వంటి ఘటనల గురించి, అవి కఠినమైన తీవ్రవాద వ్యతిరేక చట్టాలకు మద్దతు సాధించడానికి రాజ్యమే 'కల్పించినవని' సిబిఐ వంటి సంస్థలలో పనిచేసిన ప్రభుత్వాధికారులే ఆ తర్వాత అన్నారు. పార్లమెంటుపై దాడి తర్వాత పోటా వచ్చింది. 26/11 తర్వాత మరింత కఠినమైన యుఎపిఎ వచ్చింది. ఎంతో మంది సాయుధులైన తిరుగుబాటుదారులు కనబడ్డారు. వందలాది ప్రాణాలు బలి అయిపోయాయి. కాని ఆ దాడుల వెనుక హస్తం ఎవరిదో మనం ఎప్పటికీ తెలుసుకోలేం. మనకు కనబడుతున్నదల్లా అటువంటి దాడులు జరిగిన ప్రతి సందర్భంలోనూ సామ్రాజ్యవాదుల ప్రాపకంలో సాగుతున్న 'తీవ్రవాదంపై యుద్ధం' మరిన్ని కోరలు తెచ్చుకున్నదనే వాస్తవం మాత్రమే. మరిన్ని దుర్మార్గమైన చట్టాలు ప్రవేశపెట్టారనే వాస్తవం మాత్రమే. ప్రజలను వేధించడానికి రాజ్యం చేతుల్లోకి మరింత జవాబుదారీతనం లేని అధికారం వచ్చిందనే వాస్తవం మాత్రమే.

అదే విధంగా, పెషావర్ దాడి తర్వాత జరగనున్నదేమిటో ఊహించడం అసాధ్యం కాదు. ఏమి జరగనున్నదో పెషావర్ నుంచి ఆ దురాగతపు వార్తలు వస్తుండగానే బైటపడడం మొదలయింది. ఉదాహరణకు, ఆ రాత్రే, టైమ్స్ నౌ టివి ఛానల్‌లో ప్రధాన చర్చా సమయంలో 'పాకిస్తాన్‌లో అమెరికా ఉనికి అనివార్యమా?' అని చర్చ మొదలైంది. జరగనున్నది ఇదేనని, రానున్న రోజులలో ఇది జరగడానికి రంగం సిద్ధమవుతున్నదని స్పష్టమే. అంటే ఇంకా ఎక్కువ మానవరహిత విమాన దాడులు జరుగుతాయి. ఇంకా ఎక్కువ రక్తపాతం జరుగుతుంది.

ఉపఖండంలో భారత్, పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్ వంటి తైనాతీ రాజ్యాలతో అమెరికా సామ్రాజ్యవాదానికీ ఇజ్రాయెల్‌కూ మరిన్ని 'వ్యూహాత్మక ఒప్పందాలు' కుదురుతాయి. అమెరికా సైనిక దూకుడు మరింత పెరుగుతుంది. మరిన్ని 'తీవ్రవాద వ్యతిరేక చట్టాలు' వస్తాయి. ఇంతవరకు మనం కచ్చితంగా చెప్పవచ్చు. అయితే ఇదంతా చెపుతున్నప్పటికీ, దారుణమైన పెషావర్ మారణకాండ తెహ్రీక్ ఎ తాలిబాన్ (పాకిస్తన్) చెప్పుకున్నట్టుగా దాని పనే కావచ్చుననే కీలక అనుమానం మిగిలే ఉంటుంది. ఈ దాడి 'ఇస్లామిక్ వ్యతిరేకమైనద'ని అంటూ చేసిన ఖండన ప్రకటనలో చివరికి అఫ్ఘన్ తాలిబాన్ కూడ అదే నమ్ముతున్నట్టుంది.

అయితే, మనం పెషావర్ మారణకాండను ఎలా అర్థం చేసుకోవాలి? ఇంతకు ముందే చెప్పినట్టు, అటువంటి చర్య ఏదైనా, ప్రత్యేకించి అది సాధారణ పౌరులనూ, చిన్నారి పిల్లలనూ గురిచూసినదైతే తప్పనిసరిగా ఎటువంటి పరిస్థితిలోనూ సమర్థించదగినది కాదు. అత్యంత తీవ్రమైన పద్ధతిలో ఖండించవలసినదే. కాని అడగవలసిన కష్టతరమైన, మరింత మౌలికమైన ప్రశ్న ఏమంటే ఈ పెషావర్ మారణకాండకు నిజంగా బాధ్యులుగా గుర్తించవలసిన వారెవరు? అందుకు అంతిమంగా బాధ్యత వహించవలసినది యుద్ధోన్మాద అమెరికన్ సామ్రాజ్యవాదం మాత్రమేనని మేం భావిస్తున్నాం. పెషావర్ రక్తపాతాన్ని సాకుగా చూపి మరింత రక్తపాతానికి తయారవుతున్న అమెరికా తన చేతుల మీది పెషావర్ రక్తపు మరకలను తుడిచేయజాలదు.

చాలసార్లు, వేలాది మంది మృత్యువాత పడినదానికన్న ఒక హత్యా వార్త ఎక్కువ మందిని ఆకర్షిస్తుంది, ఎక్కువ నైతిక ఆగ్రహానికీ, తీవ్రమైన ఖండనలకూ దారి తీస్తుంది. అలా వేలాది మంది మృత్యువాత పడడాన్ని ఎంగెల్స్ 'సమాజపు హత్య' అన్నాడు. నిజంగానే, చాల సందర్భాలలో ఒక హత్యా, దానికి ప్రతిస్పందనగా ఖండనలూ ఇంకా హెచ్చు స్థాయిలో, ఇంకా దారుణంగా, ఇంకా పాశవికంగా ఉన్న వాస్తవికతను దాచడానికి మాత్రమే పనికి వస్తాయి. అది ఎంత దారుణమైన ఘటన అయినప్పటికీ ఒక తీవ్రవాద దాడికి తాలిబాన్ ను వేరు చేసి విమర్శించడం, ఏమి చేయవలసి ఉన్నదనే విషయంలో సరైన నిర్ధారణలకు దారి తీయదు. నిజం చెప్పాలంటే అటువంటి వైఖరి సరిగ్గా అమెరికా మనను ఎటు తీసుకుపోవాలనుకుంటున్నదో అటే తీసుకుపోతుంది. అంటే ఇంకా ఎక్కువ మానవరహిత విమాన దాడుల వైపు తీసుకుపోతుంది. అందువల్ల కొన్ని చర్యలను కప్పిపెడుతూ కొన్ని చర్యల మీదికి దృష్టి మళ్లించే రాజకీయాలను మనం అర్థం చేసుకోవలసి ఉంది.

ఉత్తర వజీరిస్తాన్‌లో 2006లో ఒక మదరసా మీద జరిగిన మానవరహిత విమాన దాడిలో 69 మంది చిన్నారి పిల్లలు చనిపోయినప్పుడు మనం ఇప్పటంత ఆదుర్దానూ, ఆందోళననూ, ఖండనల వెల్లువనూ, ఆగ్రహాన్నీ చూశామా? దానికి ముందూ ఆ తర్వాత జరిగిన వందలాది క్షిపణి దాడుల సందర్భంలో ప్రతిస్పందన ఇలాగే ఉందా? లేదు. ఇప్పుడు మనం జవాబు చెప్పవలసిన మౌలిక ప్రశ్న అదే. స్పష్టంగా చెప్పాలంటే, చివరికి ప్రగతిశీల ప్రజాస్వామిక ఉదారవాద శక్తులతో సహా మనందరమూ కూడ సామ్రాజ్యవాద ప్రాయోజిత కార్పొరేట్ ప్రచార ఆర్భాటానికి బానిసలుగా మారిపోయాం. మన టివి ఛానళ్లలో ఎంపిక చేసి చూపించిన రక్తపు మడుగులపట్ల వారు కోరుకున్నట్టుగానే ఆగ్రహాన్ని ప్రదర్శించేలా మనం తయారయ్యాం. అందువల్ల అంతులేకుండా సాగుతున్న రక్తప్రవాహం మన దృష్టిలోకే రాదు, అది మన అవగాహనకు అందదు. అది మన అంతరాత్మను ప్రశ్నించదు. మన అంతరాత్మ అలా సామ్రాజ్యవాద కొరడా దెబ్బల కింద ముందుకు సాగుతున్నప్పటికీ, ఆందోళన చెందవలసిన, ఒక్క క్షణం ఆగి ఆలోచించవలసిన అంశాలున్నాయి.

ఆమాటకొస్తే పెషావర్ మారణకాండ తర్వాత తాలిబాన్ అధికార వ్యాఖ్యాత తాము ఆ పని ఎందుకు చేశామో వివరించాడని వార్తలు వచ్చాయి. తాము అనుభవిస్తున్న బాధ 'వారికి' కూడ తెలియాలనే ఆ పని చేశారట. సమర్థించడానికి వీలులేని దురాగతానికి, ముక్కు పచ్చలారని బాలబాలిక లను మట్టుపెట్టిన పాశవికతకు అది ఎంతమాత్రమూ సమర్థన కాదు. కాని, ఇటువంటి సందర్భంలో కేవలం ఖండించి ఊరుకోవడం సులభమే. కాని దానిలో ఇమిడి ఉన్న మరింత కష్టమైన ప్రశ్నకు జవాబు చెప్పే సాహసం చేయవలసి ఉంది. ఆ విశాల నేపథ్యాన్ని మనం పరిగణనలోకి తీసుకుంటే, వజీరిస్తాన్ లో అయినా, పెషావర్ లో అయినా జరుగుతున్న రక్తపాతానికి ప్రాథమిక బాధ్యత అమెరికన్ సామ్రాజ్యవాదానిదేనని గుర్తించవలసి ఉంది.

మనకాలంలో అతి పెద్ద తీవ్రవాది అమెరికానే. అమెరికా ఆధునిక చరిత్రలోకెల్లా అత్యంత నిర్దాక్షిణ్యమైన ఆర్థిక ఆంక్షలను ఇరాక్ మీద పది సంవత్సరాల పాటు విధించింది. అప్పుడు ఐదు సంవత్సరాల లోపు చిన్నారులలో మరణాల రేటు నెలకు నాలుగువేల కన్న ఎక్కువగా ఉండింది. కేవలం ఎనిమిది సంవత్సరాలలో ఐదు లక్షల మంది ఇరాకీ చిన్నారులు మరణించారు. అక్షరాస్యత 95 శాతంగా, ఆధునిక ఆరోగ్య సౌకర్యాల అందుబాటు 93 శాతంగా ఉండిన దేశంలో ఆ ఆర్థిక ఆంక్షలూ, యుద్ధమూ ఎంత బీభత్సం సృష్టించాయంటే, అక్కడ శిశు మరణాల రేటు అతి తక్కువగా ఉన్న స్థానం నుంచి అతి ఎక్కువకు చేరింది. జాతి హననం లాంటి ఈ మారణకాండ మన కంటికి కనబడని 'సమాజపు హత్యల'లో భాగం. అంతే కాదు, దాన్ని 'తీవ్రవాదంపై యుద్ధం' పేరిట, లేదా 'ప్రజాస్వామ్యాన్ని ఎగుమతి చేయడం' పేరిట సమర్థించవచ్చు కూడ.

అరబ్ భూములను దురాక్రమించి జరుపుతున్న అమానుష యుద్ధంలో 2000 నుంచి ఇప్పటివరకూ ఇజ్రాయెలీలు పాఠశాలల మీద, ఆస్పత్రుల మీద, జనావాసాల మీద గురిపెట్టి బాంబుదాడులు జరిపి, ఎంత తక్కువగా లెక్కవేసినా దాదాపు 1500 పాలస్తీనా చిన్నారి పిల్లలను హతమార్చారు. కుఖ్యాతి పొందిన మైలాయి మారణకాండలో, 1968 మార్చ్‌లో అమెరికా సైనిక బలగాలు 500కు పైగా సాధారణ పౌరులను, అందులోనూ ఎక్కువమంది స్త్రీలను, చిన్నారి పిల్లలను చుట్టుముట్టి, ఒక్కొక్కరిని గురిచూసి కాల్చి చంపారు. ఈ మారణకాండ నాలుగుగంటల పాటు జరగగా, అందులో పాల్గొన్న సైనికులు మధ్యలో భోజన విరామం కూడ తీసుకున్నారు. ఆ మారణకాండ సమయంలో 'కదిలే ప్రతిదాన్నీ చంపెయ్యి' అని ఆదేశాలు వచ్చాయి. ఎక్కువమందిని చంపామని చూపుకుంటే సైనికులకు సెలవుల రూపంలో, మద్యం రూపంలో పారితోషికాలు ఇచ్చారు.

హిరోషిమాలో వేసిన అణుబాంబులతో పోలిస్తే 640 రెట్లు ఎక్కువ బాంబులను వియత్నాం మీద వేసి, తక్కువలో తక్కువ ఇరవై లక్షల మందిని పొట్టన పెట్టుకున్నది అమెరికా. హిరోషిమా, నాగసాకిలలో అణుబాంబులు వాడి లక్షలాది మందిని బలిగొన్న ఏకైక సైన్యం అమెరికన్ సైన్యమే. బాంబుల ద్వారా, సిఐఎ ప్రేరేపిత సైనిక కుట్రల ద్వారా మాత్రమే కాదు, అధికార లాలసతో, లాభాపేక్షతో దారుణమైన విధానాలను రుద్ది లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆగ్నేయాసియా, పశ్చిమాసియాలలో కోట్లాది మంది ప్రజలను చంపినదీ, పేదరికంలో ముంచినదీ, అదృశ్యం చేసినదీ అమెరికా.

మళ్లీ పెషావర్ విషయానికే వస్తే, బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం ప్రకటించిన గణాంకాల ప్రకారం, 'కచ్చితంగా' లక్ష్యానికి గురిపెట్టి పేల్చామని చెపుతూ అమెరికా జరిపిన మానవరహిత విమాన దాడుల్లో పాకిస్తాన్‌లో 2004 నుంచి ఇప్పటివరకూ 204 మంది చిన్నపిల్లలు, 959 మంది సాధారణ పౌరులు, 2453 మంది 'ఇతరులు' చనిపోయారు. కాగా, కేవలం 50 మంది 'గుర్తించిన', 'తెలిసిన' 'ఉన్నతస్థాయి లక్ష్యాలు' చనిపోయారు. ఈ అంకెల్లో 'ఇతరులు' అనేది చాల అస్పష్టమైన మాట. ఎందుకంటే ఒబామా ప్రభుత్వ నిర్వచనం ప్రకారం 'ఇతరులు' అంటే 'సైనికుడిగా ఉండడానికి తగిన శారీరక దారుఢ్యం ఉన్న ఏ వ్యక్తి అయినా.' ఉద్దేశించిన ప్రతి ఒక్క వ్యక్తికీ కనీసం 28 మంది అమాయకులను అమెరికా మానవరహిత విమానదాడులు చంపుతున్నాయని మరొక సర్వే ప్రకటిస్తున్నది.

ఇక పాకిస్తాన్, యెమెన్, సోమాలియా, లిబియాలలో ఇటువంటి దాడుల్లో చనిపోతున్నవారి మొత్తం అంకెలు దిగ్భ్రాంతికరమైనవి. ఇవాళ పాకిస్తాన్ సైనిక బడ్జెట్ లో పావు వంతు అమెరికానే భరిస్తున్నది. అమెరికా ఆదేశాల మేరకు పాకిస్తాన్ ఆరునెలల కింద ఉత్తర వజీరిస్తాన్‌లోని గిరిజన ప్రాంతాలలో జర్బ్ ఎ అజబ్ పేరుతో అత్యంత పాశవికమైన ఏరివేత దాడులను ప్రారంభించింది. ఈ ఏరివేత దాదాపుగా జాతి నిర్మూలనతో సమానంగా జరుగుతున్నది. అక్కడ తిరుగుబాటుదారులు లేనేలేరని, వారు అక్కడి నుంచి ఎప్పుడో ఖాళీచేసి వెళ్లిపోయారని స్థానికులు చెపుతుండగా, పాకిస్తాన్ సైన్యం మాత్రం అక్కడ గ్రామాల మీద విమానాలలోంచి బాంబులు వేస్తూ, ఫిరంగి కాల్పులు జరుపుతూ ఉంది. కొన్ని నెలలలోనే అక్కడి రక్తపాతాన్ని తప్పించుకోవడానికి పదిలక్షల మంది శరణార్థు లయ్యారు. ఈ స్థితిలో 1198 'మిలిటెంట్లను' కాల్చి చంపామని ప్రభుత్వం ప్రకటిస్తే, అసలు వారెవరు అనే ప్రశ్నలు చెలరేగాయి. అవి ఎవరూ వెళ్లడానికి వీలులేని ప్రాంతాలు గనుక వాస్తవ సమాచారం తెలియడం కష్టం. కాని బైటికి వస్తున్న సమాచారం ప్రకారం పాకిస్తాన్ సైన్యం వందలాది మంది సాధారణ ప్రజలను ఊచకోత కోస్తున్నది. ఉదాహరణకు జూలై 17న, తిరుగుబాటుదారుల స్థావరాలపై బాంబు దాడులు జరిపి 35 మందిని చంపివేశామని సైన్యం ప్రకటించగా, 20 మంది స్త్రీలను, 10 మంది చిన్నారి పిల్లలను సైనికులు ఊచకోత కోశారని తెలుస్తున్నది. ఇటువంటి వార్తలేవీ ప్రచారసాధనాలకు పట్టవు. అవి 'తీవ్రవాదంపై యుద్ధం' అనే సామ్రాజ్యవాద రణన్నినాదం కింద అణగిపోయే 'సమాజపు హత్యలు'.

సామ్రాజ్యవాద మృత్యు నాట్యం టెలివిజన్ తెరలకు ఎక్కకుండా, ప్రజల జ్ఞాపకంలో చేరకుండా ఉండిపోతుండగా, కొన్ని సంఘటనలను మాత్రం ఎంపిక చేసి ప్రచారం చేస్తారు, ఎక్కువ చేసి చూపుతారు, మన మెదళ్లలో నింపి, మన ఖండనలు సంపాదిస్తారు. పెషావర్ లో జరిగిన దారుణ మారణకాండను ఖండించే సమయంలో మనం కనీసం ఇవి తెలుసుకొని ఉండాలి. అమెరికన్ సామ్రాజ్యవాదమే మనకాలంలో అతి పెద్ద, రక్తపిపాస గల, అత్యంత పాశవిక తీవ్రవాది అనీ ప్రపంచంలోని కోట్లాది ప్రజలకు, మొత్తంగా మానవాళికి పెను ప్రమాదమనీ గుర్తించాలి. ఈ హింసాకాండను ఆపాలంటే అమెరికా, భారత్, పాకిస్తాన్ వంటి దాని తైనాతీ పాలకులు అమలు జరుపుతున్న భయోత్పాతానికి వ్యతిరేకంగా ఏకమై పోరాడవలసిందే. అటువంటి పోరాటం ద్వారా మాత్రమే మనం ఒక ప్రజాస్వామికమైన, సమానత్వం నిండిన, న్యాయమైన సమాజాన్ని నిర్మించగలం.

(Countercurrents.org పై అచ్చయిన వ్యాసానికి అనువాదం) వీ

(... 6వ పేజీ తరువాయి)

ప్రభుత్వం మోసపూరిత, వ్యాపారాత్మక ధోరణిని అవలంబిస్తుంది. ఐదు సంవత్సరాల తరువాత అధికారంలోకి ఏ ప్రభుత్వమొస్తుందో? రైతుల సొమ్మును ఎగ్గొట్టడానికి ఆ కొత్త ప్రభుత్వం మరే కొంగొత్త ఆఫర్లను ప్రవేశపెడు తుందో తెలియని పరిస్థితి. ఇప్పటినుంచి అప్పటివరకు పుట్టుకుచ్చే బాధితులు, వారికి పుట్టుకుచ్చే వారస బాధితులు ఎంతమందో మరి.

1995 నుంచి 2004 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రజావ్యతిరేక విధానాలతో పరాజయం పాలైన తరువాత కూడా అడుగడుగునా ఆయనలో అధికారదాహమే ఆధిపత్యం చెలాయించింది. చంద్రబాబునాయుడు డిక్షనరీలో అధికారదాహం తప్పితే మరో పదానికి అవకాశమే లేదు. పశ్చాత్తాపం వాసన ఎలా ఉంటుందో కూడా చంద్రబాబుకు తెలిసుండక పోవచ్చు. ముదిగొండ కాల్పుల అనంతరం బాధితుల పక్షాన పోరాడుతున్న ఇద్దరు వామపక్ష నాయకుల మధ్యన దూరి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశాడే కానీ, తన హయాంలో జరిగిన బషీర్‌బాగ్ కాల్పుల గురించి ఏనాడైనా కించిత్ పశ్చాత్తాపం వ్యక్తం చేసిన పాపాన పోలేదు చంద్రబాబు. పైగా, కారణాలు చెప్పుకుని సమర్థించుకున్నాడు, తప్పించుకున్నాడు. ఇలాంటివెన్నెన్నో. రాజశేఖరరెడ్డి మరణానంతరం సీమాంధ్రలో జగన్‌మోహన్ రెడ్డి, తెలంగాణలో టిఆర్ఎస్ పార్టీ బలబడుతూ తెలుగుదేశం పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతున్న ఒకానొక సమయంలో ప్రజల సానుభూతి కోసం, ఓటు బ్యాంకును దూరం చేసిన తన పాత విధానాల పట్ల కాస్తంత తలదించుకున్నట్లు నటించాడే తప్ప, పశ్చాత్తాపాన్ని చేరువ కానివ్వలేదు. అందుకే అధికారంలోకి వచ్చీ రాగానే 'విజన్-2029' పేరుతో మళ్లీ తన పాత విధానాలకు మరింత పదును పెడుతున్నాడు.

విజయవాడ - గుంటూరు మధ్యన ఉన్న సారవంతమైన భూములను చేజిక్కించుకోడానికి రైతుల ముందు టూరింగ్ టాకీస్ ఆపరేటర్ మాదిరిగా 'మంచితరుణం మించినా దొరుకదు' అంటూ తిరుగుతున్నాడు చంద్రబాబు - ఇది ఒక కోణం. ఇటీవల జపాన్ పర్యటన సందర్భంగా పెట్టుబడులను ఆకర్షించడానికి చంద్రబాబు అక్కడి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడిన తీరు చూస్తే ఆయన ఒక 'కార్పొరేట్ బ్రోకర్' అని అనిపించక మానదు. కావల్సినంత భూమి తయారుగా ఉందంటూ వారికి అభయం ఇచ్చాడు - ఇది మరో కోణం. ఈ రెండు కోణాల మధ్యన దాగున్న ప్రణాళికాబద్ధమైన దుర్మార్గంపై ప్రజలు తిరుగుబాటు చేయాలి.

సుమారు 60 ఏళ్లుగా సుసంపన్నమైన హైదరాబాద్‌ను రాజధానిగా అనుభవించిన సీమాంధ్రవాసులు రాష్ట్ర విభజన సందర్భంగా హైదరాబాద్‌ను కోల్పోయి నిరాశా నిస్పృహల మధ్యన కొట్టుమిట్టాడుతుంటే రాజకీయపార్టీలు వారికి అత్యాశలు కల్పించిన తీరు ఓసారి గుర్తుచేసుకుంటే మంచిది. హైదరాబాద్‌ను మించిన నగరాన్ని నిర్మిస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పింది. ఢిల్లీ నగరం చిన్నబోయేలా ఆంధ్రప్రదేశ్ రాజధానిని నిర్మిస్తామని నరేంద్రమోదీ హామీ ఇచ్చాడు. సింగపూర్ లాంటి నగరాన్ని నిర్మిస్తానని చంద్రబాబు చెప్పాడు. ప్రజలకు కల్పించిన ఇన్ని అత్యాశల మాటున దాగున్న దోపిడీ కుట్ర ఇప్పుడిప్పుడే ప్రజలకు అర్థమవుతుంది, అనుభవమవుతుంది.

చివరకు భూ సమీకరణ, భూసేకరణ రూపంలో ప్రభుత్వం ఎంతోకొంత భూమిని మూటగట్టుకుందనుకుందాం. ప్రభుత్వం చెపుతున్నట్లు పెట్టుబడులను ఆకర్షించడానికి ఆ భూమి పనికొస్తుందనే అనుకుందాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఐదు సంవత్సరాల పాటు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలి. 'ఐదు సంవత్సరాలు సరిపోదు, కనీసం పది సంవత్సరాలు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలి' అంటూ కాంగ్రెస్‌పై ఒత్తిడి తీసుకొచ్చిన బిజెపి అధికారంలోకి వచ్చీరాగానే మాట మార్చింది. ముందయితే ఈ ఐదు సంవత్సరాల సుదీర్ఘకాలం గడిచిపోనీయండి చూద్దాం అని వెంకయ్యనాయుడు దాటవేశాడు. పది సంవత్సరాలు కూడా సరిపోదు, పదిహేను సంవత్సరాల పాటు ఆంధ్రకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాల్సిందేనని ఓవైపు చంద్రబాబు మారాం. మరోవైపు, చుట్టూతా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రకు ప్రత్యేక ప్రతిపత్తి హోదా వ్యతిరేకించేవి ఉన్నాయి, ఆంధ్రకు పోటీ వస్తూ మాక్కూడా ప్రత్యేక హోదా కల్పించాలంటూ డిమాండ్ చేసేవి కూడా ఉన్నాయి. చివరకు, సాధ్యాసాధ్యాల పరిశీలనను కనీసం విస్మరించిన నేతలకు చురకలంటిస్తున్నట్లుగా, ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించడానికి సరిపడా అర్హతలు లేవంటూ ప్రణాళికా సంఘం తేల్చిచెప్పింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించడానికి ఎంతో వెసులుబాటుగా ఉంటుందనుకున్న ప్రత్యేక హోదా విషయంలో ప్రణాళికా సంఘం మాట గనుక వాస్తవరూపం దాల్చితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూటగట్టిన భూబ్యాంకు మొత్తాన్ని చివరకు దర్జాగా, యథేచ్ఛగా అనుభవించేది' స్థానిక పెట్టుబడిదారులు - ప్రభుత్వ ఆశ్రితులు'.

- ఎస్. కిషోర్ కుమార్
హైదరాబాద్

ప్రభుత్వాలు మారినా మారని విధానాలు

***ప్రభుత్వాలు మారినా ప్రజలకు అవసరమైన విధానాలు రూపొందించకుండా విదేశీ సంస్థల పెట్టుబడులకు అనుకూలమైన సంస్కరణలను వేగవంతం చేస్తూ ప్రజల జీవితాలకు భద్రత లేకుండా చేస్తున్నాయని అంటున్నారు* ఎ. నర్సింహారెడ్డి**

గత మేలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో యుపిఎ నుండి ఎన్‌డిఎ, అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ నుండి తెలంగాణ రాష్ట్ర సమితి, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ నుండి తెలుగుదేశం పార్టీలు పాలనాధికారం చేజిక్కించుకున్నాయి. కేంద్రంలో పదేళ్ల యుపిఎ పాలనలో చితికిపోయిన ప్రజలకు 'మంచిరోజులు' తెస్తామనే వాగ్దానాలతో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తెలంగాణను 'బంగారు తెలంగాణ'గా పునర్నిర్మిస్తామన్న హామీతో టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. స్వర్ణాంధ్రప్రదేశ్ ఏర్పాటు చేస్తానన్న నినాదంతో టిడిపి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చింది. అధికారం ఒక పార్టీ నుండి మరో పార్టీ లేదా కూటమి చేతుల్లోకి మారినంత మాత్రాన రాజకీయార్థిక విధానాలు మారుతాయా? అంటే పార్టీలు మారాయి, ప్రధాని మారారు, ముఖ్యమంత్రులు మారారు. కానీ విధానాలు మారలేదు. ప్రభుత్వాల స్వభావం మారలేదు. రూపం మారింది కాని సారం ఒక్కటే. అధికారంలోకి వచ్చిన కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు గత ప్రభుత్వ విధానాలకు భిన్నమైన ప్రజానుకూల విధానాలు ఏమైనా రూపొందించి అమలు చేస్తున్నారా అని పరిశీలిస్తే, అలాంటి ఛాయలు ఏమి కనిపించడం లేదు సరికదా, గత పాలకులు అనుసరించిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలను మరింత వేగవంతంగా అమలు చేయడానికి పూనుకుంటున్నారు.

మూడు దశాబ్దాల తరువాత సొంత బలంపై కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే శక్తిని సంపాయించిన బిజెపి, దేశ, విదేశీ కార్పొరేట్ శక్తులకు మరింత లాభాన్ని చేకూర్చే విధంగా ప్రైవేటీకరణను వేగవంతం చేస్తుంది. రైల్వే, రక్షణ, భీమా రంగాల్లో సైతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు పూర్తిస్థాయిలో పచ్చ జెండా ఊపింది. అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు పేరుతో విద్యారంగంతో సహా అన్ని రంగాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పిపిపి) విధానాన్ని వేగవంతం చేస్తుంది. అదే సమయంలో నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డిఎ) -1 ప్రభుత్వం (1999-2004) విద్యారంగంలో అమలు చేసిన విద్యా కాషాయీకరణను మోడీ ప్రభుత్వం కొనసాగించేందుకు సిద్ధపడుతున్నది. పేదలకు ఇస్తున్న సబ్సిడీలు తగ్గించడం, సంక్షేమ కార్యక్రమాలకు కోతపెట్టడం, మందులు, పెట్రోల్, ఇతర నిత్యావసరాలపై కంట్రోల్ ఎత్తివేయడం, ప్రభుత్వ రంగ సంస్థల వాటాలు అమ్మేయడం, కార్మిక చట్టాలను సరళీకరించడం వంటి విధానాలు ఒకవైపు పేదలపై భారాల మీద భారాలు వేస్తున్నాయి. మరోవైపు ధనికులకు పన్ను రాయితీలు ప్రకటించడం, ఉదారంగా ప్రభుత్వ భూములు, గనులు, ఇతర వనరులు కేటాయించడం వలన కాంట్రాక్టులు, కమిషన్లు, స్పెక్యులేటివ్ వ్యాపారం ధనికుల లాభాలను ఇబ్బడి ముబ్బడిగా పెంచుతున్నాయి.

మోడీ అధికార పగ్గాలు చేపట్టగానే చేసిన మొదటి పనేమిటంటే దేశంలోని కార్పొరేట్ పెట్టుబడిదార్లతో సమావేశం కావడం, వారి నుండి ఘనమైన అభినందనలు స్వీకరించడం. ఆ సమావేశంలో తన ప్రభుత్వం వారికి అనుకూలంగానే ఉంటుందనీ, వారి ప్రయోజనాలను దెబ్బతీసే ప్రయత్నాలు ఏమాత్రం చేయనని వారికి గట్టి హామీలు ఇవ్వడమే కాక, దేశంలో పరిశ్రమలు పెట్టడానికి, వాణిజ్య కార్యకలాపాలు సజావుగా కొనసాగించడానికి తాను చేయగలిగిన సహాయం చేస్తానని, మరిన్ని రాయితీలు ఇస్తానని హామీల వర్షం కురిపించాడు. మరోవైపు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పలు రంగాలలోకి అనుమతించడమేగాక, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, చైనా, రష్యా వగైరా దేశాలు పర్యటించి, విదేశీ కార్పొరేట్ పెట్టుబడులను స్వాగతించడమే కాక, దేశంలో వారికి సానుకూలంగా రాయితీలు కల్పిస్తామని, వారి పెట్టుబడులకు ఎలాంటి నష్టం కలుగకుండా, అభ్యంతరాలు, అవాంతరాలు, కార్మిక సమ్మెలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకుంటానని హామీల వర్షంతో వారికి రెడ్‌కార్పెట్ పరచారు. ఏతావాత దేశాన్ని మొత్తంగా కార్పోరేట్ పెట్టుబడిదారీ కబంధ హస్తాల్లో పెట్టడానికి సిద్ధమయ్యాడు.

కనిష్ఠ ప్రభుత్వం గరిష్ఠ పాలన నినాదంతో అధికారాన్ని కైవసం చేసుకున్న నరేంద్రమోడీ పాలన కార్పొరేట్ అనుకూలంగా, ప్రజా వ్యతిరేకంగా దూసుకుపోతున్నది. పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రపంచాన్ని (జపాన్, ఆస్ట్రేలియా, చైనా, అమెరికా) చుట్టివచ్చినప్పటికీ, మోడీ ఆశించిన స్థాయిలో పెట్టుబడులు వచ్చి వాలే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రపంచదేశాల ఆర్థికవ్యవస్థల తీరు చూస్తే ఆశాజనకంగా ఏమీలేవు. మోడీ ప్రభుత్వం చెపుతున్న రెండో తరం సంస్కరణల అమలుకు అతి ముఖ్యమైన 37 బిల్లులు పార్లమెంటులో ఆమోదముద్ర వేయించుకోవాల్సిన అవసరం ఉన్నది. సభ ముందు గత ప్రభుత్వంలో ప్రవేశ పెట్టినవి తొమ్మిది, పదిహేనవ లోక్‌సభ నాటివి నలభై, అంత కన్నా పాతవి పద్దెనమిది. మొత్తం 67 బిల్లులు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వానికి అత్యవసరంగా, ప్రతిష్ఠాత్మకంగా మారిన బీమా సవరణ బిల్లు, కంపెనీల చట్టం సవరణ బిల్లు, జిఎస్‌టి (వస్తు సేవల పన్ను) బిల్లు, ఔషధ చట్టం సవరణ బిల్లు, జౌళి మిల్లుల జాతీయీకరణ, ఉపాధి హామీ, భూసేకరణ చట్టాల సవరణ బిల్లు లాంటివి ఉన్నాయి. ఈ బిల్లులన్ని రెండోతరం సంస్కరణలను వేగవంతం చేసేవే.

మోడీ భారత రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ముఖ్య అతిథిగా పాల్గొనాలన్న ఆహ్వానాన్ని ఆమోదించిన తరవాత ఒబామా-పాకిస్థాన్‌ను సముదాయించడానికన్నట్లు నవాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో సంభాషించినా, దక్షిణాసియాలో తమ విధానాలను, కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడానికి అమెరికా భాగస్వామిగా భారత్‌ను ఎంచుకొన్నట్లు స్పష్టమైంది. ఆసియాలో, ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో చైనాకు వ్యతిరేకంగా భారత్‌ను నిలపడానికి అమెరికా, పాశ్చాత్య దేశాలు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. ప్రధాని నరేంద్రమోడీ ఇటీవల అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాల్లో పర్యటించడం, అక్కడ చేసిన

ప్రసంగాలు అమెరికా ప్రాధాన్యతను నొక్కిచెప్పాయి. భారత్‌కు సైనిక సరఫరాల్లో అమెరికా అగ్రస్థాయికి చేరింది. స్వేచ్ఛా వాణిజ్యానికి అమెరికా నేతృత్వం వహిస్తోంది. దాని విధానాలన్నీ ధనికులు, బడా కార్పొరేట్ సంస్థలకే అనుకూలం. అమెరికా కార్పొరేట్ల్ ఇక భారత్‌లోకి బారులు తీయడం ఖాయం. ముఖ్యంగా సైనిక వ్యూహ కారణాలు ఉభయులనూ దగ్గర చేశాయి. అమెరికా ఆర్థిక ప్రగతికి ఆయుధ వ్యాపారమే వెన్నుదన్ను. ఆధిపత్య విస్తరణవాద కాంక్షతో అత్యాధునిక ఆయుధాలు కోరుకుంటున్న భారతదేశానికి ఇక ఆయుధాలు అమ్ముకోవచ్చునని అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలు ఉవ్విళ్లూరుతున్నాయి. ఇండియా ఆధునిక ఆయుధాలు సమకూర్చుకోవడానికి హడావుడి పడుతోంది. ఇంతవరకు భారత్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారు రష్యా! భారత్ ఆయుధ అవసరాలన్నింటిని తీర్చగల స్తోమత ప్రస్తుతం ఆ దేశానికి లేదు. ఫలితంగా ఇజ్రాయెల్, ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికాల నుంచి భారత్ ఆయుధాల కొనుగోలు సాగుతోంది.

ఏక పక్షంగా ప్రణాళికా సంఘం రద్దు

ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ అనే భ్రమలో పడిపోయి ప్రధాని నరేంద్ర మోడీ ప్రణాళికా అవసరాన్నే మరచిపోయి, ప్రణాళికా సంఘం ఉనికినే ప్రశ్నిస్తున్నారు. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేస్తున్నట్టు నాలుగు నెలల క్రితం ఏకపక్షంగా, ఏ మాత్రం ముందస్తు ఆలోచన లేకుండా ప్రకటించారు. ప్రణాళికా సంఘం పని విధానంలో కొన్ని వైఫల్యాలు, లోపాలు ఉన్నమాట వాస్తవమే. వాటిని సరిదిద్ది, పటిష్ఠపరచడానికి ఏ ప్రయత్నం చేపట్టకుండానే ప్రత్యామ్నాయ వ్యవస్థ వైపు నరేంద్రమోడీ మొగ్గుచూపడంలోని ఆంతర్యం ఏమిటి? ఇప్పటి వరకు ఆయన ఏ పని చేసినా, ఏ పథకం చేపట్టినా ఆర్ఎస్ఎస్ అదుపాజ్ఞలోనే జరుగు తున్నాయి. తన హిందుత్వ దృక్పథానికి కార్పొరేట్ శక్తుల దోపిడీ వ్యూహాన్ని అంటకడుతూ ఈ ప్రత్యామ్నాయ వ్యవస్థకు ఊపిరి పోయాలని ఆయన తలపోస్తున్నారు. ఇలా మొగ్గ తొడిగిన వ్యవస్థ ఎవరి ప్రయోజనాలకు దోహదపడుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రణాళికా అంటే యావత్ జాతి ప్రయోజనాలు, ఆర్థికాభివృద్ధికి ప్రతీక. దాన్ని దేశ ప్రజలతో మమేకం చేయకుండా మార్కెట్ శక్తులకు ఫణంగా పెట్టే కుట్ర మాత్రమే ఇది.

దేశ సంపద, వనరులు ఎలా పంపిణీ కావాలో సామాజిక సమానత్వ న్యాయసూత్రం ప్రాతిపదికపై నిర్ణయించి, ఆ మేరకు ప్రణాళికాను రూపొందించి అమలు చేసే బాధ్యత, హక్కు ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానిది. అందులో ప్రైవేట్ భాగస్వామ్యం అనేదే అర్థరహితం, అసందర్భం, ప్రైవేట్ శక్తులు పనిచేసేది లాభాపేక్షతోనే కానీ, ప్రజల పట్ల నిబద్ధతతోనూ, బాధ్యతతోనూ కాదు. అవి ప్రభుత్వ ప్రణాళికా పరిధిలో పనిచేయవలసినవే తప్ప ప్రణాళికా కల్పనలో ఏ విధంగానూ పాత్రధారులు కావడానికి వీలులేదు. ఆర్థిక, సామాజిక, ప్రాంతీయ అసమానతలు ఇప్పటికీ ఉనికిలో ఉన్న మన దేశంలో ప్రణాళికా ఎంత అవసరమో పలువురు సామాజిక మేధావులు, రాజనీతిజ్ఞులు నొక్కి చెప్పారు. ప్రణాళికా లేకుండా మన దేశ ఆర్థికవ్యవస్థ మనుగడ సాగించ లేదనీ, ప్రణాళికాకు తెరదించడం అంటే జాతిని బలహీనం చేయడమేనని వారు స్పష్టం చేశారు. కేంద్ర – రాష్ట్రాలకు సంధానకర్తగా ఉంటూ, మరింత సమర్థంగా, పూర్తి స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే విధంగా, ప్రణాళికా సంఘాన్ని పునర్నిర్మించాలని కోరారు. మౌలిక లక్ష్యమూ, స్వభావమూ దెబ్బతినకుండా ప్రణాళికా సంఘాన్ని మరింత సమర్థ వంతంగా పనిచేసేలా తీర్చిదిద్దవలసింది పోయి, మరెలాంటి దుందుడుకు చర్యకు పాల్పడినా ఆర్థిక, సామాజిక న్యాయానికి విఘాతం కలుగక తప్పదు.

నల్లధనంపై డంబాచార ప్రకటనలు

సర్కార్ కళ్లుగప్పి విదేశాలకు తరలిన లక్షల కోట్ల నల్లధనాన్ని వెనక్కు తీసుకురావడంతో పాటు, నల్ల కుబేరులందరిని చట్టం ముందు నిలబెట్టి శిక్షింపజేస్తామని మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో చేసిన వాగ్దానాలన్నీ ఉత్తబోలుమాటలని, డంబాచార ప్రకటనలని మోడీ నిరూపించుకున్నారు. నల్ల ధనవంతుల సమస్య మోడీ ప్రభుత్వ మోసకారితనాన్ని మరోమారు దేశానికి వెల్లడించింది. ఎన్నికల ముందు నల్ల ధనంపై మోడీ చేసిన ఉపన్యాసాలు దేశంలోని మధ్యతరగతిని ఊరించి ఎన్నికల్లో ఓట్ల వర్షం కురిపించింది. యుపిఎ ప్రభుత్వం నల్ల ధనవంతులను కాపాడుతోందని మోడీ ప్రతి వేదిక మీదా ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే వారి పేర్లు బయట పెడతామన్నారు. విదేశీ బ్యాంకుల్లో దాగి ఉన్న రు. 75 లక్షల కోట్ల నల్లధనాన్ని దేశానికి రప్పించి ప్రతి భారతీయునికీ రు. 15 లక్షలు పంచుతామని ఊదరగొట్టారు. కానీ అధికారంలోకి రాగానే ఆయనా, ఆయన ప్రభుత్వం గొంతు మారింది. గతంలో నల్లధనవంతుల పేర్లు వెల్లడించాలని సుప్రీంకోర్టు కోరినప్పుడు యుపిఎ ప్రభుత్వం ఏ సాకులైతే చెప్పిందో మోడీ ప్రభుత్వం కూడా అవే సాకులు అందుకుంది. సుప్రీంకోర్టు గట్టిగా అడిగితే అసలైన వారి పేర్లు విడిచిపెట్టి ముగ్గురు అర్భకుల పేర్లు వెల్లడించింది. తీరా సుప్రీంకోర్టు ఆగ్రహం చెంది మొట్టికాయలు వేస్తే 627 మంది నల్లధనవంతుల జాబితాను కోర్టుకు సమర్పించింది. ఇది కూడా చాంతాడంత జాబితాలో చిన్న భాగం మాత్రమే. ఇప్పుడు కూడా వారి పేర్లు బహిరంగంగా వెల్లడించడానికి ప్రభుత్వం సిద్ధపడ్డం లేదు. నల్ల ధనవంతులపై ప్రభుత్వ కుప్పిగంతులకు కారణం సులువుగానే కనిపెట్టొచ్చు. నల్లకుబేరులు రాజకీయాలతో నిమిత్తం లేకుండా అన్ని పార్టీలలో ఉన్నారు. నల్లకుబేరుల జాబితాలో ఈ ప్రభుత్వాలను, పార్టీలను వెనుక ఉండి నడిపించే పెద్ద పారిశ్రామి కవేత్తలు ఉన్నారు. కాంగ్రెస్ అందుకే సాహసం చేయలేదు. కాంగ్రెస్ పాపపంకిలమై పోయిందని, తాము దేశాన్ని ప్రక్షాళన చేస్తామని గంభీర ప్రకటనలు చేసిన ఎన్‌డిఎ ఓడదాటిన తర్వాత బోడ మల్లన్న అన్న చందంగా ఇచ్చిన మాటను చెత్తబుట్టలో పడేసింది. ఓట్లకోసం చెప్పేవన్నీ నిజాలు కావని మరోసారి రుజువు చేసింది. మొదటిది, ఎన్నికల్లో మోడీని గెలిపించడానికి కృషి చేసిన కార్పొరేట్ వర్గాలు నల్లధనవంతుల జాబితాలో మొదటి పీఠాన ఉన్నాయి. రెండోది ఎన్నికల్లో ఆ నల్ల డబ్బే బిజెపి విజయానికి పెద్ద ఎత్తున పని చేసింది. మోడీ ఎన్నికల ఖర్చు సుమారు రు. 50,000 కోట్లలో అగ్రభాగం ఈ నల్లడబ్బుదే. మూడవది, నల్ల ధనవంతుల్లో చాలా మంది బిజెపి, కాంగ్రెస్ నాయకులు కూడా ఉన్నారు. అందువల్ల నల్ల ధనవంతుల జాబితా వెల్లడించాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేకపోగా, వారిని కప్పిపుచ్చడానికే అది ప్రయత్నిస్తోందన్నది స్పష్టం. కాకపోతే సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టింది కనుక పాక్షిక జాబితా సమర్పించింది.

ఆహార భద్రత సాకుతో రెండవ 'హరిత విప్లవం'

పాలకుల నిరాదరణతో వరుస ప్రకృతి వైపరీత్యాలతో తీవ్ర సంక్షోభంలో పడ్డ వ్యవసాయరంగంపై సబ్సిడీల కోతలు పడనున్నాయి. బడ్జెట్‌లో ప్రకటించిన నూతన యూరియా విధానం ప్రకారం యూరియా సబ్సిడీలకు చరమగీతం పాడేయనున్నారు. ఈ వార్త వెలువడడంతోనే ఫెర్టిలైజర్ పరిశ్రమ షేర్ల ధరలు ఎగిరిగంతులేశాయి. ఆ పరిశ్రమాధి

పతులు దీన్ని స్వాగతించారు. సాగు బరువై రోజురోజుకూ అప్పులతో కుంగిపోతున్న చిన్న, సన్న, సాధారణ రైతాంగానికి ఇది మరో పెద్ద దెబ్బ. సరిగ్గా ఈ నేపథ్యంలోనే మోడీ ప్రభుత్వం మరో హరిత విప్లవాన్ని ప్రకటించింది. ఇది మొత్తంగా రైతాంగాన్ని దివాలా తీయించి, ఆహార ధరలను స్పెక్యులేటర్ల చేతుల్లో పెట్టే కార్పొరేట్ వ్యవసాయమేనని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. కార్పొరేట్ వ్యవసాయ విస్తరణతో పాటే గ్రామీణ ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం అనివార్యం. మరో హరిత విప్లవం కోసం వ్యవసాయరంగంలో మౌలిక సదుపాయాల సృష్టి అంటే... వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, ట్రాక్టర్ల రంగ ప్రవేశమే. దీంతో వ్యవసాయ కార్మికుల అవసరం తగ్గిపోతుంది అని ఢిల్లీకి చెందిన ఒక విధాన విభాగ కేంద్రం డైరెక్టర్ యామినీ అయ్యర్ 'మింట్' పత్రికలో రాశారు. అదే విషయాన్ని ఆర్థిక మంత్రి ఇలా సెలవిచ్చారు. వ్యవసాయ సాంకేతిక వృద్ధిలో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను పెంచాల్సిన తక్షణ అవసరం ఉంది. వ్యవసాయ వాణిజ్య రంగంలోని మౌలిక వసతులను ఆధునీకరించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ వ్యయాల్లో కోతలు విధిస్తూ వ్యవసాయ రంగంలోని ప్రభుత్వ పెట్టుబడుల పెంపుదల గురించి మాట్లాడడం విచిత్రం. అసలు సంగతి ప్రైవేటు పెట్టుబడులకు, కార్పొరేట్ వ్యవసాయానికి ప్రోత్సాహమే. వ్యవసాయ సబ్సిడీల ఉపసంహరణ, ఉపాధి హామీకి తూట్లు వంటి చర్యలు చేపడుతూ 4 శాతం వ్యవసాయ వృద్ధి లక్ష్యంగా ఆర్థిక మంత్రి ప్రకటించారు. అంటే కార్పొరేట్ వ్యవసాయం ద్వారా ఉపాధి రహిత వృద్ధిని గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపజేయడమే. ఎంత దీనావస్థలో ఉన్నా నేటికీ ప్రధాన ఉపాధి రంగంగా ఉన్నది వ్యవసాయరంగమే.

కార్మికులను వంచించే చట్టాలు

అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టరు విశ్వవిధాన కార్యక్రమం అన్న నివేదికను అక్టోబరు 9న విడుదల చేశాడు. దానిలో భారత్ వృద్ధిని సాధించాలంటే విదేశీ పెట్టుబడుల మదుపుకు అనుకూల చర్యలు చేపట్టాలనీ, దానిలో కార్మికరంగ సంస్కరణలు కీలకమైనవనీ పేర్కొన్నాడు. భారతదేశంలోని కార్మిక చట్టాలు కాలం చెల్లిపోయినవనీ, తమకు అనుకూలంగా వాటిని మార్చివేయాలనీ బడా బూర్జువావర్గం చాలా ఏళ్ల నుండి గగ్గోలు పెడుతున్నది. భారత్‌లోని పత్రికలు, కొందరు ఆర్థిక వేత్తలు బూర్జువా వర్గానికి వంతపాడుతున్నారు. ఈ నేపథ్యంలోనే అక్టోబరు 16న పండిట్ దీనదయాళ్ శ్రమయేవ జయతే కార్యక్రమం పేరిట ఇన్‌స్పెక్టర్ల రాజ్యాన్ని అంతమొందిస్తాననీ, కార్మిక చట్టాలను సవరిస్తాననీ మోడీ ఆర్భాటంగా ప్రకటించాడు. కార్మికుల కోసమంటూ శ్రమ సువిధాపోర్టల్ అన్న వెబ్‌సైట్‌ను ఆవిష్కరించాడు. రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజనా అన్న పాత పథకాన్ని కొన్ని మార్పులు చేసి తిరిగి ప్రారంభించారు.

'శ్రమేవ జయతే' పథకం ప్రారంభించిన రోజు కార్మికులకు ఏదో చేస్తున్నారని అందరూ భావించారు. ఆయన చేసిన ప్రసంగం విన్న తర్వాత అసలు విషయం బోధపడింది. ఇది యాజమాన్యాలను కార్మిక చట్టాల నుంచి విముక్తి చేసే పథకం అని ఆయన స్పష్టంగానే చెప్పారు. కార్మికుల ఉద్యోగ భద్రతకు సంబంధించి యాజమాన్యాలు ఇప్పటిదాకా మోస్తున్న బాధ్యతల నుంచి మినహాయింపులు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తున్నది. పరిశ్రమల అధికారులు, కార్మిక శాఖ అధికారులు ఇక నుంచి పరిశ్రమలు సందర్శించాల్సిన పనిలేదట. తనిఖీ చేయాల్సిన పనిలేదట. యాజమాన్యాలు స్వయం ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే చాలని చెపుతున్నారు. కార్మికలోకం దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న హక్కులను, భద్రతలను అన్నింటినీ తొలగించే పనిని మోడీ ప్రభుత్వం ప్రారంభించింది. దీన్ని శ్రమ దోపిడీ జయతేగా చెబితే బాగుంటుంది.

యుపిఎ గత దశాబ్దకాలంలో అమలు చేసిన విధానాలను మోడీ కొనసాగిస్తున్నారు. ఆర్థిక సంస్కరణల మలి దశను మరింత వేగవంతం చేసేందుకు ఆయన ద్వారాలు బార్లా తెరుస్తున్నారు. అందుకు అందమైన నినాదాలు ఇస్తున్నారు. ఆకర్షణీయమైన పేర్లు పెడుతున్నారు. మేక్ ఇన్ ఇండియా నినాదం అంటే పరిశ్రమలకు స్వేచ్ఛనివ్వడం, కార్మికులను గాలికి వదిలేయడం కాకూడదు. దేశంలో ఇప్పటికే కార్మికుల పరిస్థితి గాలిలో దీపంలాగా ఉంది. సంఘటిత రంగం బలహీనపడి, అసంఘటిత రంగం పెరుగుతున్నది. కార్మికులకు భద్రత లేదు. పని గంటలపై అదుపు లేదు. చిన్న పరిశ్రమలలో పనిచేస్తున్న 3 కోట్ల మంది కార్మికులకు పెన్షన్, ఇఎస్ఐ, ద్రవ్య సౌకర్యాలు వంటివి లేవన్నది వాస్తవం. కార్మికులలో 93 శాతం మంది అనియత రంగంలోనే పని చేస్తున్నారనీ, వారికి ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్‌వంటి సౌకర్యాలు లేవన్నది అందరకూ తెలిసినదే. వారికి పని ప్రదేశాలలో ప్రమాదాల నుండి భద్రత కూడా లేదు. ప్రతి ఏటా వేలాదిమంది పారిశ్రామికరంగ పని ప్రదేశ ప్రమాదాలలో అశువులు బాస్తున్నారు. కాంట్రాక్టు కార్మిక పద్ధతి వారి మెడలపై కత్తిలా ఉంది. సంఘటిత రంగంలో కూడా కార్మికులకు చెందవలసిన ప్రావిడెంట్ ఫండును యాజమాన్యాలు దిగమింగడం ఏటేటా పెరుగుతున్నది. పనిభారం, పని గంటలు, ఓవర్‌టైమ్ వేతనం, కనీస వేతన చెల్లింపులలో యాజమాన్యాలు కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నాయి. పరిశ్రమలను తనిఖీ చేసే అధికారం ఉన్నా, కార్మిక శాఖ, పరిశ్రమల శాఖలు ఎప్పుడూ వాటి ఛాయల్లోకి వెళ్లిన దాఖలాలు ఉండవు. కొన్ని పరిశ్రమలు కోటగోడల్లాంటి దుర్భేద్యమైన ప్రాకారాల్లో ఉంటాయి. అక్కడికి వెళ్లడం, తిరిగి రావడం అంతతేలికగా అయ్యేపని కాదు. ప్రత్యేక ఆర్థిక మండళ్లు (ఎస్ఇజడ్) లోనయితే ప్రభుత్వ చట్టాలేవి వర్తించవు. ఇప్పుడు దేశం మొత్తాన్ని ఎస్ఇజడ్‌గా మార్చే కుట్రకు మోడీ తెరలేపారు. మేక్ ఇన్ ఇండియా విజయవంతం కావాలంటే పరిశ్రమలకు స్వేచ్ఛ ఉండాలట. ఇది అత్యంత ప్రమాదకర ధోరణి. దేశం సుసంపన్నంగా ఎదగడమంటే మనుషులతో ఎదగాలి. కేవలం పరిశ్రమలతో, ఉత్పత్తులతో కాదు. అందులో పనిచేసే కార్మికులు కూడా సుసంపన్నంగా ఎదిగితేనే అభివృద్ధికి సార్థకత. సరైన జీతాలు లేక, ఉద్యోగ భద్రత లేక, కునారిల్లే కార్మికలోకం ఉంటే దేశంలో శాంతి ఉంటుందా? దేశం సుభిక్షంగా ఉంటుందా? అలాంటి అభివృద్ధినేనా శ్రామిక ప్రజలు కోరుకొంటున్నది?

విదేశీ పెట్టుబడులకు ఎర్ర తివాచీ

మోడీ ప్రభుత్వ సరికొత్త నినాదం, దేశంలోకి పెట్టుబడులను ఆహ్వానిస్తూ విదేశీ బహుళ జాతి సంస్థలకు ఇచ్చిన పిలుపే మేక్ ఇన్ ఇండియా, యుపిఎ ప్రభుత్వ విధానాల కొనసాగింపే మోడీ ప్రభుత్వ విధానమనే దానికి ఇది ఒక ఉదాహరణ. పెట్టుబడులు పెట్టాలంటే డబ్బుకావాలి. మన దేశంలో డబ్బులేదా? స్వీస్ బ్యాంకుల్లో, చిన్ని చిన్న ఇతర దేశాల బ్యాంకుల్లో దాచిన డబ్బు, హవాలా ద్వారా విదేశాలకు తరలుతున్న డబ్బు, ఇతర విధాలుగా దేశ సరిహద్దులు దాటుతున్న డబ్బు, ప్రపంచంలోనే అత్యధిక ఆస్తులు కలిగిన దేశీయ కార్పొరేట్స్, భారతీయ కార్పొరేట్ల బ్యాంకుల నుంచి లక్షల కోట్లు రుణం తీసుకొని ఎగ్గొట్టిన డబ్బుంతా ఎక్కడుంది? దేశంలో పెట్టుబడి పెట్టడానికి వీరి వద్ద పెట్టుబడి లేదు. కాని విదేశాల్లో పరిశ్రమలు స్థాపించడానికి,

కొనడానికి డబ్బు ఖర్చు చేస్తున్నారంటే పెట్టుబడులు పెట్టడానికి కొరత ఏర్పడడంలో ఆశ్చర్యమేముంది? మోడీ ఎన్నికల కోసం కార్పొరేట్లు కోట్లు ఖర్చు చేశారు. ఆ డబ్బంతా ఎక్కడి నుంచి వచ్చింది? ఇప్పటికే దేశంలో 3254 విదేశీ సంస్థలున్నాయి. దేశంలో ఆర్థిక పరిస్థితి బాగాలేదని వారు చాపచుట్టి బిచాన ఎత్తేసి వారివారి దేశాలకు వెళ్లిపోలేదు. లాభాలు సంపాదిస్తున్నారు, విస్తరిస్తున్నారు. వారి ప్రధాన కార్యాలయాలు, పరిశ్రమలు అనేక దేశాల్లో కర్మాగారాలు స్థాపించి ఉత్పత్తులు చేస్తున్నాయి. విదేశాల్లో ఉన్న ప్రధాన కార్యాలయాలకు రాయల్టీలు చెల్లిస్తుంటాయి. ఇలా రాయల్టీ పేరుతో, సాంకేతిక ఛార్జీలపేరుతో విదేశాల్లో ఉన్న ప్రధాన కార్యాలయానికి 2012-13లో పంపిన మొత్తం రు. 4,838 కోట్లు, అలాగే డివిడెండ్ల రూపంలో మన దేశం నుండి వెళ్లిపోయిన మొత్తం మరో రు. 4,259 కోట్లు. మోడీ దేశం తలుపులు తెరిచారు అనేక పేర్లతో మన దేశ నిధులు ఇతర దేశాలకు తరలిపోతున్నాయి. ఆ దేశాలు పరిశ్రమలను మన దేశంలో స్థాపిస్తే ఉద్యోగావకాశాలు పెరుగుతాయనేది భ్రమ. ఇక్కడకు వచ్చిన దేశాలు సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశాలు. ఆటో మేషన్, రోబటైజేషన్ లాంటి వాటితో పనిచేసి వీలైనంత తక్కువ కార్మికులను నియమిస్తారు. వారి దేశాలతో పోలిస్తే మన కార్మిక శక్తి చవక అయినందున వారు మరింత లాభాలు చేసుకొంటారు. 125 కోట్ల జనాభా గల దేశం మనది. ఇప్పటికే బహుళజాతి కంపెనీలు గ్రామీణ మార్కెట్ వైపు దృష్టి సారించాయి. కాగా మన దేశం ఆర్థికంగా అస్వతంత్ర దేశంగా మారనుంది.

ప్రైవేటీకరణ జపం - సంస్కరణలకు ఊతం

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా భారీ మొత్తంలో పిఎస్‌యుల వాటాలను మార్కెట్ శక్తులకు కట్టబెట్టాలని నిర్ణయించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2015-16)లో రెండో తరం ఆర్థిక సంస్కరణలను తలనెత్తుకుంటామని ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. అంటే భవిష్యత్తులో వీటి ఉనికికే ప్రమాదం వాటిల్లనుంది. గత 23 ఏళ్లలో కాంగ్రెస్, ఎన్‌డిఎ, యుపిఎ-1 ప్రభుత్వాలు పిఎస్‌యుల వాటాలను క్రమక్రమంగా విక్రయిస్తున్న అంశాలను గమనించాం. ప్రస్తుతం భారీ లాభాలు గడిస్తున్న పిఎస్‌యులను బిజెపి సర్కార్ దుర్మార్గంగా ప్రైవేట్‌పరం చేయడానికి పూనుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2014-15)లో వివిధ పిఎస్‌యుల్లోని రు. 60,000 కోట్ల విలువ చేసే వాటాలను ఉపసంహ రించుకోనున్నట్లు మోడీ ప్రభుత్వం తన బడ్జెట్‌లో ప్రకటించింది. దీనికి అదనం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వాటాలను తగ్గించుకోవడం, మరికొన్ని సిపిఎస్‌యుల్లో ఉన్న మైనారిటీ వాటాలను పూర్తిగా ప్రైవేట్ కంపెనీ లకు విక్రయించడం. అంటే వచ్చే నాలుగైదు మాసాల్లో ఏకంగా లక్షకోట్ల విలువ చేసే వాటాలను ఉపసంహరించుకున్న ఆశ్చర్య పోవాల్సిందేమీ లేదు. మరోవైపు ఖాయిల పడిన, నష్టాల్లో సాగుతున్న 79 సంస్థలను ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి సిద్ధపడుతుంది.

ఇప్పటివరకు ప్రాధాన్యత రంగాలకు రుణాలు అందిస్తూ ఆర్థిక వ్యవస్థకు రక్షణ కవచంగా ఉన్న ప్రభుత్వ బ్యాంకుల్లో (పిఎస్‌బి)నూ సర్కార్ వాటాను 52 శాతానికి కుదించడానికి కసరత్తు చేస్తోంది. ఒకటి, రెండేళ్లలో బ్యాంకుల్లోని వాటాల విక్రయం ద్వారా రు. 89,200 కోట్లు సమీకరించుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. 1991లో ఆర్థిక సంస్కరణలు చేపట్టినప్పటి నుండి నేటికీ రు. 1,25,760 కోట్ల విలువ గల ప్రభుత్వరంగ సంస్థల వాటాలను ప్రైవేట్‌పరం చేశారు. మోడీ అధికారానికి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రభుత్వరంగ సంస్థల వాటాల విక్రయం ప్రారంభించారు. బొగ్గుగనుల్లో 10 శాతం వాటాలు ఉపసంహరణ ద్వారా రు. 24 వేల కోట్లు, ఓఎన్‌జిసిలో 10 శాతం వాటా ఉపసంహరణ ద్వారా రు. 14 వేల కోట్లు, సెయిల్ 5 శాతం వాటా విక్రయం ద్వారా రు. 2672 కోట్లు, ఎన్‌హెచ్‌పిసి 11 శాతం వాటా విక్రయం ద్వారా రు. 1741 కోట్లు, రాబట్టడానికి నిర్ణయం జరిగింది. ఈ విధంగా ప్రభుత్వరంగ సంస్థలను బలిపశువులుగా చేస్తున్నారు. కార్పొరేట్ల ప్రవేశం జరిగిన పరిశ్రమల్లో ఉద్యోగుల తొలగింపు జరుగుతుంది. ట్రేడ్ యూనియన్ హక్కులు నిరాకరించబడుతాయి. చివరకు పిఎస్‌యుల బలహీనం తథ్యమని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పిఎఫ్‌సి, ఆర్ఇసి, ఎంఒఐఎల్‌లో 5 శాతం చొప్పున వాటాను విక్రయించనుంది. దీంతో రు. 5,210 కోట్లు రాబట్టుకోవాలని కేంద్రం యోచిస్తుంది. హెచ్ఎఎల్, ఆర్ఐఎన్ఎల్‌లో 5,500 కోట్ల విలువ చేసే 10 శాతం వాటాను మార్కెట్ శక్తులకు కట్టబెట్టనుందని అంచనా. ప్రతి లిస్టెడ్ ప్రభుత్వ రంగ కంపెనీలోని కనీసం 25 శాతం వాటాను రానున్న మూడేళ్లలో మార్కెట్లకు కట్టబెట్టాలని సెబీ నిర్దేశించింది. ఈ దెబ్బతో సుమారు లాభాల్లో ఉన్న 36 పిఎస్‌యుల వాటాలు మార్కెట్ల పరం కానున్నాయి. హిందుస్థాన్ కాపర్, హెచ్ఎంటి, నేషనల్ ఫెర్టిలైజర్, నైవేలీ లిగ్నైట్, స్టేట్ ట్రేడింగ్ కార్ప్ తదితర సంస్థల్లోనూ ప్రైవేట్ వాటా పెరగనుంది. ఇప్పటికే ప్రభుత్వానికి 29.5 శాతం మైనారిటీ స్టాక్ కలిగిన హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జడ్ఎల్)ను పూర్తిగా విక్రయించడానికి మోడీ సర్కార్ మొగ్గు చూపుతోంది. ప్రభుత్వ రంగ సంస్థలు 1991-92 నుంచి 2008-09 మధ్య కేంద్ర ప్రభుత్వానికి పన్నులు, డివిడెండ్లు, వడ్డీలు, రాయల్టీల రూపంలో రు. 13 లక్షల కోట్లకు పైగా చెల్లించాయి. దేశంలోని మొత్తం పరిశ్రమల్లో పిఎస్‌యుల వాటా ఒక్క శాతం అయినప్పటికీ ఈ కంపెనీలు క్రితం ఆర్థిక సంవత్సరం (2013-14)లో ప్రభుత్వానికి రు. 1,40,098 కోట్ల భారీ డివిడెండ్‌ను అందించాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్ను దన్నుగా ఉన్న ఈ వ్యవస్థను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉంది.

బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను 26 నుంచి 49 శాతానికి పెంచే ఉద్దేశంతో మోడీ ప్రభుత్వం తెరలేపింది. అప్పటి యుపిఎ ప్రభుత్వం రాజ్యసభలో బీమా చట్ట సవరణ బిల్లు -2008 ప్రవేశ పెట్టింది. ఆ బిల్లును స్థాయి సంఘానికి నివేదించారు. ఆ బిల్లును పరిశీలించిన మాజీ ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా నాయకత్వంలోని స్థాయి సంఘం బీమా రంగంలోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానించాలన్న ప్రతిపాదనను ఏకగ్రీవంగా తిరస్కరించింది. అయితే ఇప్పుడు అధికారం లోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం మళ్లీ తెరమీదికి తెచ్చింది. కామధేనువు లాంటి మన దేశీయ బీమారంగంలో ఎఫ్‌డిఐ పెంపు పెన్షన్ రంగానికి సైతం ఆటోమేటిక్‌గా వర్తిస్తుంది. బహుళజాతి కంపెనీలకు దేశీయ పొదుపుపై వెసులుబాటును, పట్టును పెంచుతుంది. ఇది దేశ ప్రయోజనా లకు హానికరం. అయినా ప్రభుత్వం ఎందుకు పరుగులు పెడుతోందో తెలుసుకోవడం కష్టం కాదు. అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభ ప్రభావం ప్రపంచ బీమా రంగంపై భారీగా పడింది. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో (ఉత్తర అమెరికాలో - 2.9 శాతం, ఓషియానాలో - 3.7 శాతం, పశ్చిమ యూరప్‌లో - 0.6 శాతం) వృద్ధి మందగించింది. ప్రపంచవ్యాప్తంగా బీమారంగం ఎదురీదుతున్నా మన దేశంలో ఎల్ఐసి చలవ వల్ల దేశీయ బీమారంగం దూసుకుపోతోంది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో 345 కోట్ల పాలసీలను, 14 శాతం వృద్ధి రేటుతో రు. 2,36,798 కోట్ల మొత్తం ప్రీమియం ఆదాయాన్ని ఎల్ఐసి సాధించింది.

మన దేశ బీమారంగ అభివృద్ధి పెట్టుబడిదారీ దేశాలకు కంటగింపుగా మారింది. అందుకే, కామధేనువు లాంటి మన దేశీయ బీమారంగాన్ని చేజిక్కించుకోవాలని మన ప్రభుత్వంపై ఒత్తిడి పెడుతున్నారు. ఈ ఒత్తిళ్ల నేపథ్యంలో మోడీ ప్రభుత్వం బీమా బిల్లును ఆమోదింపజేసుకోవాలని నానాతంటాలు పడుతోంది. ఇది దేశ ప్రయోజనాలకు బీమా రంగ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుంది. మన దేశీయ పొదుపుపై విదేశీ అదుపు, నియంత్రణ పెరిగి ప్రజల బీమా రంగానికి రక్షణ లేకుండా పోతుంది. అందువల్లనే 16 వేల మంది ప్రముఖులు (పద్మభూషణ్, జ్ఞానపీఠ్ అవార్డులు పొందినవారు, న్యాయకోవిదులు, నిష్ణాతులు, మేధావులు) ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ఆర్థికమంత్రికి లేఖలు రాశారు.

బిజెపి ప్రభుత్వం రెండోతరం సంస్కరణలు అమలు చేయడం కోసమే శీతాకాల పార్లమెంటు సమావేశాలు నిర్వహిస్తున్నట్లుగా చెప్పకనే చెపుతున్నది. ఇప్పటి దాకా సంస్కరణలు అమలు చేయడంలో కొంత ముందూ-వెనకలూ ఆలోచిస్తున్నట్లు, చేయదల్చుకున్న సంస్కరణలను కొంత మరుగుపరిచి దాచి చెప్పే పద్ధతి పాటించే వారు. కానీ ఇప్పుడు మోడీ ప్రభుత్వం రెండో తరం సంస్కరణలను మరింత వేగంగా అమలు చేసేందుకు గత ప్రభుత్వాల కన్నా మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నది. అలాగే వచ్చే ఫిబ్రవరిలో ప్రవేశపెట్టబోయే పూర్తిస్థాయి బడ్జెట్ నాటికి పూర్తి స్థాయిలో సంస్కరణలు ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నది. ఈ ఒరవడిలోనే రిపబ్లిక్ దినోత్సవాలకు అతిథిగా అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాను ఆహ్వానించింది. సంస్కరణల పేరుతో అమెరికా వ్యాపారవర్గాలకు ఎర్ర తివాచీ పరిచే కార్యక్రమం మరింత బహిరంగంగా జరిగిపోతున్నది. ఇంతకాలం చెపుతూ వచ్చిన జాతీయవాద ఆర్థిక విధానాలకూ, ఇప్పుడు మోడీ ప్రభుత్వం చెపుతున్న రెండోతరం సంస్కరణలకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని బిజెపి ఎలా పరిష్కరించు కుంటుందో చూడాలి.

రెండవ తరం సంస్కరణలు

1. వ్యవసాయ రుణాలు తగ్గింపు 2. క్రాంటాక్ట్ వ్యవసాయం (కుప్పం తరహా) 3. వ్యవసాయంలో యంత్రాల ప్రవేశం 4. ఎగుమతి కొరకు ఉత్పత్తి 5. ముతక ధాన్యాల ఉత్పత్తుల తగ్గింపు (పంటల మార్పిడి) 6. సాంప్రదాయ ఎరువులు - విత్తనాల వాడకానికి స్వస్తి (మాన్‌శాంటో - డూపాంట్ రసాయనాల వాడకం) 7. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ 8. కన్సల్‌టెన్సీ సంస్థల ఏర్పాటు 9. కార్పొరేట్ వ్యవసాయం 10. రైతుల సంఖ్య తగ్గింపు 11. ప్రపంచ మార్కెట్లుతో పోటీ 12. సహకార వ్యవస్థ ఎత్తివేత వలన మన దేశంలో ఇప్పటికే వ్యవసాయ రంగంలో రైతుల జనాభా తగ్గిపోతున్నది.

దశాబ్దాల తరబడి యావత్ భారత ప్రజల శ్రమ, ధనాదులను వెచ్చించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందిన ప్రభుత్వ రంగ పరిశ్రమల ఆస్తులను కార్పొరేట్ కుబేరులకు కట్టబెట్టే ప్రయత్నం ఈసారి కొనసాగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకం ద్వారా సుమారు రు. 63,425 కోట్ల రాబడిని ఆశిస్తున్నారు. ఇది గత ఏడాది యుపిఎ అమ్ముకున్న వాటాల విలువ (రు.25,841 కోట్లు) కంటే 145 శాతం ఎక్కువ! పొదుగు కోసి పాలు తాగే విద్యలో యుపిఎ కంటే నాలుగాకులు ఎక్కువే చదివామని ఎన్‌డిఎ బడ్జెట్ చాటి చెప్పింది. జూలై 10న బడ్జెట్ సమర్పిస్తుండగానే షేర్ మార్కెట్ స్పెక్యులేటర్ల (మాయాజూదర్లు) తొలుత షేర్ల విలువను పడగొట్టి, ఆ తదుపరి ఎగదోసి రెండు చేతుల చేసుకున్న లాభాల పండగే బడ్జెట్ దిశకు సరైన సూచిక కావచ్చు. చివరకు షేర్ల విలువతో గరిష్ఠంగా లబ్ధినిపొందిన రంగాలనుబట్టే ఈ బడ్జెట్ అసలు స్వభావం వెల్లడవు తుంది. రియల్ ఎస్టేట్, ఫైనాన్షియల్ రంగాలు భారీగా లాభపడ్డాయి.

షేర్ మార్కెట్ జూదంతో ప్రజల కొనుగోలుశక్తిని పెంచలేరు. వ్యవసాయ, వస్తు తయారీ రంగాలలోని వస్తు గిరాకిని పెంచలేరు. అది జరగనిదే నిజమైన పారిశ్రామిక వృద్ధి సాధ్యం కాదు. జైట్లీ దేశ ఆర్థిక రంగం పగ్గాలను షేర్ మార్కెట్ జూదర్లుగా మారిన కార్పొరేట్ అధిపతులకు అప్పగించి, మంచి రోజులు తెస్తామని నమ్మబలుకు తున్నారు. అధికారం కట్టబెట్టినవారి కోసం అట్టహాసంగా 29 పథకాలు ప్రకటించారు. 120 కోట్ల జనాభా గల దేశంలో ఒక్కో పథకానికి ముచ్చటగా రు. 100 కోట్లు కేటాయించారు. ఆ మెతుకులు ఏరుకుంటూ మరో నాలుగేళ్లు గడిపేస్తే బొందితోనే స్వర్గానికి చేర్చేస్తాం ఎదురు చూడమని తేల్చి చెప్పారు. అభివృద్ధి పేరుతో స్వదేశీ, విదేశీ కార్పొరేట్ రంగం దోపిడీకి ద్వారాలు బార్లా తెరిచారు. ఇది ప్రజల్లో అసంతృప్తిగా మారకుండా పక్కదారి పట్టించేందుకు మత భావోద్వేగాలతో మిళితమై ఉన్న ఉమ్మడి పౌరస్మృతి, అధికరణ 370 రద్దు. రామాలయ నిర్మాణం వంటి అంశాలను చర్చనీయాంశం చేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు ముందు భ్రమలు కల్పించడంలో విజయం సాధించిన మోడీ ఆ తరువాత ప్రజలలో ఆ భ్రమలను అదే విధంగా నాటుకుపోయ్యేలా చేస్తూ వస్తున్నారు. దీనితో ప్రభుత్వం అంతా భ్రమ అనే విధంగా మారుతోంది. విదేశీ పెట్టుబడిదార్లను ఆకర్షించేందుకు మోడీ తాను అధికారంలోకి వస్తూనే ఓ చిట్టాను తయారు చేసుకుని ఆ విధంగానే విదేశీ పర్యటనల పర్వం ఆరంభించారు. తూర్పు పయనించే రైలు అన్నారు. ఆర్థిక రంగంలో మార్పులన్నీ ఇక తూర్పు దేశాల వైపే మొగ్గు చూపుతాయని, పడమటి వేడిగాలి పనికిరాదని చెప్పారు. అయితే, డాంభికాన్ని పక్కన పెట్టి తిరిగి పాశ్చాత్య దేశాలతోనూ ఆయన దౌత్యం సాగిస్తూ అక్కడికీ పర్యటనలు సాగించారు. ఈ విధంగా కుడి ఎడమల మద్దెల మేళగా మోడీ తానే ఓ బ్రాండ్ ఇమేజ్‌గా సాగిస్తోన్న వ్యవహారాలతో చివరికి ఫలితం విపరీత పరిణామాలకు దారితీయక తప్పదు.

టిఆర్ఎస్ ప్రభుత్వ విధానాలు

ఎన్నికల ముందు టిఆర్ఎస్ అనేక వాగ్దానాలు చేసింది. కాంగ్రెస్ విధానాలతో విసుగెత్తిన ప్రజలు టిఆర్ఎస్‌కు పట్టంగట్టారు. గత ప్రభుత్వ విధానాలతో టిఆర్ఎస్ ప్రభుత్వం విడగొట్టుకుంటుందా? అంటే దాని ఆచరణ, అనుసరిస్తున్న విధానాలు అలా కనిపించడం లేదు. ఎన్నికల ముందు రైతులకు ఒక లక్షలోపు రుణాలు మాఫీ, ఇల్లు లేని వారికి డబుల్ బెడ్ రూం ఇల్లు, ఇంటికో ఉద్యోగం, దళిత కుటుంబాలకు మూడు ఎకరాల భూమి, ఉద్యోగులకు కేంద్ర స్కేళ్లు అని హామీ ఇచ్చారు. కేజీ నుంచి పిజి వరకు ఉచిత విద్య లాంటి హామీలు ఏవీ అమలు అయ్యే విధానాలు ప్రభుత్వం వద్ద లేవు. హామీలు నినాదాలుగా మిగిలి పోతున్నాయి. మాటల ప్రభుత్వమే కాని చేతల ప్రభుత్వం కాదని ఆరు మాసాల కాలంలోనే నిరూపించుకుంది. పౌర, ప్రజాతంత్ర హక్కులకు హాని కలిగిస్తుంది. 300 పైగా రైతులు ఆత్మహత్య చేసుకుంటే చోద్యం చూస్తుంది. విద్యుత్ సమస్య గడ్డుగా ఉంది. పిఆర్‌సి అమలులో జాప్యం ఎందుకు చేస్తున్నారో అర్థం కాదు.

పారిశ్రామిక అభివృద్ధి పేరుతో బహుళజాతి సంస్థల పెట్టుబడులను ఆహ్వానిస్తుంది. అన్ని వసతులు సమకూరుస్తామని హామీ ఇచ్చింది. ఐదు లక్షల ఎకరాల భూమి అందుకు సిద్ధంగా ఉంచామని ప్రకటించింది. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దుతామంటూ ప్రణాళికాలు

వేస్తుంది. కార్మికుల హక్కులు, సమస్యలు, చట్టాలు విషయంలో నోరు మెదపడం లేదు. 'తక్కువ తనిఖీలు – ఎక్కువ సౌకర్యాలు' అనే ముద్దు పేరుతో పెట్టుబడిదారులను అందలమెక్కించారు. కార్మికుల హక్కులను పాతాళానికి తోశారు. తెలంగాణలో 70 శాతం ప్రజలు గ్రామాల్లో వ్యవసాయం, ఇతర వృత్తులు జీవనాధారంగా జీవిస్తున్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి మీద దృష్టి సారించాల్సి వుంది. అయితే పారిశ్రామిక రంగానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందుకు అభివృద్ధి అంటే పరిశ్రమలు అనే తప్పుడు అభిప్రాయమే కారణం. ఇవ్వాళ సంపన్న దేశాలుగా పిలువబడుతున్న దేశాలు మొదట భూసంస్కరణలు అమలు చేసి, వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించిన తర్వాతనే పారిశ్రామిక రంగంలో అడుగు పెట్టాయన్న చారిత్రక వాస్తవాన్ని గమనించాలి. నిజానికి వ్యవసాయం – పరిశ్రమలు పరస్పరాధారితాలు. ఆదివాసుల అస్థిత్వాన్ని, సంస్కృతిని, జీవనాధారాన్ని కాలరాస్తున్న పోలవరం నిర్మాణం గురించి మాట్లాడడం లేదు. తెలంగాణ ఉద్యమకాలంలో రామోజీ ఫిల్మ్‌సిటీని లక్ష నాగళ్లతో దున్నిస్తానని ప్రగల్భాలు పలికిన కెసిఆర్ రామోజీరావును స్వయంగా కలిసి ఆయనను పొగడ్తలతో ముంచడం చూస్తుంటే కెసిఆర్ ఎవరి ప్రతినిధో బట్టబయలు అవుతున్నది.

టిడిపి ప్రభుత్వ విధానాలు....

ఎన్నికల ముందు చంద్రబాబు స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మిస్తానని, రైతు రుణాలు మాఫీ చేస్తానని, యువతకు ఉపాధి కల్పిస్తానని, పారదర్శక పాలన అందిస్తానని ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు ఆయన ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిని సింగాపూర్‌లాగా నిర్మిస్తానని కలలు గంటున్నారు. రాజధాని నిర్మాణానికి మూడు పంటలు పండే భూమిని రైతుల నుండి బలవంతంగా గుంజుకునే ప్రయత్నాలు మొదలు పెట్టాడు. చంద్రబాబు ఆశ్రితులు ఇప్పటికే నూతనంగా నిర్మించబోయే రాజధాని పరిసరాల్లో వేలాది ఎకరాలు కొని పెట్టారు. కార్పొరేట్ విద్యకు మూలస్తంభమైన నారాయణను శాసన సభ్యునిగా ఎన్నిక కాకున్న తన మంత్రి వర్గంలోకి తీసుకోవడంతో ఆయన వర్గ స్వభావం తేట తెల్లమైంది. కేంద్ర ప్రభుత్వంలో టిడిపి నుండి ఇద్దరు మంత్రులువున్నారు. అయినా, కేంద్రం నుండి చంద్రబాబు ఆశించిన సాయం పొందలేదు. రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. రైతుల జీవితాలా? రాజధాని ముఖ్యమా? అన్నది చంద్రబాబు తేల్చుకోవల్సి ఉంది. విదేశీ పర్యటనలలో మాత్రం ఒక్క అడుగు ముందే ఉన్నారు. సింగపూర్, జపాన్ పర్యటన ముగించారు. త్వరలో కోరియా వెళ్తారట. ఈ పర్యటనల ముఖ్య ఉద్దేశం సంపన్న దేశాల బహుళజాతి సంస్థల పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టాలన్న తపన మాత్రమే. 1995–2004 కాలంలో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ప్రపంచబ్యాంక్ ఏజెంట్‌గా ఏ విధానాలనైతే అమలు చేశారో అవే విధానాలను ఇప్పుడు పరిశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు చేయ పూనుకుంటున్నారు.

ముగింపు

మోడీ విదేశాంగ విధానం చైనా రష్యాలతో సత్సంబంధాలకు అడుగులు వేస్తూనే అమెరికాకు మరింత లొంగుబాటును ప్రదర్శిస్తుంది. ఆసియా–పసిఫిక్‌లో అమెరికా అనుకూలంగా చైనా వ్యతిరేకంగా ఆస్ట్రేలియా, జపాన్, భారత్‌లు ఒక కూటమిగా ఏర్పడ్డాయి. దేశ ఆర్థిక విధానాలే విదేశాంగ విధానాన్ని నడిపే శక్తిగా ఉంటాయని మోడీ పదేపదే చెపుతున్నాడు. అసలు ఆర్థిక విధానాలు అంటే ఆయన ఉద్దేశమేమిటి? దేశ స్వతంత్రతకు, స్వావలంబనకు కట్టుబడిన ఆర్థిక విధానాలా లేక సామ్రాజ్యవాదానికి లొంగి ఉన్న పాలక వర్గాల దళారీ ఆర్థిక విధానాలా? అంటే ప్రజావ్యతిరేక పెట్టుబడి అనుకూల ఆర్థిక విధానాలే అన్నది స్పష్టం. సామ్రాజ్యవాద సంపన్న దేశాలు సహాయం అందించేవిగా వుండి షరతులను నిర్దేశించగలిగిన స్థితిలో వుండగా, భారత ప్రభుత్వం, భారత పాలకులు సహాయాన్ని, పెట్టుబడిని యాచించే స్థితిలో ఉన్నారు. సామ్రాజ్యవాదుల పెట్టుబడుల కనుగుణంగా మన దేశంలో చట్టాలను, విధి విధానాలను మార్పుచేసి, వారి దోపిడీ సజావుగా సాగిపోయేందుకు వీలుగా సౌకర్యవంతమైన పరిస్థితులను కల్పించాల్సి ఉంటుంది. కనుక పెట్టుబడులు పెట్టే దేశాలకు, పెట్టుబడులు స్వీకరించే దేశాల మధ్య అసమాన సంబంధాలకు, ప్రజలకు నష్టదాయకంగా పరిణమిస్తాయి. పెట్టుబడిదారులకు దేశం జాతి, వర్గం, కులం అనే అభిమానాలు ఉండవు. 'పెట్టుబడి పెట్టు లాభాలు రాబట్టు' అనేదే వారి ఏకైక వ్యాపార లక్షణంగా ఉంటుంది.

ఇప్పటికే ప్రమాదం అంచుకు చేరుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు రెండో తరం సంస్కరణలు మరింత ప్రమాదాన్ని తెస్తాయి. రెండోతరం సంస్కరణలు అమలు చేయడమంటే భారత ఆర్థిక వ్యవస్థను బహుళజాతి సంస్థల చేతుల్లోకి, దేశీయ బిలియనీర్ల చేతుల్లోకి పెట్టడమే జరుగుతుంది తప్ప, పేద ప్రజల కొనుగోలు శక్తి మాత్రం పెరుగదన్నది వాస్తవం. ఆర్థిక అభివృద్ధికి మోడీ చూపెడుతున్న ప్రమాణాలేవీ ప్రజలను కలుపుకునేవిగా లేవు. ప్రజలు ఏమైనా కానీ 'ఉత్పత్తి పెరగాలి, లాభాలు రావాలి, ఆర్థిక సూచీలు ఊర్ధ్వముఖ ప్రయాణం సాగించాలి' అన్న ధోరణి మోడీ నమూనాగా కనిపిస్తున్నది. ఈ తరహా అభివృద్ధి మనజాలదు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడవు. సమాజంలో పైవర్గాలు పైపైకి ఎదుగుతాయి. పేదలు ఇంకా ఇంకా కిందికి జారిపోతారు. మధ్యతరగతి, కార్మిక ప్రజానీకం మరింత కునారిల్లే ప్రమాదం ఉంది. దేశీయ ఆర్థిక వ్యవస్థ స్వావలంబనకు, సార్వభౌమాధికారానికి ప్రమాదం జరిగే ఈ సంస్కరణల విధానాన్ని ప్రభుత్వాలు పునరాలోచించాలి. భారతదేశం స్వతంత్ర ఆర్థిక విధానం అనుసరిస్తుందన్న ప్రచారం చేస్తూనే బహుళజాతి సంస్థలకు సాగిలపడుతున్నారు. ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు కీలకమైన వ్యవసాయం, పారిశ్రామిక ఉత్పత్తులను దేశంలో దెబ్బతీసి సామ్రాజ్యవాద సంపన్న దేశాలు తమ దిగుమతులతో దేశాన్ని ముంచెత్తడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. సామ్రాజ్యవాద దేశాల కార్పొరేట్ల ప్రయత్నాన్ని ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, ఆర్థికవేత్తలు తీవ్రంగా వ్యతిరేకించాలి.

మనదేశంలో జరుగుతున్న ఎన్నికల ప్రహసనం దోపిడీదారులకు సాధికారత కల్పిస్తున్నదే తప్ప ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి తోడ్పడం లేదన్న వాస్తవాన్ని గడిచిన ఆరున్నర దశాబ్దాల ఎన్నికలు రుజువు చేశాయి. అందుకే ప్రభుత్వాలు, పాలకులు మారినా అర్ధ భూస్వామ్య, అర్ధ వలస వ్యవస్థ ఉన్నంత వరకు రాజకీయార్థిక విధానాలు మారవు. ఎన్నికలు జరిగినప్పుడల్లా దోపిడీ వర్గంలోని ఒక ముఠా నుండి మరో ముఠాకు అధికారం బదిలీ అవుతుంది తప్ప వ్యవస్థ స్వభావం మారదు. ప్రభుత్వాలు మారినంత మాత్రానా ప్రజానుకూల విధానాలు రూపొందించబడి అమలు అవుతాయన్నది వట్టి భ్రమ. అందువలన శ్రమ జీవులు, బుద్ధి జీవులు, ప్రజాస్వామిక వాదులు నిజమైన ప్రజాతంత్ర వ్యవస్థ కొరకు పోరాటాలు చేయక తప్పదు.

(రచయిత ఉపాధ్యాయ నాయకులు, రాజనీతి శాస్త్ర విద్యార్థి) వీ

రాజ్యాంగంగా భగవద్గీత?!

***అధికారంలోకి రాగానే బిజెపి-ఆర్ఎస్ఎస్ శక్తులు అగ్రవర్ణ మనుస్మృతి భావజాలాన్ని పెంపొందించే విధంగా భగవద్గీతను జాతీయ గ్రంథంగా ప్రకటించాలనే కుట్రను ముందుకు తెచ్చాయని అంటున్నారు* వరవరరావు**

'ఓట్లు మంత్రుల చిరునామాలు మాత్రమే మారుస్తాయి. బులెట్లు వ్యవస్థను మారుస్తాయి' అని ఉదారవాద సామ్యవాది అయిన బెర్నార్డ్‌షాకే అనిపించినపుడు జనతనసర్కార్ ప్రత్యామ్నాయం గురించి చెప్తున్న వాళ్లకు మారుతున్న ప్రభుత్వాలు విధానాల్లో ఏమైనా మార్పులు తేగలవనే భ్రమలు ఏమాత్రం ఉండే అవకాశం లేదు. సగటు ప్రజలు ఏమాశించారు, ఎటువంటి మార్పులు వచ్చాయి, ఇంకా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో లేశమైనా ప్రజాసామ్యం అంశం మిగిలి ఉందని భ్రమలు ఉన్నవాళ్లు ఈ ఎన్నికల వలన ఏమాశించారు, ఏ మార్పు వచ్చింది, వచ్చిందా లేదా అని మాత్రమే చర్చించగలం. అయినా ఆరు నెలలకే ఏం చెప్పగలం అనేవాళ్లు కూడ ఉంటారు.

వాస్తవానికి కేంద్ర ప్రభుత్వంలో ఆశావహమైన మార్పు వస్తుందని లౌకిక ప్రజాస్వామ్య భావాలు గలవారు ఎవరూ ఆశించలేదు. ఒకవైపు అవినీతి, అసమర్థ కాంగ్రెస్ పాలన పట్ల విసుగు, అసంతృప్తి, తీవ్రమైన జుగుప్స – ఉన్న రాజకీయ వాతావరణంలో ప్రజల లౌకిక ప్రజాస్వామ్య భావాలను ప్రతిఫలించడానికి అనువదించడానికైనా ఏ మాత్రం నిర్మాణ క్రియా సంసిద్ధతలేని కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీలు – స్థూలంగా కాంగ్రెస్, బిజెపియేతర పార్టీలు, అవి కమ్యూనిస్టు, జనతా, సమాజ్‌వాదీ, బహుజన సమాజ్‌వాదీ వంటి ఏ పేరుతో ఎన్నికల రాజకీయాల్లో ఉన్నా అవన్నీ ఎన్నడో అఖిల భారత ప్రాతినిధ్య స్వభావాన్ని కోల్పోయినవి. కనుక ఇంక కేంద్రంలో పెనం మీంచి పొయ్యిలోకే పోతామన్నది ప్రగతిశీల శక్తులన్నీ ఊహించిందే. ఊహించి కూడ ఏమీ చేయలేనంత దివాళకోరు రాజకీయాల్లో అప్పటికే ఆ పార్టీలన్నీ కూరుకుపోయి ఉన్నాయి. అంత మాత్రమే కాదు, ఉత్తరప్రదేశ్ నుంచి లోక్‌సభకు ఎక్కువ సీట్లు గెలుచుకోవడానికి బిజెపి అక్కడ అమిత్‌షాను ఎన్నికల పర్యవేక్షణకు నియమించి 2002 గుజరాత్ ప్రయోగాన్ని రెండు మూడు రోజుల్లో కాకుండా రెండు మూడు నెలల్లో అమలు చేయడానికి ముజఫర్‌నగర్‌ను ఎంచుకున్నది. అంత సుదీర్ఘ కాలం, విస్తృతమవుతూ ఇవాళ మనం ముజఫర్‌నగర్ దురంతాలు లేదా మారణకాండ అని పిలుచుకుంటున్న ముస్లింలపై దాడులు, హత్యలు, లైంగిక అత్యాచారాలు ఒక పార్టీ చేసింది అని చెప్పడానికి కూడ లేదు. జాట్ కులం బలం ఉన్న బిజెపి, ఎస్‌పి పార్టీలు రెండూ అందులో ఒకరు కొత్తగా బలం పుంజుకోవడానికి, మరొకరు అధికారం నిలుపుకోవడానికి తలదూర్చాయి. ఫలితంగా బిఎస్‌పి వెనుక ఉన్న దళిత బడుగువర్గాలు ఇతర కులాల నుంచి సహకారం కోల్పోయి బలహీనపడ్డాయి. అవినీతిమయమైన నాయకత్వం ప్రతిఘటన నివ్వలేకపోయింది.

ముస్లిం సమాజం ఏకాకిగా దాడులకు, హత్యలకు, అత్యాచారాలకు గురయింది. ఏడు నెలల్లో ముజఫర్‌నగర్, బదాయులు ఒక ఉత్తరప్రదేశ్ ఉదాహరణలుగానే కాదు, బిజెపి బలపడినా, అధికారానికి వచ్చినా ఏ సమాజాలు అభద్రతకు గురవుతాయి అనడానికి దాఖలాలుగా నిలిచిపోయాయి. హిందుత్వ స్వభావం కోల్పోని మన ఎన్నికల పార్టీలన్నిటికి ఈ తిలాపాపం తలా పిడికెడు పంచుకోవడం తప్ప, ఒకరి మీద ఒకరు నిందారోపణలు చేసుకోవడం తప్ప ఇవాళ కేంద్రంతో సహా ఆయా రాష్ట్రాల్లో బిజెపి అధికారంలోకి రావడమైనా, బలపడడమైనా గాయపడి నెత్తురోడుతున్న లౌకిక ప్రజాస్వామ్యం తన పుండ్ల మీద వాలుతున్న ఎన్నికల రాజకీయాల ఈగలను విసరడమా, గాయాలను తడుముకోవడమా అనే విషాదమే మిగిలింది. ఇపుడింక లోక్‌సభ ఎన్నికలు జరిగిన తీరు దేశంలో రెండు సంఘటితమైన ఫాసిస్టు శక్తులను ముందుకు తెచ్చాయి. మొదటిది, కార్పొరేట్ ప్రపంచం – అది నరేంద్రమోడీని ప్రధాని అభ్యర్థిగా ముందుకు తెచ్చి ఆయన ఎన్నికల ప్రచారాన్ని ఒక (బిజెపి) పార్టీ ప్రచారం వలె కాకుండా అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికల వలె నిర్వహించింది. ఎన్నికలు ప్రభుత్వం ఖర్చుతో నిర్వహించాలి – పార్టీలకు ఎన్నికల కాలానికి వాటికుండే బలాబలాల ఆధారంగా ఎన్నికల ఖర్చు ఇస్తే పార్టీలే నిలబడి గెలుచుకున్న ఓట్ల దామాషాలో అభ్యర్థులను ప్రకటించాలి అని ఎన్నికల సంస్కరణలు చెప్తున్న వారికి కనువిప్పుగా ఒక ఉల్టా ప్రయోగం జరిగింది. నరేంద్ర మోడీ జేబులో పడిన ఓట్లన్నీ బిజెపి డబ్బాలో పడ్డట్లే అయింది. నరేంద్ర మోడీ జుబ్బా జేబులోనయినా, వేస్ట్ కోటు జేబుల్లోనయినా చేతులు దూర్చింది మాత్రం కార్పొరేట్ శక్తులు. ఆయనకు మాట, హావభావాల నిచ్చింది మాత్రం – కార్పొరేట్ మీడియా. పెషావర్‌లో తాలిబన్ల తూటాలకు నేలకొరిగిన నూటా నలభై మంది పసిపిల్లల కోసం నిజమైన ఆర్తిలో దుఃఖించగల సగటు భారతీయులు మూడువేల మందిని మూడు రోజుల్లో చంపిన రాజీవ్‌గాంధీనయినా, నరేంద్రమోడీనయినా ప్రధానిగా స్వీకరించడమే కాదు, స్వాగతించడం, పూర్తి మెజారిటీతో అధికారానికి తేవడం – అది 1984లోనూ సాధ్యమైంది. 2014లోనూ సాధ్యమైంది. లౌకిక ప్రజాస్వామ్యం మన రాజ్యాంగంలో తప్ప మన ఎన్నికల రాజకీయాచరణలో, సంస్కృతిలో మృగ్యమైంది – మనం కుహనా లౌకిక ప్రజాస్వామ్యం నుంచి అశోక్ సింఘాల్ ఛాతీ విరుచుకొని చెప్పుకుంటున్నట్లు ఎనిమిది వందల సంవత్సరాల తర్వాత ఢిల్లీలో హిందూ రాజ్య స్థాపనకు ప్రస్థానం పూర్తి చేశాం.

మోడీ అయినా, మీడియా అయినా ఎన్నికల ప్రచార కాలం నుంచి ఇవాళ్టి వరకు ప్రచారం చేయగలుగుతున్నది మాత్రం అభివృద్ధి నమూనా – గుజరాత్ ఆదర్శం (?) స్వచ్ఛభారత్ – అచ్ఛా దిన్ ఆయేగా – 1991లో పి.వి. నరసింహారావు ప్రారంభించిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణను ఎనిమిదేళ్ల పాలనలో

మన్మోహన్ సింగ్ తానాశించినంతగా, తన మాస్టర్స్ ఆశించినంతగా ముందుకు తీసుకుపోలేనప్పుడు అవినీతిరహిత అభివృద్ధి హామీతో ముందుకు వచ్చిన మోడీ రైల్వేలు, రక్షణ వంటి రంగాల్లో కూడ ప్రైవేటైజేషన్‌కు తలుపులు బార్లా తెరిచాడు. ఆయనింక అభివృద్ధి మంత్రమే జపిస్తున్నాడు. నీతిచంద్రికలో నెత్తురు రుచి మరిగిన పులి ఊబిలోంచి పైకి లాగమన్నపుడు ప్రయాణీకునికి ఎరచూపింది బంగారు కంకణమే కదా. ఇవాళ్టి సామ్రాజ్యవాద సంక్షోభాన్ని మనం ఈ విధంగానే అర్థం చేసుకోవాలి. లోక్‌సభ ఎన్నికల్లో ముందుకు వచ్చిన మరొక ఫాసిస్టు శక్తి – ఆర్ఎస్ఎస్. ఈసారి బిజెపి ఎన్నికల ప్రచార నిర్వహణ అంతా బిజెపి చేయలేదు – ఆర్ఎస్ఎస్ చేసింది. వేలాది మంది ఆర్ఎస్ఎస్ పూర్తికాలపు కార్యకర్తలను పూర్తికాలం కోసం ఎన్నికల ప్రచారంలోకి తెచ్చింది. వాళ్ల ఎన్నికల రాజకీయాల్లో వాళ్ల ఆశించిన విజయాలను సాధించగానే ఇంక వాళ్లను బిజెపిలోకి కీలక స్థానాల్లో బాధ్యతల్లోకి పంపించింది. అమిత్‌షా అఖిల భారత బిజెపి అధ్యక్షుడు కాగలగడమైనా, రామ్‌మాధవ్, మురళీధర్ రావు వంటి వాళ్ల పూర్తిగా బిజెపి నిర్మాణంలోకి రావడమైనా మనకందరికీ తెలిసిన పేర్లుగా కొన్ని ఉదాహరణలు మాత్రమే. బిజెపి అధ్యక్షుడుగా అవినీతికి పేరొందిన గడ్కరీ వంటి వారిని మంత్రివర్గంలోకే తెచ్చారు. ఆర్ఎస్ఎస్‌గా, సాధ్వులుగా, సంఘ్ పరివార్ సంచాలకులుగా గతంలో పేరుండి మంత్రులైన వాళ్ల ప్రభుత్వంలో ఆర్ఎస్ఎస్ భాషలో మాట్లాడుతున్నారు. ఇంక ప్రవీణ్‌తొగాడియా, అశోక్ సింఘాల్‌లు సరేసరి. హిందీ అధికార భాషతో మొదలై, హిందువులు కాని వాళ్లంతా రాముని అక్రమ సంతానం అనేంత వరకు ఘర్ వాపసీల వరకు హిందుత్వ అజెండాను అమలు చేస్తున్నారు. ఎమర్జెన్సీ ఎత్తివేసినాక అధికారానికి వచ్చిన జనతాపార్టీలోని బిజెపి విద్య, సంస్కృతి, సమాచార రంగాల్లో – ఏయే సంఘ్‌పరివార్ భావజాలాన్ని చొప్పించడానికి ప్రయత్నం చేసి చాలావరకు విస్తరించగలిగిందో, ఇపుడు పూర్తి మెజారిటీతో వాటిని స్థిరపరచి అవినీతిరహిత సమర్థ అభివృద్ధి నమూనా భావజాలంతో ఆమోదం పొందగలుగుతున్నది. ఛత్తీస్‌గఢ్‌లో మూడోసారి అధికారంలోకి వచ్చి, జార్ఖండ్‌లో పూర్తి మెజారిటీతో అధికారం చేపట్టబోయే ఆదివాసి రాజ్యాలలో హిందుత్వ ప్రాబల్య ఆమోదం పొందడమే కాదు, జమ్ము కశ్మీర్‌లో కూడ తన బలమైన ఉనికిని చాటగలిగి అధికారం కోసం తొందర పడడం లేదంటే ఎంత చాపకింద నీరువలె హిందుత్వ భావజాలాన్ని ప్రవేశపెట్టగలుగుతున్నదో ఊహించవచ్చు.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ భావజాలానికి హిందుత్వ భావజాలానికి ఉన్న పరస్పరాధార ఆధేయ సంబంధం గురించి ఇదివరకు చాలాసార్లు చెప్పుకున్నాం. అది 1984 భోపాల్ గ్యాస్ విషాదం, సిఖ్ఖుల ఊచకోత, హింద్ కరేగా హిందూ రాజ్ పేరుతో రాజీవ్‌గాంధీ నాలుగు వందల ఒక స్థానాలతో లోకసభకు ఎన్నికకావడం, దేశాన్ని ఇరవయ్యొకటో శతాబ్దంలోకి తీసుకపోతాననడం, శ్రీలంకకు తమిళ ఈలంను అణచడానికి శాంతిసేనను పంపించడంతో ప్రారంభించి – రామ్‌లల్లా దర్శనం కోసం బాబ్రీమసీదులో ద్వారాలు తెరవడం వరకు ఉన్న అంతర్ సంబంధాన్ని చూసినా 1991లో నూతన ఆర్థిక విధానం పేరుతో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, 1992లో బాబ్రీమసీదు విధ్వంసం, 1993లో బొంబాయి, సూరత్‌లలో ముస్లింలపై దాడులు ఇవన్నింటినీ చూసినా హిందుత్వ శక్తులు ప్రపంచీకరణ విధానపు విధ్వంసానికి ఎట్లా అండగా నిలుస్తున్నాయో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

2002 గుజరాత్ మారణకాండతో విడివడి అయిదుసార్లు మోడీ గుజరాత్‌లో ఎన్నిక కావడం కాని, ఆయన చెపుతున్న అక్కడి అభివృద్ధి కాని అర్థం చేసుకునే అంశాలు కావు. గుజరాత్ అభివృద్ధిగా చెపుతున్నదంతా ఒక శతాబ్దంపైగా గుజరాత్ ఆర్థిక వాణిజ్య స్థితితో పోల్చి చూస్తే తప్పు ఎంత డొల్లతో కూడిన వాస్తవమో మనం గ్రహించలేం. ఎన్నికల రాజకీయాలు కులంతో విడిపోతున్న సమాజాన్ని హిందుత్వ పేరుతో, అఖండత్వం పేరుతో దేశాన్నంతా ఐక్యం చేసిన పటేల్ పేరుతో, పటేలే గాంధీకి నిజమైన వారసుడనే పేరుతో ఎట్లా మతాన్ని, జాతులన్నిటిని ఒక బందీఖానాలో బలవంతంగా కట్టి ఉంచడాన్ని, తద్వారా దేశవ్యాప్తంగా ఒక మార్కెట్ శక్తుల అధీనంలోకి తేవడాన్ని ఒక పథకం ప్రకారం కుట్రపూరితంగా అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో పాశ్చాత్య దేశాలకు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మాట్లాడే దేశభక్తి పదజాలాన్ని కూడ వదిలేసి ఇదివరకంటే ఎక్కువగా అమెరికా అనుకూలమైనటువంటి ఆచరణను మోడీ ప్రభుత్వమే ప్రదర్శిస్తున్నది. ఆరు నెలల కాలంలోనే రెండు సార్లు ఒబామాను కలవడమైనా, స్వయంగా ఒబామాను రిపబ్లిక్ దేకు ప్రత్యేకంగా పిలవడం ఒకవైపు, ఒబామాకు భగవద్గీతను కానుకగా ఇవ్వడం మరొకవైపు, ఒక భావజాలం రాజకీయార్థిక పునాదికి ఉపరితలంగా మలాముగా పనిచేసే పద్ధతికి రెండు ముఖాలు.

ఇప్పుడు సుష్మాస్వరాజ్ భగవద్గీతను జాతీయ గ్రంథంగా ప్రకటించాలి, ఇప్పటిదాకా అట్లా భావిస్తున్నాం, దీన్ని అధికారికంగా ప్రకటించాలని పార్లమెంట్‌లోనే డిమాండ్ చేయడం, దాని మీద దేశమంతటా చర్చ జరగడం చూస్తూనే ఉన్నాం. అంటే అంబేద్కర్ రచించిన గణతంత్ర, లౌకిక, ప్రజాస్వామ్య, శాస్త్రీయ రాజ్యాంగం స్థానంలో మనుధర్మాన్ని అధికారికంగానే రాజ్యాంగంగా ప్రకటించాలనే దుస్సాహసానికి ఈ ప్రభుత్వం పూనుకుంటున్నది. భగవద్గీత చాలా స్పష్టంగా వ్యవస్థలో అసమానతలను సమర్థించి హింసను ప్రేరేపించే గ్రంథం. భగవంతుడు తాను చేసిన సృష్టి చాతుర్ వర్ణాలుగా అని, వాటిలో బ్రాహ్మణులు శిరస్సు నుంచి వస్తే, శూద్రులు పాదాల నుంచి వస్తారని దాచుకోకుండానే చెప్పాడు. అట్లే కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడిని హింసకు ప్రేరేపించాడు. అసమానత, హింస ఒక వైదిక మతధర్మంగా ప్రబోధిస్తూ వాటన్నింటిని అఖండంగా చూపిస్తూ అవి ధర్మ సాధనకు, అంటే రాజ్యాధికారానికి అవసరంగా చెప్పిన హితబోధయే భగవద్గీత. ఇది మహాభారతంలో భాగమైనప్పటికి దేశంలో కాస్త పెద్దరాజ్యాలు ఏర్పడే క్రమంలో మౌర్య రాజ్య కాలానికి, రెండు వేల సంవత్సరాల క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం రాసిన కాలానికి మనుధర్మ శాస్త్రం వచ్చింది. రాజుగారి రక్తం తప్పు చేయదనే రాజధర్మాన్ని స్థాపించడానికి, బ్రాహ్మణ క్షత్రియ ఆధిక్యాన్ని సంపాదించడానికి, పురుషస్వామ్యాన్ని స్థిరపరచడానికి రచించబడిన హిందూ ధర్మశాస్త్రం మనుధర్మం. ఒక విధంగా చెప్పాలంటే అది హిందుత్వ రాజ్యాంగం. ఒకవైపు కౌటిల్యుని అర్థశాస్త్రం, మరొకవైపు మనుధర్మ శాస్త్రం ఇవాళ్టి మోడీత్వ భావజాలానికి సామ్రాజ్యవాద అనుకూలమైన భావజాలాన్ని సమకూరుస్తున్నాయి. భగవద్గీతను జాతీయ గ్రంథంగా గుర్తించాలి అని ప్రతిపాదించడంలో ఇమిడి ఉన్న రహస్యం ఇదే.

మనకు అనాలోచితంగా కొన్నిపదాలు వాడడం అలవాటు అయిపోయింది, అట్లాగే ఇవ్వబడిన భావజాలమే భాష ద్వారా వాడడం అలవాటు అయిపోయింది గాని అసలు భారతజాతి అనేది ఎక్కడ ఉంది? భారత ఉపఖండం ఒక జాతుల సమాహారం. ఈ విషయాన్ని ఎక్కువ వివరణలోకి వెళ్లనక్కరలేకుండానే రాజ్యాంగాన్ని సమాఖ్యగా రచించడంలో గాని, భాషా రాష్ట్రాల ఏర్పాటులో గాని భారతీయ భాషలన్నిటినీ జాతీయ భాషలుగా గుర్తించడంలో గాని ఇమిడి ఉన్నటువంటి చారిత్రక విలువ అదే. తెలుగుజాతి, తమిళజాతి మొదలుకొని ఎన్నో జాతులు ఒక పరిపాలన కింద ఉన్న దేశం మనది. దీనిని భారతజాతిగా చిత్రించడమే 1857 తర్వాత జాతీయోద్యమంగా పిలవబడుతున్న ఎన్నో పోరాటాలు చేసిన ఒక పని అయితే, మొదట అఖండ భారత్ భావన తీసుకుని వచ్చి, దాని వెనుక దాని హిందుత్వ భావనకు పర్యాయపదంగా ప్రతిపాదించడంలోనే ఈ కుట్ర దాగి ఉంది.

కనుక జాతీయ గ్రంథంగా భగవద్గీతను గుర్తించడం అనేది భారతదేశంలో ఉన్న వివిధ మతాలకే కాదు, జాతులకు కూడ అభ్యంతరకరమైన విషయం.

ఈ నేపథ్యం నుంచే ఎన్నికలు జరిగి ప్రభుత్వాలు ఏర్పడిన సందర్భమే కాకుండా, రెండు కొత్త రాష్ట్రాలు ఏర్పడిన తెలుగుజాతి పరిస్థితి చూసినా భిన్నంగా ఏమీ లేదు. ఆంధ్రప్రదేశ్ చంద్రబాబు నాయుడు పరిపాలన ఎన్‌డిఎ కాలం నుంచి దానికి బిజెపితో ఉన్న అనుబంధం, అది ఈసారి ఎన్నికలలో నిలబడడమే బిజెపి పొత్తుతో జరిగి ప్రభుత్వంలో కూడ ఇక్కడి బిజెపి సభ్యులు చేరడం, కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో చేరడం చూసినప్పుడు ప్రత్యేకించి ఇక అక్కడి ప్రభుత్వం గురించి చెప్పనక్కరలేదు. పోలవరం ప్రాజెక్టు మొదలుకొని రాజధాని నిర్మాణం, తాను 2004లో ఓటమికి కారణమైన అవే సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు, మావోయిస్టు రాజకీయాలను శాంతిభద్రతల సమస్యగానే చూడడం అనే విధానాలనే కొనసాగిస్తున్నాడు. అందులో ఆశ్చర్యం ఏమీ లేదు. తిరిగి బాక్సైట్ కంపెనీలకు చింతపల్లి అడవులను అప్పగించాలని అనుకోవడం గాని, ఆదివాసుల అణచివేతకు అనుసరిస్తున్న విధానం గాని, గ్రీన్‌హంట్ ఆపరేషన్ కొనసాగింపు, వ్యతిరేకిస్తున్న ప్రజాస్వామ్య శక్తుల అణచివేత, ఎన్‌కౌంటర్లు అన్నీ పాత విధానాలే మరింత తీవ్రంగా అమలు చేస్తున్నాడు.

బుద్ధిజీవుల భ్రమలకు కారణమై చాలామందిని తనకు అనుకూలంగా చేసుకోగలిగిన కెసిఆర్ అన్ని విధాలా ఎన్‌టిఆర్ భాష మాట్లాడుతున్నాడు. మావోయిస్టు అజెండాను అమలు చేస్తానని అధికారంలోకి వచ్చాడు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడడంలో పద్దెనిమిది సంవత్సరాల ప్రజాస్వామిక పోరాట చరిత్ర ఉన్నది. ఈ ప్రజాస్వామిక ఉద్యమ ఫలితాలన్నిటినీ తన వర్గ ప్రయోజనాలకు ఉపయోగించుకునే క్రమంలో కెసిఆర్ మావోయిస్టు అజెండా వంటి ఆకర్షణీయమైన నినాదాలు చెప్పినప్పటికీ ఆచరణలో అదే పట్టణీకరణ, అదే పారిశ్రామీకరణ, సింగపూర్ లాంటి రాజధాని వంటి ఆలోచన చేస్తున్నాడు. రాష్ట్రంలో ఉన్న భూములూ, అడవులూ అన్నిటినీ కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడానికే ఒకవైపు ఏరియల్ సర్వేలు చేస్తూ, మరోవైపు యాదగిరిగుట్టను వాటికన్ సిటీ చేస్తానంటున్నాడు. హైదరాబాద్ నగర ఎన్నికల దృష్ట్యా ముస్లింలకు ఎన్ని రాయితీలు ప్రకటిస్తున్నప్పటికీ కూడ ఆచరణలో తెలంగాణ సంస్కృతి పేరుతో హిందుత్వ భావజాలానికే ప్రోది చేస్తున్నాడు. ముఖ్యంగా డిసెంబర్ 16న రామోజీ ఫిలిం సిటీకి వెళ్లి ఆయన నాలుగు అయిదు గంటలు అక్కడ గడిపి ఆ ఫిలిం సిటీ గురించి చేసిన పొగడ్తల కన్న దాని వెనుక దాగిన దూరదృష్టి ప్రమాదకరమైనది. ఆయన రామోజీ నిర్మాణం చేసిన ఫిలిం సిటీ కన్న చేయతలపెట్టిన ఓం ఆధ్యాత్మిక నగరం తలమానికం అయిందీ అని చెప్పాడు. దేశంలో ఉన్న దేవాలయాల ప్రతికృతులు అన్ని అక్కడ నిర్మాణం అవుతాయని, ఇంక ప్రజలు దేవాలయాలు దర్శించుకోవడానికి దేశమంతా తిరగనక్కరలేదని ఒక ఓం ఆధ్యాత్మిక నగరాన్ని దర్శించుకుంటే సరిపోతుందని చెప్పాడు. రామోజీ ప్రభుత్వం నుంచి ఒక్క పైసా సహాయం తీసుకోలేదని, అయినా ఇప్పుడు ఫిలిం సిటీ దర్శించుకోవడానికి వేల మంది వస్తే, రేపు ఓం సిటీ దర్శించుకోవడానికి లక్షల మంది వస్తారు కాబట్టి ప్రభుత్వం రహదారులు వేస్తుందని ప్రకటించాడు. అది దృష్టిలో పెట్టుకొనే తన వెంట ఆర్థిక మంత్రిని, కాబోయే రహదారుల మంత్రిని తీసుకుపోయాడు. రామోజీరావు ద్వారా మోడీతో సంబంధాలు ఏర్పర్చుకోవడం కొరకే ఆయన రామోజీ ఫిలింసిటీ వెళ్లాడు. గతంలో ఎన్‌టిఆర్‌తో ఎన్‌డిఎ సంబంధాన్నైనా అంతకన్నా ముఖ్యంగా ఎన్‌డిఎతో చంద్రబాబు పొత్తునైనా సంధానం చేసినవాడు రామోజీరావు. ఎవరు పెట్టుబడిదారీ సామర్థ్యంతో దేశాన్ని కొల్లగొట్టగలడో వాడే దేశభక్తి పేరుతో హిందుత్వ శక్తులను ఒకచోటికి తేగలడు. రామోజీ రావుకు ఆ శక్తి ఉన్నదని తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడే కెసిఆర్‌కు తెలుసు. కనుక అది కేవలం రామోజీ ఫిలింసిటీకి వెళ్లడం మాత్రమే కాదు, అది మోడీకి సన్నిహితం కావడానికి మార్గం వెతుక్కోవడం. హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలు అయిన తర్వాత ఇది మరింత స్పష్టంగా ముందుకు వస్తుంది.

ఈసారి భద్రతా సమితిలో భారత ప్రభుత్వం పాలస్తీనాకు వ్యతిరేకంగా ఓటు వేయబోతున్నదని హిందూ పత్రిక భారత ప్రతినిధులతోటే అనధికారికంగా మాట్లాడి బయటపెట్టింది. దాని మీద పార్లమెంట్‌లో లేవదీసిన ప్రశ్నలకు కూడ ప్రభుత్వం మౌనంగానే ఉండిపోయింది. అరవై సంవత్సరాలుగా సూత్రబద్ధంగా పాలస్తీనా ప్రజలతోటి, తద్వారా ఇస్లాం సమాజాలతోటి ఉన్న సంబంధాలను క్రమంగా తెంచుకొనే క్రమంలో భారత ప్రభుత్వం ఉన్నట్లు అర్థమవుతూనే ఉంది. అయితే దీనికి మన దేశంలో తూర్పు మధ్యభారతాల్లో మావోయిస్టుల మీద గ్రీన్‌హంట్ ఆపరేషన్ పేరుతో జరుగుతున్న దాడుల్లో ఇజ్రాయెల్ నుంచి తెచ్చుకుంటున్న ఆయుధ సామగ్రి, మానవ రహిత విమానాలు, భారత ప్రభుత్వం సైనిక అవసరాల కోసం సమకూర్చుకుంటున్న సాంకేతిక జ్ఞానమే కారణం కావడం అనేది ముఖ్యం. ఒక పత్రిక సంపాదకీయంలో రాసినట్టుగా టెల్ అవీవ్ మీదుగా అమెరికాకు మార్గమన్నట్లుగా ఇజ్రాయెల్‌కు భారత ప్రభుత్వం ఇస్తున్న సమర్థన, దాని నుంచి తీసుకుంటున్న ఆయుధాలు మాత్రమే కాకుండ, అమెరికా సామ్రాజ్యవాద మెప్పు పొందడం కూడ అయినప్పుడు ప్రపంచంలో న్యాయాన్యాయాల పోరాట శక్తుల మధ్య వివక్ష కోల్పోయే పరిస్థితి కూడ వస్తుంది. ఇజ్రాయెల్ నుంచి మానవరహిత విమానాలు, ఆయుధాలు కేంద్ర ప్రభుత్వం మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు కూడ పెద్ద ఎత్తున సమకూర్చుకుంటున్నాయి. కనుక ప్రజల న్యాయమైన పోరాటాలను అణచివేయడానికి హిందుత్వ భావజాలానికి కేవలం భావజాల సంబంధమైన అంశమే కాదు, రాజకీయార్థిక అంశాలు కూడా కారణమవుతున్నాయి. ఇవి విడిగా చూడాల్సిన అంశాలు కావు.

(రచయిత విప్లవ కవి, విప్లవ రచయితల సంఘం నాయకులు) వీ

మారిన ప్రభుత్వాలలో ప్రజాస్వామిక హక్కులు

ప్రభుత్వాలు మారినా విధానాల్లో మార్పు లేదనడానికి రైతుల ఆత్మహత్యలూ, అమలు చేయని వాగ్దానాలూ, ప్రశ్నించేవారి అణచివేతా రుజువు చేస్తున్నాయనీ, కనీస ప్రజాస్వామిక హక్కులను అమలు చేయడంలేదనీ అంటున్నారు బి. రామకృష్ణ

తెలంగాణలో చంద్రశేఖరరావు, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వాలు దాదాపుగా ఒకేసారి ఏర్పడ్డాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి ఉద్యమ పార్టీగా గుర్తించ బడిన టిఆర్ఎస్ 2014 జూన్ 2న అధికారంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ లో టిడిపి అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు 2014 జూన్ 8న ముఖ్యమంత్రి అయ్యాడు. స్వతంత్ర మెజారిటీ సంపాదించిన బిజెపి నరేంద్రమోడీ ప్రధాన మంత్రిగా 2014 మే 26న కేంద్రంలో అధికారం చేపట్టింది.

ఉద్యమాలు నడిపి నిర్బంధాలను చవిచూసిన టిఆర్ఎస్ నుండి సహజంగానే ప్రజలు ఎంతో కొంత ముందడుగు కార్యక్రమాలను ప్రజా పోరాటాలపట్ల సానుకూల వైఖరులను, ఉద్యమంపై. హక్కులపై గౌరవాన్ని ఆశిస్తారు. టిఆర్ఎస్ ఏర్పడక ముందే ఎన్నో ఏళ్లుగా తెలంగాణ కోసం అనేక రకాలుగా ఉద్యమాలు కొనసాగాయి. ఒక రకంగా టిఆర్ఎస్‌ను ఉద్యమంలో నిలబెట్టడానికి ఇవి పరోక్షంగా, ప్రత్యక్షంగా ఎంతగానో ఉపయోగపడ్డాయి. మౌళిక మార్పు కోసం ఆరాట పడుతున్న ఉద్యమాలు తెలంగాణ పోరాటంలో భాగమయ్యాయి. ఎన్నో ఉద్యమాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ (ఆంక్షలతో కూడిన)లో పౌర, ప్రజాస్వామిక హక్కులకు గౌరవం ఉంటుందని అనుకున్న వారికి ఆశాభంగం కలిగించే సంఘటనలు జరిగాయి. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయం లో నిరుద్యోగ విద్యార్థులు ఆ విధానాన్ని వ్యతిరేకించారు. ఆందోళనలు చేశారు. వాటికి సరైన పరిష్కారాలు చూపకుండా వారిపై లాఠీలను ప్రయోగించారు. తెలంగాణ కోసం పోరాడిన విద్యార్థులపై ఉద్యమ సందర్భంలో ప్రయోగించబడిన పోలీసుల చర్యలే తెలంగాణ ప్రభుత్వంలో పునరావృతం కావడం దురదృష్టకరం. ఈ డిమాండ్‌పై ప్రజాస్వామిక చర్చలను జరిపి విద్యార్థులు, మేధావులతో పరిష్కార మార్గం కనుగొనే ప్రయత్నం చేయకుండా పోలీసులను ఆశ్రయించారు. ప్రజలు తమ డిమాండ్‌లను ప్రభుత్వాలకు చెప్పుకునే వాటికోసం ఆందోళనలు చేసే హక్కును కలిగి ఉంటారు. ఆందోళనలపై బలప్రయోగం ద్వారా వారి నోళ్లుమూయించే పని చేయడం ప్రజాస్వామిక ప్రభుత్వాల లక్షణం కాదు.

టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక నాలుగు వందలకు పైగా రైతుల ఆత్మహత్యలు జరిగాయి. సగటుగా రోజుకు ఇద్దరు రైతులు బలవన్మరణా లకు గురవుతున్నారు. ఏ సమాజంలోనైనా బలవన్మరణాలు ఆ సమాజాల సంక్షోభాలను, అస్త వ్యస్థతలను సూచిస్తాయి. వీటిని పరిష్కరించే దిశలు ఆ సమాజం ఆలోచనలను, ఆచరణలను పదును పెట్టే ఆవశ్యకతను తెలుపుతాయి. ఈ ఆత్మహత్యలు రైతులకు భరోసానివ్వడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని సూచిస్తున్నాయి. అయితే ఇవి ఎప్పటి నుండో పాత ప్రభుత్వాల పాపాల ఫలితమని చెప్పడాన్ని తప్పుపట్టలేం కాని, ఈ ప్రభుత్వం ఇచ్చే భరోసా, చేపట్టే కార్యక్రమాలు తప్పనిసరిగా పనికొస్తాయి. అలా చేయవలసిన యుద్ధ ప్రాతిపదిక కార్యక్రమం కంటే మరేది ముఖ్యమవు తుంది. గుళ్లు గోపురాలకు, చర్చీలకు వందలాది కోట్లు కేటాయిస్తున్న ప్రభుత్వం రైతుల కోసం ఖర్చు పెట్టలేదా? వ్యవసాయ రంగంలో సంక్షోభం రైతులు జీవించే హక్కును హరించివేస్తున్నది. దీని నుండి బయట పడేందుకు కృషి చేయవల్సి ఉన్నది.

సెప్టెంబర్ 2014లో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక సదస్సును అడ్డుకున్నారు. సదస్సు నిర్వాహకులను, సభకు వచ్చే ప్రజలను పెద్ద ఎత్తున అరెస్టులు చేశారు. దీని ద్వారా తెలంగాణ ప్రభుత్వం రాబోయే కాలంలో నిరసన గొంతులపై, ప్రత్యామ్నాయ రాజకీయాలపై తన నిరంకుశ వైఖరిని బయట పెట్టింది. నిషేధిత పార్టీ రాజకీయాలను ప్రచారం చేయడం సరైంది కాదని సభను జరపనీయకపోవడాన్ని సమర్థించే ఉద్యమ మేధావులు కొందరు ఉండవచ్చు. ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలైనా కాలేదు అప్పుడేనా సభలు అనేవారూ ఉండవచ్చు. ప్రజలెప్పటికీ ప్రభుత్వ తప్పుడు విధానాలను నిరసించే హక్కును కలిగి ఉంటారు. వాటిని మార్చేందుకు ప్రయత్నించడం వారికుండే ప్రజాస్వామిక హక్కు. ఈ హక్కును గౌరవించడం ప్రజాస్వామిక ప్రభుత్వాలు చేయవల్సిన పని. వాక్ సభా స్వాతంత్ర్యాన్ని అణిచివేసిన టిఆర్ఎస్ ప్రభుత్వం రాబోయే కాలంలో ఉద్యమాలపై ప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందా? అనేది సందేహమే. టిఆర్ఎస్ ప్రభుత్వంపై ఏ వత్తిడైనా ఉండవచ్చు గాక, వత్తిళ్లకు తలొగ్గితే ఇంకా నాలుగున్నరేళ్ల కాలంలో మరింతగా ప్రజలపై, ప్రత్యామ్నాయ రాజకీయాలపై పోలీసుమార్క్ నిర్బంధానికి సంకేతంగా దీన్ని తీసుకోవాల్సి ఉంటుంది. కాళోజి, జయశంకర్, కొమురం భీంలను గౌరవనీయులుగా ఆరాధ్యులుగా భావిస్తున్నట్లుగా చెప్పుకునే కెసిఆర్ వారి పోరాటాల కొనసాగింపును సహించకపోవడం అనేది హక్కులను అణచివేయడంతో పాటు వారిని కించపరచడమే అవుతుంది.

జూనియర్ డాక్టర్లు సమ్మె చేసినపుడు వారి న్యాయమైన డిమాండ్‌లపై సరిగ్గా స్పందించకుండా వారిపై ఎస్మా (ఇఎస్ఎంఎ) వంటి నల్లచట్టాలను ప్రయోగిస్తామని బెదిరించడం జరిగింది. కోర్సు కాలంలోనే సంవత్సరం గ్రామీణ వైద్యశాలలో పనిచేయమని ప్రస్తావించకుండా కోర్సు పూర్తయ్యాక మరో సంవత్సరం గ్రామాల్లో పనిచేయాలని పట్టుబట్టింది ప్రభుత్వం. జూనియర్ డాక్టర్లు ముందుకు తెచ్చిన పర్మనెంట్ పోస్టింగ్‌పై నోరు మెదపలేదు. ఇలా చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పిహెచ్‌సిలలో డాక్టర్లు అందుబాటులో ఉండే పరిస్థితి ఉండేది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో

మౌళిక వసతులు యంత్ర పరికరాలను కల్పించే విషయంలో జూనియర్ డాక్టర్ల డిమాండ్‌లను పరిశీలించనే లేదు.

జిల్లాకో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తామని చెప్పిన కెసిఆర్ హైదరాబాద్‌లోని ఒక అపోలో హాస్పిటల్ ప్రారంభోత్సవానికి హాజరైన సందర్భంలో మాట్లాడుతూ జిల్లాకో హాస్పిటల్ నిర్మించాలని అపోలో యాజమాన్యాన్ని కోరడం జరిగింది. ప్రైవేట్ దవాఖానాలు ఇప్పటికే ప్రజలను పిప్పి చేస్తున్నాయి. పేద, మధ్యతరగతి వారికి వైద్యం అతి ఖరీదైనదిగా మారింది. అలాంటి వాటి ప్రారంభోత్సవానికి హాజరు కావడమే కాకుండా వాటి విస్తృతికి విజ్ఞప్తి చేయడం దేనికి సంకేతంగా ఉంటుంది? ఆర్టికల్ 21 జీవించే హక్కులో భాగంగా ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి, ఆరోగ్యకర పరిసరాలు, పర్యావరణం, సామాజిక భద్రత వంటివి గ్యారంటీ చేయాలి. ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానాలు ప్రజలకు వైద్యం చేయడంలో లాభాపేక్ష లేకుండా పనిచేయాలనే సూచనతో పాటు మరింత ముందుకెళ్లి ఆజ్ఞాపించడం చేయాలి. కాని కెసిఆర్ ప్రభుత్వం ఆ పని చేయగలదా?

కెజి నుండి పిజి వరకు ఉచిత విద్య అని, కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పిన కెసిఆర్ మరొక దొంతరగా ఉండే నియోజక వర్గానికి ఒక రెసిడెన్సియల్ పాఠశాల స్థాపిస్తామని అంటున్నాడు. మరోవైపు తన కూతురు, టిఆర్ఎస్ ఎంపి కవిత ప్రైవేట్ విద్యా సంస్థలకు భరోసా ఇస్తుంటుంది. విద్యా హక్కును బలహీనం చేస్తూ పాత ప్రభుత్వాల విధానాలనే మరో రూపంలో కొనసాగించ బోతున్నారనే అనుమానం బలపడుతుంది. కామన్ స్కూల్ అంటే ఒకే క్యాచ్‌మెంట్ ఏరియాలో ఒకే పాఠశాల అదీ కూడా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచిత గుణాత్మకమైన విద్యను అందించేది. అంతేగాని ప్రైవేట్ విద్యా సంస్థలన్నీ ఇలాగే కొనసాగించడం కాదు.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రెండు వారాల్లోపే కడప అడవుల్లో ఎర్రచందనం కూలీలను కాల్చి చంపారు. 2014 జూలై 31న మరొకరిని అదే అడవిలో, 2014 ఆగస్టు 2న చిత్తూరు జిల్లా అడవుల్లో మరొకరిని కాల్చి చంపారు. వేలాది మంది పేద కూలీలను స్మగ్లింగ్ కేసుల్లో ఇరికించి జైల్లో పెట్టడం జరిగింది. అక్కడ ఫారెస్టు అధికారిని చంపిన విషయంలో అసలు దోషులను వదిలి పొట్టకూటి కోసం ఎర్రచందనం స్మగ్లింగ్ మాఫియా చేతుల్లో పావులుగా మారిన పేదకూలీలను నానా హింసల పాలుచేస్తున్నారు. ఈ మాఫియాకు చేదోడు, వాదోడుగా పోలీసు వ్యవస్థ, అటవీ అధికారులు, రాజకీయ పార్టీలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యమే. ఎన్నికల్లో స్మగ్లింగ్ డబ్బు పార్టీల చేతులకు చేరుతూనే ఉంటుంది. ప్రత్యర్థులను నియంత్రించేందుకు అధికార పార్టీలు స్మగ్లింగ్‌ను పావుగా వాడుకుంటున్నారు. పేద కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారిని స్మగ్లింగ్ మాఫియా చేతుల్లో పడకుండా చూడొచ్చు. ఇది ప్రభుత్వాలు చేయాల్సిన పని కూడా. అలా చేయకుండా అటవీ ప్రాంతంలో కూంబింగ్‌ల పేరుతో అమాయక ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం, అక్రమ కేసులు పెట్టడం అనేది పౌర హక్కులను అణచివేయడమే.

చంద్రబాబు అధికారంలోకి వచ్చిన పదకొండో రోజు 2014 జూన్ 19న ప్రకాశం జిల్లా చెరువు మండలం శతకోటి వద్ద ముగ్గురు మావోయిస్టు కార్యకర్తలను ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చారు. దీని ద్వారా ప్రత్యామ్నాయ రాజకీయాల ఉద్యమాలపై భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎలా స్పందించబోతున్నదో స్పష్టం అయింది. ఈ కాల్చివేతలకు ముఖ్యమంత్రికి సంబంధం ఏమిటని కొందరు ప్రశ్నిస్తుంటారు. ఏ ప్రభుత్వాధినేతనైనా సరే ఇలాంటి వాటిపై వారి వైఖరిని స్పష్టం చేయాలి. కాల్చి వేతలను సహించబోమని, పోలీసులు చట్టప్రకారం, రాజ్యాంగ నియమాల ప్రకారం నడుచుకోవాలని బహిరంగంగానో, పాలనా పరంగానో చెప్పకుండా ఉండడం అంటే పోలీసుల చర్యలను సమర్థించినట్లే. అలాగే వాటిని కొనసాగిస్తామని చెప్పడమే అవుతుంది. తిరుపతిలో అక్టోబర్ 2014లో ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా ప్రజా సంఘాలు ఏర్పాటు చేసిన సభకు అనుమతి ఇవ్వకుండా ఆ సభ నిర్వాహకులను, సభలో మాట్లాడవల్సి ఉన్న వ్యక్తులను ముందుగానే అరెస్టులు, గృహ నిర్బంధాలు చేశారు. కనీస ప్రజాస్వామిక హక్కు అయిన అభిప్రాయ వ్యక్తీకరణ, సభలు నిర్వహించుకునే స్వేచ్ఛను కూడా అడ్డుకున్నారు. వాక్ సభ స్వాతంత్ర్యాలు ప్రజాస్వామిక వ్యవస్థకు మూల స్తంభాలుగా ఉంటాయి. వాటిని కాలరాచి వేస్తూ గ్రీన్‌హంట్ వ్యతిరేక సభను జరగనీయకుండా నిర్బంధం విధించడం ద్వారా చంద్రబాబునాయుడు పౌర, ప్రజాస్వామిక హక్కులకు ఏపాటి గౌరవం ఇవ్వదలచుకున్నాడో స్పష్టం చేశారు. ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నట్లుండే కెసిఆర్, చంద్రబాబులు అణచివేతల పట్ల ఎంతగా కలిసిపోయారో తెలుస్తుంది.

గుంటూరు, విజయవాడల మధ్య నిర్మించబోయే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని నిర్మాణానికి సంబంధించి ముప్పైవేల ఎకరాల భూమి 52.5 చదరపు కిలోమీటర్ల పరిధిలో సేకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. 29 గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున వ్యవసాయ భూములు దీని ప్రభావానికి గురికాబోతున్నాయి. అంత పెద్ద రాజధాని నిర్మాణం ఎందుకవసరమని ప్రశ్నించాల్సి ఉన్నది. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు వెనుకబడి ఉన్నవి. వాటి అభివృద్ధికి ప్రణాళికలు లేవు. ప్రతి జిల్లా, మండల స్థాయి వరకు వికేంద్రీకరణ చేయడం ద్వారా ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయకుండా ఒకేచోట రాజధాని ప్రాంతంలో కేంద్రీకరణ చేయడం సరైంది కాదు. ఆ ప్రాంత ప్రజల భూములను బలవంతంగా లాగేసుకుని వారి నివాస, ఉపాధి హక్కులకు విఘాతం కలిగిస్తున్నారు.

పోలవరం ప్రాజెక్టు వలన ఇటు తెలంగాణలోను, అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ మూడు లక్షల మంది ఆదివాసులు నిరాశ్రయులు కాబోతున్నారు. ఈ గిరిజనుల గురించి వారి జీవించే హక్కుల గురించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేంద్ర ప్రభుత్వాలకు ఏమాత్రం పట్టింపు లేకుండా పోయింది. పైగా దాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి త్వరగా పూర్తి చేయాలనుకుంటున్నారు.

శ్రీకాకుళం జిల్లాలోని కొవ్వాడ వద్ద అణువిద్యుత్ కేంద్రం నిర్మాణానికి భూసేకరణకు సంబంధించి ఏపి ప్రభుత్వం సెప్టెంబర్ 14లో ఉత్తర్వులు జారీ చేసింది. దీని ద్వారా వ్యవసాయ భూములు కోల్పోవాల్సి వస్తుంది. ఈ కేంద్రం చుట్టు కిలోమీటర్ పరిధిలో ప్రజా జీవనానికి ఎలాంటి అవకాశం ఉండదు చుట్టూ 30 కిలోమీటర్ల మేర ప్రాంతం ప్రమాద ప్రభావంలోకి వస్తుంది. ఇక్కడ అణువిద్యుత్ కేంద్రం వద్దని గత రెండు దశాబ్దాలుగా ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. అయినా సరే మొండిగా పాలకులు దీని నిర్మాణానికి కంకణబద్ధులై ఉన్నారు. ఇక్కడేదైనా ప్రమాదం జరిగితే ఎంతో ప్రాణ నష్టం, పర్యావరణ నష్టం వాటిల్లే అవకాశమున్నది.

ప్రపంచంలో జరిగిన అణు ప్రమాదాలు దీన్ని సూచిస్తూనే ఉన్నాయి. ప్రజల జీవించే హక్కును గౌరవించకుండా అభివృద్ధి పేరుతో చంద్రబాబు నాయుడు నిరంకుశంగా వ్యవహరిస్తుండడం చూడొచ్చు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సముద్ర తీర ప్రాంతంలో నిర్మించబోయే థర్మల్ పవర్ ప్లాంట్లను కొనసాగిస్తూ పర్యావరణ విధ్వంసానికి, వ్యవసాయ భూముల నాశనానికి, మత్స్యకారుల, లక్షలాది మంది ప్రజల జీవితాలను ప్రమాదంలో వేయడానికి పూనుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి జీవించే హక్కు పట్ల ఏమాత్రం గౌరవం ఉందో తెలిసిపోతున్నది. ప్రత్యామ్నాయ విద్యుత్ మార్గాల గురించి ఆలోచించకుండా, అటువైపుగా పరిశోధనలు సాగించకుండా బడా పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసం పనిచేయడం గతంలోనూ జరిగింది. నేడు అదే జరుగుతున్నది. ప్రభుత్వాలు మారినా విధానాలు మారడం లేదు.

కేంద్రంలో ఎన్నడూ లేనంత పూర్తి మెజారిటీతో నరేంద్రమోడీ ప్రధాన మంత్రిగా బిజెపి అధికారంలోకి వచ్చింది. దేశ వ్యాప్తంగా పరమత ద్వేషాన్ని, విద్వేషాలను రెచ్చగొడుతూ వస్తున్న ఆర్ఎస్ఎస్ భావజాలానికి అధికారం చేజిక్కింది. విద్యా రంగ కాషాయీకరణకు పూనుకుంటున్నారు. ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్‌ను తొలగించారు. వారికి అనుకూలమైన వ్యక్తి కోసం చూస్తున్నారు. గతంలో ఎన్‌డిఏ పాలనలో ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్‌గా వారి భావజాలానికి దగ్గరగా ఉన్న రాజ్‌పుత్‌ను నియమించారు. కేంద్రీయ విద్యాలయాల్లో జర్మని భాషను తొలగిస్తూ సంస్కృతంను రుద్దడానికి ఉత్తర్వులు జారీ చేశారు. దేశవాప్తంగా 700 కేంద్రీయ విద్యాలయాలున్నాయి. సంస్కృతం అన్ని భాషలకు తల్లివంటిదని చెపుతున్నారు. దీనికి శాస్త్రీయ ఆధారాలు ఏమిలేవు సంస్కృతం ఎన్నడూ ప్రజల భాషగా లేదు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టరీ రిసెర్చ్ (ఐసిఎచ్ఆర్) ఛైర్మెన్‌గా వై. సుదర్శనరావును నియమించారు. ఇతడు గతంలో అఖిల భారత ఇతిహాస్ సంకలన్ యోజన ఆంధ్రప్రదేశ్ చాప్టర్‌కు అధ్యక్షుడిగా పనిచేశాడు. ఈ సంస్థ 1978లో ఆర్ఎస్ఎస్ బుర్రలోంచి పుట్టింది. 1999-2004లో సాగిన ఎన్‌డిఏ పాలనలో ఐసిఎచ్ఆర్ సభ్యుడిగా పనిచేశాడు. ఇతడు కాకతీయ యూనివర్సిటీ వరంగల్‌లో చరిత్ర బోధించేవాడు. ఇతడు కులవ్యవస్థను కీర్తిస్తూ 2007లో రాశాడు. చరిత్రను వక్రీకరిస్తూ సంఘపరివార్ భావజాలానికి అనుకూలంగా అశాస్త్రీయమైన భావనలను చరిత్రగా చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తద్వారా లౌకిక విలువలకు, ప్రజాస్వామిక విలువలకు ప్రమాదం పొంచి ఉన్నది. హిందీ భాషను దక్షిణాది ప్రాంతాలపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా చాలా చోట్ల 'ఘర్‌వాపసి' పేరుతో ఇతరులను హిందూ మతంలోకి మార్పిడిలను నిర్వహిస్తున్నారు. దీన్ని నిరసిస్తే మతమార్పిడిలపై నిషేధం విధిస్తూ చట్టం చేయమని అంటున్నారు. గోవధను నిషేధించాలని, పశుమాంసం తినడం నీచమని సంఘ్‌పరివార్ శక్తులు ప్రచారం చేస్తున్నాయి. అలా ఆహారపు అలవాటును కించపరుస్తున్నారు. ఎవరిని ప్రేమించాలో, ఎలా ప్రేమించాలో కూడా ఈ శక్తులు చెపుతున్నాయి. ఫత్వాలు జారీ చేస్తున్నాయి. ఆదివాసులు, దళితులు, బిసిలు, మత మైనారిటీలను ప్రలోభపెట్టో, బెదిరించో, దౌర్జన్యం చేసో అఖండ హిందూ మత వ్యవస్థలోకి లాక్కొచ్చే ప్రయత్నాలు తీవ్రం చేయబోతున్నాయి.

గాంధీని చంపిన గాడ్సే దేశభక్తుడని బిజెపి పార్లమెంట్ సభ్యుడు సాక్షి మహరాజ్ ప్రకటిస్తాడు. బాబ్రీ మసీదు స్థానంలోనే రామాలయం నిర్మించాలని ఉత్తరప్రదేశ్ గవర్నర్ రామ్‌నాయక్ ప్రకటించాడు. ఇతడు బిజెపి మాజీ పార్లమెంట్ సభ్యుడు. ఇతన్ని బిజెపి జూలై 2014లో ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా నియమించింది. గవర్నర్ హోదాలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ సంఘ్‌పరివార్ భావజాలాన్ని అధికారికంగానే ప్రకటిస్తున్నాడు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కలకత్తాలో మాట్లాడుతూ హిందూరాజ్యం స్థాపించడమే తమ లక్ష్యమని ప్రకటించాడు. భారత్‌ను హిందూ రాజ్యంగా చూపే ప్రయత్నాలు తీవ్రం అవుతున్నాయి. వీటి నేపథ్యంలో సంఘ్‌పరివార్ శక్తులైన హిందూ వాహిని, ఎబివిపి, హిందూ జాగరన్ మంచ్, భజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్, తదితర దేశ వ్యాప్తంగా పనిచేస్తున్న సంస్థలు రెచ్చిపోవడానికి అనుకూల వాతావరణం దానికి అధికార యంత్రాంగం తోడవ్వడానికి నరేంద్రమోడీ ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేయబోతున్నది. హిందుత్వ, మత భావజాలాన్ని విస్తృత పరచడం దానికి అడ్డుగా నిలిచే అన్ని రకాల ప్రజాభిప్రాయాలను, ప్రజాస్వామిక ఉద్యమాలను, మైనారిటీ మత సంస్థలను, వ్యక్తులను అడ్డు తొలగించుకునే ప్రమాదకర ఎజెండాతో ముందుకు నడుస్తున్నారు. దీని ద్వారా ప్రజాస్వామిక హక్కులు కుదించుకుపోవడమే కాకుండా అవి దాడులకు గురయ్యే ప్రమాదకర సంకేతాలను పసికట్టవచ్చు.

బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చే హిందువులకు స్వాగతం పలికి వారికి సరైన వసతులు ఏర్పాటు చేయాలని మోడీ అంటాడు. మరోవైపు వలసలుగా ఉన్న ముస్లింలను తిరిగి బంగ్లాదేశ్‌కు పంపించేయాలని బిజెపి డిమాండ్ చేస్తున్నది. అంటే ఈ దేశం హిందువులదే, ఇది హిందూ దేశమనే సంకేతాలు పంపాలనుకుంటున్నారు. ఇది బహుళ జాతులు, భిన్న మతాలు, విభిన్న సంస్కృతులకు ప్రమాదకరం. ప్రజాస్వామిక హక్కులకు తీవ్ర విఘాతం కలిగిస్తుంది.

కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 2014 జూన్ 11న చత్తీస్‌గడ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌తో మాట్లాడుతూ పదివేల మంది పారా మిలిటరీ బలగాలను పంపిస్తానని చెప్పాడు. దీనికి అదనంగా రెండు వేల ఇంజనీరింగ్, సాంకేతిక రంగాల్లో బహుళ నైపుణ్యం కలిగిన సాయుధ దళాలను సిద్ధం చేశారు. ఇప్పటికే ఈ రాష్ట్రంలోని కేంద్ర సాయుధ బలగాల్లోని 37 బెటాలియన్లలో 29 బెటాలియన్లు బస్తర్ ప్రాంతంలో పనిచేస్తున్నాయి. సిఆర్‌పిఎఫ్, ఐటిబిపి, బిఎస్ఎఫ్, కోబ్రా, గ్రేహౌండ్స్, సి-60, థండర్‌బోల్ట్స్ వంటి వాటితో పాటుగా సల్వాజుడుం ఉండనే ఉన్నది. వీటికి అదనంగా ఈ పది బెటాలియన్లు వస్తున్నాయి. అలా బస్తర్ ప్రాంతంలో మొత్తం నలభై బెటాలియన్లు పనిచేస్తున్నాయి. దీని ద్వారా మోడీ ప్రభుత్వం గతంలో యుపిఎ-1, యుపిఎ-2 లకంటే దారుణమైన అణచివేతను ప్రయోగించ బోతున్నది.

2014 జూన్ 27న ఒడిశా, బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల పోలీసులు తదితర ఉన్నతాధికారులు ఎయిర్‌ఫోర్స్ అధికారులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని గ్రేహౌండ్స్ పనితీరును మెచ్చుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రేహౌండ్స్ పోలీసులు నక్సలైట్ ఉద్యమకారుల అణచివేతను, హత్యలను చేసిన దారుణమైన చరిత్రను కలిగి ఉన్నారు. ఈ రాష్ట్రాలలోని ప్రత్యేక పోలీసు బలగాలను పునర్నిర్మాణం చేయాలని వాటికి కావల్సిన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలని పేర్కొన్నాడు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బిహార్, చత్తీస్‌గడ్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో ఇప్పటికే 127 బెటాలియన్లు అంటే లక్షా ఇరవై ఏడు వేల మంది ప్రత్యేక సాయుధ బలగాలు పనిచేస్తున్నాయి.

రాజధాని భూమి సమస్య

***ఆంధ్రప్రదేశ్‌లో తలపెట్టిన రాజధాని నిర్మాణం రియల్ ఎస్టేట్ వ్యాపారానికి శ్రీకారం చుట్టిందనీ, ఈ జూదంలో సమిధలవుతున్నది పేద గ్రామీణ ప్రజలేననీ అంటున్నారు* ముప్పాళ్ల భార్గవ శ్రీ**

ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధానిగా ప్రకటించిన తుళ్లూరు ప్రాంతంలోని ప్రజలు తీవ్ర గందరగోళ పరిస్థితులలోకి నెట్టబడ్డారు. ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని అయోమయ స్థితిలో పూర్తిగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఉమ్మడిగా ఉన్న తెలుగు ప్రజలు రాష్ట్రం విడిపోవడమే బాధాకరంగా ఉంటే పులిమీద పుట్రలా నూతన రాజధాని ప్రాంత ప్రకటన ఈ ప్రాంత ప్రజలను భయకంపితులను చేస్తున్నది. రాష్ట్రం విడిపోవడం రెండు ప్రాంతాలలోని ప్రజలకు ఇష్టం లేకపోయినా పాలకపార్టీలు ప్రజల ఆకాంక్షల పేరుతో జూదం ఆడి తాము పదవులను, ఆధిపత్యాన్ని చెలాయించుకోవడానికి రాష్ట్రాన్ని నిరంకుశంగా నిట్టనిలువుగా చీల్చారు. ఈ విభజనవాదంలో రెండు కళ్ల సిద్ధాంతం పేరుతో పావులు కదిపిన చంద్రబాబు పార్టీ ముఖ్యంగా సీమాంధ్ర జిల్లాల్లో పూర్తి వ్యతిరేకతను మూటగట్టుకుంటున్న స్థితిలో కేంద్రంలోని సోనియా గాంధీ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం రాష్ట్ర విభజనకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సీమాంధ్రలో కాంగ్రెస్ పట్ల పెరిగిన తీవ్ర వ్యతిరేకత చంద్రబాబుకి వరంగా మారిపోయి అసలు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుస్తానో లేదో అన్న సంకట స్థితిలో ఉన్న చంద్రబాబు పార్టీ గెలుపును ఖాయం చేసుకోవడానికి బిజెపితో పొత్తుపెట్టుకోవడంతో పాటు రైతుల రుణమాఫీ అస్త్రాన్ని కూడా ప్రయోగించి అత్యధిక మెజారిటీతో గెలుపు గుర్రంగా నిలిచింది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ అభివృద్ధి జపం తోడై చంద్రబాబు వల్లనే రాష్ట్రం శరవేగంతో అభివృద్ధి అవుతుందన్న వాతావరణాన్ని సృష్టించుకొన్నారు. ఈ నేపథ్యంలోనే తమకు ఎదురులేదన్న స్థితిలో ఎవరిని సంప్రదించకుండా, అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా తుళ్లూరు ప్రాంతంలో నూతన రాజధానిని చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించింది. అప్పటినుంచి ఈ ప్రాంత ప్రజల్లో నిద్రలేని రాత్రులకు శ్రీకారం చుట్టింది.

కృష్ణానది తీరంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రపంచంలోనే అత్యద్భుతమైన రాజధానిని నిర్మించడం తమ లక్ష్యమని, ఇందుకు మొదటి దశలో 30 వేల ఎకరాలు, తరువాతి రెండు, మూడు దశల్లో లక్షకుపైగా ఎకరాలు సేకరిస్తామని చెప్పి, మొదటి దఫా తుళ్లూరు మండలంలో 9 గ్రామాలు, రెండవ దఫా మంగళగిరి మండలం కలిపి 19 గ్రామాలు, చివరగా తాడేపల్లి మండలంలోని గ్రామాలు కలిపి మొత్తం 29 గ్రామాలు ప్రకటించి మొదటి దశలోనే 30 వేల ఎకరాల

వీటికి అదనంగా మరో 27 బెటాలిన్లను దించడానికి సిద్ధపడుతున్నారు. ఈ ప్రాంతంలో ఉద్యమాలను అణచివేయడంలో భాగంగా సమాచార సంబంధాల విస్తృతి కొరకు మొబైల్ ఫోన్‌ల పరిధిని 2,200 ప్రాంతాలకు విస్తరింపచేయడానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వారు పిలుచుకునే వామపక్ష తీవ్రవాద ప్రాంతాలలో ఇప్పటికే బిఎస్ఎన్ఎల్ వందలాది టవర్లను ఏర్పాటు చేసింది. దీనికొరకు మూడు వేల ఆరు వందల కోట్లు ఖర్చు అవుతుంది. దేశంలోని బడా కార్పొరేట్ కంపెనీలు, బహుళజాతి కంపెనీలు, టాటా, బిర్లా, అంబాని, ఆదాని, మిట్టల్ వంటి వాటికి అండగా నిలిచిన గత ప్రభుత్వాల విధానాలను మరింతగా ముందుకు తీసుకెలుతున్నది మోడీ ప్రభుత్వం. ప్రకృతి సంపదను దోచుకుంటూ, పర్యావరణానికి, అక్కడి ఆదివాసుల జీవితాలను విచ్ఛిన్నం చేస్తున్న ఈ కంపెనీలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ప్రజలపై తీవ్రమైన సాయుధ అణచివేతను ఓ రకంగా యుద్ధమే చేస్తున్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రికార్డు స్థాయిలో అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ 175 ప్రాజెక్టులకు అలాగే జాతీయ వన్యప్రాణి సంరక్షణ బోర్డుచేత క్లియరెన్స్‌ల కోసం ఎదురు చూస్తున్న 160 ప్రాజెక్టులలో 133 ప్రాజెక్టులకు క్లియరెన్స్‌లు ఇచ్చేశారు. వీటికోసం అటవీ, పర్యావరణ, వన్యమృగ సంరక్షణ, ఆదివాసి షెడ్యుల్ ప్రాంతాల చట్టాలను ఉల్లంఘిస్తూ బడాకంపెనీలకు దాసోహం అంటున్నారు.

అటవీ ప్రాంతంలో ఉన్న సహజ వనరులు, ఖనిజ సంపదను ఎంఎన్‌సిలకు అప్పగించేందుకు క్షేత్రస్థాయిలో రోడ్ క్లియర్ చేయడానికి రాజ్‌నాథ్‌సింగ్ ఆయా రాష్ట్రాల్లోకి అదనపు సాయుధ బలగాలను పంపిస్తున్నాడు. అలాగే వాటికి ప్రత్యేక శిక్షణలు ఇస్తున్నారు. యుపిఎ-1, యుపిఎ-2ల విధానాలను మరింత ముందుకు తీసుకుపోతూ గ్రామ సభల అనుమతి లేకుండానే అనుమతులిచ్చేలా చట్టాలను సరళతరం చేస్తున్నది మోడీ ప్రభుత్వం. రాజ్‌నాథ్‌సింగ్ ఒకచోట మాట్లాడుతూ తాను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోలీసులకు మానవ హక్కుల కమిషన్ నుండి ఏ ఇబ్బందులు రాకుండా చూసుకుంటానని చెప్పానని గుర్తు చేసుకున్నాడు. దీనర్థం ఆయా రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎలాంటి ఇబ్బందులు రాకుండా భరోసా ఇవ్వమని చెప్పడమే కదా! అసలు దేశంలో, రాష్ట్రాలలో మానవ హక్కుల కమిషన్‌లు ఏం పనిచేస్తున్నాయని, వాటి ప్రభావం ఏమిటనేది వేరే విషయం అనుకోండి. మోడీ - రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమాలపై, ఉద్యమించే ప్రజలపై అణచివేతలను, నిర్బంధాలను మరింత తీవ్రంగా కొనసాగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫలితంగా దేశంలో పౌర, ప్రజాస్వామిక హక్కులను హరించి వేసే ప్రక్రియ వేగవంతంగా అమలు చేయబడుతున్నది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

నుంచి 53 వేల ఎకరాలకు విస్తీర్ణాన్ని పెంచేశారు.

చంద్రబాబు ప్రభుత్వం నూతన రాజధానిని ఏకపక్షంగా ప్రకటించడంలో మొదటగా ఉత్పన్నమయ్యే సమస్య భూమి సమస్య. అంటే నూతన రాజధాని నిర్మాణానికి పచ్చని పంట పొలాలనే తీసుకోవాలా! విజయవాడ – గుంటూరు మధ్య వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉండగా పచ్చని పంట పొలాలనే ఎందుకు తీసుకోవాలనే ప్రశ్నలు సహజంగా ఎవరికైనా ఉదయిస్తాయి. 2013 భూసేకరణ చట్టం ప్రకారం కానీ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కానీ, ప్రత్యేక ఆర్థిక మండళ్లకు వ్యవసాయ భూములు తీసుకోరాదన్న చట్టపర నిబంధనలున్నా రాష్ట్ర ప్రభుత్వం పంట భూములనే తీసుకోవాలని నిర్ణయించడం రైతాంగ వ్యతిరేక చర్య కిందకు వస్తుంది. అంతకంటే మానవహక్కుల ఉల్లంఘన కిందకు వస్తుంది.

ఇప్పుడు రాజధాని కోసం ప్రకటించిన 29 గ్రామాల్లో కనీసం 10 గ్రామాలు 365 రోజులు దాదాపు 120 పంటలు (పూలతోటలు, కూరగాయలు, అరటి, నిమ్మతోటలు మొ?) పండిస్తాయి. ఈ గ్రామాలన్నీ కృష్ణానది కరకట్ట పక్కనే 10 అడుగులలోపే నీళ్లు పడే పొలాలను కలిగిఉన్నాయి. ఈ పొలాలనే ఈ ప్రాంతంలో జరీబు భూములంటారు. కావున జరీబు భూములున్న గ్రామాల రైతులు రాజధాని ప్రాంత నిర్ణయం ప్రకటించినప్పటి నుంచి తమ భూములను రాజధాని నిర్మాణం కోసం ఎటువంటి పరిస్థితులలో ఇవ్వబోమని పంచాయితీలలో ఏకగ్రీవ తీర్మాణాలు చేయటంతో పాటు అధికార పార్టీ మంత్రులు, ఎంఎల్ఎలతో ఏర్పాటు చేసిన రాజధాని నిర్మాణ కమిటీల ముందు కూడా తీర్మాణాలు చేసి ఇచ్చారు. తమ భూములకు ఎప్పటి నుంచో ఎకరా రు.2 నుండి 4 కోట్ల వరకు ధర ఉందని, వేలాది మంది వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించటమే కాక చుట్టు ప్రక్కల 3–4 జిల్లాలకు వివిధ రకాల ఆహారాన్ని అందిస్తుందని, కావున మా భూములను ఎటువంటి పరిస్థితుల్లో ఇచ్చేదిలేదని సభాముఖంగా తీర్మాణాలు చేసి ఇచ్చారు.

రెండవ సమస్య, తుళ్లూరు ప్రాంతంలోని భూములు మెట్టభూములు కావడం, సరిగా పంటలు పండకపోవడం, మరో వైపు కొండవీడు వాగు వలన ముంపుబారిన పడుతూ ఉండడం వలన ఈ పాంతంలో రాజధాని ప్రకటన వలన ఎకరా రు.10–15 లక్షలు ఉన్న ధర ఒక్కసారిగా కోటిన్నరకు పెరిగిపోవడంతో ఈ ప్రాంత రైతులు మాత్రం సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సరైన సాగునీటి సౌకర్యాలు లేక, వాగుల ముంపు నివారణ చర్యలు తీసుకోనందున రైతులు ఈ పరిస్థితిలోకి నెట్టబడ్డారు. సరిగ్గా ఈ పరిస్థితిని పాలకులు సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారు. అంతకు ముందు వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు ఇప్పుడు తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయరంగాన్ని లాభసాటి చేస్తానని చెపుతూ ఆచరణలో వ్యవసాయం దండగ అనే పాలసీనే అనుసరిస్తున్నారనడానికి ఈ ఉదాహరణ చాలు. ఇప్పుడు ఒక రాజధాని ప్రాంతంలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ రంగం నానాటికి సంక్షోభంలో కూరుకుపోయే విధానాలనే కేంద్ర, రాష్ట్ర పాలకులు అనుసరిస్తూ అంతిమంగా కాంట్రాక్టు – కార్పొరేట్ శక్తులకు భూములను కట్టబెట్టే విధానాలను అనుసరిస్తున్నారు.

నూతన రాజధానికి కావలసిన భూమిని చంద్రబాబు ప్రభుత్వం భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్) విధానం ద్వారానే సేకరిస్తానని, ఈ విధానం రైతులకు ఎంతో మేలుచేస్తుందని, భూసమీకరణకు సహకరించకపోతే భూసేకరణ చట్టం ద్వారా భూమి సేకరిస్తానని రైతులను బెదిరించి లొంగదీసుకునే విధంగా వ్యవహరిస్తున్నది. భూ సమీకరణ విధానానికి ఎటువంటి చట్టబద్ధతలేదని చంద్రబాబుతో సహా అందరికీ తెలిసిన విషయమే. అయితే చంద్రబాబు ప్రభుత్వం రాజధానికి కావలసిన భూముల కోసం ఒక్క రూపాయి ఖర్చుపెట్టకుండా రైతుల భూములతోనే పక్కా రియల్ఎస్టేట్ వ్యాపారం చేయడానికి ఈ విధానాన్ని ఎంచుకున్నది. నూతన రాజధాని నిర్మాణానికి కావలసిన అసెంబ్లీ, కార్యనిర్వాహక భవనాలకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం నిధులను అందిస్తుంది కాబట్టి నంబర్ వన్ రాజధాని నిర్మాణం పేరుతో ఒక్క రూపాయి పెట్టుబడి లేని భూసమీకరణ విధానాన్ని తెలివిగా ఎంచుకుంది. అంటే పక్కా రియల్ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపింది.

ఈ విధానం ద్వారా భూములను కాజేయడానికి రైతులను ఏసి రూముల్లో కూర్చొబెడతానని, ఎంతకాలం మట్టిపిసుక్కుంటూ కూర్చుంటారని, వ్యాపారవేత్తలు – పరిశ్రమాధిపతులుగా తయారు చేస్తానని రైతులకు చిటికెల పందిళ్లు వేసి ఆశలు కల్పిస్తున్నారు. భూములిచ్చే రైతులకు అంతకు ముందు రకరకాల ప్యాకేజీలు ప్రకటించి రైతుల నుండి వస్తున్న డిమాండ్లను పరిగణలోకి తీసుకొని రైతులను ఏ విధంగానైనా తన దారిలోకి తెచ్చుకోవడానికి చివరికి డిసెంబర్ 9న ముఖ్యమంత్రి రైతులు 'పండుగ' చేసుకునే విధంగా ప్యాకేజిని ప్రకటించారు. ఆ ప్యాకేజీ ప్రకారం మెట్ట భూమికి ఎకరాకు వెయ్యి గజాలు చొప్పున నివాస స్థలం, వాణిజ్య స్థలంలో 200 గజాల ప్లాటు' జరీబు భూములకు నివాస స్థలం వెయ్యి గజాలు, 300 గజాలు వాణిజ్య ప్లాటు అసైన్డ్ భూములకు నివాస స్థలం 800 గజాలు, వాణిజ్య ప్లాటు 200 గజాలు పదేళ్ల పాటు ఏటా చెల్లించే పరిహారం మెట్ట భూములకు ఎకరాకు రు.30 వేలు, జరీబు భూములకు రు.50 వేలు, ఈ మొత్తంపై ప్రతి ఏడు పది శాతం పెంచి ఇస్తామని, రైతులకిచ్చే భూమిపై తొమ్మిది నెలల్లో యాజమాన్య హక్కులు కల్పించి, మూడేళ్లల్లో అభివృద్ధి చేసిన స్థలాలు అప్పగించడం వ్యవసాయ కూలీలకు 365 రోజుల పాటు ఉపాధి హామీ పథకం అమలు, వారి కుటుంబాలకు నెలకు రు.2500 పదేళ్లపాటు చెల్లించడం, భూసమీకరణ ప్రాంతంలో రైతులు, కౌలు దారులందరికి రు.200 కోట్లు రుణమాఫీ చేస్తామని, ఇంకా చిన్నా చితక హామీల 'వరాలు' ముఖ్యమంత్రి ప్రకటించారు.

రైతుల రుణమాఫీ విషయంలో ఎన్నికల ముందు వాగ్దానాల వర్షం, ఎన్నికల్లో గెలిచిన తరువాత ఏరుదాటాక తెప్పతగలేసినట్లు వ్యవహరిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం నూతన రాజధాని కోసం భూసమీకరణపై రైతులకు ప్రకటించిన 'అందరికీ ప్రతిఫలం' ప్యాకేజి ఏమేరకు అమలవుతుందన్న ప్రశ్న రైతులను వేధిస్తున్నది. 2007లో ప్రారంభించిన జక్కంపూడి – గొల్లపూడి ప్రాజెక్టు అమలు దీనికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుంది. జెఎన్ఎన్‌యుఆర్ఎం పథకంలో భాగంగా జీప్లస్‌త్రీ ఇళ్ల నిర్మాణం కోసం రైతులకు 60 శాతం, ప్రభుత్వానికి 40 శాతం గా 226.54 ఎకరాల్లో రైతులకు 129.90 ఎకరాలు, ప్రభుత్వానికి 96.55 ఎకరాలు పంచేటట్లు రైతులకు వచ్చే భూమిలో ఎకరాకు 1850 గజాలు ఇచ్చి 12 నెలల్లో నివాసయోగ్య ప్లాట్లను, సంవత్సరంలోపు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ఇవ్వాలని అగ్రిమెంట్ రాసుకొన్నారు. కానీ నూతన

రాజధాని ప్రకటించేవరకు అంటే 8 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ప్రాథమిక పనులు కూడా పూర్తిచేయలేదు. నూతన రాజధానిని ప్రకటించిన తరువాత ఆగమేఘాల మీద రైతుల ప్లాట్లను విడగొట్టారు. కాని ఈనాటికి రిజిస్ట్రేషన్ పనులు పూర్తికాలేదు. జక్కంపూడి పథకం పెండింగ్‌లో ఉంటే నూతన రాజధాని ప్యాకేజీపై నెగిటివ్ ప్రభావం పడకుండా చూసుకోవడం కోసం ప్రభుత్వం ఈ తతంగానికి ఒడిగట్టింది. కాబట్టి నూతన రాజధాని కోసం రైతులకు ప్రకటించిన ప్యాకేజీ అమలు ఎంత సుందర ముదనష్టంగా ఉండబోతుందో తేలిగ్గా ఊహించుకోవచ్చు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు మొదలుకొని పులిచింతల ప్రాజెక్టు వరకు నేటికి బాధితులకు పునరావాస సౌకర్యాలు కల్పించలేదన్న వాస్తవం కళ్లముందు కనిపిస్తున్నది.

చంద్రబాబు ప్రభుత్వం రైతులు భూసమీకరణకు సహకరించకపోతే భూసేకరణ చట్టాన్ని ప్రయోగించి లాక్కొంటానని, భూసేకరణ వలన రైతులే నష్టపోతారన్న భయాల్ని కల్పించడానికి పూనుకుంది. బ్రిటిష్ కాలం నాటి 1894 భూసేకరణ చట్టంలో ఉన్న లోపాలను సవరించడానికి ప్రతిపక్ష, వామపక్ష పార్టీలు, పౌరహక్కుల సంఘాలు దశాబ్దాల తరబడి సాగించిన పోరాటం ఫలితంగా కొంత మెరుగైన చట్టం 2013లో రుపుదిద్దుకుంది. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని నీరు గార్చడానికి ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. అయితే భూసేకరణ చట్టం వలన భూములకు ధర ప్రభుత్వ రికార్డులలో ధర కంటే 3, 4 రెట్లు వస్తుందని, ఇది రైతులకు చాలా నష్టం అన్న వాదనను రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తూ వాస్తవాలను వక్రీకరించ పూనుకుంటున్నది. అనేక ప్రాజెక్టుల అమలు సందర్భంగా బాధిత రైతులు ఆందోళనలు చేసి భూములకు ప్రస్తుతం ఉన్న మార్కెట్ రేట్లను సాధించుకున్న ఉదాహరణలు మన ముందున్నాయి.

భూసేకరణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం బూచిగా చూపించడానికి ముఖ్య కారణం భూసేకరణ ప్రాంతంలో వ్యవసాయంపై ఆధారపడి ఉన్న వేలాది వ్యవసాయ కూలీలు, వివిధ చేతివృత్తుల వారికి మెరుగైన ప్యాకేజీని ఇవ్వాల్సి వస్తుందని మాత్రమే. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు తాజాగా ప్రకటించిన ప్యాకేజీలో భూమిలేని 12 వేల వ్యవసాయ కూలీల కుటుంబాలకు నెలకు రు.2500 పదేళ్లపాటు చెల్లించేటట్లు, 365 రోజులు ఉపాధి హామీ పథకం అమల్లో ఉంటుందని ప్రకటించారు. ఇందులో వ్యవసాయకూలీ కుటుంబానికి నెలకు రు.2500 ప్రకటించడం అంటే బిక్షం వేయడం కిందే లెక్క. రాజధాని ప్రాంత భూముల్లో వ్యవసాయ కూలీలు రోజుకి రు.300 నుండి 500 వరకు కూలీ రేట్లు పొందుతూ ఉంటే ప్రభుత్వం నెలకు కుటుంబానికి ఇచ్చే మొత్తం ఏ మూలకు వస్తుంది. మరో వైపు ఉపాధి హామీ పథకం అమలులో జరుగుతున్న అక్రమాల చిట్టా నానాటికి పెరుగుతున్న నేపథ్యంలో, అసలు పథకాన్నే కుదించే ప్రయత్నాలు చేస్తున్న స్థితిలో ఉపాధి పథకం ఎంత వరకు హామీగా ఉంటుందో చెప్పలేని స్థితి. అంటే ఆచరణలో ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీలతో వేలాదిగా ఉన్న వ్యవసాయ కూలీల జీవితాలు అంధకార బంధురం అవుతాయి. వ్యవసాయ కూలీల్లో కౌలురైతులుగా ఉన్నవారి పరిస్థితి కడుదుర్భరంగా తయారవుతుంది. వీరితోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కమ్మరి, కుమ్మరి, మంగలి, చేనేత, గీత తదితర చేతువృత్తుల వారి జీవితాలు మరింత సంక్షోభంలోకి నెట్టబడతాయి. ప్యాకేజి ప్రకటించిన పేదలకు నైపుణ్య శిక్షణ ఆచరణలో ప్రచారం చేసుకోవడానికే ప్రభుత్వానికి ఉపయోగపడుతుంది తప్ప పేదలకు దూరపు కొండలు నునుపు చందంగా మారిపోతుంది. ప్రభుత్వ ప్యాకేజీ వలన వ్యవసాయ రంగం బతకడానికి ప్రధాన శక్తులైన దళిత, బలహీన, మైనారిటీ ప్రజలు అనాథలుగా రాజధాని ప్రాంతం నుండి దూరంగా విసిరివేయబడతారు. ఆ విధంగా వారి సామాజిక, సాంస్కృతిక జీవనం విచ్ఛిన్నం చేయబడుతుంది.

చంద్రబాబు ప్రభుత్వం భూసమీకరణ విధానం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అదే పనిగా ప్రచారం చేస్తున్నది. చండీఘడ్ రాజధాని నిర్మాణానికి అధికారిగా విధులు నిర్వహించిన విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎంజి దేవసహాయం రాజధాని ప్రాంత గ్రామాలను సందర్శించి వచ్చిన తరువాత డిసెంబర్ 8న, విజయవాడలో జరిపిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ, భూసమీకరణ చిన్న ప్రాజెక్టులకు చేయవచ్చుకానీ రాజధాని నిర్మాణం లాంటి బడా ప్రాజెక్టులకు చేయడం సరికాదని, ఇలాంటిది దేశంలో ఎక్కడా జరగలేదని కూడా స్పష్టం చేశారు. పైకి చెప్పేది ఒకటి అసలు అంతరంగం వేరు అనడానికి భూసమీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే నిదర్శనంగా నిలుస్తాయి. రాజధాని నిర్మాణానికి ఎక్కువలో ఎక్కువ 5000 ఎకరాలు చాలని నిపుణులు చెపుతూ ఉంటే 30 వేల నుండి లక్ష ఎకరాల వరకు భూసమీకరణకు ఎందుకు పూనుకుంటున్నట్లు! రాజధాని భవనాలతో పాటు స్టార్ హోటళ్లు, పబ్బులు, బార్లు, పర్యాటక ప్రాంతాలు, కార్పొరేట్ హాస్పిటళ్లు నిర్మించడానికి కావలిసిన భూమిని ప్రపంచంలోనే గొప్ప రాజధాని పేరుతో దేశీయ, విదేశీ బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేయడం కోసం సేకరిస్తున్నారన్నది స్పష్టం. అలానే ఈ అధునాతన భవన సముదాయాల నిర్మాణాలకు వేలాది ఎకరాలను పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం పేరుతో దేశీయ, విదేశీ బడా కాంట్రాక్టర్లకు అప్పజెప్ప బోతున్నారు. గొప్ప రాజధాని నిర్మాణం కోసం ముఖ్యమంత్రి సింగపూర్, జపాన్ దేశాలు పర్యటించి అనేక ఒప్పందాలు కూడా చేసుకొని వచ్చారు. చివరకు నూతన రాజధాని మాస్టర్ ప్లానును కూడా తయారు చేసే బాధ్యతను సింగపూర్ కంపెనీలకు అప్పజెప్పే విధంగా ముఖ్యమంత్రి విదేశీ మోజుతో ఉంటే, రేపు రాజధాని నిర్మాణంలో ఎన్ని విదేశీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకోబోతున్నారో వేరే చెప్పనవసరం లేదు.

రాజధాని నిర్మాణం పేరుతో చంద్రబాబు ప్రభుత్వం రైతులను దగా చేయడానికి పథకాలను, ప్యాకేజీలను రుపొందిస్తున్నది. మొదటి దశలో ప్రకటించిన భూసమీకరణ పథకంలో 41,750 ఎకరాల్లో రూపాయి పెట్టుబడి లేకుండా స్థిరాస్తి వ్యాపారానికి ప్రణాళికలు రూపొందించి 13,836 ఎకరాలను ప్రభుత్వం సొంతం చేసుకోబోతుంది. టౌన్‌ప్లానింగ్ నిబంధనల మేరకు మొత్తం భూమిలో 40శాతం డెవలప్‌మెంట్‌కి తీసివేయగా మిగిలిన 60 శాతం లో 30 శాతం డెవలప్ చేసిన వారికి దక్కడం అంటే సింగపూర్, జపాను కంపెనీలకు ధారాదత్తం చేయడమే. అంటే వీటి ముసుగులో పెద్దపెద్ద కార్పొరేట్ దిగ్గజాలు నూతన రాజధానిలో రాజ్యమేలుతాయి. అసలు భూములిచ్చిన రైతులను నివాసయోగ్యస్థలం పేరుతో ఏ మారుమూల ప్రాంతానికో నెట్టేస్తారు. డబ్బు ఒకరిది సోకు ఒకరిది అన్నట్టుగా రాజధాని నిర్మాణంలో రైతుల భాగస్వామ్యం జరగబోతూ ఉంది.

తుళ్లూరు ప్రాంతంలో నూతన రాజధానిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి రియల్ ఎస్టేట్ దందాకు తెరలేపింది. ఈ ప్రాంతంలో అంతకు ముందు ఎకరం రు.15-20 లక్షలుగా ఉన్న భూమి ధర కోటిన్నరకు పైగా ఒక్కసారిగా పెరిగిపోవడంతో రైతులపై తీవ్ర ఒత్తిడి పెరిగిపోయింది. ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీ పట్ల పూర్తిగా నమ్మకం లేక ఎక్కువ మంది రైతులు పూర్తి సందిగ్ధంలో మునిగిపోయారు. రియల్ వ్యాపారుల ఒత్తిడితో భూమి అమ్మకానికి సిద్ధపడడం, రిజిస్ట్రేషన్ పూర్తి చేయించుకునే వరకు వివిధ రకాల ఒత్తిడులను రైతులు ఎదుర్కోవలసి వస్తున్నది. ఇంతరేటు పెట్టి భూములను కొంటున్నది ఈ ప్రాంత రైతులు కాదు, పూర్తిగా బడా రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పాటు ఎన్ఆర్ఐలు, ఎంఎల్ఎ – ఎంపి – మంత్రుల అనుచరగణం వందల కొద్ది ఎకరాలను రైతులను తిమ్మినబమ్మిన చేసి కొంటునే ఉన్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతంలోని పేద, మధ్యతరగతి రైతాంగం తమ భూములను అమ్ముకొని దూర ప్రాంతాలలోని ఇళ్ల స్థలాలు, భూములను కొనుగోలు చేస్తున్నారు. దీని ఫలితంగా దూర ప్రాంతాలలోని భూములకు కూడా రెక్కలు వచ్చాయి. ఆ విధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ఫలితంగా మనీ స్పెక్యులేషన్ పెరిగిపోయింది. మరో వైపు రెవెన్యూ డిపార్టుమెంట్ అధికారులు ఇప్పుదేర్పడిన పరిస్థితిని ఆసరా చేసుకొని విపరీతంగా డబ్బులు దండుకోవడమే కాక రైతులపై దందా కూడా సాగిస్తున్నారు.

మరోవైపు జరీబు భూములున్న రైతుల పరిస్థితి మరింత సంకటంగా మారిపోయింది. రాజధాని ప్రకటించక ముందు ఎకరం ధర రు.2 నుంచి 4 కోట్లు ఉంటే, ఈ భూములు ఇవ్వకుంటే గ్రీన్ బెల్ట్ కింద ప్రకటిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపును ఆసరా చేసుకొని రియల్ ఎస్టేట్ మాఫియా ఈ భూముల రేట్లను ఎకరం రు.కోటిన్నరకు తగ్గించేశాయి. ఇటువంటి ఒత్తిడిని జరీబు భూముల గ్రామాల రైతాంగం ఎదుర్కొంటున్నప్పటికీ, తమకు ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీలు అవసరం లేదనే కట్టుబాటుతోనే వ్యవహరిస్తున్నారు.

రాజధాని నిర్మాణానికి ఇన్ని వేల ఎకరాల పంటభూములు అవసరం లేదని, ఈ విధానం వలన ఆహార కొరత పెరుగుతుందనీ, రాజధానికి కావలసిన భూమిని గుంటూరు – విజయవాడ మధ్యలో గల ప్రభుత్వ భూముల్లో నిర్మించవచ్చని, చట్టబద్ధతలేని, రైతుల భూములతో వ్యాపారం చేసే భూసమీకరణ విధానం రైతులకు శాపంలాంటిదని, బడా రియల్ ఎస్టేట్, బహుళజాతి కంపెనీలకు వరంలాంటిదని, 2013 భూసేకరణ చట్టంలో ఇంకా ఉన్న లోపాలను సరిదిద్ది రైతులతోపాటు వ్యవసాయంపై ఆధారపడి ఉన్న వ్యవసాయ కూలీలు, కౌలురైతులు, వివిధ చేతివృత్తుల వారి మౌలిక అవసరాలను తీర్చేవిధంగా మార్పులు తీసుకురావాలని, రాజధాని మాస్టర్‌ప్లాన్ మొదలుకొని భవనాల డిజైన్, నిర్మాణ బాధ్యతలన్నిటినీ మన దేశీయ సాంకేతిక నిపుణులచేతనే చేయించాలని, సింగపూర్, జపాన్‌లాంటి విదేశీ కంపెనీలతో ఒప్పందాలు నష్టాలు కలిగిస్తాయని, రాజధాని నిర్మాణంలో కాలుష్య నియంత్రణ వ్యవస్థ పటిష్ఠంగా ఉండాలన్న ముఖ్యమైన సూచనలతో నూతన రాజధాని నిర్మాణం ప్రాంతంలోని రైతుల్లో సరైన అవగాహన కలిగించేలా వివిధ వామపక్ష, విప్లవ పార్టీల, రైతుకూలీ ప్రజాసంఘాల మద్దతు నానాటికీ పెరుగుతున్నది. వ్యవసాయ రంగంలో అనుభవం కలిగిన వడ్డే శోభనాద్రీశ్వరరావు, యలమంచిలి శివాజీ లాంటి వాళ్లు, చండీఘడ్ రాజధాని నిర్మాణ బాధ్యతలు చూసిన దేవసహాయం లాంటి ఉన్నత అధికారులు, పౌరహక్కుల సంఘాలు నియమించిన నిజనిర్ధారణ కమిటీల ద్వారా అందిస్తున్న మద్దతు రైతుల్లో ఆత్మస్థైర్యాన్ని, కట్టుబాటును పెంచేవిధంగా ఉన్నాయి.

మరోవైపు భూసేకరణ ఆపాలంటూ దాఖలైన పిటిషన్లపై జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ, గుంటూరు కలెక్టర్ తదితర అధికారులకు నోటీసులు జారీ చేయడంతో రైతులకు అండగా న్యాయ పోరాటం కూడా ప్రారంభమైంది. సమస్యల సుడిగుండం నుంచి రైతులు బయటపడడానికి ప్రజాస్వామ్య శక్తుల నుండి నిరంతర ఉద్యమ మద్దతు కొనసాగడం నేడు అత్యవసరం.

కేంద్రంలో అభివృద్ధి జపంతో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు ప్రభుత్వం అన్ని రంగాలను ప్రైవేటీకరణ బాటలో నడిపించడానికి, మోడీ బాటలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు గేట్లు బార్లా తెరచే విధానాల అమలులో భాగంగానే నెంబర్ వన్ రాజధాని నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతున్నది. గతంలోనే ప్రపంచబ్యాంకుకు సిఇఒనని గర్వంగా చెప్పుకొన్న చంద్రబాబు ఇప్పుడు రెట్టించిన ఉత్సాహంతో ప్రపంచ బ్యాంకు విధానాల అమలుకు పూనుకుంటున్నారు. గతంలో ఏ విధంగా అయితే విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు వేయడానికి పూనుకున్నారో ఇప్పుడు నూతన రాజధాని నిర్మాణం పేరుతో రైతుల్ని భూముల నుండి గెంటివేయడంతో పాటు ప్రజలపై వివిధ రకాల యూజర్‌చార్జీల పేరుతో మరిన్ని భారాలు వేయడానికి పథకాలు తయారు చేస్తున్నారు. ఈ ప్రజా వ్యతిరేక పథకాలను ఓడించడానికి గత పోరాట అనుభవాల వెలుగులో సమైక్య ప్రజా ఉద్యమాలు సాగించాల్సిన అవసరం నేడు మరెంతగానో ఉంది.

(రచయిత సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్రకమిటీ సభ్యులు) వీ

రాబోయే సంచికలలో...

- **హిజ్రా సమస్య - రంగనాయకమ్మ**
- **గ్రంథాలయ ప్రచార సమితి కరపత్రం**
- **నరహంతకులే నేతలై దిగాలు పడుతున్న దేశం - డా. నూకతోటి రవికుమార్**
- **కాశ్మీర్ దైన్యస్థితికి 370 అధికరణనే కారణమా? - డా. జి. లచ్చయ్య**

రాజధానికి పేదరైతుల భూములా?

***నూతన రాజధాని నిర్మాణం కోసం చట్టబద్ధతలేని భూసమీకరణతో గ్రామీణ పేద రైతుల జీవితాలతో చంద్రబాబు ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని అంటున్నారు* వై.ఎచ్.కె. మోహన్‌రావు**

తెర తొలగించుకుని లోపలి చంద్రబాబు నాయుడు వెలుపలికి వచ్చాడు. ఆయన అసలు రూపం ఆవిష్కరించుకుంటున్నాడు. 2004కు ముందు అప్పటి ముఖ్యమంత్రిగా బయటపెట్టుకున్న నియంత నైజాన్ని తిరిగి ప్రదర్శిస్తున్నాడు. రాష్ట్ర ప్రజల అభిమతానికి, వారి సాధారణ జీవనానికి వ్యతిరేకంగా ఒక అణచివేత దిశగా పాలన సాగించాలను కుంటున్నాడు. కమిషన్లు, కమిటీలు ఇచ్చే నివేదికలు, చేసే సూచనలు తనకు కొరగానివని తోసి వేస్తున్నాడు. అవశేష ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నిర్మాణ విషయంలో భూముల సేకరణ ఆ ప్రాంత రైతులకు రాక్షస క్రీడగా పరిణమించింది. భూమిపుత్రుల జీవితాలతో, వారి భవిష్యత్తుతో చంద్రబాబు వికృత వినాశన క్రీడ ప్రారంభించాడు. రైతుకు నేలతో ఉన్న బంధం రియల్ ఎస్టేట్ బంధం కాదు. లాభనష్టాల బంధం అంతకన్నా కాదు. అదో విడదీయలేని శాశ్వత బంధం. ప్రాణాను బంధం. భూమి పుట్టుక నుండీ వ్యవసాయదారునికి దానితో ఉన్న అనుబంధాన్ని వీడదీసి చూడలేం. మృత్యువులో కూడా రైతు మట్టి మంత్రాన్నే స్మరిస్తాడు. భూమే రైతులకు జననం, జీవనం, మరణం అన్న విషయం విస్మరించ దగినది కాదు. కరువు వచ్చినా, కాటకం వచ్చినా, వరదలొచ్చినా, విపత్తులొచ్చి సాగిలపడినా వ్యవసాయాన్ని వదలడం రైతుకు చేతకానిపని. రాజకీయ బిక్ష పెట్టిన పార్టీని రాజకీయ నాయకులు వదిలినంత సులువు కాదు. తనకూ, ప్రపంచానికి పట్టెడన్నం పెట్టే భూమిని, వ్యవసాయాన్ని రైతు విడిచి పెట్టడం రైతుకు తన సంతానం కన్నా భూమినే అమితంగా ప్రేమించే తత్వముంటుంది. అందుకే పిల్లలు పట్నాలలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ ఉంటే రైతులు తాము ప్రేమించే భూమిని, పల్లెను అంటిపెట్టుకుని అక్కడే కాలం వెళ్లదీస్తారు. ఈ నేపథ్యమే పెనవేసుకు పోయిన రైతు – భూమి ఆత్మీయానురాగాలను వెల్లడి చేస్తాయి.

రాజధానికి తమ ప్రాణ ప్రదమైన భూములు ఇవ్వడానికి వ్యతిరేకిస్తూ రైతాంగం గగ్గోలు పెడుతూ నల్ల జెండాల ప్రదర్శనలతో ఆందోళనను ఆకాశం వరకూ తీసుకుపోయింది. ఇందుకు ప్రతిగా నిస్సారమైన భూములు గల కొద్ది మంది యజమానులను, వర్షాధారంతో ఒక్క పంటకే పరిమితమైన ఒకటి, అరగ్రామాల రైతులను మీడియా ముందుకు తెచ్చి భూములివ్వడం తమకు అంగీకారమేనంటూ చెప్పించి మిగతా రాష్ట్ర ప్రజలను నమ్మించే తాజా నయవంచక కుట్రకు చంద్రబాబు నాయుడు అయన అనుంగు దేశం అనుసర వర్గాలు నాటకీయతను జోడించి రక్తి కట్టిస్తున్నాయి. పూలింగ్‌కు రైతులు అంగీకరించకపోతే చట్టాన్ని ప్రయోగించి బలవంతంగా లాక్కుంటానని తెగేసి చెపుతున్నాడు. ఇటువంటి బెదిరింపు ప్రకటనలతో రైతులను భయభ్రాంతులకు గురిచేసి తన దోవకు తెచ్చుకోవాలనే పథకంలో ఉన్నాడు. రైతాంగానికి ఇష్టం కాకుండా వారి భూములను స్వాధీన పరుచుకునే విధ్వంసపు దారుల వెంట చంద్రబాబు నాయుడు పరుగులు పెడుతున్నాడు. రైతుల కంట కన్నీరు కాదు రక్తాశ్రువులను దర్శించాలనే విషాద వినోదం కోసం తపిస్తున్నాడు. అందుకే ఈ పరిణామాలన్నింటినీ రాక్షస క్రీడగా అభివర్ణించుకోవచ్చు.

రెండు మూడు పంటలు పండే సారవంతమైన భూములను ధ్వంసం చేసి రాజధాని నిర్మాణం చేయడం ఇదేమి ఆనందమో అర్థం కాని విషయం. పూలింగ్ అంటూ ప్రభుత్వంపై భారం పడని సరికొత్త దోపిడికి తెర తీశాడు. ఇదెక్కడి అన్యాయం. పరుల ఆస్తిని తను నిర్దాక్షిణ్యంగా తీసుకుని వారికి తిరిపెం రాల్చుతానంటున్నాడు. బంగారం వంటి పంట భూములను కోల్పోయే సందర్భంలో రైతాంగం ప్రభుత్వం ఎదుట యాచకుల్లా మారారు. అభివృద్ధి పరిచిన వారి భూములలో వారికి సగభాగం అప్పగిస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టమేమిటో చెప్పకుండా నియంతృత్వం ప్రదర్శిస్తున్నాడు. డెవలపర్స్ పేరుతో కార్పొరేట్ శక్తులకు మాత్రం దోచిపెట్టడానికి సిద్ధంగా ఉన్నాడు. నిజానికి అక్కడే ఎందుకు రాజధానిని ఏర్పాటు చేయాలని ప్రశ్నిస్తే? ఎక్కడో ఒక చోట పెట్టాలికదా! అంటూ బుకాయింపు మాటలతో సమాధానం ఇస్తున్నాడు. ఇక్కడే మనందరినీ సమాధానం దొరకని ప్రశ్న ఒకటి వేధిస్తోంది. అదేంటంటే సుమారు 50 వేల ఎకరాలు ఉచితంగా సులభంగా సునాయాసంగా లభించే దొనకొండ ప్రాంతాన్ని వదలి తుళ్లూరు ప్రాంత పంట భూములపై చంద్రబాబు నాయుడు మమకారం పెంచుకోవడమే పరిష్కరించలేని ఒక పజిల్. దొనకొండ ప్రాంతంలో వనరులకేమీ లోటులేదుకదా! ఈ ప్రాంతానికి 25 కిలోమీటర్లలోపు ఉన్న వెలిగొండ ప్రాజెక్టు వలన గానీ, 12 కిలోమీటర్ల దూరం మించని నాగార్జునసాగర్ ప్రధాన కాలువ గానీ ఈ ప్రాంత నీటి అవసరాలను పుష్కలంగా సమకూర్చుతాయి. దొనకొండ గుండా బ్రాడ్‌గేజి రైలు మార్గం స్థిరపడే ఉంది. అదే విధంగా బ్రిటిష్ కాలం నాడే ఏర్పడిన విమానాశ్రయం అందుబాటులో ఉంది. బలమైన పునాదులు ఏర్పడడానికి అనువైన నేల ఉంది. చంద్రబాబు నాయుడు మనసు ఈ వైపు ఎందుకు వెళ్లడం లేదు. రాజధాని అడవిలో కట్టాలా? అంటూ తెగ గుంజుకుంటున్న చంద్రబాబు నాయుడు గారికి తెలియదేమో! అనేక అటవీ ప్రాంతాలు జనావరణాలుగా మారాయని ఒక ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం జరిగిన ప్రాంతాన్ని అడవి అనడానికి ఎవరైనా సాహసిస్తారని విజ్ఞులెవరూ భావించరు. అయినా దొనకొండ అటవీ భూములన్నీ మైదాన ప్రాంత సరిహద్దులు కావా? సాగునీటి ప్రాజెక్టుల రిజర్వాయర్ల నిర్మాణాలలోనైతే ఎవరూ ప్రత్యామ్నాయాన్ని చూపించలేరు. నీరునిల్వ ఎక్కడ వీలు పడుతుందో

అక్కడే రిజర్వాయర్ నిర్మించాలనేది ఒక చారిత్రక వాస్తవం. ఆ సందర్భంలో ఎవరికి ఇష్టమున్నా, లేకున్నా భూములు సేకరించడం అక్కడ తప్పనిసరి అవుతుంది. ఇక్కడ రాజధాని నిర్మాణానికి అనేక ప్రత్యామ్నాయాలు సూచిస్తున్నా, అందుకు అనువైన అనేక ప్రాంతాలను విడిచి చంద్రబాబు నాయుడు నియంత పోకడనే ఎంచుకున్నాడు. మెట్రోరైలు మార్గ విషయంలో తెలంగాణ సిఎం కెసిఆర్ హైదరాబాద్‌లో ప్రత్యామ్నాయ మార్గాన్ని అనుసరించలేదా? అలాంటి పద్ధతిని చంద్రబాబు నాయుడు ఎందుకు అవలంబించడం లేదో ఎవరికి అంతుచిక్కని రహస్యం.

రాజధాని ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం ఏర్పరచిన శివరామకృష్ణ కమిటీ చేసిన సిఫార్సులను చంద్రబాబు నాయుడు తుంగలో తొక్కడం చూస్తుంటే మేధావుల అధ్యాయనాలపై ఆయనకున్న విశ్వాసమేమిటో భోద పడుతుంది. పంట భూములలో రాజధాని నిర్మాణాన్ని వ్యతిరేకించిన కమిటీ నివేదికను విసిరి చెత్త బుట్టలో పడవేశాడు. ఇంత మాత్రానికి అంత ఆర్భాటంగా ఆ కమిటీ ఏర్పాటు ఎందుకు? కాళ్లీడ్చుకుంటూ కమిటీ వారు 13 జిల్లాలు పర్యటించి, రాత్రింబవళ్లు తలబద్దలు కొట్టుకుని నివేదిలు సమర్పించడమెందుకు. ఆచరించనిదానికి అంతంత వృధా ఖర్చులు దేనికో చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ వర్గాలు తమను తాము ప్రశ్నించుకోవాలి. ఒకవైపు రైతుల నోట్లో మట్టి కొడుతూనే మరోవైపు సిగ్గుపడకుండా తాను రైతు కుటుంబ వారసుడనని చెప్పుకోవడానికి ఎలాంటి సంశయం చెందడం లేదు. వాస్తవానికి రైతులు భూమిని ఇవ్వడానికి వ్యతిరేకిస్తున్న వైనం గజాలు, కరెన్సీ కట్టలకు సంబంధించిన అంశం కానేకాదు. అది భూమికీ రైతుకీ ఉన్న అనుబంధానికి ప్రతీక. భూమితో రైతుది ఒక నమ్మకం. తరతరాల యుగయుగాల విశ్వాసం. భూమి పుట్టుక నుండీ రైతుకదే ప్రాణప్రదం. నిజంగా రైతుకు వ్యవసాయం స్వర్గ సుఖాలను తెచ్చిపెట్టదు. పారిశ్రామిక వేత్తలకు, కార్పొరేట్ శక్తులకు, అధికారులకు, రాజకీయ నాయకులకు, పాలకులకు మల్లే సుఖవంతమైన జీవితం, విలాసవంతమైన భవనాలు, కార్లు, సూట్లు, బూట్లు, కోట్లు సమకూర్చ లేదు. వ్యవసాయ దారుడు బతికినంత కాలం సాదా సీదా జీవితమే నిరంతరం గడుపుతున్నా తాను నమ్ముకున్న భూమిని, వృత్తి వ్యవసాయాన్ని వదలిరావడానికి ఇష్టపడడు. ఈ అంతఃసూత్రాన్ని గమనించిన చంద్రబాబు నాయుడు తానూ రైతాంగ వారసత్వంతోనే వచ్చానని సన్నాయి నొక్కులు నొక్కుతూనే రైతుల ఉసురు తీయడానికే ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. పూలింగ్ ద్వారా రైతులకు తాము అప్పగించే భూ భాగం విక్రయించుకుంటే ఒక్కో ఎకరాకు 3 కోట్ల రాబడి ఉంటుందని నమ్మపలుకుతున్నాడు. ఇదే క్రమంలో కొందరు రైతులు ఆ భూమిని కూడా ప్రభుత్వమే తీసుకుని ఆ వచ్చే 3 కోట్లు మాచేతిలో వేయవచ్చు కదా? అని ప్రశ్నిస్తున్నారు.

పూలింగ్‌కు అంగీకరించని రైతుల భూములను భూసేకరణ చట్టాన్ని ప్రయోగించి స్వాధీనపరుచుకుంటామని బెదిరించి వారిని లొంగదీసు కోవాలనే యత్నంలో చంద్రబాబు నాయుడు అడుగులు ఆవేశంగా పడుతున్నాయి. ఇటీవలి యుపిఎ ప్రభుత్వం భూసేకరణ చట్టానికి పార్లమెంట్‌లో అనేక మార్పులు చేసింది. భూమి యజమానులకు అనుకూలంగా పార్లమెంట్ చట్ట సవరణకు ఆమోద ముద్ర వేసింది. గ్రామంలోని 80 శాతం మంది ప్రజలు అంగీకరిస్తేనే ఆ గ్రామం భూములను సేకరణ చట్టంలో భాగంగా స్వీకరించి స్వాధీనం చేసుకోవాలనే నిబంధన చట్టమై కూర్చుంది. మరి చంద్రబాబు నాయుడు ఏవిధంగా సేకరించాలనుకుంటున్నాడో మనకు ఇట్టే బోధపడుతుంది. భూసేకరణ నిమిత్తం ఆయా గ్రామాలలో తన చెప్పుచేతలలో ఉండే అధికారులతో నామమాత్రపు అభిప్రాయ చర్చా వేదికలు పెట్టి అనుకూలంగా నివేదికలు ఇప్పించుకుని మమ అనిపించాలని భావిస్తున్నట్లుగా రాజకీయ విశ్లేషకులు చెపుతున్నారు. పోలీసు బలగాలతో తమ ఆకాంక్షకు వ్యతిరేకంగా ఎవరి స్వరం వినపడకుండా చేయాలనుకుంటున్నట్లు, భూముల సేకరణను వ్యతిరేకించే వారిని చర్చా వేదికల దరిదాపులకు కూడా రాకుండా అడ్డుకోవాలని భావిస్తున్నట్లుగా ఇప్పటికే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ప్రజాస్వామ్య బద్ధంగా అభిప్రాయాలు చెప్పుకోవడానికి ఆయా చర్చావేదికల్లో అందరికీ అవకాశం కల్పించకుండా ముగించాలనే సూత్రప్రాయ పథకంతో ఉన్నట్లు చెపుతున్నారు. ప్రతిపక్ష పార్టీలను, ఆయా పార్టీల నాయకులను మందబలంతో, అధికార దర్పంతో, పోలీసు సహాయంతో ఇప్పటికే ఎదుర్కొంటూ ఆ చాయలకు వారు అడుగుపెడితే నానాయాగీ చేస్తూ దేశం వర్గాలు సృష్టిస్తున్న యుద్ధ వాతావరణం అభిప్రాయ సేకరణ సవ్యంగా జరుగుతుందనే నమ్మకాన్ని కలిగించలేక పోతోంది. అయితే భూముల సేకరణపై ప్రజల అభిప్రాయాన్ని ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించాలని ఆయా ప్రాంత గ్రామాల ప్రజలు కోరుతున్నారు. చంద్రబాబు నాయుడుకు చిత్తశుద్ధి ఉంటే పాశ్చాత్య దేశాలలో జరిపినట్లు భూములు సేకరించాలను కుంటున్న గ్రామాలలో పోలింగ్ రిఫరెండం నిర్వహించి ఫలితాలను బహిర్గతం చేయాలని, ఆ ప్రకారమే ప్రభుత్వం ముందడుగు వేయాలని ఆయా గ్రామస్తులు డిమాండు చేస్తున్నారు.

రాజధాని నిర్మాణ సంరంభంలో మరో విచిత్రమైన విషయమేంటంటే సింగపూర్ భాగస్వామ్యం. భారతదేశంలోని రాష్ట్రాలలో ఇంతకు క్రితం రాజధానులే లేనట్లు, ఎవరూ రాజధానులే నిర్మాణం చేయనట్లు సింగపూర్ సంస్థల బాట పట్టడం ఒక అనైతికతకు దారి తీసింది. కొద్దిరోజుల క్రితం వరకూ సింగపూర్ ప్రైవేట్ సంస్థల తోడ్పాటుతో రాజధాని నిర్మాణం జరుగుతుందని స్వరమెత్తిన వారు, ప్రతిపక్షాలు గళమెత్తడంతో ఇప్పుడు సింగపూర్ ప్రభుత్వ సహకారంతో నంటూ రాగంమార్చి వల్లె వేస్తున్నారు. అదేమిటో రాజధాని మాస్టర్‌ప్లాన్ తయారీకే 1200 కోట్లు సమర్పిస్తాడట. ఆర్థికలోటు, డబ్బుకు కటువుగా ఉందంటూ బీద పలుకులు పలుకుతున్న చంద్రబాబు నాయుడు ఈ ఉదార చెల్లింపులు ఎందుకు చేస్తున్నట్లో అంతు చిక్కదు. రైతు రుణమాఫీ విషయంలో ఖజానావైపు చూపిస్తూ గుండెలు బాదుకునే చంద్రబాబు నాయుడు సింగపూర్ పట్ల అత్యంత సరళంగా ఎముకే లేని చేతిలా వ్యవహరిస్తున్నాడు. అసలు రాజధానిని మన భారతీయులు నిర్మించలేరా? మనదేశ పరిస్థితులకు, మన శీతోష్ణ స్థితులకనుగుణంగా మన శాస్త్ర సాంకేతిక నిపుణులు ఆమాత్రం కట్టడా లను కట్టలేరా? మన మేధావులపై, శాస్త్రజ్ఞులపై ఆమాత్రం విశ్వాసం లేదా? రాచరిక పాలనతోనే మనవారు అద్భుతమైన నిర్మాణాలను గావించారే! ఎన్ని ఉపద్రవాలెదురైనా చెక్కు చెదరని రాజ ప్రసాదాలను, కోటలను, విశ్వ విద్యాలయాలను నిర్మించి శబాష్ అనిపించుకున్నారే! నలంద, తక్షశిల వంటి ప్రపంచాన్ని నివ్వెరపరిచే కట్టడాలను క్రీస్తుకు పూర్వమే నిర్మించారు కదా? అలాంటి మనదేశ మేధావులు మన రాజధాని నిర్మాణానికి కొరగారా? అంటూ అనేక మంది ప్రశ్నిస్తున్నారు.


వ్యవస్థలు - అభివృద్ధి - మిగులు మనుషులు

***సామాజిక వ్యవస్థల పరిణామ క్రమంలో పెట్టుబడిదారీ విధానం మూడు దశల్లో విభిన్నంగా ఎదిగిందంటూ, మూడో దశలో పెట్టుబడి ప్రవేశించిన భారత సమాజ ప్రత్యేకతల్ని వివరిస్తున్నారు* ముదునూరి భారతి**

క్లిష్టసమస్య

భారతదేశాన్ని అధునిక సమాజంగా మార్చివేసే ప్రయోగంలో, రాజకీయ నాయకత్వం పెట్టుబడి ఆధారిత అభివృద్ధి మార్గాన్ని ఎంచుకుని, పెద్ద పెద్ద డ్యాములు, ఫ్యాక్టరీలు, మౌలిక సదుపాయాలకు చెందిన ప్రాజెక్టులు కట్టడం జరిగింది. దేశంలో ఈ అభివృద్ధి చిహ్నాలే చాలా వరకు అభివృద్ధిగా చలామణీ అయిపోవడంతో, ఇదే భావన పాలకవర్గ భావజాలంగా కూడా మారిపోయింది. కొంతకాలం గడిచేసరికి ఈ అభివృద్ధి పథకాలన్నీ సమాజంలో కళ్లు చెదిరిపోయే మార్పులను తీసుకువస్తే, దీనికి వ్యతిరేకమైన మార్పులు కూడా అదే సమయంలో ప్రతిఫలించడంతో, అభివృద్ధికి సంబంధించిన రెండు భిన్నమైన ధోరణులు సమాజంలో ముందుకు వచ్చాయి. మన సమాజంలో పెట్టుబడి వేళ్లూనుకుందని కొంత మంది గట్టిగా నమ్ముతుంటే, మరికొంత మందిలో మన సాంప్రదాయిక వ్యవస్థ పరివర్తన పూర్తిగా జరుగలేదనీ, అందుచేత సమాజంలో ఏక కాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థ పక్కనే సాంప్రదాయిక వ్యవస్థ కూడా కొనసాగుతూ ఉందనే భావన కూడా ఉంది. ఈ వైరుధ్య భావాలు 'ఎవరి దృక్పథానికి అనుగుణంగా వారికి కనిపించే మార్పులు' అనే సామెతని నిజం చేస్తాయి. ఈ వైరుధ్యం కారణంగా సమాజంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఉందా లేదా అనే అంశం మీద తీవ్రమైన, వాడి, వేడి చర్చలు కొనసాగుతూనే ఉండి, వాదోప వాదాలకు దారితీస్తున్నాయి.

ఇక్కడ జరుగుతున్న చర్చలో, మన సమాజము–దాని పరివర్తన అనేవి పరిశోధనా వస్తువు అనుకుంటే, పరిశోధనలో వాస్తవ ప్రపంచంలో సేకరించిన వివరాలను పెట్టుబడిదారీ వ్యవస్థ నమూనా ఆధారంగా విశ్లేషించే ప్రయత్నం జరుగుతుంది. దీనికొరకు, పెట్టుబడిదారీ వ్యవస్థ గతంలోని ఆ సమాజంలో జరిగిన కొన్ని మార్పులను మనం కొండ గుర్తులుగా అంగీకరించి, వీటి ఆధారంగా సమాజంలో పెట్టుబడిదారీ వ్యవస్థ స్థితిని అంచనా వేయడం జరుగుతుంది. ఈ పద్ధతిలో పెట్టుబడిదారీ వ్యవస్థలో జరిగిన మార్పులు దత్తాంశం (సమ్‌థింగ్ గివెన్) గా భావించి, ప్రస్తుత సమాజంలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఉంటే అలాంటి మార్పులే జరగాలని ఊహించడం జరుగుతుంది. దీనికంటే భిన్నంగా, మరొక పద్ధతిలో, పెట్టుబడిదారీ వ్యవస్థని ఒక పరిణామ క్రమంలో మార్పులు చెందుతూ ఉండే వ్యవస్థగా ప్రతిపాదిస్తూ, ఈ కారణంగా పెట్టుబడిదారీ వ్యవస్థ నమూనా కూడా మార్పు చెందవలసిన అవసరం ఉందని చెప్పడం జరిగింది. ఈ పరిణామాన్ని (నిర్దిష్టత – అమూర్తత – నిర్దిష్టత) ల అంతస్సంబంధంగా ఒక గొలుసుకట్టుగా చూడవచ్చును.



మోడల్ రియాలిటీలో 'ని' అనేది ఒక సమాజంలో, ఇంగ్లండ్ లాంటి దేశాలలో నిర్దేశిత స్థలకాల సమయంలో వచ్చిన మార్పులని, 'అ' ఈ మార్పుల అమూర్త భావన అని చూడవచ్చును. (ని1–ని2–ని3) అనేవి వివిధ నేపథ్యాలలో వచ్చిన మార్పులనుకుంటే, అ1–అ2–అ3 గొలుసు పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క నమూనాలోని, పరిణామ క్రమంలోని

ఇటీవల జపాన్ దేశం సందర్శించిన సందర్భంలో అక్కడి పారిశ్రామిక వేత్తల్తో సమావేశమైన సందర్భంలోనూ, ఆదేశ పాలకులతో చర్చల సందర్భంలోనూ చంద్రబాబు నాయుడు ఏమి చెప్పాడు. అభివృద్ధికి శిఖరమైన అమెరికాలో పరాయి దేశం నుండి వెళ్లి ఉద్యోగాలు చేస్తున్న ఇంజనీర్లు ప్రతి పది మందిలో నలుగురు ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన వారేనని ఢంకా భజాయించాడు. అట్లా మన సాంకేతిక శాస్త్రజ్ఞుల గురించి, మనవారి సత్తా గురించి గొప్పలు పోయిన చంద్రబాబునాయుడు రాజధాని విషయంలో అనుసరిస్తున్న వైఖరేంటి? రాజధాని నిర్మాణం జరగాలంటే అధ్యయనం అవసరమే. మన ఇంజనీర్లనే వివిధ రాజధానులను దర్శించేందుకు అనుమతించి, మూల్యాంకనం చేసి, వారితోనే నిర్మాణానికి పూనుకుంటే మనకు ఎంతో లాభ సాటిగా ఉంటుంది కదా? మన విద్యా వేత్తలకు మనం గౌరవం ఇచ్చిన వారమౌతాం కదా? ఈ నిర్మాణాలలో మిగులు బాటంతా మన రాష్ట్రంలోనే, మనదేశంలోనే జమ అవుతుందనడంలో సందేహం లేదు. చంద్రబాబునాయుడు సింగపూర్ మంత్రం జపించడంలో మర్మమేమిటి? ఇప్పటికే హైదరాబాద్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని మాదాపూర్ హైటెక్ సిటీ నిర్మాణ కాంట్రాక్టును చంద్రబాబునాయుడు చలువ వలన దక్కించుకున్న ఎల్ అండ్ టి సంస్థ బహుమానంగా నిర్మించిందని ఇతర పార్టీలు విమర్శలు చేసిన విషయం అందరికీ గుర్తుండే ఉంటుంది. అయితే ఇప్పుడు రాజధాని నిర్మాణాన్ని సింగపూర్ సంస్థలకు అప్పగిస్తానంటున్న చంద్రబాబునాయుడుగారి వైఖరి వెనుక అలాంటి మతలబు ఏదైనా ఉందేమోనని ప్రజలు సంశయించే వీలుంది. ఏది ఏమైనా ఇప్పుడు చంద్రబాబునాయుడు అనుసరిస్తున్న విధానాలు ఆయన గత తొమ్మిదేళ్ల పాలనా పోకడలోనే సాగుతున్నాయనేది మాత్రం నిర్వివాద అంశంగా చెప్పవచ్చు.

(రచయిత అధ్యక్షులు, పల్నాడు రచయితల సంఘం) వీ

దశలను సూచిస్తాయి. ఇండియా లాంటి మూడవ ప్రపంచ దేశాలలో, పెట్టుబడి యొక్క ప్రభావాన్ని పై నమూనా సహాయంతో అంచనావేస్తే, ఇండియాలో ప్రస్తుతం జరుగుతున్న మార్పులు గతంలో ఇంగ్లండులో జరిగిన మార్పుల కంటే తేడాగా ఉంటాయి.

పైన చెప్పిన నమూనా సహాయంతో మన సమాజంలో పెట్టుబడి ప్రభావాన్ని అంచనావేసే ప్రయత్నమే ప్రస్తుత వ్యాసం యొక్క ఉద్దేశ్యం. ఈ నేపథ్యంలో చూస్తే, మన సమాజంలో మార్పులను తెచ్చే సాధనం పెట్టుబడి కొంత వృద్ధిని నిశ్చయంగా సాధించినప్పటికీ, సమాజాన్ని పూర్తిగా సారాంతరం చేసి, పెట్టుబడిదారీ వ్యవస్థగా మార్చే క్రమంలో కొన్ని అడ్డంకులను ఎదుర్కొంది. ఆధునిక సమాజంలో అవకాశాలు దొరకక బయటకు నెట్టివేయబడ్డ మిగులు మనుషులు తయారవడం, సమాజం మార్కెట్లతో అనుసంధానించబడి ఏకైక వ్యవస్థగా మారిపోకుండా, మూడు ఉప వ్యవస్థల కలయికగా మనుగడ సాగిస్తూ ఉండడం అనేవి ప్రస్తుత సమాజం ఎదుర్కొనే అడ్డంకులు. ఈ అడ్డంకులు తొలిగితేకాని పెట్టుబడిదారీ సమాజ ఆవిర్భావానికి అవకాశం కలుగదు.

1. ఉపోద్ఘాతం

గత ఏడు దశాబ్దాలలో మన సమాజాన్ని ఆధునీకరించే ఉద్దేశంతో రాజకీయ నాయకత్వం అనేక అభివృద్ధి పథకాలను ప్రవేశపెటాయి. అనేక విధానాలను అమలు చేశారు. వీటికి కావలసిన పెట్టుబడిని (డబ్బు, సాంకేతికత, జ్ఞానము రూపేణా) సమకూర్చుకుని పెద్ద డ్యాములు, ఫ్యాక్టరీలు, ఆధునిక రవాణా మార్గాలు, ఐటి ఆధారిత సంస్థలు, సూపర్‌ఫాస్ట్ రైళ్లు, ఐదు నక్షత్రాల హాస్పిటళ్లు, కార్పొరేట్ విద్యా సంస్థలు మొదలైన వాటినెన్నో ఏర్పరిచారు. వ్యవసాయ రంగంలో వ్యాపార పంటలు పండించడం, పొలాల్లో ట్రాక్టర్లు లాంటి ఆధునిక యంత్రాల వినియోగం లాంటివి క్రమంగా చోటు చేసుకోవడంతో, ఈ రంగంలో రాశిలోనే కాక వాసిలో కూడా కనిపించే మార్పులు అనేకం చోటు చేసుకున్నాయి. పై మార్పులన్నీ కూడా మనదేశ ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీ సమాజానికి దారి తీస్తోందనే అభిప్రాయాన్ని కలుగజేశాయి. ఇక్కడ గుర్తించవలసిన మరో విషయం ఏమిటంటే, పై అభివృద్ధి పథకాలు అన్నింటిని అమలు చేయడంలో ఉమ్మడిగా ఉండే అంశం వీటన్నింటి ఏర్పాటుకు భూమి కావలసి రావడం, దానికొరకు స్థానిక సమూహాలను నిర్వాసితులను చేయడమే కాక ఆధునిక సమాజంలో వారికి స్థానం కల్పించలేక పోవడంతో ఈ నిర్వాసిత ప్రజలంతా మిగులు మనుషులుగా మారిపోయారు. దీని పర్యవసానంగా ఇంకా విపరీతమైన పరిణామాలు కూడా వస్తున్నాయి.

ఈ అభివృద్ధి పథకాల అమలులో కొన్ని అవాంఛిత పరిణామాలు వచ్చినప్పటికీ, మనదేశ నాయకత్వానికి అభివృద్ధి అంటే పెట్టుబడిదారీ సమాజంగా మారిపోవడమేననీ, పెట్టుబడి కేంద్రిత అభివృద్ధి మార్గాన్ని అనుసరించడమే దానికి ఏకైక మార్గమనే నమ్మకంతో ఈ అభివృద్ధి మార్గాన్నే ఇప్పుడు కూడా కొనసాగిస్తూ ఉన్నారు. ఇప్పటికే అమెరికా లాంటి దేశాలు అభివృద్ధి చెందడంలో వారి దగ్గర అభివృద్ధికి సంబంధించిన నమూనా, దానికి కావలసిన జ్ఞానం తయారుగా ఉన్నాయనీ, మనం దాన్ని అందిపుచ్చుకుని మనదేశంలో అమలు చేయగలిగితే, మనం కూడా వాళ్లలాగానే అభివృద్ధి చెందిపోగలమనే ధీమా ఉండడమే దీనికి కారణం. మన నాయకత్వం ఈ మార్గాన్నే విశ్వసించడానికి మరో కారణం ప్రపంచ దేశాలలో సోషలిస్టు సమాజాలు పడిపోయాయని అనుకోవడం కూడా కావచ్చు. ఈ నమూనాలో అభివృద్ధికి కావలసిన ముఖ్య వనరు పెట్టుబడి అనుకోవడం, ఆ దేశాలు మన అభివృద్ధికి కావలసిన నైపుణ్యంతో పాటు డబ్బు, సమాచార వివరాలు ఇవ్వడానికి తయారుగా ఉండడంతో కూడా మన నాయకత్వం ఈ మార్గాన్నే ఎన్నుకుంది. ఈ అభివృద్ధి పథకాల అమలు కారణంగా మొదట కొన్ని లాభాలు కూడా వచ్చాయి.

ఈ నమూనాకి సిద్ధాంత పరంగా బలం చేకూర్చి పెట్టింది ఆర్థిక శాస్త్రవేత్త అయిన ఆర్థర్ లూయిస్ (1954). ఇండియా లాంటి మూడవ ప్రపంచ దేశాలలో సామాజిక పరివర్తన అనే సమస్యని వివరిస్తూ, ఈ దేశాలను ద్వంద్వ ఆర్థిక వ్యవస్థలు (డ్యుయల్ ఎకానమీ)గా వర్ణించడం జరిగింది. ఇవి సమాజంలో మార్పులు జరుగకుండా నిశ్చలంగా ఉన్నట్లు కనిపించే సాంప్రదాయిక వ్యవస్థ, డబ్బును పెట్టుబడిగా పెట్టడంతో మార్పులకు గురి అవుతూ, వృద్ధి చెందుతూ ఉండే ఆధునిక వ్యవస్థల కలయికగా గుర్తించడమే కాక, కాలం గడిచేకొద్దీ ఈ ఆధునిక వ్యవస్థ బలపడే క్రమంలో సాంప్రదాయ వ్యవస్థ నెమ్మదిగా అదృశ్యమైపోయే క్రమాన్నే అభివృద్ధిగా వివరించడం జరిగింది. ఇలా సమాజంలో అభివృద్ధి సాధ్యపడాలంటే, సాంప్రదాయక వ్యవస్థలో ఉండే కార్మికులు దానిని వదిలిపెట్టి ఆధునిక వ్యవస్థలో అంతర్భాగంగా మారిపోయే క్రమాన్నే సామాజిక పరివర్తనగా వర్ణించడం జరిగింది. కాని ప్రస్తుత నేపథ్యంలో శ్రామికులు ఆధునిక ఉత్పత్తులు జరుగుతున్న ప్రదేశాలకు వెళ్లినా కూడా, అక్కడి అభద్రత మొదలైన కారణాల వలన తిరిగి సాంప్రదాయిక వ్యవస్థలోని తమ స్వస్థలాలకే మొగ్గు చూపుతున్నట్లు గణాంకాలు చెపుతున్నాయి. (గ్రామీణ వ్యవసాయ కూలీలు, పేద రైతులు 33 శాతంగా ఉండిపోయారు) అంటే శ్రామికుల వలసలు తాత్కాలిక పరిణామం మాత్రమేనని, సామాజిక పరివర్తన క్రమానికి అడ్డంకులు వస్తున్నాయనీ అర్థం చేసుకోవచ్చును. ఈ క్రమంలో వృద్ధి జరిగినా కూడా అభివృద్ధి అసంపూర్తిగానే మిగిలి పోయింది.

దీనితో లూయిస్ నమూనా ప్రశ్నార్థకంగా మారడమే కాక, మూడవ ప్రపంచ దేశాల అభివృద్ధి గురించిన ఏకైక నమూనా, దాని సాధ్యాసాధ్యాల గురించి అనుమానాలు ఉత్పన్నమయ్యాయి. 1998లో నోబెల్ బహుమతి గ్రహీత జోసెఫ్ స్టిగ్‌లిజ్ ఒక ప్రత్యామ్నాయ ప్రాతిపదికను తయారు చేయడమే కాక, సామాజిక అభివృద్ధితో పాటు వ్యక్తి అభివృద్ధికి కూడా నిర్వచనం ఇచ్చి అభివృద్ధి అనే భావనకి లోతైన అర్థం ప్రతిపాదించడం జరిగింది. వ్యవస్థ నిర్మాణం (స్ట్రక్చర్)లో మార్పులే అభివృద్ధి అనీ, వ్యక్తి అభివృద్ధికి కొలమానం వ్యక్తి దృక్పథంలో, సమస్యలకు సమాధానం అన్వేషించే క్రమంలో నిర్వచించడం జరిగింది. అభివృద్ధిని అవగాహన చేసుకోవడంలో సమాజ నిర్మాణానికి, వ్యక్తి ఆలోచనా విధానానికి ప్రాముఖ్యత ఇవ్వడం జరిగింది. ప్రతి సమాజాన్ని కూడా ద్వంద్వ వ్యవస్థల కలయికగానే వర్ణిస్తూ, ప్రతి సమాజం తన అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న అభివృద్ధి పథకాలను ఎంచుకోవచ్చుననీ, అయితే అందరూ కలిసికట్టుగా ఆలోచించుకుని పథకాలను ఎంచుకుంటే, వారు

ఆ పథకాలను సొంతం చేసుకొని సమర్ధవంతంగా అమలు చేయడం ద్వారా అభివృద్ధి సాధ్యమౌతుందని ప్రతిపాదన చేయడం జరిగింది.

గత డెబ్బయి సంవత్సరాలలో సమాజంలో 'పెట్టుబడి ద్వారా అభివృద్ధి' అనే నమూనాని అనుకరించడంలో, కొన్ని ఆహ్వానించదగిన మార్పులు సాధ్యమైనప్పటికీ, కొన్ని విపరీత పరిణామాలు–పేదరికం, నిరుద్యోగం, అసమానతలు, లంచగొండితనం, ధరల పెరుగుదల, వృద్ధిలో పెరుగుదల లేకపోవడం లాంటి అనేక సమస్యలకు సమాధానం రాకపోగా, అభివృద్ధి పథకాలను వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమాలు సమాజంలో తలెత్తడంతో సామాజిక పరివర్తన అసంపూర్తిగా ఉండిపోయిందనీ, పెట్టుబడి సమాజం నిర్దేశించిన పనిని సక్రమంగా నెరవేర్చలేక పోయిందనే అభిప్రాయం వస్తుంది. ఈ సందర్భంలో సమాజం ముందుకు పెట్టుబడిని గురించిన కొన్ని ప్రశ్నలు వస్తాయి:

(1) పెట్టుబడి, తను ప్రప్రథమంగా రూపు తీసుకున్న దేశంలోనూ, కాలక్రమంలో తను వలస వెళ్లిన దేశంలోనూ, ఒకే రకంగా పని చేస్తుందా లేక వేరు వేరుగా పని చేస్తుందా? అంటే పెట్టుబడి స్థలకాల పరిస్థితులతో నిమిత్తం లేని ఒక యూనివర్సల్ కాటగిరిగా సార్వత్రిక అంశంగా చూడగలమా?

(2) సర్వకాల సర్వావస్థలలోను పెట్టుబడి ఒకే రకంగా పనిచేస్తుందా? లేక అది గ్రహించగలిగే మిగులును అధికం చేసుకునే తన ఉద్దేశ్యాన్ని సాధ్యం చేసుకునే ప్రయత్నంలో తన సారం మార్చుకోకుండా, తన రూపాన్ని మాత్రమే మార్చుకునే ప్రయత్నం చేస్తుందా?

(3) పెట్టుబడి తను చేరే దేశాన్ని బట్టి తనరూపం మార్చుకుంటే, ఇండియా లాంటి మూడవ ప్రపంచ దేశాలలో దీని పర్యవసానాలు ఎలా ఉంటాయి?

(4) మూడవ ప్రపంచ దేశాలలో ఇటువంటి పర్యవసానాలు విధ్వంస పూర్వకంగా ఉంటాయా? లేక తటస్థంగా, ఉపేక్షించదగినవిగా ఉంటాయా?

(5) ఇటువంటి దేశాల అభివృద్ధికి పెట్టుబడి ఆధారిత అభివృద్ధి మార్గం ఒక్కటే ఏకైక మార్గమా లేక ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గం ఏదైనా ఉంటుందా?

2.1 పెట్టుబడిదారీ విధానం : వివిధ దశలలో దాని పరిణామ క్రమం

పెట్టుబడి చరిత్రని పరిశీలిస్తే, ఒక వ్యవస్థలో డబ్బుని పెట్టుబడిగా పెట్టినప్పుడు, ఆ వ్యవస్థ మార్పులకు లోనవుతుంది. పెట్టుబడి ఆ వ్యవస్థలో ఉత్పత్తికి కావలసిన వనరుల సమీకరణని మార్చి వేస్తుంది. ఆ వ్యవస్థలో 'కొరత' గా ఉన్న ప్రత్యేక ఉత్పత్తి వనరును సమర్ధవంతంగా ఉపయోగించుకొని, ఉత్పత్తి సంబంధాలను మార్చివేసే ప్రక్రియ ద్వారా ఉత్పత్తిని పెంచి, తను రాబట్టగల మిగులును ఎక్కువ చేసుకుంటుంది. ఈ మార్పుల వలన ఇప్పటి వరకు ఉన్న ఉత్పత్తి విధానం రద్దయిపోయి, దాని స్థానంలో మార్కెట్లతో అనుసంధానించబడిన ఆధునిక వ్యవస్థ రూపు తీసుకుంటుంది. మనిషికి ప్రకృతి మీద ఉన్న జ్ఞానం పెరుగుతున్న కొద్దీ, పెట్టుబడి ఈ జ్ఞానాన్ని ఉపయోగించుకొని ఉత్పత్తి విధానాన్ని మార్చి వేస్తుంది. ఈ మార్పులకు అనుగుణంగా పెట్టుబడి పరిణామ క్రమం పూర్తిగా భిన్నమైన మూడు దశలలో జరిగినట్లు ఊహించవచ్చును.

పెట్టుబడి ఇలా విభిన్న దశలలో పరిణామం చెందినట్లు మొట్టమొదటి గా ప్రతిపాదించిన తత్వవేత్త కారల్ మార్క్స్. ఆయన చెప్పిన ప్రకారం, ఒక వ్యవస్థలో వ్యక్తులకు ప్రకృతి మీద జ్ఞానం పెరుగుతున్నప్పుడు, పెట్టుబడి దానిని ఉత్పత్తి క్రమంలో ఉపయోగించుకొని, ఉత్పత్తి విధానాన్ని మార్చివేయడంతో పాటు మిగులుని రాబట్టుకునే పద్ధతులు వేరువేరుగా ఉంటాయి. ఈ కారణం మూలాన పెట్టుబడి పరిణామ క్రమంలో వివిధ దశలు, వాటికి పీరియడైజేషన్ ఏర్పడతాయి. రాజకీయ ఆర్థిక శాస్త్రవేత్తగా ఆర్.ఎస్. రావుగారు ఈ పీరియడైజేషన్ ఆధారం చేసుకుని మూడవ ప్రపంచ దేశాలలో ఆర్థిక వ్యవస్థని అర్థవంతంగా అవగాహన చేసుకునే ప్రయత్నంలో వీటిని 'ద్యుయల్ ఎకానమీ మోడల్'తో కాకుండా, దానికి ప్రత్యామ్నాయంగా 'అలయన్స్ మోడల్' తయారు చేశారు. ప్రస్తుత వ్యాసకర్త కూడా ఈ పెట్టుబడి, దాని ఆధారంగా పెట్టుబడి వివిధ దశలలో స్త్రీల ఉద్యోగావకాశాలలో వచ్చిన మార్పులను అర్థం చేసుకునే ప్రయత్నం చేయడం జరిగింది. మొట్టమొదట, పెట్టుబడి అప్పటి సమాజ ఉత్పత్తి విధానాన్ని మార్చి ప్రజల అవసరాలు తీర్చడంతో, దానికి సమాజ నిర్మాణాన్ని మార్చివేయగల శక్తివంతమైన ఒక ఆపరేటర్‌గా క్రెడిట్ వచ్చింది.

క్షుణ్ణంగా ఈ దశలను పరిశీలిస్తే, పెట్టుబడి సమాజంలో ఉత్పత్తి చేయడానికి అందుబాటులో ఉన్న వనరులను ఆ సమయంలో ఉపయోగిస్తునట్లుగా కాకుండా, చిన్న చిన్న మార్పులు చేసి మరొక విధంగా ఉపయోగించుకునే విధానాన్ని తయారు చేసి ఉత్పత్తిని, దానితోపాటే మిగులుని కూడా పెంచుకునే ప్రయత్నం చేస్తుంది. ఈ వనరులలో భూమి, నీరు, అడవులు, ఖనిజాలు మొదలైన ప్రకృతిలో లభ్యమయ్యే వనరులుంటే, శ్రమ, జ్ఞానం, నైపుణ్యం, సాంకేతికత లాంటి మానవ వనరులు కూడా ఉంటాయి. పెట్టుబడి తన ప్రవేశంతో ప్రజలు తమకు కావలసిన పంటలు పండించుకునే సాంప్రదాయిక వ్యవస్థ నుండి మార్కెట్లలో మారకం చేయగల పంటలు పండించే ఆధునిక వ్యవస్థకు మార్చివేస్తుంది. ఇంతే కాకుండా జ్ఞాన సముపార్జనలో పరిశోధన (రిసర్చ్), బదిలీ (ట్రాన్స్‌మిషన్), ఉపయోగం (అప్లికేషన్) అనే మూడు పనులు విడిపోయి, తమ పనులు తామే నిర్వహించుకోవడంలో జ్ఞానం అమితంగా పెరిగిపోయింది. పెట్టుబడి ఈ వృద్ధి చెందిన శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాల సాయం తీసుకుని సమాజంలో అమలు చేయడంతో, సమాజ నిర్మాణ పరంగా మార్పులు, వ్యక్తి ఆలోచనా విధాన పరంగా మార్పులు వచ్చాయి.

పెట్టుబడి పరిణామక్రమం మూడు దశలలో జరిగిందనీ, పెట్టుబడి ఎల్లప్పుడూ మిగులుని అధికంగా రాబట్టుకునే విధంగా అన్ని దశలలో సారం మార్చకుండానే ప్రతి దశలోనూ రూపంలో మాత్రమే మార్పులు చేసుకుంది అని భావించవచ్చును.

మనిషి ప్రకృతిలో దొరికే ముడి పదార్థాలను తీసుకుని తన శ్రమశక్తి, తన శ్రమ ద్వారా నిర్మితమైన పరికరాల సహాయంతో సమాజానికి ఉపయోగపడే వస్తువులను తయారు చేస్తాడు.

దీనినే

మానవ శ్రమ + పరికరాలు —ముడి పదార్థాలు→ వస్తువులు

అనే సమీకరణ ద్వారా అవగాహన చేసుకోవచ్చును. చారిత్రక దృక్పథంలో పెట్టుబడిని పరిశీలించితే, ఈ పెట్టుబడి ఒక్కొక్క దశలో పైన చెప్పిన సమీకరణలో ఒక్కొక్క అంశం మీద కేంద్రీకరించి ఉత్పత్తిని పెంచుతుంది. ఇలా చూస్తే, పెట్టుబడిని ఈ కింది మూడు దశలలో అవగాహన చేసుకోవచ్చును.

(1) కో ఆపరేషన్/ వస్తు తయారీ – సి 1

(2) మెషిన్స్/ ఆధునిక పరిశ్రమలు – సి 2

(3) ఇంపీరియల్ పెట్టుబడి/ మొనాపలీ – సి 3

మొదటిదశ (కో–ఆపరేషన్)లో ఉత్పత్తి విధానంలో మార్పులు మొదటి అంశమైన 'మానవ శ్రమ'లో విప్లవం (గుణాత్మకమైన మార్పులు) ద్వారా మొదలయింది. ఈ దశలో పెట్టుబడి సమాజంలో ఆ సమయంలో అమలులో ఉన్న ప్రత్యేకమైన శ్రమ విభజనని యథాతథంగా ఉపయోగించుకొని అధికోత్పత్తిని సాధించింది. మార్క్స్ చెప్పినట్లుగా అధిక సంఖ్యలో శ్రామికులు ఒకే సమయంలో ఒకేచోట ఒకే యాజమాన్యం (పెట్టుబడిదారు) కింద ఒకే రకమైన వస్తువుని తయారు చేయడం చారిత్రకంగా, లాజికల్‌గా పెట్టుబడిదారీ విధానంలో వస్తూత్పత్తిని మొదలు పెట్టిన క్షణం.

ఇలా అధిక సంఖ్యలో శ్రామికులు ఒకేచోట ఒకే ప్రాసెస్‌లో పనిచేయడాన్ని కో–ఆపరేషన్ దశ అనవచ్చును. ఇలా శ్రామికులు అనేకమంది కలిసి ఒకచోట పనిచేయడం మూలాన వారిలోని పోటీ తత్వం పైకివచ్చి శ్రామికుల ఉత్పాదక శక్తి పెరుగుతుంది. ఇలా ఎందరో శ్రామికుల ఉత్పాదక శక్తి ఒకదానితో ఒకటి కలిసిపోయి సామూహిక శ్రమ శక్తిగా మారిపోతుంది. ఈ సామూహిక ఉత్పాదక శక్తి, విడివిడిగా ప్రతి ఒక్క శ్రామికుడి ఉత్పాదక శక్తులన్నీ కలిపిన మొత్తం కంటే ఎక్కువగా ఉంటుంది.

ఈ కో–ఆపరేషన్ మొదటి భాగంలో శ్రమ విభజన, మెషినరీలు సబార్డినేట్ పాత్రను పోషిస్తే, తరువాతి భాగంలో శ్రామికుల నైపుణ్యత ఆధారంగా శ్రమ విభజన జరిగి ఉత్పత్తి క్రమంలో అంతరాలు ఏర్పడుతాయి.

ఇక రెండవ దశలో, ఉత్పత్తి క్రమంలో ఉపయోగించే శ్రమ ద్వారా నిర్మితమైన పరికరాలను మెరుగు పరచడం ద్వారా ఉత్పత్తి విధానంలో విప్లవం జరుగుతుంది. ఈ దశలో పెట్టుబడి సైన్సు సహాయం తీసుకుని పనిముట్లను (టూల్స్‌ను) పరికరాలు (ఇన్‌స్ట్రుమెంట్స్) గా మార్చడం, ప్రకృతిలో తమకు అందుబాటులో ఉండే శక్తుల మోటర్ మెకానిజమ్‌ని ఉపయోగించడం ద్వారా జరుగుతుంది, మార్క్స్ మాటల్లో, మిషన్ల రూపంలో ఉండే ఈ పరికరాలు మానవ శక్తులకు బదులుగా ప్రకృతిలోని శక్తులను ఉపయోగించుకొనడం, ఉత్పత్తి క్రమంలో సైన్సు ఉపయోగం పెరగడం ద్వారా గుర్తించవచ్చును.

ఇలా మానవ శక్తులను ప్రకృతిలోని శక్తులు పక్కకు తోసివేయడం, సైన్సు ద్వారా వచ్చిన సాంకేతిక శ్రమ విభజనలు కలిసి, ఉత్పత్తి క్రమంలో మనిషి యంత్రాలకు కేవలం ఒక అనుబంధంగా, అప్రధానంగా మారిపోతాడు. ఉత్పత్తులు మనిషి అజమాయిషీలో కాకుండా పరికరాల నిర్దేశన ద్వారా సాగుతాయి. సైన్సు ఉపయోగం ద్వారా బాగా పెరిగిపోయిన ఉత్పత్తుల ద్వారా పెట్టుబడి అధికంగా మిగులు రాబట్టుకోగలుగుతుంది. ఉత్పత్తుల క్రమంలో మెషినరీ ఉపయోగించడం ద్వారా, శరీర దారుఢ్యం కలిగిన మగవారి అవసరం లేకపోవడంతో, వారిని తీసివేసి చౌకగా తమ శ్రమను అమ్ముకునేందుకు తయారైన ఆడవాళ్లను ఉత్పత్తిలో భాగం చేశారు. తులనాత్మకంగా చూస్తే, మొదటి దశలో శ్రమ వినియోగం సబ్జెక్టివ్ అయితే, రెండవ దశలో ఉత్పత్తికి కావలసిన ఏర్పాట్లు చేయడం స్పష్టంగా అబ్జెక్టివ్‌గా ఉన్న కారణంగా రెండవ దశలో మనిషి యంత్రానికి బానిస అయిపోతాడు.

ఇంక మూడవ దశలో, పెట్టుబడి మరో సమాజంలో ప్రవేశించి, మార్కెట్లలో అందుబాటులో ఉండే వస్తువుల మీద సర్వాధికారాలు కలిగిన పెట్టుబడిగా ఉండి, స్థానిక విలువలు, వస్తు మిశ్రమాన్ని మార్చడం ద్వారా ఉత్పత్తి విధానంలో విప్లవం జరుగుతుంది. ఇదే మార్క్స్ చెప్పినట్లు, ఇది సర్వాధికారాలు కల పెట్టుబడిగా మారడంతో చాలా మంది స్పెక్యులేటర్స్ గా, స్టాక్ మార్కెట్లలో పరాన్న జీవులుగా పాత్ర నిర్వహించడం మొదలవుతుంది. ఉత్పత్తి చేసే పెట్టుబడి కంటే ఫైనాన్స్ క్యాపిటల్ ఆధిపత్యం చలాయించడం జరుగుతుంది. ఫ్యూడల్ సమాజంలో లాగానే స్పెక్యులేటర్స్ మొదలైనవారు ఉత్పత్తిలో భాగం పంచుకోకుండా, దానిని తమ స్వాధీనంలో ఉంచుకోవడం జరుగుతుంది. అందుచేత ఈ మూడవ దశలో మార్పులు ముందుగా మార్కెట్లలో అందుబాటులో ఉండే వస్తువు మిశ్రమంలో మార్పులు, దీనికితోడు సమాజంలో ఉండే విలువలలో మార్పుల ద్వారా కొనసాగుతుంది. దీనినే లోతుగా గమనిస్తే, ఈ సమాజంలోని వ్యక్తులు పెట్టుబడి ఉత్పత్తి చేసిన సరకులనే వినియోగిస్తారు కాని, పెట్టుబడి వీరికి కావలసిన వస్తువులను ఉత్పత్తి చేయదు. అంతే కాకుండా, సమాజంలో వస్తున్న మార్పుల వలన శ్రమ చేయకుండానే డబ్బు సంపాదించవచ్చుననీ, తమ దగ్గర తాము ఆర్జించుకున్న డబ్బు లేకపోయినా, ప్రజలు అడిగినంతనే ఇల్లు, కారు, ఇలా ఏ సరుకు కొనడానికైనా అప్పు ఇవ్వడానికి బ్యాంకులు తయారుగా ఉంటాయనే ఊహ ఏర్పడింది. సమాజంలో విలువలు మారిపోయాయి.

2.2. మూడవ ప్రపంచ దేశాలలో పెట్టుబడిదారీ వ్యవస్థ – దాని పర్యవసానాలు

ఇప్పటివరకు చెప్పుకున్న పెట్టుబడి, మూడు దశలలో దాని పరిణామము అనేవి పెట్టుబడి యొక్క సామాన్య చరిత్ర (జనరల్ హిస్టరీ) అనుకోవచ్చు. ఇక పెట్టుబడి వివిధ దేశాలలో ప్రవేశించి నిర్వహించే కార్యక్రమాలు ఆ దేశాలు పెట్టుబడి యొక్క సామాన్య చరిత్రలో కలిసే దశమీద ఆధారపడుతుంది. దీనిని పెట్టుబడి యొక్క నిర్దిష్ట చరిత్ర (పర్టికులర్ హిస్టరీ)గా గుర్తించవచ్చును.

పెట్టుబడి మొదటి దశలో బ్రిటన్, ఫ్రాన్స్ లాంటి దేశాలలో ప్రవేశించి, అక్కడి సాంప్రదాయిక వ్యవస్థని బలప్రయోగం ద్వారా నిర్మూలించిన దశ. ఈ గమనాన్ని సి1 నుంచి సి2 గా గుర్తించవచ్చును. ఇంకొన్ని దేశాలు, జర్మనీ, జపాన్ లాంటి, పెట్టుబడి గమనంలో మొదటి దశ దాటవేసి రెండవ దశ (సి2)లో అంటే, బ్రిటన్ రెండవ దశలో ప్రవేశించిన సమయంలో, జర్మనీ తిన్నగా పెట్టుబడి మొదటి దశని తోసివేసి రెండవ దశలో బ్రిటన్‌తో పాటు జర్మనీ కూడా పెట్టుబడి మార్గంలో ప్రవేశించింది.

ఈ దశలోనే పెట్టుబడి ఉత్పత్తి విధానంలో సైన్సు సహాయం తీసుకుంది. జర్మన్ పెట్టుబడిదారులు స్థానిక ఫ్యూడల్ శక్తులతో రాజీపడి వారిని పెట్టుబడిదారులుగా మార్చివేసి తమలో కలిపి వేసుకోవడం జరిగింది. ఈ విధంగా సమాజంలో మార్పు రావడాన్ని సామరస్యంగా సమాజాన్ని మార్చే పద్ధతిగా అనుకోవచ్చును. ఈ రెండవ దశలో పెట్టుబడి అప్పటికే జర్మనీలో వాడుకలో ఉన్న టెక్నాలజీని, ఉత్పత్తి పరికరాలను నాశనం చేయకుండా వాటినే స్వీకరించి, కలుపుకొని, మెరుగుపరచడం జరిగింది. ఇంక మూడవ దశలో, పెట్టుబడి తను ప్రవేశించిన మూడవ ప్రపంచ దేశాలలో మార్కెట్లలో వస్తు మిశ్రమాన్ని (ప్రొడక్ట్ మిక్స్) మార్చివేయడం వలన సమాజంలో విలువలు కూడా మారిపోయాయి. ఇండియా లాంటి దేశాలు పెట్టుబడి మూడవ దశలో, అంటే, మొదటి రెండు దశలను నెట్టివేసి తిన్నగా మూడవ దశలో ప్రవేశించాయి. సాధారణంగా ఉత్పత్తి విధానంలో శ్రమశక్తి కాని సాంకేతిక పద్ధతులలో, పరికరాలలో చేసుకునే అవసరమైన మార్పుల ద్వారానే సమాజంలో కొత్త విలువలు చోటుచేసుకున్నాయి. కాని ఇండియా లాంటి వలస దేశాలలో ముందుగా విలువలలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇలా పెట్టుబడి మొదటి రెండు దశల కంటే విరుద్ధంగా మూడవ దశలో వస్తు మిశ్రమాలు, విలువల మూలాన మన సమాజంలో మార్పులు చోటు చేసుకోవడాన్ని ఇన్‌వర్షన్‌గా, అంటే క్రమం తల కిందులు కావడంగా చెప్పుకోవచ్చు.

ఇటువంటి పరస్పర విరుద్ధమైన పర్యవసానాలకు మూలం మన సమాజంలో ఉండే బహుళ నిర్మాణ వ్యవస్థగాను, అధిక సంఖ్యలో ఉండే శ్రామిక శక్తిగాను గుర్తించవచ్చును. మన ఆధునికతకి మూలం అంతర్గతంగా కాకుండా బాహ్య శక్తుల మూలంగా జరగడమే కారణమని అభిప్రాయం కూడా ఉంది. సమాజంలో మార్పుల యొక్క ఈ దశని అర్థం చేసుకోవాలంటే మొనాపలీ పెట్టుబడికి, స్థానిక ఫ్యూడల్ యజమానులకు ఉండే సఖ్యతలో మూలాన్ని చూడగలిగితే, ఈ ఫలితాలలోని సంక్లిష్టతని కొంత వరకు అర్థం చేసుకోవచ్చును.

మనదేశం లాంటి దేశాలలో విశేషం ఏమిటంటే పెట్టుబడి ఇక్కడ ప్రవేశించినప్పుడు ఇంగ్లండులో లాగా ఫ్యూడలిజాన్ని బలవంతంగా నాశనం చేయలేదు. జర్మనీలో లాగా ఫ్యూడల్ యజమానులను తమతో కలిపివేసుకోలేదు. వీటికి భిన్నంగా పెట్టుబడి మనదేశంలో ఫ్యూడల్స్‌తో సఖ్యతని, స్నేహాన్ని కోరుకోవడంతో పెట్టుబడికి తమది కాని దేశంలో స్థానికంగా భద్రత దొరకడం, తమ తరపున అవసరమైన పనులు చేయగలిగిన ఏజెంట్లు దొరకడం జరిగింది. అంతే కాకుండా పెట్టుబడికి మనదేశంలో చౌకగా దొరికే శ్రామికులు, విస్తారంగా ఉండే సహజ వనరులు అందుబాటులోకి రావడంతో ఉత్పత్తి పెరగడంతో పాటు మిగులు కూడా అధికంగా లభించే అవకాశం వచ్చింది. దీని అర్థం మనదేశంలో పెట్టుబడి వృద్ధి జరగడానికి విదేశీ పెట్టుబడి మీద, దాని నిర్మాణాల మీద (ఇంపీరియలిస్ట్ స్ట్రక్చర్స్), దేశంలో స్థిరత్వం కోసం పెట్టుబడి పూర్వ నిర్మాణాల మీద ఆధారపడవలసి ఉంటుంది. మనదేశంలో ఈ విదేశీ పెట్టుబడుల పనితీరుని విశ్లేషించుకుంటే అధిక మొత్తంలో మిగులును రాబట్టుకోగలిగిందే కాని, అది ఫ్యూడల్ యాజమాన్యంతో పెట్టుకున్న మిత్ర పూర్వక సంబంధాల కారణంగా తనకు ఆపాదించిన సామాజిక పరివర్తన అనే పాత్రని సరిగా నిభాయించలేకపోయింది అని అనుకోవచ్చును. అంటే పెట్టుబడి ప్రభావం సమాజంలోని మిగతా రంగాలలో మార్పులు తేగలిగినా కూడా, ఉపరితల రంగంలో ఫ్యూడల్ సంస్కృతి యొక్క ఆధిపత్యం, పట్టు ఉండడంతో సమాజ పరిణామ క్రమం అసంపూర్ణంగానే ఉండి పోయింది. ఈ పరిస్థితే పెట్టుబడి గురించి మొదట ఉదహరించిన వాదోపవాదాలకు దారి తీసింది. ఈ సామ్రాజ్యవాదం–ఫ్యూడలిజానికి ఉన్న సంబంధం ఒక వైరుధ్యం అవడంతో, అవి పక్క పక్కనే మనుగడ సాగించడం చూస్తే, బడి పిల్లలు ఆడుకునే మూడుకాళ్ల పందెంలా ఉండి, ఒక ఆటగాడి గెలుపు మరొక ఆటగాడి ఓటమిలా కాకుండా, ఒక ఆటగాడి గెలుపు మరొకరికి కూడా గెలుపుగా మారుతుంది. కింద ఇచ్చినవి వీరి మిత్రత్వాన్ని సూచించే కొన్ని ఉదాహరణలు.

(1) ఎన్నికలు, ప్రజాస్వామ్యం లాంటి ఆధునిక సంస్థలు సమాజంలో తమ ఆచరణలో సాంప్రదాయిక అంశాలయిన కులం, మతం లాంటి వాటితో చేతులు కలపడం జరుగుతుంది.

(2) మన బడ్జెట్లో కార్పొరేట్ పరిశ్రమలను, వాటి సంస్కృతిని ఆహ్వానిస్తూ, దానికి వచ్చే అడ్డంకులను తొలగించే ప్రయత్నాలు చేయడం ఒకపక్క అయితే, సంప్రదాయ సంస్కృతిని కాపాడుకునేందుకు చేసే ప్రయత్నాలు మరొక పక్క జరుగుతూనే ఉన్నాయి.

(3) ఇండియాలో పెద్దపెద్ద మేనేజ్‌మెంట్ విద్యా సంస్థలలో టీచింగ్ ప్రోగ్రామ్‌తో పాటు ప్రపంచ స్థాయి నేతృత్వం కోసం ఆధ్యాత్మిక, స్వీయ అభివృద్ధి తోడుగా, ఆ సంస్థలు ఓంకార నాదంతో ప్రతిధ్వనిస్తూ ఉంటాయి. వారి 'కాంపస్ ఆశ్రమ్స్'లో 'బిజినెస్ యోగుల'ను తయారు చేయడం చూస్తే, ఆధునిక, సాంప్రదాయ వ్యవస్థలు కలిసి చేసే మనుగడ వారి ఫిలాసఫీని ప్రతిఫలిస్తుంది.

(4) సమాచార సాంకేతిక నియంత్రణలో పనిచేసే గ్లోబల్ మార్కెట్లతో సంబంధమున్న సంస్థలు, వివిధ గ్రహాలను నియంత్రించే పనిచేసే స్థానిక జ్యోతిష, వాస్తు శాస్త్రాలు కలిసే మనుగడ సాగిస్తాయి. అలాగే మన ముఖ్యమంత్రులు 'పట్టాభిషేకం' లాంటి భావనలు కూడా రెండు వ్యవస్థల మిత్రత్వాన్ని సూచిస్తాయి.

ప్రస్తుత సమాజంలో అసమానతల పెరుగుదల, గొప్పవారు మరింత గొప్పవారుగా, పేద ప్రజలు మరింత పేదలుగా మారిపోవడం, ధరల పెరుగుదల, ఆర్థిక వృద్ధి రేటులో తగ్గుదల మొదలైన సమస్యలున్నప్పటికీ ఆర్థిక శాస్త్రవేత్తలకు, ప్రభుత్వానికి అధిక పెట్టుబడుల ద్వారా మాత్రమే వృద్ధి సాధ్యమనే అభిప్రాయం ఉంది. పైన చెప్పిన క్లిష్ట పరిస్థితులను సవరించేటట్లుగా, ఎలాగైనా సరే పరిశ్రమలను తిరిగి దారిలో పెట్టాలనే సలహాలు కూడా ఇస్తున్నారు.

ఇప్పటి వరకూ, సమాజాన్ని ఆధునీకరించే ప్రయత్నంలో పెట్టుబడి కేంద్రంగా ఉండే అభివృద్ధి మార్గాన్నే ప్రభుత్వం అనుసరిస్తూ వచ్చిన సందర్భంలో, అభివృద్ధి పథకాల కారణంగా అవిచ్ఛిన్నంగా స్థానిక ప్రజలను నిర్వాసితులను చేసి, వారిని కొత్తగా రూపు దిద్దుకుంటున్న ఆధునిక సమాజంలో అంతర్భాగం చేయలేకపోవడంతో, వీరంతా నిరంతరం విస్తరిస్తూ పోయే మిగులు మనుషుల సమూహంలో కలిసిపోతున్నారు.

3.1 మిగులు మనుషులు అంటే?

మనదేశంలో ఆధునీకరణ మొదలు పెట్టినప్పటి నుండి, అంటే, ఒరిస్సాలో మహానది మీద హిరాకుడ్ డ్యామ్, రూర్కెలాలో ఉక్కు కర్మాగారం స్థాపిస్తున్న సమయం నుండి విస్థాపనకు గురయి జీవన వనరులను పోగొట్టుకున్న స్థానిక ప్రజలు ప్రభుత్వం దృష్టిలోకి రాలేదు. కాని గత ముప్పయి సంవత్సరాలలో నర్మదా బచావ్ ఆందోళన మొదలైన తర్వాత నుండి నిర్వాసిత ప్రజలు, మిగులు మనుషులు, సమాజపు అంచులలో ఉండే మనుషులు తమకొక ప్రత్యేక గుర్తింపుని పొందడమే కాక, తమ అసంతృప్తిని తెలుపుతూ చేసే ఉద్యమాల ద్వారా ప్రశ్నలు వేస్తున్నారు. అభివృద్ధి ద్వారా సమాజంలో వచ్చే లాభాలలో తమకు చెందవలసిన వాటాకోసం అధికారికంగా, గట్టిగా అడగడం మొదలు పెట్టారు. సమాజానికి తమ గొంతులను వినిపించేటట్లు చేసి, తమ ఉనికిని స్పష్టంగా తెలియజేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వీరికోసం ఎన్నో రకాల సబ్సిడీలు, సంక్షేమ పథకాలు, పేదరిక నిర్మూలన పథకాలు మొదలైనవి అమలు చేయవలసి రావడంతో, ఈ ఖర్చులు ప్రభుత్వానికి భారమై పోయాయి. నిర్వాసితుల ఉద్యమాలు కొన్ని అనుకోకకుండా అప్పటికప్పుడు జరిగితే, కొన్ని తీవ్రమై ఎక్కువ కాలం జరుగుతూ ఉంటే, వీటి కారణంగా మిగులు మనుషులు సమాజపు వేదిక మీద కేంద్ర స్థానం ఆక్రమించడంతో, వీరి ఉనికిని ఉపేక్షించడం సమాజానికి సాధ్యం కాలేదు. ఈ సమస్య క్లిష్టత ఏమిటంటే ప్రభుత్వం దృక్పథంలో వీరు అవసరమైన వారి కంటే అధికంగా ఉన్న మిగిలిపోయిన మనుషులనీ, వీరి ఉనికి మన ఆర్థిక వ్యవస్థని మెరుగుపరచడానికి అడ్డంకులు కలిగించడమే కాకుండా, వ్యవస్థని అస్థిరతకు గురిచేస్తుందనీ అర్థం ఉంది. దీనికి విరుద్ధంగా, నిర్వాసితుల దృక్పథంలో తాము మిగులును ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉన్నవారైనా కూడా ఆధునిక ఆర్థిక వ్యవస్థలో అవకాశాలు నిరాకరించబడిన మిగులు మనుషులు అనే అర్థం ఉంది. సమాజంలో మార్పులను గమనిస్తే, పెట్టుబడుల ద్వారా అభివృద్ధి పథకాలు స్థాపించడం, మిగులు మనుషులు తయారవడం అనేవి ఒకే నాణేనికి రెండు ముఖాలుగా, అంటే విడదీయలేని రెండు విభిన్న పార్శ్వాలుగా ఉండి, వాస్తవ ప్రపంచంలో పెట్టుబడి పెరిగిన కొద్దీ ఈ మిగులు మనుషులు తయారవడం గమనించవచ్చును. ఈ తప్పని పరిస్థితులలో ఎన్నో అభివృద్ధి పథకాల అమలు తర్వాత కూడా అంతకంతకూ పెరుగుతూ వస్తున్న ఈ మిగులు మనుషుల ఉనికిని సిద్ధాంతీకరించడం సామాజిక శాస్త్రవేత్తలకు తప్పలేదు.

ఇక పెట్టుబడి దృక్పథంతో చూస్తే సాంకేతిక నైపుణ్యంలేని కారణంగా వీరు మిగులు ఉత్పత్తి చేసే మనుషులుగా అదృశ్యులు (కనిపించరు) కాని సమాజంలో వస్తున్న మిగులు ఉత్పత్తిలో అధికారికంగా వాటాకోరే మనుషులుగా దృశ్యులు (కనిపించేవారు). ఈ అభివృద్ధి నేపథ్యంలో చూస్తే, ప్రభుత్వ దృక్పథంలో సమాజ అభివృద్ధి క్రమంలో భాగస్థులుగా అదృశ్యులు, ఎన్నికల రాజకీయాలలో సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని పెంచే మనుషులుగా దృశ్యులుగా మారారు.

తెలుగు సాహిత్యంలో బుర్రా రాములు రాసిన ఏడో సారా కథలో మనుషులు ఈ ప్రపంచంలో చనిపోయినప్పటికీ స్వర్గంలో ప్రవేశం దొరకని వాటిని వర్ణిస్తూ చెప్పిన 'దృశ్యాదృశ్య సమూహం' అనే మాట మిగులు మనుషులకు సరిగ్గా వర్తిస్తుంది. ఈ దృశ్యాదృశ్య సమూహం భౌతికంగా తమ అస్థిత్వాన్ని ఆధునిక వ్యవస్థలో చూసుకున్నా, సంస్కృతి పరంగా పాత సాంప్రదాయిక వ్యవస్థలోనే స్థానీకరించుకుంటారు. తమ అవసరాలకు అనుగుణంగా ఆర్థిక వ్యవస్థని తామే తయారు చేసుకుని, పెనుగాలిలో ఎగిరే గాలి పటంలా తాడూ బొంగరం లేనట్లుగా తమదైన గమనం లేకపోవడంతో త్రిశంకు స్వర్గం తీరుగా రక్షణగాని స్థిరత్వం గాని లేని జీవితాలు గడుపుతారు.

3.2. మిగులు మనుషులు అంటే

మనదేశంలో గత ఏడు దశాబ్దాల పారిశ్రామీకరణ ప్రయోగంలో డ్యాములు, భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసిన క్రమంలో భూమి అవసరం అన్నింటిలోనూ ఒక సర్వ సాధారణ అంశంగా ముందుకు వస్తుంది. ఇలా జరిగే భూసేకరణల వల్ల తప్పని సరిగా స్థానిక ప్రజలను వారికి అందుబాటులో ఉండే సహజ వనరులు, జీవనాధారం, జీవనశైలి అన్నింటి నుండి నిర్వాసితులుగా చేసివేసి బలవంతంగా మరొక వ్యవస్థలోనికి తోసివేయవలసి వస్తుంది. వీరిలో భూమి, అడవులు, ఖనిజ సంపద, నదులు మొదలైన తమ సహజ వనరులతో పాటు తమ జ్ఞానం, నైపుణ్యం కూడా పోగొట్టుకునే ఆదివాసులు అధికంగా ఉంటారు. వీరిని అభివృద్ధి అనే ప్రవాహంలో మునిగిపోతున్నవారుగా గుర్తించవచ్చును. అంతేకాక, ఈ అభివృద్ధి పథకాలు విజ్ఞానం, సాంకేతిక నైపుణ్యం కేంద్రంగా ఉండడంతో వీటికి ఎక్కువ సాంకేతిక నైపుణ్యత ఉన్న శ్రామికులు అతి తక్కువ సంఖ్యలో కావలసివస్తుంది. నైపుణ్యత తక్కువగా ఉన్న కారణంగా ఈ నిర్వాసితులకు ఆధునిక పథకాలలో ఉద్యోగావకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. ఈ కారణంగా మిగులు మనుషులు ఆధునిక సమాజపు అంచులలోనికి నెట్టివేయబడి, మనుపటి తమ సాంప్రదాయిక వ్యవస్థలోనూ, ప్రస్తుత ఆధునిక వ్యవస్థలోనూ కూడా తమ స్థానాన్ని, పాత్రని కోల్పోవడం జరుగుతుంది. మనదేశంలో పేద ప్రజానీకమనీ, దారిద్ర్య రేఖకి కింద ఉండేవారనీ, నిరుద్యోగులనీ, ఆహార సబ్సిడీ ఉంటే కాని బతకలేని వారనీ, అత్యవసర పరిస్థితులలో స్వాస్థ్య సేవల ఖర్చులను భరించలేని వారినీ సంఘ విద్రోహులనీ, సంఘం చేత బహిష్కరించడినవారనీ ఇలా పలు విధాలుగా వర్ణించే ప్రజా సమూహాలు మనదేశంలో ఉరమరగా 70 శాతం -80 శాతం వరకూ ఉంటారని ఒక అంచనా.

3.3. మిగులు మనుషుల నిర్వచనం విశాలం చేస్తే

మిగులు మనుషులు అంటే డ్యాములు, ఫ్యాక్టరీలు మొదలైన అభివృద్ధి పథకాల నిర్మాణం ద్వారా తమ స్థావరాల నుండి బలవంతంగా నిర్వాసితులయ్యే ప్రజానీకమేనని ఒక అపోహ సమాజంలో ఉంది. ఈ భావనని విశాలం చేసి అభయారణ్యాలు, ఎక్స్‌ప్రెస్ హైవేస్, అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఫ్లై ఓవర్లు, మెట్రో రైళ్లు మొదలైన ఎన్నో అభివృద్ధి పథకాలేకాక, వివిధ రంగాలకు సంబంధించి ప్రభుత్వం తయారు చేసే విధానాలు కూడా ఆచరణలో అక్కడి ప్రజలను తమ జీవన శైలి నుండి దూరం చేస్తాయి. ఉదాహరణ అల్యూమినియం స్టీలు గిన్నెల తయారీ మొదలుపెట్టిన తరువాత కుమ్మరి, బట్టల మిల్లులు వచ్చిన తరువాత సాలె పని వాళ్లు, వ్యవసాయంలో వ్యాపార పంటలకు చెందిన విధానాలు

వచ్చిన తరువాత వ్యవసాయ కూలీలు, పేద రైతులు మొదలైనవారు తమతమ జీవనాధార పనుల నుండి తోసివేయబడతారు.

ఈ నేపథ్యంలో మిగులు మనుషుల నిర్వచనాన్ని విశాలం చేస్తే, ఈ పరిధిలోనికి అభివృద్ధి పథకాలు, విధానాల ద్వారా తమ వనరులతో పాటు తమ మనుగడను కూడా కోల్పోతూ ఉన్నవారు కలిసిపోతారు. వీరిని ఆర్థికపరమైన విభజన ద్వారా గుర్తించదలచుకుంటే, ఈ కాటగరీలో వ్యవసాయ కూలీలు, పేద, మధ్యతరగతి రైతులతో పాటు చేతి వృత్తుల వారు, పట్టణ పేదలు, నిరుద్యోగులు మొదలైన వారు వస్తారు. సాంస్కృతిక విభజన ద్వారా చూస్తే, ఆదివాసులు, అంటరాని వాళ్లు, తక్కువ కులస్తులు ఈ గ్రూపులోకి వస్తారు. ఎలా చూసినా కూడా వీరి సంఖ్య గణనీయంగా ఉండడం, వీరు సమాజ వేదిక మీద స్పష్టంగా కేంద్ర స్థానం ఆక్రమించడంతో, ప్రభుత్వం ఇచ్చే పేదరిక నిర్మూలన పథకాలకు, సంక్షేమ పథకాలకు, స్వచ్ఛంద సంస్థలకు, మత సంస్థలకు, నక్సలైట్లు మొదలైన వారి ఆచరణకి కేంద్రంగా మారారు.

పెట్టుబడి ప్రభావంతో మనదేశం లాంటి దేశాలలో వస్తున్న మార్పులను విశ్లేషిస్తూ, తయ్యాబ్ మహమ్మద్ (సియాటిల్ లా యూనివర్సిటీలో న్యాయశాస్త్రంలో ప్రొఫెసర్) దేశంలో సామ్రాజ్యవాద పెట్టుబడి రాకకీ మిగులు మనుషులు తయారవడానికి విడదీయలేనటువంటి సంబంధం ఉందని అభిప్రాయపడ్డారు. నూతన ఆర్థిక విధానాల ద్వారా వ్యవస్థలను పునర్ నిర్మించి ప్రభుత్వ బాధ్యతలను కూడా మార్చివేస్తున్న గత 30 సంవత్సరాలలో పట్టణ పేదలు, వ్యవస్థ అంచులలోకి తోసివేయబడ్డ ప్రజలు (మామూలుగా మిగులు మనుషులు అని పిలువబడే వాళ్లు) తయారయ్యే క్రమం గురించి నొక్కి చెపుతూ, ఆయన వెలిబుచ్చిన అభిప్రాయం ప్రకారం. అభివృద్ధి క్రమంలో పెట్టుబడి స్థానిక ప్రజలకు, వనరులు, వాటి మీద ఉండే అధికారాల నుండి ఉద్వాసన చెప్పినప్పుడు, సాంప్రదాయ వ్యవస్థలో జీవనాధారంతో పాటు వారికుండే హక్కులు, అధికారాలు నాశనమైపోయి ఈ నిర్వాసితులను నూతన ఉత్పత్తి క్రమం ఇముడ్చుకోలేపోయింది.

దీనికి కారణాలు అన్వేషిస్తూ, "ఇలా కొత్త వ్యవస్థ తనలో ఇముడ్చుకోలేక పోయిన వీరు ఒక రకంగా స్వతంత్రులుగా ఉన్నట్లు కన్పించినప్పటికీ, కుంచించుకుపోతూ ఉన్న సాంప్రదాయిక వ్యవస్థకీ ఒడిదుడుకులకు లోనయ్యే మార్కెట్ ఆధారిత వ్యవస్థకీ మధ్య వేలాడుతూ ఉంటారు. ఇలా ఇమిడిపోలేక బయటే ఉండిపోయిన ప్రజలను మిగులు మానవులు" అని ఆయన వివరించారు.

వీరు తమ అవసరాలు తీర్చగలిగే, తమ స్వంతమైన 'నీడ్ ఎకానమీ'ని సృష్టించుకొని దాని ద్వారా జీవనం కొనసాగిస్తారు. పెట్టుబడిదారీ వ్యవస్థకి ఈ ఇన్‌ఫార్మల్ నీడ్ ఎకానమీ తోడు విడిచిపెట్టని సహచరుడుగా ఉనికిని సాగిస్తాడు. మరి కొందరు దీనినే 'సృజనాత్మక విధ్వంసం' అని పేర్కొంటూ, ఇక్కడ బీదరికం, అసమానతలు పెరుగుతూనే ఉంటాయని అన్నారు.

మరొక సామాజిక శాస్త్రవేత్త కల్యాణ్ సన్యాల్ పెట్టుబడిదారీ విధానం గురించి పునరాలోచన చేస్తూ మిగులు మనుషుల గురించి విశ్లేషించారు. వారి ఆలోచనలో, మూడవ ప్రపంచ దేశాలు గ్లోబల్ పెట్టుబడిదారీ నెట్‌వర్క్‌లో భాగమైన సందర్భంలో,

దాన్ని సమర్థవంతంగా ఉత్పత్తి చేసి సంపదను వితరణ చేయగల సామర్థ్యం ఉన్నదన్న కారణంగా ప్రపంచం పెట్టుబడిదారీ వ్యవస్థని ఆహ్వానిస్తున్నప్పుడు, సమాజపు అంచులకు తోసివేయబడ్డ పేదలు, నేరస్తులు, తిరుగుబోతులు, మానసిక రోగులు మొదలైన వారిని సమాజంలో భాగం కానివ్వరు. వీరినే మిగులు మనుషులుగా పరిచయం చేస్తూ, వీరే ప్రపంచీకరణ శకంలో వలసానంతర పెట్టుబడికి ఒక రూపాన్ని ఇస్తారని వివరించారు. ఈ నేపథ్యంలో మనదేశం లాంటి దేశాలు పెట్టుబడి కేంద్రంగా అభివృద్ధి చెందే క్రమంలో, వీరి అభివృద్ధి అంతంత మాత్రమే ఉంటుందనీ, ఈ దశలో నిరుద్యోగ సమస్య, పేదరికం లాంటివి పెట్టుబడిదారీ వ్యవస్థలో రావలసిన ఉద్యోగాలకు ప్రతిబింబాలనీ విశ్లేషించారు. ఈ కొత్త క్యాటగరీ మనుషులు పాత వ్యవస్థలో జీవనాధారం పోగొట్టుకొని, కొత్త వ్యవస్థలో చోటు దొరకక పోవడంతో వీరు జీవిస్తూ ఉన్నప్పటికి, మనిషికి స్వాభావికంగా ఉండవలసిన అనుభూతులు, నడవడిక మొదలైన లక్షణాలను పోగొట్టుకుని ఉంటారని ఇవాన్ ఇలిచ్ వర్ణించారు.

3.4 దేశంలో పెట్టుబడి ప్రవేశం, మిగులు మనుషులు పుట్టుక

మనదేశంలో పెట్టుబడి ప్రవేశించి వ్యవస్థని ఆధునీకరించే ప్రయత్నాలు చేసే రంగాన్ని బట్టి మిగులుమనుషుల పుట్టుకకి ఎన్నో దారులు తయారవుతాయి.

1. భూముల క్రమబద్ధీకరణ, భూమి శిస్తు డబ్బు రూపేణా కట్టే పాలసీలు ప్రవేశపెట్టడం.

భూమికి ఉపయోగపు విలువ మాత్రమే ఉండి, భూమి శిస్తు వస్తు రూపేణా కట్టే అనవాయితీ ఉండి, డబ్బు ప్రమేయం చాలా తక్కువగా ఉన్న సాంప్రదాయ వ్యవస్థలో భూములను క్రమబద్ధీకరించి, భూమి సొంతదారుని గుర్తించి, ఆ భూమి మీద చెల్లించవలసిన పన్నును నిర్ణయించి, అది వస్తురూపంలో కాకుండా డబ్బు రూపంలో చెల్లించే విధానాలను ప్రవేశపెట్టడంతో, దాని పర్యవసానాలు రెండు దిశలలో వచ్చాయి. చిన్న కమతాలున్న రైతులు శిస్తును డబ్బు రూపంలో కట్టలేక భూములను కోల్పోవడం ఒక దిశ అయితే, ఎక్కడో దూరంగా ఉన్న చిన్న చిన్న గ్రామాలలో కూడా వడ్డీ వ్యాపారస్తులు పుట్టుకురావడంతో డబ్బు అవసరాల కారణంగా తమ పొలం మీద పని చేసుకునే రైతులు ఈ పొలాలను పోగొట్టుకుని బానిసలుగా మారిపోయారు. ముఖ్యంగా ఆదివాసులు డబ్బు రూపేణా పన్నులు కట్టలేని కారణంగా తమ భూములను పోగొట్టుకుని మిగులు మనుషులుగా మారిపోయారు.

2. వ్యాపార పంటల ప్రవేశం, గ్లోబల్ మార్కెట్లతో అనుసంధానం

చిన్న చిన్న గ్రామాలలో కూడా గ్లోబల్ మార్కెట్లకి అవసరమైన పత్తి, వేరుశనగ మొదలైన వ్యాపార పంటలు ప్రవేశపెట్టి, వడ్డీ వ్యాపారులు, వ్యాపారులు రైతులకు సప్లయి చేయడమేకాక, పండించబోయే పంటకి ముందుగానే నిర్ధారించిన ధరకు కొనేటట్లుగా ఒప్పందం చేసుకుంటారు. కాని వాతావరణంలోనూ, మార్కెట్ల ధరలలోనూ వచ్చే హెచ్చు తగ్గుల కారణంగా ఊహించుకున్న పంటలు చేతికి అందకపోవడం, ఇటువంటి నష్టాలే మళ్లీ మళ్లీ రావడంతో చిన్న రైతులు తమ భూములను అమ్ముకొని మిగులు మనుషులుగా మారిపోవడం జరుగుతుంది. ఈ క్రమాన్ని అతి సహజంగా కా.రా. రచించిన 'యజ్ఞం' కథ వివరిస్తుంది.

3. అటవీ చట్టాలు, ఆదివాసుల ప్రవేశానికి, అటవీ ఉత్పత్తుల వాడకానికి సంబంధించిన విధానాలు.

ఆదివాసులకు తమ జీవనాధారమే కాకుండా సంస్కృతిలో భాగమైన అడవులలోనికి ప్రవేశాన్ని, అటవీ ఉత్పతుల వాడకాన్ని నిషేధించే అటవీ చట్టాలు తయారు చేశారు. వీటిని అతిక్రమించినప్పుడు వేసే జరిమానాలు మొదలైన వాటి వల్ల తమ జీవన విధానాన్ని పోగొట్టుకొని వ్యవసాయ కూలీలుగా, కాంట్రాక్టు లేబర్‌గా, పాలేర్లుగా మారిపోయారు. మిగులు మనుషులలో భాగం అయిపోయారు.

4. అభివృద్ధి పథకాలు, విధానాల రూపంలో అభివృద్ధి ప్రవేశం.

మనదేశంలో సహజ వనరులు పుష్కలంగా ఉన్న ప్రాంతాలలోనికి అభివృద్ధి పథకాల ద్వారా పెట్టుబడి ప్రవేశించి, స్థానిక సముదాయాలను నిర్వాసితులను చేసి వేసింది. వీరికి ప్రభుత్వం పునర్నిర్మాణ సౌకర్యాలు అందించినప్పటికి, వారు నూతన వ్యవస్థలో స్థానం సంపాదించలేక పోవడంతో ఎక్కువ సంఖ్యలో మిగులు మనుషులు తయారై పోయారు.

5. పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణ విధానాలు.

గత రెండు దశాబ్దాలలో ప్రపంచీకరణ వల్ల దేశంలో ఆధునికత వేగం అధికమవడంతో, అన్ని దేశాల పెట్టుబడులు అడ్డంకులు లేకుండా మనదేశంలో ప్రవేశించడానికి మార్గం సుగమం కావడంతో అభివృద్ధి క్రమంలో పెట్టుబడికి ముఖ్యపాత్ర ఆపాదించబడింది. ఈ దశలో జరిగిన అధికోత్పత్తి పద్ధతులకు, దీనితో పాటు ప్రపంచ దేశాలతో అనుసంధానించబడే సేవారంగం జతకలిసినప్పుడు, మనదేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భాగం అయిపోయింది. ఈ సమయంలోనే మన వ్యవసాయరంగంలో ప్రపంచ మార్కెట్ డిమాండ్ ప్రకారం ఎగుమతులే ప్రధానంగా ఉండే పిల్ల మక్క లాంటి పంటలు ప్రవేశపెట్టబడ్డాయి. ఇదే కార్పొరేట్ వ్యవసాయం. ఇక్కడ మన వ్యవసాయరంగంలో విదేశీ పెట్టుబడి అంటే విదేశీ డబ్బు, విదేశీ శాస్త్రవిజ్ఞానం, విదేశీ సాంకేతిక పరిజ్ఞానం ప్రవేశించింది. తమ అవసరాలు తీర్చే పంటలు పోయి ఎగుమతుల నిమిత్తం విదేశీ మార్కెట్లలో డిమాండ్ ఉండే పంటలు పండించడం మొదలైంది. కార్పొరేట్ వ్యవసాయం కోసం రైతులు భూమిని కంపెనీలకు ఇచ్చివేయడంతో, స్థానిక రైతులు తమ సొంత భూమినీ, తమకు ఉపయోగపడే పంటలు పండించుకోడాన్నీ, వాటి ఉత్పత్తిని గురించి తమకున్న జ్ఞానాన్ని పోగొట్టుకోవడం జరిగింది. అంతేకాకుండా తను ప్రస్తుతం పండిస్తూ ఉన్న కొత్త పంటల మీద తనకు జ్ఞానం లేకపోవడం, తన అవసరాలు తీరకపోవడం, మునుపు తనకున్న ఆహార భద్రత కోల్పోవడంతో, ఈ కొత్త క్రమానికి తాను నిరుపయోగమై పోవడమే కాక, తాను పండించే పంట 'కేంద్ర స్థానాకి'కి రావడంతో దాని ప్రాముఖ్యత పెరిగింది. పంట ముందుకు వచ్చి దానిని పండించే రైతు తెర వెనుకకి వెళ్లిపోయారు. క్రమంగా మిగులు మనుషులలో కలిసి పోయారు.

మనదేశంలో జరుగుతున్న అభివృద్ధి పర్యవసానాలు గుర్తు చేసుకుంటే,

1. అధిక సంఖ్యలో స్థానిక సముదాయాలను నిర్వాసితులను చేసింది. వీరు వ్యవసాయం నుండి తోసివేయబడి కొత్త వ్యవస్థలోని పరిశ్రమలలో స్థానం దొరకక, ప్రభుత్వ సహాయం మీద ఆధారపడే ప్రజలుగా, మిగులు మనుషులుగా తయారయ్యారు. ఇలా వీరికి సంక్షేమ పథకాలు అందించవలసి రావడంతో ప్రభుత్వానికి భారంగా తయారయ్యారు.

2. మిగులు మనుషులు చేసే ఉద్యమాల కారణంగా దేశంలో పెట్టుబడి యథేచ్ఛగా ప్రవేశించడానికి ఆటంకాలు ఏర్పడ్డాయి.

వీరు సమాజ పరిణామ క్రమానికి ఒక లంగరుగా పని చేస్తూ పరిణామ క్రమాన్ని అసంపూర్తిగా ఉంచి వేశారని అనుకోవచ్చును. మూడవ ప్రపంచ దేశాలలో ఈ మిగులు మనుషులు పెట్టుబడిదారీ వ్యవస్థకి శాశ్వతమైన సహచరులుగా గుర్తింపబడడంతో ఈ సమస్యకు సమాధానం వెతకవలసిన అవసరం తీవ్రతరమైంది.

4. మూడు ఉప వ్యవస్థల సహ జీవనం: ఒక ఊహా జనిత ప్రతిపాదన

పెట్టుబడి పరిణామాన్ని వివరించే మూడు దశల గురించి, మిగులు మనుషుల గురించి చెప్పిన దానికి మార్క్స్ ప్రతిపాదించిన సిద్ధాంతపు బలం వాస్తవ ప్రపంచంలో వచ్చిన ఇంపిరికల్ అబ్జర్వేషన్ నుంచి, ముఖ్యంగా ఒరిస్సా చోట్ల, స్వానుభవంతో చూచిన విషయాలను విశ్లేషించడం ద్వారా వాటిని అవగాహన చేసుకునే పద్ధతిని అనుసరించడం జరిగింది. ఈ విషయంలో సిద్ధాంత పునాది లేకపోవడంతో వాస్తవ ప్రపంచంలో కనిపించే విషయాల ఆధారంగా సిద్ధాంతాన్ని రూపొందించే ప్రయత్నం చేయడం జరిగింది.

ఒరిస్సా గ్రామాలలో సర్వే చేసిన క్రమంలో కనుచూపు మేరలో మనకు కన్పించే రంగురంగుల ప్రకృతి దృశ్యాలు, వైవిధ్యమైన ప్రజల జీవనశైలిని గమనిస్తే, ఒరిస్సా రాష్ట్రాన్ని మనం మూడు విభిన్నమైన భాగాలలో వేరువేరు ఉత్పత్తి విధానాలు ఉండే మూడు ఉప వ్యవస్థలుగా గుర్తించవచ్చును. ఒరిస్సాలో కొండ ప్రాంతమైన కోరాపుట్ విభాగంలో ఆదివాసి ప్రజలు కొండ వాలులలో పోడు వ్యవసాయం చేసుకుంటూ, వివిధ రకాల పంటలు పండించడంతో, కనుచూపు మేర స్థలంలో పంటలు పండే స్థలాలు పోగా, మిగిలిన స్థలంలో ఇరవై కుటుంబాలకు మించని గూడేలు కన్పిస్తాయి. కొంచెం కిందకి వస్తే, హిరాకుడ్ నదీ జలాలలో స్థిర వ్యవసాయం చేస్తూ, వరి పంట పండించే సంబల్‌పూర్ ప్రాంతం, ఇక తీర ప్రాంతానికి వెళితే వివిధ పరిశ్రమలు, తమలపాకులు లాంటి వ్యాపార పంటలు పండించే కటక్ ప్రాంతం కన్పిస్తాయి. మూడు విభిన్న ఉత్పత్తి విధానాలతో, వైవిధ్యమైన జీవన శైలులతో ఈ మూడు ప్రాంతాలను చూస్తే, ఒరిస్సా రాష్ట్రం ఒకే ఉత్పత్తి విధానంతో ఏఖండంగా, ఒకే ముద్దలాగా కాకుండా, మూడు విభిన్న ఉప వ్యవస్థల సహజీవనంగా, కలయికగా ఊహించుకోవచ్చును. ఈ ఊహనే మొత్తం దేశానికి వర్తింపచేస్తే, ఇండియా అనే దేశం, సామాన్యంగా ఊహించినట్లు గ్రామీణ – పట్టణ ద్వంద్వంతో కాకుండా, మూడు వేర్వేరు ఉపవ్యవస్థల కలయికగా ఊహించకోవచ్చును.

మనదేశంలో అమలవుతోన్న పెట్టుబడి కేంద్ర అభివృద్ధి పథకాలను ఫలితాలను పరీక్షిస్తే, ఇవి వాస్తవంలో వైరుధ్య ఫలితాలను ఇవ్వడం మనకు కన్పిస్తుంది. సిద్ధాంతపరంగా చూస్తే, మన వ్యవస్థలో పెట్టుబడి ప్రవేశించినప్పుడు మన సమాజంలోని గ్రామీణ వ్యవస్థ క్రమంగా క్షీణించిపోతూ, ఆధునిక వ్యవస్థకి దారి ఇవ్వవలసి ఉంటుంది. కాని ప్రస్తుత నేపథ్యంలో మన గ్రామీణ వ్యవస్థ పట్టణ వ్యవస్థలో క్రమంగా కలిసిపోకుండా, తన ఉనికిని కొనసాగించుడమే కాకుండా బలపడుతూ ఉందనే సాక్ష్యాలు కన్పిస్తాయి.

ప్రస్తుత నేపథ్యంలో మూడవ ప్రపంచ దేశాలలో సమాజాన్ని ఎన్నో రకాలుగా నిపుణులు వర్గీకరించారు. గ్రామీణ – పట్టణ కలయిక అని ఆర్థర్ లూయిస్ వర్ణిస్తే, సాంప్రదాయ ఆధునిక వ్యవస్థల కలయికగా స్టిగ్‌లిట్జ్ విశ్లేషించాడు. సన్యాల్ లాంటి నిపుణులు ఫార్మల్ – ఇన్‌ఫార్మల్ కలయికగా చూస్తే, సాంప్రదాయ మార్క్సిస్టులు భూస్వామ్య – పెట్టుబడిదారీ వ్యవస్థల కలయికగా గుర్తించారు. ఇన్ని వేర్వేరు వర్గీకరణలు ఉన్నా కూడా వీటన్నిటి వెనుక సమాజ అభివృద్ధికి కావలసిన ముఖ్యమైన వనరు పెట్టుబడి మాత్రమేననే భావన ఉంది. వీటికి విరుద్ధంగా ఉత్పత్తికి కావలసిన వనరుల కొరతలో తేడాల ఆధారంగా వ్యవస్థల ప్రత్యేకతలను గుర్తించవచ్చునని మేం భారతి, రావు ప్రతిపాదన చేశాం. ఈ నమూనాలో ఉత్పత్తికి కావలసిన పెట్టుబడి, శ్రమ, భూమి అనే వనరులలో ఒక నేపథ్యంలో ఒకే ఒక వనరుని పెంచినప్పుడు మాత్రమే ఉత్పత్తిలో పెరుగుదల సాధ్యం. ఈ వనరుల కొరత ఆధారంగా వ్యవస్థలను శ్రమకొరత, భూమికొరత, పెట్టుబడి కొరతల ఆధారంగా గుర్తించవచ్చును. ఈ నమూనాలో ఉన్న ముఖ్యమైన షరతు ఒక కొరత ఆధారంగా సమీకరించబడుతున్న వ్యవస్థ మరొక కొరత ఆధారంగా సమీకరించబడే వ్యవస్థగా మారడమే అభివృద్ధి అని, దీనిలో ఒకేసారి రెండు మెట్లలో జరుగవలసిన మార్పుగా ప్రతిపాదించారు. అంతే కాకుండా ఒక నూతన నాయకత్వం – తమ సమాజపు భవిష్యత్తుని గురించిన ముందుచూపు ఉన్న నాయకత్వ ఆవిర్భావంలోనే సాధ్యమనే ప్రతిపాదన కూడా ఉంది. మార్పు రెండు మెట్లలో ఒకేసారి జరుగకపోయినా, లేక సమాజంలోని ప్రజలు అభివృద్ధి కార్యక్రమాలను సొంతం చేసుకోలేపోయినా కూడా సమాజ పరివర్తన అసంపూర్ణంగా ఉండిపోతుంది. కొత్త వ్యవస్థ కూడా పాత వ్యవస్థ ప్రభావానికి గురి అవుతుంది. ఒకేసారి జరుగవలసిన ఈ రెండు క్రమాలే 'నిర్మాణం – విధ్వంసం' అని కూడా చూడవచ్చును.

ఇలా సమాజ పరిణామం అసంపూర్ణంగా ఉండి పోవడానికి, అంటే పైన చెప్పిన రెండు క్రమాలు ఒకే సమయంలో జరుగకపోవడానికి కారణాలు సమాజ అభివృద్ధికి ఎంచుకోబడిన ఆపరేటర్ అంటే పెట్టుబడి ఆధారిత అభివృద్ధి పథకాలు తీసుకొస్తున్న మార్పులకు, సమాజానికి అవసరమైన మార్పులకు సంతులనం లేకపోవడం అవవచ్చును. ఇంకొక కారణం తమ భవిష్యత్తుని గురించిన ముందుచూపు ఉన్న కొత్త నేతృత్వం ఇంకా ఆవిర్భవించకపోవడం, లేక ప్రజలు సమాజంలో ప్రవేశపెడుతున్న ఆపరేటర్‌ని తమసొంతం అని భావించలేకపోవడం గా భావించవచ్చును.

ప్రస్తుత నేపథ్యంలో పై చట్రంలో మన ఆర్థిక వ్యవస్థని ఒక మొత్తంగా చూస్తే, ఈ మొత్తాన్ని మూడు విభిన్న వ్యవస్థల సహజీవనంగా ఊహించుకోవచ్చును. ఈ కలయిక రాష్ట్రాల పరంగా చూస్తే కూడా, వీటి నిష్పత్తులలో తేడాలు ఉండవచ్చును, కాని ఈ మూడింటి కలయిక కన్పిస్తుంది. ఒరిస్సా లాంటి రాష్ట్రంలో శ్రమ కొరత వ్యవస్థ అధిక భాగం ఉంటే, గుజరాత్ లాంటి రాష్ట్రాలలో పెట్టుబడి కొరత వ్యవస్థ భాగం అధికంగా ఉంటుంది. ఒకే దేశంలోని ప్రాంతాలలో తేడాలున్న కొరత సమాజాలు ఉండడానికి కింద సూచించిన అంశాలు కారణాలు అవవచ్చును.

ఎ) చారిత్రక పరిణామ క్రమంలో జమీందారీ, రైత్వారీ మొదలైన వేరువేరు పన్ను పద్ధతులు ప్రవేశపెట్టడంతో, వాటి అమలు ఆ ప్రాంత ప్రగతిని నిర్దేశించవచ్చును.

బి) భూమి మీద ఉండే హక్కుల ఆధారంగా అంటే భూమి మీద ఉండే ఉపయోగపు హక్కు, యాజమాన్యపు హక్కు, అమ్మకపు హక్కు మొదలైన వాటి ఆధారంగా వేరువేరు వ్యవస్థలు రూపు తీసుకుంటాయి.

సి) ఉత్పత్తిలో వాడుకోగలిగిన ప్రకృతి మీద ఉండే జ్ఞానం బట్టి, వనరుల అందుబాటుని బట్టి ఉత్పత్తి క్రమంలో సమాజం ఎదుర్కొనే వనరు కొరతని బట్టి వేర్వేరు వ్యవస్థలు వస్తాయి.

ఉప వ్యవస్థల మధ్య పరస్పర సంబంధాలు

మన ఆర్థిక వ్యవస్థ అనే దాన్ని ఒక మొత్తంగానూ, పైన చెప్పిన మూడు ఉప వ్యవస్థలు ఆ మొత్తంలో అంతర్భాగాలు గానూ ఊహించుకుంటే, ఈ అంతర్భాగాల మధ్యన సరైన అంతస్సంబంధాలు ఉండవలసిన అవసరం ఉండి, ఈ ద్వైపాక్షిక సంబంధాలు ఒక వ్యవస్థకి కావలసిన వస్తు, సేవల మారకంలో కన్పిస్తాయి. ఈ మూడు వ్యవస్థలలో ప్రకృతి మీద ఉండే జ్ఞానం, దానితో పాటే ఉత్పత్తులు కూడా వేరువేరు స్థాయిలలో ఉంటుందని అనుకోవచ్చును, ఈ మూడు ఉప వ్యవస్థలలో పెట్టుబడి కొరత వ్యవస్థ సైన్సు, సాంకేతిక విజ్ఞానాల మీద ఆధారపడడం వల్ల ఇది అన్ని విషయాయాలలో మిగతా వాటి కంటే పై అంతస్తు సంపాదించుకుంటుంది. అందుచేత కింది స్థాయిలలో ఉండే మిగత రెండు వ్యవస్థలతో ఉండే సంబంధాలు ఏకపక్షంగానే ఉంటాయి. శ్రమ కొరత ఉండే మొదటి వ్యవస్థకి మిగతా వ్యవస్థలతో ఉండే సంబంధాలు పరిశీలిస్తే, ఎంతో విలువైన అటవీ ఉత్పత్తులు, కొన్ని ఖనిజాలు, నైజర్ లాంటి నూనె గింజలు మారకం చేసి, దానికి బదులుగా వారు పొందేవి ఉప్పు, కిరసనాయిలు, కొన్ని ప్లాస్టిక్ ఫాన్సీ వస్తువులు మాత్రమే. ఇలా సరైన ద్వైపాక్షిక సంబంధాలు లేని స్థితిలో అవి ఒకే వ్యవస్థ అనే మొత్తంలో భాగం అయ్యే అవకాశం ఉండదు.

ఉప వ్యవస్థల సహజీవనం : దాని పర్యవసానాలు

1. గ్రామీణ వ్యవస్థ క్రమక్రమంగా ఒక శేషంగా మిగిలిపోయి అంతర్ధానమై పోకుండా, స్వతంత్రమైన, విభిన్నమైన రెండు సజీవమైన ఆర్థిక నిర్మాణాలుగా కన్పిస్తాయి. ఈ శ్రమ కొరత, భూమి కొరత వ్యవస్థలను కలిపివేసి, ఒక్కటే గ్రామీణ (రూరల్) వ్యవస్థగా భావిస్తే, ఈ సమాజం మొత్తానికి ఒకే రకంగా అభివృద్ధి ప్రణాళికలను రూపకల్పన చేయడంతో సమస్యలు సృష్టించబడతాయి. ఈ సందర్భంలో ఊహించిన ఫలితాలకు వాస్తవ ప్రపంచంలో వచ్చిన ఫలితాలకు పొంతన లేకపోవడంతో సామాజిక పరిణామ క్రమానికి అడ్డంకులు వస్తాయి.

2. నేపథ్యంలో సమాజం మొత్తానికి ఒకే ఒక స్టేట్ పవర్, ఒకే రకమైన అభివృద్ధి ప్రణాళికలు, ఒకే అభివృద్ధి మార్గం ఉండడం సాధ్యం కాదు. సమాజంలో సహజీవనం చేసే మూడు ఉప వ్యవస్థల ప్రతినిధులు రాజ్యాధికారంలో భాగంగా ఉండడం, ఈ మూడు వ్యవస్థల అభివృద్ధి మార్గాలు వేరుగా ఉన్న కారణంగా మొత్తం సమాజంలో సంక్షోభ పరిస్థితులు చోటు చేసుకుంటాయి.

3. పెట్టుబడి కొరత సమాజంలో ఉత్పత్తులు ఉత్తమమైన శాస్త్రీయ,

సాంకేతిక పరిజ్ఞానాల మీద ఆధారపడుతాయి. సాధారణంగా అభివృద్ధి పథకాలు అంటే అభివృద్ధి అనే భావన సమాజంలో ఉండడంతో, పెట్టుబడికి సంబంధించిన విధానాలకు, పథకాలకు రాజ్యం అధిక ప్రాముఖ్యత (పాలసీ స్పేస్) ఇస్తుంది. కాని వీటి ద్వారా మిగులు మనుషులు తయారవడం, వీరికి మిగతా రెండు వ్యవస్థలు స్థానం కల్పించే పరిస్థితులలో, ఈ రెండు వ్యవస్థలు కూడా విధానాలలో తమకు సముచిత స్థానం కావాలని డిమాండ్ చేస్తాయి.

4. ఇటువంటి వైవిధ్యమైన మన వ్యవస్థలో, అభివృద్ధి ప్రణాళికలు, విధానాలు రూపంలో మరింత పెట్టుబడి ప్రవేశిస్తే, ఉప వ్యవస్థలలో విభిన్న పర్యవసానాలు ఉండడమే కాకుండా, వాటి మధ్యన ఉండే వ్యత్యాసాలు, దూరం పెరిగిపోతుంది. పేదరికం పెరిగిపోతున్న విశాల నేపథ్యంలో సంపదలు కొందరి చేతులలో పోగుపడే అవకాశం వచ్చి, వ్యవస్థ అస్థిరతకు గురై సంక్షోభంలోకి నెట్టబడుతుంది. ఇదే ప్రస్తుతం మనదేశంలో వివిధ ప్రాంతాలలో ఆందోళనలు, ఉద్యమాల రూపంలో మనకు దర్శనమిస్తోంది.

5. సంక్షోభ పరిస్థితులను అధిగమించే విధి విధానాలు

అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టడమే అభివృద్ధిగా భావించే సమాజంలో, ఈ అభివృద్ధి పథకాల స్థాపన ద్వారా ఉద్భవించే కొత్త వ్యవస్థలో స్థానం లేని మిగులు మనుషులు తయారవుతున్నారు. దీనికి ముఖ్య కారణం వారి నైపుణ్యంలోని అసమానతలు కాకుండా, ఆ పెట్టుబడి కేంద్రంగా వచ్చే పథకాలకు అతి తక్కువ సంఖ్యలో అవసరమయ్యే శ్రామికులుగా గుర్తించవచ్చును. ముందుగా చెప్పినట్లు, మూడవ ప్రపంచ దేశాలలో పెట్టుబడి కేంద్రంగా జరుగుతున్న సామాజిక పరివర్తనకు రెండు అడ్డంకులు ఎదురవుతాయి. మొదటిది మిగులు మనుషులు తయారవడం, దీనితో సంబంధించినదే రెండవ అడ్డంకి, ఒకే సమయంలో ద్వైపాక్షిక అంతస్సంబంధాలు లేని మూడు ఉప వ్యవస్థల సహజీవనం. ఈ మిగులు మనుషులను కొత్తగా రూపు తీసుకుంటున్న ఆధునిక వ్యవస్థలో భాగం చేయగలిగితే, దీని ఫలితంగా మూడు ఉప వ్యవస్థలు ఒకే వ్యవస్థగా కలిసిపోయి, సమాజం అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

ఈ నేపథ్యంలో అభివృద్ధికి చెందిన సందిగ్ధ పరిస్థితులలో, ఈ మిగులు మనుషులను కూడా ఆధునిక వ్యవస్థలో భాగం చేయగల అభివృద్ధిని తీసుకుని రావడమే మన సమాజం ముందున్న ముఖ్యమైన సవాలు. ఇలా చూసినప్పుడు, సమాజ అభివృద్ధికి రెండు ప్రత్యామ్నాయ మార్గాలు ముందుకు వస్తాయి. మొదటిది – ఇప్పటి వరకు అనుసరిస్తోన్న పెట్టుబడి కేంద్ర అభివృద్ధి మర్గాన్ని కొనసాగిస్తూ, కొత్త చట్టాలు రూపొందించి, పెట్టుబడి ప్రవేశానికి, ఉండే అడ్డంకులను తొలగించి, ఇంకా ఎక్కువగా సదుపాయాలు కల్పిస్తూ, పెట్టుబడి రాకకి మార్గం సుగమం చేసి, అధిక పెట్టుబడులను ఆహ్వానించడం. రెండవది ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న పెట్టుబడి కేంద్రిత అభివృద్ధి మార్గానికి ప్రత్యామ్నాయంగా మానవ శ్రమ చోదకశక్తిగా గల అభివృద్ధి మార్గాన్ని అన్వేషించడం.

మొదటి మార్గంలో

1. మిగులు మనుషులను ఆధునిక వ్యవస్థలో భాగం చేయగల శక్తి, సామర్థ్యాలుండే పెట్టుబడి కేంద్రిత అభివృద్ధి పథకాలను ఎంచుకోవడం.

దీని వల్ల సమాజం ఎదుర్కొంటున్న రెండు కీలకమైన సమస్యలు – సమాజంలో వృద్ధిని తీసుకుని వస్తూనే, ఈ క్రమంలో తయారవుతున్న మిగులు మనుషలను ఆధునిక వ్యవస్థలో ఇముడ్చుకొనగలగడం – అనే వాటికి సమాధానం దొరుకుతుంది. ఇది వాస్తవంలో సాధ్యపడాలి అంటే మిగులు మనుషులకు పునరావాస సదుపాయాలు కల్పించే బాధ్యత మాత్రమే కాకుండా, వారి నైపుణ్యాన్ని పెంచే బాధ్యత కూడా ప్రభుత్వం కాని, కార్పొరేట్ వ్యవస్థ కాని తీసుకోగలగాలి. దీని వల్ల వచ్చిన నినాదం 'వృద్ధి పెంచడం ప్రభుత్వ ఆశయం, సంక్షేమం దాని బాధ్యత' అని అనుకోవచ్చును. కాని ఇది ప్రభుత్వం మీద మోయలేని భారాన్ని మోపడంతో వారికి సంక్రమించే మిగులు తరిగిపోతుంది. ఇటువంటి పథకాలకు అంటే పెట్టుబడి కేంద్ర అభివృద్ధి పథకాలకు సాంకేతిక నైపుణ్యం హెచ్చుగా అవసరమైన కారణంగా, చాలా తక్కువ సంఖ్యలో నిపుణులైన శ్రామికుల అవసరం ఉంటుంది. సమాచార పత్రికలలో చెప్పినట్లు, సగటున కోటి రూపాయల పెట్టుబడి గల పరిశ్రమలలో ఒకరికే ఉద్యోగం దొరుకుతుంది. అందుచేత ఇక్కడ మిగులు మనుషులకు దొరికే ఉద్యోగావకాశాలు చాలా తక్కువగా ఉంటాయి.

రెండవ మార్గంలో

శ్రమ కేంద్రంగా ఎంచుకునే పథకాలు స్థానికంగా దొరికే సహజ వనరులు, స్థానిక ప్రజల శక్తి, సామర్థ్యాలు, నైపుణ్యం మీద ఆధారపడి తమ అవసరాలను తీర్చి తమను ముందుకు నడిపించగలవని స్థానిక ప్రజలు నమ్మినప్పుడే వాటిని సొంతం చేసుకుంటారు. అవి ఆశించిన ఫలితాలను సాధించే అవకాశం కలిగి సమాజ పరిణామానికి దారి తీయస్తాయి. ఇక్కడ ఒక ముఖ్యమైన షరతు – తమ భావి సమాజపు గమ్యం గురించిన అవగాహనతో ప్రజల వెంట నడుస్తూ, వారికి దారి చూపించగల కొత్త నేతృత్వ ఆవిర్భావంతోనే అభివృద్ధి సాధ్యం.

మరొకసారి ఈ రెండు మార్గాలను పరిశీలించితే, మొదటి మార్గం ద్వారా సమాజంలో వచ్చే మార్పుల దిశ పథకాల నుండి ప్రజలకు ఉంటే, రెండవ మార్గంలో ఈ మార్పుల దిశ ప్రజల నుండి పథకాలకు ఉంటుంది. పెట్టుబడి కేంద్ర అభివృద్ధి మార్గంలో, పెట్టుబడిదారుల ఆధ్వర్యంలో అభివృద్ధి పథకాలు తయారవడంతో, వారికే పథకాల మీద చాలా వరకు అవి తమ కొరకేనన్న భావన (ఓనర్‌షిప్) ఉంటుంది. అలా కాకుండా శ్రమ కేంద్రిత అభివృద్ధి మార్గంలో స్థానిక ప్రజలు, వారి వనరులు, వారి అవసరాల మీద ఆధారపడడంతో, ప్రజలకు ఈ పథకాలు తమ అవసరాలు తీర్చగలవనే నమ్మకం కలిగి, ఈ పథకాలు అనుకున్న ఫలితాలు ఇచ్చే అవకాశం ఉంది. అంతే కాకుండా వీటి ఆచరణలో వచ్చే తప్పులకు పరిష్కారాలు కూడా స్థానికంగా తామే అన్వేషించుకునే అవకాశం ఉంటుంది. ఇక్కడ ప్రవేశపెట్టే సంస్థలు (ఇన్‌స్టిట్యూషన్స్) కూడా స్థానిక నేపథ్యంతో, ప్రత్యేకతలతో సంబంధం ఉన్న వ్యవస్థలు అయినప్పుడు ఇవి అనుకున్న ఫలితాలు సాధించే అవకాశం ఎక్కువ ఉంటుంది.

(రచయిత సామాజిక శాస్త్రవేత్త) వీ

వ్యవసాయ రంగంలో మార్పులు - రూపమూ సారమూ

వ్యవసాయ, గ్రామీణ రంగాలలో జరుగుతున్న మార్పుల రూపాన్ని బట్టి సామాజిక పరివర్తన గురించి నిర్ధారణలకు రాగూడదనీ, సారాన్ని విశ్లేషించాలనీ అంటున్నారు ఎన్. వేణుగోపాల్

బూర్జువా ఉత్పత్తి సంబంధాలలో చిక్కుకుని ఉన్న బూర్జువా ఉత్పత్తి ప్రతినిధుల అభిప్రాయాలను వ్యాఖ్యానించడం, క్రమబద్ధం చేయడం, శుష్క సిద్ధాంత పద్ధతిలో సమర్థించడం కన్న మించి నాటు ఆర్థిక శాస్త్రం వాస్తవంగా చేసేదేమీ లేదు. అందువల్ల, ప్రాథమికంగా అర్థరహితమైన, సంపూర్ణమైన వైరుధ్యాలు కనబడే, ఆర్థిక సంబంధాల పరాయీకరించిన బాహ్య రూపాలే ఈ నాటు ఆర్థిక శాస్త్రానికి సహజమైనవిగా కనిపిస్తాయంటే, ఈ సంబంధాల అంతర్గత సంబంధాలను, సాధారణ ఆలోచనకు సులభంగా అర్థమయ్యే విషయాలను, ఎంతగా దాచిపెడితే అంత స్వయంవ్యక్తమైనట్టు నాటు అర్థశాస్త్రం భావిస్తుందంటే మనం ఆశ్చర్యపోనక్కరలేదు. కాని బాహ్య రూపాలు వస్తువుల అంతస్సారంతో నేరుగా సరిపోలినట్టయితే సకల శాస్త్రాలూ అనవసరమైపోతాయి.

– కార్ల్ మార్క్స్ (కాపిటల్, మూడో సంపుటం, పే. 797)

ఉపోద్ఘాతం

భారత వ్యవసాయ రంగంలో మన కళ్లముందరే గణనీయమైన మార్పులు జరుగుతున్నాయి. ఒక తరం జీవిత కాలంలోనే మన వ్యవసాయరంగం విపరీతమైన మార్పులకు లోనయింది. ఇవాళ నలభైల్లో ఉన్నవారు కూడ వారి బాల్యంలో చూసిన వ్యవసాయానికీ ప్రస్తుత వ్యవసాయానికీ పోలికే లేనంత మార్పు జరిగిపోయిందని గుర్తిస్తున్నారు. ఇది కేవలం వ్యవసాయ రంగంలో మార్పు మాత్రమే కాదు, మొత్తంగా గ్రామీణరంగమే మారిపోతున్నది.

వందల ఎకరాల భూస్వాములు లేరు. కట్టుబానిసల లాగ పనిచేసే జీతగాళ్లు లేరు. పశువులు చాల వరకు తగ్గిపోయాయి. పశువుల పేడ స్థానాన్ని పూర్తిగా రసాయనిక ఎరువులు ఆక్రమించాయి. మోట బావుల స్థానాన్ని బోర్ వెల్స్ ఆక్రమించాయి. సాంప్రదాయిక విత్తనాల బదులు మార్కెట్ నుంచి కొనుక్కొచ్చుకునే విత్తనాలే ప్రధానంగా ఉన్నాయి. ట్రాక్టర్లు వచ్చి నాగళ్లను తొలగించాయి. చాలచోట్ల అద్దెకైనా సరే కోతయంత్రాలు ప్రవేశించాయి. గ్రామాలకు రహదారులు ఏర్పడి రవాణా సదుపాయాలు పెరిగాయి. గ్రామానికీ పట్టణానికీ నిరంతర సంబంధం పెరిగింది. గ్రామాల్లో డబ్బు ప్రాధాన్యత, సరుకుల వాడకం పెరిగాయి. ఆహారధాన్యాల వ్యవసాయానికన్న వాణిజ్య పంటల వ్యవసాయానిదే పైచేయిగా ఉంది. గ్రామీణ వ్యవసాయంలోనూ జీవితంలోనూ ప్రధానపాత్ర వహించిన వడ్రంగం, కమ్మరి, కుమ్మరి వంటి ఉత్పత్తి కులాల వృత్తుల, ఇతర కులాల సేవా వృత్తుల అవసరం రద్దయిపోయింది, లేదా చాల తగ్గిపోయింది. వ్యవసాయ పనుల్లో యాంత్రీకరణ పెరగడంతో పనులు తగ్గిపోయాయి. గ్రామీణ శ్రామిక జనాభాలో గణనీయ భాగం వలస వెళ్లవలసి వస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాల కొరత వల్ల కూడ వలసలు పెరుగుతున్నాయి. పాత వ్యవసాయదారుల కుటుంబాలలో కూడ వ్యవసాయం మీద ఆసక్తి తగ్గిపోతున్నది. కొత్త తరం వ్యవసాయం లోకి రావడమే తగ్గింది.

ఇటువంటి మార్పులన్నీ కళ్లకు కనబడుతున్నవే. ప్రతిరోజూ ప్రచారసాధనాలలో వస్తున్నవే. ఆలోచనాపరులను ఆకర్షిస్తున్నవే. అయితే రూపంలో, దృగ్గోచరాంశాలలో స్పష్టంగానే కనబడుతున్న ఈ మార్పులను అర్థం చేసుకోవడంలో, వాటి సారాంశం ఏమిటనే విషయంలో ఆలోచనాపరుల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. చర్చలు జరుగుతున్నాయి. ఆ భిన్నాభిప్రాయాలు కేవలం ఒక సామాజిక పరిణామాన్ని ఎలా అర్థం చేసుకోవాలనే అంశానికి సంబంధించినవి మాత్రమే కాదు. ఆ మార్పులు సామాజిక పరివర్తనా వ్యూహాల మీద ఎటువంటి ప్రభావం వేస్తాయనే విషయంలో కూడ సామాజిక పరివర్తనను కోరుకునే ఆలోచనాపరులలోనే భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ మార్పులు ప్రగతిశీలమైనవనీ, వీటివల్ల సమాజ పరివర్తనా క్రమం ముందుకు నడుస్తున్నదనీ కొందరు భావిస్తుండగా, ఈ మార్పులు నిజమైన మార్పులు కావనీ, ఈ మార్పుల వెనుక సారాన్ని పరిశీలిస్తే అవి సామాజిక పరిణామం ప్రతిష్టంభనలో ఉందని చెప్పడానికి చిహ్నాలనీ మరికొందరు భావిస్తున్నారు.

సామాజిక పరివర్తనను చారిత్రక భౌతికవాద దృక్పథంతో పరిశీలించేవారిలో కూడ ఈ మార్పులు రెండు రకాల ప్రతిస్పందనలకు దారితీస్తున్నాయి. మన సమాజం భూస్వామ్య, అర్ధభూస్వామ్య దశ నుంచి పెట్టుబడిదారీ దశలోకి మారుతున్నదనడానికి ఈ మార్పులు సూచనలని కొందరు భావిస్తుండగా, మరికొందరు ఈ మార్పులు మౌలికంగా సమాజ స్వభావాన్ని మార్చడం లేదని భావిస్తున్నారు. ఈ భిన్నమైన అవగాహనల వల్ల సామాజిక పరివర్తనా వ్యూహంలో కూడ మార్పులు వస్తాయి. ఈ మార్పులవల్ల భారత ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీదశలోకి ప్రవేశించిందనుకుంటే ఇక ఈ సమాజంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటానికి స్థానం లేదనీ, జరగవలసినది పెట్టుబడిదారీ వ్యతిరేక, లేదా సామ్రాజ్యవాద వ్యతిరేక సోషలిస్టు విప్లవం అనే అవగాహన వస్తుంది. మౌలికంగా సామాజిక స్వభావం మారలేదనుకుంటే ఇక్కడ జరగవలసినది భూస్వామ్య వ్యతిరేక ప్రజాస్వామిక విప్లవమేనని అవగాహన వస్తుంది. అయితే సామ్రాజ్యవాద దశలో ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించే బాధ్యతను పెట్టుబడిదారీ వర్గం వదులుకుంది గనుక అది కార్మికవర్గ నాయకత్వంలో జరగవలసిన భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక నూతన ప్రజాస్వామిక విప్లవంగా ఉండవలసి ఉంటుందనే

అవగాహన వస్తుంది. కర్తవ్యం సోషలిస్టు విప్లవం అనుకున్నప్పుడు ఒక రకమైన పోరాట వ్యూహాలు, నూతన ప్రజాస్వామిక విప్లవం అనుకున్నప్పుడు మరొక రకమైన పోరాట వ్యూహాలు ఉంటాయి.

అంటే ప్రత్యేకంగా గ్రామాలలో, వ్యవసాయ రంగంలో, సాధారణంగా సమాజంలో వస్తున్న మార్పుల పట్ల అవగాహన ఇంకా విస్తారమైన సామాజిక పరివర్తనా అవగాహనకూ, పోరాట వ్యూహాల ఎంపికకూ దారి తీస్తుంది. అంత విస్తృతమైన పరిధి ఉన్నందువల్ల, ఆ మార్పులు కంటికి కనిపించే రూపాలు మాత్రమేనా, ఆ రూపాల వెనుక సారం భిన్నంగా ఉందా, రూపసారాలు యథాతథంగా సరిపోయే అవకాశం ఉందా పరిశీలించడం అవసరం అవుతుంది.

గ్రామీణ, వ్యవసాయ రంగ మార్పుల గురించి పైన చెప్పిన రెండో అవగాహనతో, ఈ పత్రం ఆ మార్పుల రూపాన్ని యథాతథంగా గుర్తిస్తూనే వాటి సారాన్ని విశ్లేషించడానికి ప్రయత్నిస్తుంది. కనీసం ఆ దిశగా కొన్ని ప్రశ్నలు లేవనెత్తుతుంది. ఈ మార్పుల విశ్లేషణ కేవలం వ్యవసాయ, గ్రామీణ రంగ విశ్లేషణతోనే సమగ్రం కాదనీ, ఈ మార్పులను మొత్తంగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నేపథ్యంలో, భారత బడా, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గ స్వభావాన్నీ, భారత రాజ్య స్వభావాన్నీ, భారత సమాజపు ప్రత్యేకతలైన కులం. మతం, జాతులసమస్య, పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు విస్తరణ వంటి అంశాలతో కలిపి విశ్లేషించవలసి ఉంటుందనీ ఈ పత్రం వాదిస్తుంది.

వ్యవసాయ, గ్రామీణ రంగాల్లో మార్పులు

భూస్వాములు

మన గ్రామాల్లో గతంలో లాగ వందలాది ఎకరాలు ఉండిన భూస్వాములు ఇవాళ లేరనేది స్పష్టంగా కనబడుతున్న విషయమే. భూసంస్కరణల చట్టాలు అమలు కాకపోయినప్పటికీ వాటి నుంచి తప్పించుకోవడానికి భూస్వాములు తమ భూమిని చట్టబద్ధమైన మినహాయింపుల కిందికి మార్చుకోవడం, చట్టబద్ధంగా ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవలసి ఉండిన మిగులు భూమిని బేనామీగా ఉంచుకోవడం, అమ్ముకోవడం, గ్రామీణ భూస్వామ్య వర్గాల వారసులు పట్టణ అధికార వర్గాలలోకి బదిలీ కావడం, వారసుల సంఖ్య పెరిగినందు వల్ల పంపకాలలో భూ ఆస్తి విభజన జరగడం, మధ్యంతర కులాల ఆర్థిక స్థితిలో మెరుగుదల వల్ల భూమి కొనుగోళ్లు పెరగడం మొదలైన ఎన్నో కారణాలు కలిసి గ్రామాల్లో ఏ ఒక్కరి దగ్గరా వందలాది ఎకరాలు లేని స్థితి ఏర్పడింది.

అయితే ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో వందల ఎకరాలున్న కుటుంబాలు, వ్యక్తులు ఉన్నట్టు సమాచారం ఉంది. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రచారం చేసే ఒక స్వచ్ఛంద సంస్థ దగ్గరికి సలహాలు కావాలని గత కొద్ది సంవత్సరాలలో ఐదువందల మంది భూయజమానులు వచ్చారనీ, వారిలో కనీసం రెండు వందల మంది తమకు ఐదువందల నుంచి పదిహేను వందల ఎకరాల విశాల భూక్షేత్రాలు న్నాయని చెప్పుకున్నారని, ఆ సంస్థ బాధ్యులు ఒక సదస్సులో బహిరంగం గానే చెప్పారు. అంటే చట్టంలో, కాగితం మీద ఏమి ఉన్నప్పటికీ, వాస్తవంలో వ్యక్తిగత, కుటుంబ యాజమాన్యంలో విశాల భూక్షేత్రాలు ఉన్నాయి. అది మినహాయింపే తప్ప సాధారణ స్వభావం కాదనీ, విశాల భూక్షేత్రాల యజమానులు అనే అర్థంలో భూస్వాములు లేరు అనీ కూడ వాదించేవారున్నారు. అయితే ఆ వాదన ఎంత సులభంగా చేయగలమో భూస్వామ్య స్వభావం, ప్రవర్తన గల పెత్తందార్లు లేరని, గ్రామాల్లో, ఆ మాటకొస్తే పట్టణ ప్రాంతాల్లో కూడ సమాజంలో భూస్వామ్య స్వభావం లేదని అంతే సులభంగా చెప్పలేం. కనుక భూస్వాములు లేరు అని అంగీకరించినప్పటికీ భూస్వామ్యం ఉందా లేదా పరిశీలించవలసే ఉంది.

గతంలో అనుపస్థిత (గైర్హాజరీ) భూస్వామ్యం – కాగితం మీద భూ యజమానులై వాస్తవంగా గ్రామంలో ఉండని, వ్యవసాయం స్వయంగా చేయని భూస్వామ్య వర్గం – అనే ప్రత్యేక తరగతి ఉండేది. ఇప్పుడు దాని స్థానాన్ని సాగు చేయని వ్యవసాయ కుటుంబాలు అనే కొత్త తరగతి ఆక్రమించింది, ఆక్రమిస్తున్నది. పేరు ఏదైనా, వ్యవసాయంతో సంబంధం లేని ఒక వర్గం భూయాజమానులుగా ఉన్నదనడానికి ఇది సూచన. ఈ భూయాజమాన్య వర్గం కౌలుదార్ల ద్వారా భూమి సాగు చేయించి, వ్యవసాయ మిగులును రాబడుతున్నది. ఇతర ప్రాంతాలకు, విదేశాలకు వెళ్లి, అక్కడే స్థిరపడిన వారు కూడ తమ మిగులు డబ్బును భూమి కొనుగోలు మీద ఖర్చు పెడుతున్నారు. దేవాదాయ, ధార్మిక సంస్థలు, సహకారసంఘాలు, తోటలు, ఫార్మ్ హౌజులు, రిసార్టులు, ప్లాంటేషన్లు, శిథిల భవన స్థలాలు, ప్రత్యేక ఆర్థిక మండలాలు వగైరా అనేక పేర్లతో చట్టబద్ధమైన, చట్టవ్యతిరేకమైన పద్ధతులలో గరిష్ఠ పరిమితిని మించిన భూమి కలిగిన యజమానులు ఎందరో ఉన్నారు.

అలాగే భారత సమాజంలో భూస్వామ్యానికి యూరప్‌లో లాగ మతం వత్తాసుతోపాటు, బహుశా అంతకన్న ఎక్కువగా కుల వత్తాసు ఉంది. యూరప్ లో బూర్జువా ప్రజాస్వామిక విప్లవంతో పాటు జరిగిన మత సంస్కరణల వంటివి ఇక్కడ జరగలేదు. బూర్జువా ప్రజాస్వామిక విప్లవం జరగకుండానే అంటు కట్టినట్టుగా వచ్చిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కుల మతాలను బలోపేతం చేస్తూ తాను బలపడింది. అందువల్ల ఇవాళ భారత భూస్వామ్యానికి విశాల భూక్షేత్రాలు లేకపోయినా, అంతకన్న విశాలమైన సామాజిక క్షేత్రాన్ని కులం, మతం, పార్లమెంటరీ ప్రజాస్వామిక నిర్మాణాలు సమకూర్చిపెడుతున్నాయి. గ్రామంలో ప్రధాన ఉత్పత్తి సాధనమైన భూమి మీద గుత్తాధిపత్యం తగ్గిందేమో గాని, ఇవాళ గ్రామంలో పెత్తందారీ అధికారాన్ని నెరపడానికి భూయాజమాన్యం ఏకైక, లేదా ప్రధాన ఆధారం కాదు. భూమితో పాటు ఇసుక, గ్రనైట్, కలప, అటవీ ఉత్పత్తులు వంటి స్థానిక వనరులు, రియల్ ఎస్టేట్, రవాణా, ఫైనాన్స్, సారా వంటి వ్యాపార లావాదేవీలు ఆధిపత్యాన్ని ఇస్తున్నాయి. కుల, మత, సమూహ, రాజకీయ ఆధిపత్యం, ప్రభుత్వాధికారులతో, ముఖ్యంగా పోలీసు, బ్యాంకు, రెవెన్యూ అధికారులతో, రాజకీయ నాయకులతో, అందులోనూ అధికారపార్టీ రాజకీయ నాయకులతో సంబంధాలు, పాత భూస్వామ్య అధికారం కన్న ఎక్కువ అధికారాన్ని ఇస్తున్నాయి. ఈ కొత్త భూస్వామ్య–దళారీ–పైరవీకార్ వర్గానికి భూమి మీద, గ్రామంలోని ఉత్పత్తి సాధనాల మీద ఎంత యాజమాన్యం ఉన్నదనే ప్రశ్న ముఖ్యమైనదే గాని, దానికి గ్రామంలోని ఉత్పత్తి సంబంధాల మీద, సామాజిక సంబంధాల మీద ఆధిపత్యం ఉన్నదనేది కూడ అంత ముఖ్యమైన సూచికే. ఈ కొత్త పాలకవర్గంలో పాత భూస్వామ్య కుటంబాల నుంచి వచ్చినవారూ ఉంటున్నారు, కొత్తగా మధ్యంతర కులాల నుంచి వచ్చినవారూ ఉంటున్నారు.

జీతగాళ్లు

గతంలో భారత వ్యవసాయ రంగంలో రైతుల దగ్గర, భూస్వాముల దగ్గర అతి తక్కువ వేతనాలకు, నియమిత పనిగంటలు లేని జీతగాళ్లు కట్టుబానిసలుగా పని చేస్తుండేవారు. ఈ జీతగాళ్ల వ్యవస్థ చాల చోట్ల ఇప్పుడు కనబడడం లేదు. గతంలో ఉండిన జీతగాళ్ల సంఖ్యలో పదో వంతు కూడ ప్రస్తుతం లేరు. జీతగాళ్ల పని పరిస్థితులు కూడ కొంతవరకు మెరుగయ్యాయి. ఇది ప్రధానంగా భూస్వామ్యానికి ఒక చిహ్నమైన ఆర్థికేతర పీడనలో భాగం గనుక ఈ వ్యవస్థ రద్దు కావడమంటే భూస్వామ్యం రద్దయిపోవడమేనని కొందరు పరిశీలకులు భావిస్తున్నారు. జీతగాళ్ల వ్యవస్థ తప్పనిసరిగా భూస్వామ్య పీడనకు, ఆర్థికేతర దోపిడీకి చిహ్నమే. కాని అది రద్దయిపోవడమే మరొక ప్రగతిశీల నిర్మాణం రూపొందిందనడానికి సూచన కాదు. నిజానికి అది పూర్తిగా రద్దయిందా, రూపం మార్చుకుందా, ఆ బహిరంగ పీడనా రూపం మారి ప్రచ్ఛన్న పీడనా రూపాలు వచ్చాయా అని చర్చలు జరుగుతూనే ఉన్నాయి. జీతగాళ్లు తగ్గడం, రద్దు కావడం అనేది ఒక రూపపరమైన మార్పు అయితే, దాని సారం అర్థం కావాలంటే చాల ప్రశ్నలు వేసుకోవలసి ఉంటుంది. ఆ జీతగాళ్ల ప్రస్తుత జీవనోపాధి ఏమిటి? వారి జీవితాలు మెరుగుపడ్డాయా, దిగజారాయా? అసలు వారికి ప్రస్తుతం ఏదైనా ఉత్పత్తి కార్యక్రమంలో భాగం ఉందా? వారు గతంలో చేస్తుండిన ఉత్పత్తి కార్యక్రమం ఇప్పుడు ఎలా జరుగుతున్నది? ఆ జీతగాళ్లకూ వారి పాత యజమానులకూ, ఇతర గ్రామస్తులకూ మధ్య సంబంధాలు ఎలా ఉన్నాయి? ఈ ప్రశ్నలకు జవాబులు సంపాదించకుండా జీతగాళ్లు అదృశ్యం కావడమే అర్ధభూస్వామ్య ఉత్పత్తి సంబంధాలు రద్దయ్యాయన డానికీ, పెట్టుబడిదారీ స్వేచ్ఛాశ్రామికులు పుట్టుకొచ్చారనడానికీ చిహ్నమని చెప్పడం కుదరదు.

చేతివృత్తుల పతనం

గ్రామం మారిపోయింది అని ఎవరికైనా అనిపించడానికి ప్రధాన ఆధారం గ్రామాలలోని చేతివృత్తులు అంతరించి పోవడం. పాత భూస్వామ్యం కింద ఆర్థికేతర పీడనా రూపాలలో ప్రధానమైనదిగా ఉండిన చేతివృత్తుల వ్యవస్థ దాదాపుగా రద్దయిపోయింది. ముఖ్యంగా వ్యవసాయానికి అనుబంధంగా, అత్యవసరంగా ఉండిన వడ్రంగం, కమ్మరి, కుమ్మరి వృత్తులు ఆధునిక పారిశ్రామిక పరికరాల వల్ల అనవసరమైనవిగా మారిపోయాయి. గ్రామీణ జీవితంలో ప్రధాన వృత్తిగా, చిన్నస్థాయి వ్యవసాయాధార పరిశ్రమగా చెప్పదగిన నేత వృత్తి దాదాపుగా అంతరించింది. వ్యవసాయం మీద, గ్రామ శివార్లలోని చిట్టడవుల మీద, చెరువులు, వాగుల మీద ఆధారపడిన గొల్ల, తెనుగు, బెస్త వంటి కులాలకు తగిన జీవనోపాధి దొరకక అవి కూడ శిథిలమవుతూ వచ్చాయి. మంగలి, చాకలి వంటి సేవా వృత్తులు చాల తక్కువ స్థాయిలో కొనసాగుతున్నాయి.

ఈ వృత్తులన్నిటినీ గ్రామీణ వ్యవసాయ సమాజానికీ, ఉత్పత్తికీ అవసరమైన శ్రమలుగా, నైపుణ్యాలుగా కాక వంశపారంపర్య కులాలుగా నిర్బంధించడంలోనే హైందవ బ్రాహ్మణ్య పాలకవర్గాల కుట్ర ఉంది. వాటిని కట్టుబానిస కులాలుగా మాత్రమే చూస్తే అవి తప్పనిసరిగా రద్దు కావలసినవే. వాటిని కులాలుగా, నిచ్చెనమెట్ల అంతరాల వ్యవస్థలో భాగంగా రద్దు చేసి, సమాజానికి అవసరమైన, గౌరవనీయమైన శ్రమలుగా, నిర్బంధపూరిత వంశపారంపర్యంగా కాక, ఎవరైనా చేపట్టదగిన శ్రమలుగా చూడవలసి ఉంది. వ్యవసాయానికి అవసరమైన శ్రమలుగా చూసినప్పుడు ఆ అవసరాలను తీర్చే ప్రత్యామ్నాయాలు రూపొంది అవి రద్దవుతున్నాయా, ప్రత్యామ్నాయాలు రూపొందకుండానే రద్దవుతున్నాయా అనే ప్రశ్న ముఖ్యం. ప్రత్యామ్నాయాలు రూపొంది నప్పటికీ అవి వారి జీవితాలలో ఎటువంటి మార్పులతో వస్తున్నాయి, ఆ ప్రత్యామ్నాయాల వల్ల వారికీ సమాజానికీ సంబంధాలు ఎలా మారు తున్నాయి, ఆ ప్రత్యామ్నాయాలతో ప్రయోజనాలు ఎవరు పొందుతున్నారు వంటి ప్రశ్నలు కూడ అడగవలసి ఉంది. కాని దురదృష్టవశాత్తూ చేతివృత్తుల గురించి చర్చించడమే కులాలు కొనసాగాలనే వారికీ, కులాలు వద్దనేవారికీ మధ్య జరిగే చర్చగా తప్పుడు వ్యాఖ్యానాలు వస్తున్నాయి. కులాలు రద్దు కావాలంటూనే ఆ వృత్తులలో ఉన్నవారి జీవనోపాధి, ఆ వృత్తులు ప్రస్తుతం తీరుస్తున్న అవసరాలను తీర్చడం, ఆ అవసరాలను తీర్చడంలో మార్కెట్ కు లోబడకుండా ఉండడం అనే అంశాలు చర్చించవలసి ఉంది. అలా చర్చించినప్పుడే చేతివృత్తుల పతనం అనే పరిణామానికి సారాంశం ఏమిటో తెలుస్తుంది.

వ్యవసాయ యాంత్రీకరణ

వ్యవసాయంలో ట్రాక్టర్లు, విద్యుత్తు, పంపుసెట్లు, కోతయంత్రాలు, రసాయనిక ఎరువులు, బిందు సేద్యం వంటి ఆధునిక పద్ధతుల వినియోగం విపరీతంగా పెరిగిందని, పెరుగుతున్నదని గణాంకాలు చూపుతున్నాయి. ఇలా వ్యవసాయంలోకి మార్కెట్ సరుకులు, యంత్రాలు రావడమే ఒక గుణాత్మక మార్పు అని వాదిస్తున్నవారు ఉన్నారు. సామ్రాజ్యవాదం ప్రపంచాన్నంతా ఒకే మార్కెట్ గా మార్చిన తర్వాత విభిన్న సమాజాలలో గుణాత్మక మార్పులు రాకుండా కూడ సరుకుల ప్రవేశం, మార్కెట్ల ఏర్పాటు జరగవచ్చుననడానికి ఇది ఉదాహరణ. ఆయా ప్రభుత్వాలమీద తమ షరతులు రుద్ది బహుళ జాతి సంస్థలు, లేదా వారి దళారీలు ఆయాదేశాలలో తమ సరుకుల మార్కెట్లను విస్తరించుకోవచ్చు. యంత్రపు మెరుగైన ఉత్పాదకత వల్ల గాని, సాపేక్షికంగా తక్కువ ఖరీదు వల్ల గాని, గత్యంతరం లేకుండా చేసిన ప్రభుత్వ విధానాల వల్ల గాని రైతాంగం యాంత్రీకరణవైపు మొగ్గు చూపవచ్చు. అందువల్ల వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగవచ్చు. కాని ఈ యంత్రాలు – కొత్త ఉత్పత్తి సాధనాలు – ఉత్పత్తి సంబంధాలను ఏ మేరకు మారుస్తున్నాయి, ఏ దిశలో మారుస్తున్నాయి, అవి స్థానిక సమాజ చలనానికి కారణమవుతున్నాయా, బైటి నుంచి అంటుకట్టిన చలనంగా మిగిలిపోతున్నాయా చూడవలసి ఉంటుంది. ఒక యంత్రం, లేదా ఒక ఆధునిక పద్ధతి ప్రవేశించడం వల్ల అంతకు ముందు జరుగుతున్న ఉత్పత్తి పద్ధతికి ఏం జరిగింది, పాత ఉత్పత్తి విధానంలో ఉండిన శ్రామికులకు ఏం జరిగింది, శ్రామికులకూ యజమానులకూ మధ్య సంబంధాలు ఎలా మారాయి, కొత్త ఉత్పత్తి సాధనం శ్రామికుల చైతన్యంలో ఏ మార్పులు తెచ్చింది, కొత్త ఉత్పత్తి సాధనం శ్రమనూ, మిగులునూ సంగ్రహించే పద్ధతులను ఎలా మార్చింది, కొత్త ఉత్పత్తి సాధనం హోం మార్కెట్ పెరుగుదలకు ఎంతవరకు దోహదం చేసింది వంటి ప్రశ్నలకు సమాధానాలు లేకుండా కేవలం యంత్రాల, సరుకుల

అంకెలలో పెరుగుదలను సమాజ ప్రగతిగా, ఉత్పత్తి సంబంధాల అభివృద్ధిగా చెప్పడం సరికాదు.

గ్రామీణ మార్కెట్

వ్యవసాయ ఉత్పత్తి రంగంలో సరుకుల ప్రవేశం మాత్రమే కాక మొత్తంగా గ్రామీణ జీవితంలో సరుకుల ప్రవేశం పెరిగిందనేది కూడ నిజమే. పెరిగిన రవాణా సదుపాయాలు, డబ్బు ప్రాధాన్యత, శ్రమ ద్వారా, ఉత్పత్తి ద్వారా కాకపోయినా ప్రభుత్వ విధానాల వల్ల, పరపతి సౌకర్యాల వల్ల, ద్రవ్యచలామణీ వల్ల గ్రామాల్లో డబ్బు ఎక్కువగా కనబడడం వంటి అనేక కారణాలు కలిసి గ్రామాల్లో సరుకుల వాడకం పెరిగిందనేది స్పష్టమే. అయితే, గ్రామాల్లో మౌలిక పరివర్తన జరిగిందా అని చూడడానికి సరుకుల వాడకం పెరుగుదల ఏకైక సూచిక కాదు. గ్రామాల్లో మార్కెటేతర సంబంధాలు తొలగిపోకుండానే, తగ్గకుండానే మార్కెట్ సంబంధాలు కూడ ప్రవేశించడం మన సమాజ ప్రత్యేకతలలో ఒకటనిపిస్తుంది. అసలు ప్రవేశించినవి ఏదో ఒక మేరకైనా మార్కెట్ సంబంధాలేనా, కొన్ని మార్కెట్ సరుకులను రుద్దడం జరిగిందా అనేది కూడ చర్చనీయాంశమే. ఆడమ్ స్మిత్ చెప్పిన 'అదృశ్య హస్తం' హిందూ ధర్మపు కర్మసిద్ధాంతంతో మిలాఖత్తు అయిన నేపథ్యంలో మార్కెటేతర, మార్కెట్ పూర్వ వ్యవస్థలతో సహజీవనం చేయడానికి మార్కెట్ సిద్ధపడిన వర్తమానంలో భారత సమాజం ఉంది.

వ్యవసాయ సంక్షోభం

వ్యవసాయ, గ్రామీణ జీవితంలో వస్తున్న మార్పులను వ్యవసాయ సంక్షోభ కోణంలో కూడ చూడాలి. వ్యవసాయ, గ్రామీణ రంగాలలో వస్తున్న మార్పులకూ వ్యవసాయ సంక్షోభానికీ సంబంధం ఏమిటి? ఆ మార్పుల వల్ల సంక్షోభం వస్తున్నదా? ఆ మార్పులు సంక్షోభాన్ని తగ్గించడానికో, తొలగించడానికో ప్రయత్నిస్తున్నాయా? వ్యవసాయం జీవనోపాధి సాధనం కాకపోవడం, వ్యవసాయంలో పెట్టుబడికి తగిన ఫలితం రాకపోవడం, వ్యవసాయోత్పత్తి కారకాల మార్కెట్ల మీద గాని, ఉత్పత్తుల మార్కెట్ మీద గాని వ్యవసాయదారులకు ఎటువంటి అదుపూ లేకపోవడం, వ్యవసాయాభివృద్ధికి అవసరమైన మౌలిక సాధన సంపత్తి ఏర్పడకపోవడం, రైతాంగం గణనీయంగా ఆత్మహత్యలే శరణ్యమని అనుకోవడం వంటి పరిణామాలను సాధారణంగా వ్యవసాయ సంక్షోభానికి సూచనలుగా గుర్తిస్తున్నాం. పశుసంపద ప్రాధాన్యత తగ్గడం, పశువుల పేడ, గత్తం స్థానంలో రసాయనిక ఎరువుల వినియోగం పెరిగిపోవడం, సాంప్రదాయిక విత్తనాల స్థానాన్ని మార్కెట్ విత్తనాలు ఆక్రమించడం, ఆహారధాన్యాల స్థానాన్ని వాణిజ్య పంటలు ఆక్రమించడం, గ్రామీణ ప్రాంతాల నుంచి విపరీతంగా వలసలు పెరిగిపోవడం, గ్రామీణ ప్రాంతాలలో ఉన్నవారిలో కూడ వ్యవసాయం మీద ఆసక్తి తగ్గిపోవడం వంటి దృగ్గోచరాంశాలు కూడ ఉన్నాయి. మరొకవైపు నుంచి చూస్తే, వ్యవసాయం మీద ఆసక్తి తగ్గుతున్నదని అంటున్న కాలంలోనే, నికర వ్యవసాయోత్పాదకత పెరగకుండానే స్థూల వ్యవసాయోత్పత్తిలో క్రమబద్ధమైన పెరుగుదల కనబడుతున్నది. వ్యవసాయరంగ ఉత్పత్తుల ధరలను కృత్రిమంగా నిర్ణయించడం వల్ల జాతీయోత్పత్తిలో వ్యవసాయరంగ వాటా తగ్గుతున్నట్టు కనబడుతున్నది గాని, ప్రభుత్వ గణాంకాల ప్రకారమే వ్యవసాయ రంగ వృద్ధి రేటు గణనీయంగానే ఉన్నది.

అంటే ఒక రకంగా చూస్తే వ్యవసాయరంగంలో మార్పులు, సంక్షోభం ఒకే నాణానికి రెండు ముఖాల లాగ, ఒకదానితో మరొకటి కలిసి వస్తున్నట్టు గుర్తించవలసి వస్తుంది. మామూలుగానే పెట్టుబడిదారీ వినియోగదారీ సంస్కృతిలో ఉండే ప్యాకేజి డీల్ (ఒకే కొనుగోలుకు ఒకటి కన్న ఎక్కువ సరుకులు దొరకడం) వ్యవసాయ రంగంలోకి కూడ ప్రవేశించి మార్పులతో పాటు సంక్షోభం వస్తున్నదా ఆలోచించాలి. అది నిజమైతే, సంక్షోభానికి, ఆత్మహత్యలకు, విధ్వంసానికి దారి తీసే మార్పులు ప్రగతిశీలమైనవో, సామాజిక పరివర్తన సాధించేవో అవుతాయా ఆలోచించాలి. ఒకవైపు వ్యవసాయం మీద ఆసక్తి తగ్గుతున్నట్టు గ్రామీణ, సూక్ష్మ స్థాయిలో కనబడుతున్నప్పటికీ, సగటు ఉత్పాదకతలో పెద్ద పెరుగుదల లేనప్పటికీ, స్థూల, దేశీయ స్థాయిలో వ్యవసాయోత్పత్తి పెరుగుతున్నదంటే, ఆసక్తి తగ్గుతున్నదనేది రూపపరమైన మార్పేనా ఆలోచించాలి. వ్యవసాయం సక్రమంగా సాగడానికి తగిన వనరులు – భూమి, నీటి పారుదల సౌకర్యాలు, మెరుగైన విత్తనాలు, పరిశోధన, విస్తరణ సేవలు, ఎరువులు, మార్కెట్ సౌకర్యాలు, గిట్టుబాటు ధరలు – లేకపోవడం వల్ల ఆసక్తి తగ్గుతున్నదా, లేక ఆ వనరులన్నీ కల్పించినా ఆసక్తి తగ్గే అవకాశం ఉందా కూడ ఆలోచించాలి.

అనివార్యమైన సంబంధిత అంశాలు

వ్యవసాయ రంగంలో, గ్రామీణ రంగంలో మార్పులు వాటికవే స్వతంత్రంగా విశ్లేషించగలిగినవి కూడ కావు. అవి మొత్తం దేశపు రాజకీయార్థిక వ్యవస్థతో, ప్రపంచ రాజకీయార్థిక వ్యవస్థతో, రాజకీయార్థిక చరిత్రతో, ప్రజాజీవిత పరిణామాలతో ముడిపడినవి. ఆ నాలుగు కోణాలతో కలిపి సమగ్రంగా సమన్వయంచకుండా వ్యవసాయ, గ్రామీణ రంగాల మార్పుల గురించి లెక్కలూ, ఉదాహరణలూ, వివరణలూ ఎన్ని ఇచ్చినా అవి రూప చర్చలే అవుతాయి గాని సారాన్ని గ్రహించడానికి ఉపయోగపడవు. అందువల్ల గ్రామీణ వ్యవసాయ రంగాలలోని మార్పులను సంపూర్ణంగా, యథాతథంగా గుర్తిస్తూనే వాటిని భారత రాజకీయార్థిక వ్యవస్థలో పాలకవర్గాల విధానాలతో, ప్రయోజనాలతో, సామ్రాజ్యవాద బహుళ జాతి సంస్థల ఎత్తుగడలతో, మార్కెట్ విస్తరణ వ్యూహాలతో, పెట్టుబడిదారీ విధాన చరిత్రలో సామ్రాజ్యవాదం తర్వాత వచ్చిన మార్పులతో, ప్రజాజీవితం ఎదుర్కొంటున్న ఒడిదుడుకులతో కలిపి చర్చించవలసి ఉంటుంది. ఈ చర్చ సవివరమైన గణాంకాలతో, చారిత్రక, సామాజిక ఆధారాలతో సమగ్రంగా జరగవలసి ఉంటుంది గాని ఇక్కడ ఆరు ముఖ్యమైన అంశాలను మాత్రం ప్రస్తావించుకుందాం:

1. పెట్టుబడిదారీ విధానానికి ఒక ముఖ్య సూచిక ఉత్పత్తి శక్తుల గరిష్ట అభివృద్ధి. అరాచక అభివృద్ధి క్రమం వల్ల దాని కాలగమనంలో ఉత్పత్తిశక్తుల వృథా జరుగుతుంది గాని సాధారణంగా అంతకు ముందరి ఉత్పత్తి విధానాలకూ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికీ తేడా – ఉత్పత్తి శక్తులను, ముఖ్యంగా ఉత్పత్తి సాధనాలను వీలైనంత ఎక్కువ అభివృద్ధి చేయడం. భారత పాలకవర్గాలు నిజంగా వ్యవసాయాభివృద్ధిని, వ్యవసాయ రంగంలో ఉత్పత్తిశక్తుల అభివృద్ధిని సాధించాయా చూస్తే

అవి ఎంతవరకు పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గాన్ని అనుసరించాయో, మన గ్రామీణ వ్యవసాయరంగ మార్పులు ఆ మార్గపు ఫలితాలవునో కాదో అర్థమవుతుంది. వలస పాలనలో భిన్నమైన పాలకవర్గాలు ఉన్నాయనుకున్నా ఆ తర్వాత ఆరున్నర దశాబ్దాల పాలనలో పాలకవర్గాలు వ్యవసాయాభివృద్ధి కోసం ఉద్దేశ్యపూర్వకంగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టిన చర్యలు దాదాపుగా లేవనే చెప్పవచ్చు. దేశంలో సాగుకు లాయకైన భూమినంతటినీ సాగు కిందికి తెచ్చి వ్యవసాయోత్పత్తిని పెంచడం జరగలేదు. దేశంలో లభ్యమయ్యే జలవరులన్నిటినీ వ్యవసాయానికి వినియోగించుకునే విధానాలు అమలు కాలేదు. వ్యవసాయదారుల చొరవను పెంచి వ్యవసాయోత్పత్తి పెంచడానికి, వ్యవసాయ రంగంలో పెట్టుబడిపూర్వ సంబంధాల సంకెళ్లను తెంచడానికి అవసరమైన భూసంస్కరణలు అమలు జరగలేదు. వ్యవసాయ రంగంలోకి ప్రవేశించిన ఆధునిక సాంకేతిక పద్ధతులన్నీ కేవలం బహుళ జాతి సంస్థల సరుకుల మార్కెట్ల కోసం వచ్చినవే తప్ప దేశీయ వ్యవసాయాభివృద్ధి కోసం వచ్చినవి కాదు. వ్యవసాయాన్ని ఒక పెట్టుబడిదారీ దిశలో నిర్వహించడానికి, పెంపొందించడానికి పాలకవర్గాలు, ప్రభుత్వాలు ఈ ఆరు దశాబ్దాలలో విధానపరంగా తీసుకున్న చర్యలు లేవు. నీటి పారుదల సౌకర్యాలు, అధిక దిగుబడి వంగడాలు, ఎరువుల ఉత్పత్తి, వ్యవసాయ విద్యుత్తు, రుణ, పరపతి సౌకర్యాల కల్పన, హరిత విప్లవం, మార్కెట్ల అభివృద్ధి వంటి కార్యక్రమాలన్నీ కూడ అరకొరగా జరిగినవే, లేదా బహుళ జాతి సంస్థల ప్రయోజనాల కొరకు జరిగినవే గాని వ్యవసాయంలో దేశీయ ఉత్పత్తి సాధనాలను, ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయడానికి జరిగినవి కావు.

2. గ్రామీణ వ్యవసాయ సంక్షోభం ఫలితంగా విపరీతంగా వలసలు పెరిగి ఇటీవలి దశాబ్దాలలో పట్టణీకరణ పెరుగుతున్నది. ఇలా వలసలు పెరగడం స్వేచ్ఛా శ్రామికులు రూపొందుతున్నారనడానికి, అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడిందనడానికి సూచన అని కొందరు వ్యాఖ్యాతలు అంటున్నారు. ఈ వలసలను యూరప్ లో పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో గ్రామాలు వదిలేసి పట్టణాలకు వెళ్లి పారిశ్రామిక కార్మికులుగా మారిన పరిణామంతో, స్వేచ్ఛా శ్రామికులతో పోల్చడానికి వీలు లేదు. మన వలసలు వాటిలాగ శాశ్వతమైనవీ, అర్థవంతమైన, మెరుగైన ఉపాధి కల్పిస్తున్నవీ, స్వచ్ఛందమైనవీ కావు. వీటిలో గణనీయమైన భాగం ఆయా కాలాలలో తాత్కాలికంగా మాత్రమే జరుగుతున్నవి. అర్థవంతమైన, మెరుగైన ఉపాధి కల్పిస్తున్నవి కావు. ఒక రకంగా నిర్బంధపూరితంగా జరుగుతున్నవి. పాత వలసలలో గ్రామాల నుంచి వలస వెళ్లిన రైతాంగపు బిడ్డలు పట్టణాలలో పారిశ్రామిక కార్మికులుగా మారారు. ప్రస్తుతం వలసలు వారికి పరిశ్రమల్లో ఎంత మాత్రం అవకాశాలు కల్పించడం లేదు. వారు సేవారంగంలోనో, నిరుద్యోగంలోనో మాత్రమే చేరుతున్నారు. స్వేచ్ఛాశ్రామికులు అనే మాటకు మార్క్స్ చెప్పినట్టుగా రెండు అర్థాలు – ఏ గ్రామీణ బంధనాలు లేని స్వేచ్ఛాయుతమైన శ్రామికులు, తమ శ్రమను ఎవరికైనా అమ్ముకోగల స్వేచ్ఛ ఉన్న శ్రామికులు – అనే అర్థాలు ప్రస్తుత వలస శ్రామికులకు సరిపోవు. వారు గ్రామంలోని బంధనాలు పూర్తిగా తెంచుకున్నవారనీ చెప్పలేము. తమ శ్రమను ఎవరు కొనుక్కుంటారా అని ఎదురుచూసి, చాల సందర్భాలలో నిరాశతో మిగిలిపోయేవారుగానే తప్ప ఎవరికి అమ్ముకోవాలో తామే నిర్ణయించుకోగలిగే స్వతంత్రులుగానూ వారు లేరు. అసలు ఈ గ్రామాల నుంచి వలసలు వస్తున్న వారు ఉత్పత్తిరంగంలోకి వస్తున్నారా, ఉత్పత్తికి బైట ఉన్నారా అనేది ప్రధానమైన ప్రశ్న. ఏ రకంగా చూసినా ఇవాళ భారత గ్రామీణ సమాజం నుంచి అసంఖ్యాకంగా జరుగుతున్న వలసలు మన ఆర్థిక వ్యవస్థ ప్రతిష్టంభనకు చిహ్నమే గాని పెట్టుబడిదారీ పట్టణీకరణకు చిహ్నం కాదు. నిజానికి మన పట్టణాలు కూడ పెట్టుబడిదారీ యుగపు పారిశ్రామిక పట్టణాలు కాదు, భూస్వామ్య యుగంలో పాలనా కేంద్రాలు, కూడళ్లు, మత కేంద్రాలు ఎలా పట్టణాలుగా మారాయో ఇవాళ్టికీ భారత పట్టణాలలో నూటికి తొంభై అటువంటి పట్టణాలే. వలసలు అటువంటి పట్టణాలకే జరుగుతున్నాయి.

3. అసలు సామ్రాజ్యవాదం తర్వాత ఏదైనా ఒక దేశంలో స్వతంత్ర పెట్టుబడిదారీ అభివృద్ధి జరగడానికి అవకాశం ఉంటుందా అనేది మౌలికమైన ప్రశ్న. సామ్రాజ్యవాద దశలోని పెట్టుబడి ఆయా దేశాలలో తనకు సామాజిక పునాది కల్పించుకోవడానికి స్థానిక భూస్వామ్యంతో మిలాఖత్తయింది. పెట్టుబడి పూర్వ అభివృద్ధి నిరోధక లక్షణాలను సంతరించుకుంది. అందువల్ల పెట్టుబడి తొలి శతాబ్దాలలో లాగ భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు నడిపి స్వతంత్ర పెట్టుబడిదారీ వర్గంగా ఎదిగే బదులు తనకు దళారీగా, ప్రతినిధిగా, చేతికింద పనిచేసే భాగస్వామిగా ఒక చిన్న స్థానిక పెట్టుబడిదారీ వర్గానికి అవకాశం ఇచ్చింది. అలా ఆయా దేశాల పాలకవర్గాలు ఈ మూడు వర్గాల – సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, దళారీ నిరంకుశ బూర్జువావర్గం – కూటమిగా తయారయ్యాయి. అందువల్ల ఇక్కడ స్వతంత్ర పెట్టుబడిదారీ వర్గం ఎదిగి భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు జరపడానికి, దేశభక్తితో విదేశీ పెట్టుబడికి వ్యతిరేకంగా పోరాటాలు జరపడానికి అవకాశం లేదు.

4. ప్రపంచంలో, ముఖ్యంగా యూరప్ లో బూర్జువా ప్రజాస్వామిక విప్లవాల ఫలితంగా సమాజం సమూలంగా కదిలిపోయి, పాత రాచరిక పాలనా పద్ధతులు కూలిపోయి, పార్లమెంటరీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం ఉనికిలోకి వచ్చింది. భారతదేశంలో అటువంటి బూర్జువా ప్రజాస్వామిక విప్లవమేదీ జరగకుండానే వలసవాదం తనకు తెలిసిన ప్రాతినిధ్య ప్రజాస్వామిక పద్ధతినీ, పార్లమెంటునూ ఇక్కడ ప్రవేశపెట్టింది. అది ఒక స్థానిక ప్రజావెల్లువ ఫలితంగా, ప్రజల భాగస్వామ్యంతో, ప్రజల చైతన్యంతో ఏర్పడిన నిర్మాణం కాదు గనుక దానిలో ప్రజల ఆకాంక్షలు ప్రతిఫలించకపోవడం మాత్రమే కాదు, అదే ప్రజా ఆకాంక్షలకు బలమైన అవరోధంగా తయారయింది. దాని స్థాపనే సామ్రాజ్యవాద–భూస్వామ్య మిలాఖత్తు వల్ల జరిగింది గనుక మూడు పాలకవర్గ ముఠాల కూటమికే అధికారం దక్కింది. అందువల్ల ఆ కూటమి ఆ మూడు వర్గాల ప్రయోజనాలకూ దెబ్బతగలకుండా చూడడానికే పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థను నడుపుతున్నది. వలస వ్యతిరేక ప్రజా ఉద్యమ నేపథ్యం వల్ల భూస్వామ్య–వ్యతిరేక, సామ్రాజ్యవాద–వ్యతిరేక విధానాలను నామమాత్రంగా ప్రకటించినప్పటికీ, ఆ పార్లమెంటరీ వ్యవస్థలోనే చట్టరూపం కూడ ఇచ్చినప్పటికీ ఆ విధానాలు అమలు చేయడంలేదు. తాను చేసిన చట్టాలు ఎందుకు అమలులోకి రావడం లేదని అడగడానికి కూడ శక్తి సామర్థ్యాలు లేని పార్లమెంటరీ వ్యవస్థ ఇక్కడ రాజ్యం చేస్తున్నది. అంటే, యూరప్ లో, పెట్టుబడిదారీ

విధాన చరిత్రలో భూస్వామ్య వ్యతిరేక, జాతీయ పాత్ర నిర్వహించిన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ భారతదేశంలో భూస్వామ్య అనుకూల, సామ్రాజ్యవాద అనుకూల పాత్ర నిర్వహిస్తూ, ప్రజాస్వామిక విప్లవానికి ఆటంకంగా మారింది.

5. బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలు ఆయా దేశాలలో వ్యక్తిని వికసింపజేశాయి. పౌరసమాజం ఏర్పడడానికి, స్వతంత్ర పత్రికా రంగం ఏర్పడడానికి దారితీశాయి. భారతదేశంలో బూర్జువా ప్రజాస్వామిక విప్లవం జరగలేదు గనుక, పాలకవర్గాలే అందుకు అవరోధంగా మారిపోయాయి గనుక ఇక్కడ అసలు వ్యక్తి రూపొందడం, పౌరసమాజం ఏర్పడడం, స్వతంత్ర పత్రికారంగం ఏర్పడడం జరగలేదు. మనుషులు భూస్వామ్య సమాజంలో లాగనే కుటుంబం, కులం, మతం, భాష, ప్రాంతం, జాతి వంటి పెట్టుబడి పూర్వ సమూహాలలో భాగంగానే ఉండిపోయారు గాని వ్యక్తులుగా వికసించలేదు. వ్యక్తి-సమాజం అనే ఆధునిక ద్వంద్వం రూపొందలేదు. అందువల్ల పౌరసమాజం అభివృద్ధి చెందలేదు. పౌరసమాజం బలహీనంగా ఉన్నప్పుడు పత్రికాస్వేచ్ఛ, స్వతంత్ర పత్రికారంగం వికసించడానికి కూడ అవకాశం లేదు.

6. గ్రామీణ వ్యవసాయ రంగంలో మార్పుల స్వభావం భారతదేశంలో రాజ్యాధికారం చలాయిస్తున్న వర్గాలేవి, వాటి ప్రయోజనాలేమిటి అనే ప్రశ్నల మీద కూడ ఆధారపడి ఉంటుంది. రాజ్యాధికారంలో ఉన్న వర్గాలు పూర్తిగా పెట్టుబడిదారీ వర్గాలై ఉంటే, గ్రామీణ మార్పులు పెట్టుబడిదారీ అభివృద్ధిక్రమంలో భాగమై ఉండేవి. అవి పూర్తిగా భూస్వామ్య వర్గాలై ఉంటే గ్రామీణ మార్పులు భూస్వామ్య అధికారాన్ని పునరుద్ధరించడానికి జరుగుతూ ఉండేవి. కాని భారత పాలకవర్గాలు ఈ రెండు వర్గాల సమ్మేళనం గనుక, అవి కూడ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భాగంగా సామ్రాజ్యవాద ప్రయోజనాలకు అనుగుణంగా సాగేవి గనుక మన వ్యవసాయ రంగ మార్పులు రూపపరమైన మార్పులుగానే తప్ప సారాంశపు మార్పులుగా పరిణమించకుండా సాగుతున్నాయి.

7. గ్రామీణ వ్యవసాయ రంగ మార్పులు పెట్టుబడిదారీ వ్యవస్థను ప్రవేశపెట్టడానికే జరుగుతున్నాయని వాదిస్తున్నవారు పెట్టుబడిదారీ వ్యవస్థ విస్తరణలో, కనీసం యూరప్, అమెరికాలలో మార్కెట్ సామాజిక సంబంధాల సమస్తాన్నీ ఎట్లా తిరగరాసిందో, అటువంటి పని భారత సమాజంలో జరుగుతున్నదో లేదో కూడ పరిశీలించవలసి ఉంది. సుప్రసిద్ధమైన కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికలోని మార్క్స్, ఎంగెల్స్ ల మాటల్లో చెప్పాలంటే, 'పెట్టుబడిదారీ వర్గం చారిత్రకంగా అతి విప్లవకరమైన పాత్రను నిర్వహించింది. ఎక్కడైతే ఈ వర్గానిది పైచేయి అయిందో అక్కడల్లా ఇది భూస్వామ్య, పితృస్వామిక, గ్రామీణ సంబంధాలను నిర్మూలించింది. కొందరు మనుషులు ఇతరులకంటె 'సహజాతమైన ఆధిక్యత'కలిగి ఉంటారనే భూస్వామ్య సమాజపు ప్రబల సూత్రం మీద ఆధారపడిన రకరకాల భూస్వామ్య సంబంధాలను పెట్టుబడిదారీ వర్గం నిర్దాక్షిణ్యంగా తుత్తునియలు చేసింది. మనిషికీ మనిషికీ మధ్య అతి నగ్నమైన స్వార్థపరత్వం, నీచమైన ధనపిపాస మాత్రమే మిగిలాయి. ఇతర సంబంధాలన్నీ మాయమయ్యాయి. పూర్వం మనిషి మత ఉత్తేజంతోను, సాహసచర్యల ఉత్సాహం తోను, మూఢత్వపు భావోద్రేకం తోను మైమరచి పారలౌకిక ఆనందం పొందేవాడు. ఆ మహదానందాన్ని పెట్టుబడిదారీ వర్గం స్వార్థపరత్వమనే మంచునీటి ప్రవాహంలో ముంచి వేసింది. వ్యక్తుల విలువను మారకపు విలువగా మార్చివేసింది...'ఇంత సమూలమైన, పెద్ద ఎత్తున మార్పు భారత సమాజంలో జరిగిందా రుజువు చేయవలసే ఉంది. అసలు ఆ మౌలికమైన మార్పు జరగాలంటే ఒక బూర్జువా ప్రజాస్వామిక విప్లవం జరగవలసి ఉంటుంది. అది కొన్ని దశాబ్దాలపాటు, శతాబ్దాలపాటు సమాజాన్ని అతలాకుతలం చేయవలసి ఉంటుంది. యూరప్ చరిత్రలో ఆ మార్పు కనీసం మూడు శతాబ్దాలు సాగింది. భారత సమాజంలో అటువంటి మార్పు ప్రారంభమయిందా, ప్రారంభమై ఉంటే ఎప్పుడు, ఏయే మైలురాళ్లు దాటి వచ్చింది, 1857, 1947 అనే రెండు కొండగుర్తులు ఆ మార్పు దిశకు ఏమైనా దోహదం చేశాయా, ఆ మార్పు ఒకవేళ మొదలయిందనుకున్నా, అది యూరప్ లో లాగ అంత లోతుగా సామాజిక సంబంధాలను మార్కెట్ సంబంధాలుగా మారుస్తున్నదా, ఇవాళ్టికీ సమాజంలో కనబడుతున్న మార్కెటేతర సంబంధాల మాటేమిటి అనే ప్రశ్నలకు సంతృప్తికరమైన జవాబులు చెప్పుకోకుండా మన సమాజ పరివర్తన గురించి ఆమోదయోగ్యమైన నిర్ధారణ చేయలేము.

ముగింపు

గ్రామీణ, వ్యవసాయ రంగాలలో కంటికి కనబడే మార్పులు ఎన్నో జరుగుతున్నప్పటికీ, వాటికి నిర్దిష్టమైన దిశ లేకపోవడం, అటూ ఇటూ ఊగిసలాడడం, సమాజ ప్రతిష్టంభనకు ఒక చిహ్నం. అర్ధవలస, అర్ధభూస్వామ్య అనే సూత్రీకరణ ఆ ప్రతిష్టంభనను సూచించేదే. భారత సమాజం 1947 వరకు ఒక సామ్రాజ్యవాద దేశానికి ప్రత్యక్ష వలసగా ఉన్నదని అందరికీ తెలుసు. 1947 తర్వాత అది అర్ధవలసగా మారిందని, భారత ఆర్థికవ్యవస్థ మీద దోపిడీ పీడనలు ఇప్పుడు నయావలస పద్ధతులలో జరుగుతున్నాయని 1967లో నక్సల్బరీ పంథా ప్రకటించింది. 1991 నూతన ఆర్థిక విధానాల తర్వాత ఆ సూత్రీకరణను అంతకంతకూ ఎక్కువమంది అంగీకరిస్తున్నారు. ఇవాళ నక్సల్బరీ పంథాను అనుసరించేవారితో పాటు, గాంధేయవాదులు, సర్వోదయవాదులు, నిజమైన దేశభక్తులు, స్వతంత్ర పరిశీలకులు కూడ భారతదేశం అనేక సామ్రాజ్యవాద దేశాలకు అర్ధవలసగా మారిపోయిందని గుర్తిస్తున్నారు. ఇక ఒక సమాజం భూస్వామ్య దశ నుంచి పెట్టుబడిదారీ దశలోకి ఎదగబోతూ, ఆ గుణాత్మక మార్పుకు అవసరమైన బూర్జువా ప్రజాస్వామిక విప్లవం జరగకపోవడం వల్ల గాని, మరేదైనా అవరోధం వల్ల గాని, ప్రతిష్టంభనకు గురైతే దాన్ని అర్ధభూస్వామ్య సమాజంగా పిలుస్తాం. భారత సమాజం అలా అర్ధభూస్వామ్య సమాజంగా కొనసాగుతున్నది. ఈ స్థితి నుంచి విముక్తి సాధించవలసిన బూర్జువా ప్రజాస్వామిక విప్లవం జరిగే అవకాశం చారిత్రకంగా లేదు. కనుక కార్మికవర్గ నాయకత్వాన నూతన ప్రజాస్వామిక విప్లవం జరగడం అనివార్యం.

నక్సల్బరీ పంథా రూపొందించిన ఆ అవగాహన ప్రాధాన్యత ఇవాళ గ్రామీణ, వ్యవసాయ రంగంలో జరుగుతున్న మార్పుల నేపథ్యంలో మరింత ఎక్కువగా స్పష్టమవుతున్నది. ఈ వ్యవసాయరంగ మార్పులను శ్రమ, భూమి, ఉత్పత్తి సంబంధాల కోణాల నుంచి అధ్యయనం చేసినా, అనుబంధ అంశాల నుంచి అధ్యయనం చేసినా ఆ అవగాహన ఎంత ప్రాసంగికమైనదో, అవసరమైనదో అర్థమవుతున్నది. వీ

(రచయిత వీక్షణం సంపాదకులు)

పేదల పక్షపాతి జస్టిస్ కృష్ణ అయ్యర్

నంబూద్రిపాద్ మంత్రివర్గ సభ్యుడిగా ప్రారంభమై సుప్రీంకోర్టు న్యాయమూర్తి దాకా ఎదిగిన, నిండు నూరేళ్లు ప్రజాపక్షపాతంతో జీవించిన కృష్ణ అయ్యర్‌ను స్మరిస్తున్నారు **ప్రొ. ఎస్. శేషయ్య**

సమాజంలో పేదలకు, అట్టడుగు ప్రజలకు సామాజిక న్యాయం కల్పించాలనీ, హక్కులు అనుభవించే పరిస్థితులు ఉండాలనీ కాంక్షించి, అందుకోసం విశేషంగా కృషి చేసిన విశిష్ట న్యాయమూర్తి కృష్ణ అయ్యర్. రాజ్యాంగాన్ని, చట్టాలను, పేదలకు, బడుగు బలహీన ప్రజలకు అనుకూలంగా వ్యాఖ్యానిస్తూ, న్యాయశాస్త్ర సిద్ధాంతాలకు కొత్త భాష్యాన్ని అందించాడు. న్యాయవాదిగా, శాసనసభ్యుడిగా, న్యాయమూర్తిగా, మానవహక్కుల ప్రచారకుడిగా పేదలపక్షాన నిలబడ్డారు.

'జడ్జీలు రుషులు కాదు, శాస్త్రవేత్తలు కూడ కాదు. జాతి జనజీవన స్రవంతిలో కృయాశీలకంగా పాల్గొనే వ్యక్తులు'. కృష్ణ అయ్యర్ సామాజిక, రాజకీయ ఆచరణలో ప్రత్యక్ష అనుభవం వల్ల చట్టానికి రెండు వైపుల పదును ఉంటుందని గ్రహించాడు. సమానత్వం గురించి గంభీరంగా చెప్పే చట్టం ధనవంతులను అదే విధంగా పేదలను బ్రిడ్జీల కింద పడుకోనివ్వదు. వీధుల్లో అడుక్కోనివ్వదు. రొట్టెముక్కలను దొంగలిస్తే నేరంగా పరిగణిస్తుంది. ఈ అవగాహనతోనే న్యాయవాదిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పని చేశారు. పదవీ విరమణ తర్వాత మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేశారు.

న్యాయవాదిగా

1915 నవంబర్ 15న పలక్కాడ్ జిల్లాలోని పాల్ఘాట్ గ్రామంలో బ్రాహ్మణ కుటుంబంలో పుట్టారు. అతని తండ్రి వి.వి. రామ అయ్యర్ పేరున్న న్యాయవాది. ఆర్థికంగా ధనవంతులే. కృష్ణ అయ్యర్‌కు చదువుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు లేవు. 1935లో అన్నామలై విశ్వవిద్యాలయం నుండి ఆర్థిక శాస్త్రంలో, ఇంగ్లిష్‌లో డిగ్రీ పూర్తి చేశారు. అన్నామలై మిస్సెలరీ పత్రిక ఇంగ్లిష్ విభాగంలో పనిచేశారు. అతని ఇంగ్లిష్ ప్రావీణ్యానికి శ్రీనివాస శాస్త్రి అవార్డు ఇచ్చారు. కృష్ణ అయ్యర్‌కు మొదటి నుండి జర్నలిస్టు కావాలని కోరిక ఉండేది. కాని, తండ్రి ప్రోద్బలంతో మద్రాస్ లా కాలేజీలో చేరి 1937లో న్యాయశాస్త్రంలో పట్టా తీసుకున్నాడు. ఆ తర్వాత న్యాయవాద వృత్తిని చేపట్టాడు. పారిశ్రామికవేత్తలు, భూస్వాముల తరఫున వాదించాడు. అలాగే పేద రైతులు, శ్రామికుల తరపున ఎలాంటి ఫీజు లేకుండా వాదించేవాడు. భూస్వాముల దోపిడీని, పోలీసుల దౌర్జన్యాలను తీవ్రంగా వ్యతిరేకించేవాడు. రాజకీయ నాయకులు, ప్రత్యేకించి వామపక్ష పార్టీల నాయకుల విడుదల కోసం కోర్టుల్లో వాదించేవాడు.

కేరళలో కమ్యూనిస్టు ఉద్యమం బలంగా ఉండడం, నాయకులను ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం కింద అరెస్టు చేయడం, కృష్ణ అయ్యర్ వారిని విడిపించడంతో వామపక్ష వాదిగా గుర్తింపు వచ్చింది. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ కలకత్తా థీసిస్‌లో (1948) మిలిటెంట్ చర్యలను ఉధృతం చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో అనేక మంది వామపక్ష కార్యకర్తలు జైళ్లపాలయ్యారు. కృష్ణ అయ్యర్ స్వతహాగా హింసను సమర్థించకపోయినా, రాజకీయ ఖైదీల విడుదల కోసం విస్తృతంగా పని చేశారు. అపాయకరమైన కమ్యూనిస్టుగా ముద్రపడింది. వాస్తవానికి ఆయన కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకోలేదు. కాని కమ్యూనిస్టు నాయకులతో మంచి సంబంధాలు ఉండేవి. కమ్యూనిస్టు ఉద్యమాన్ని అభిమానించేవాడు. కమ్యూనిస్టులకు రహస్య స్థావరాలను ఏర్పాటు చేశాడనే ఆరోపణతో మే 1948లో అరెస్టు చేశారు. ఆయనపై చేసిన ఆరోపణలు సరైనవి కాదని మద్రాస్ ప్రభుత్వం ఒక నెల తర్వాత విడుదల చేసింది. జైలు జీవితం గడిపిన వ్యక్తిని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించబడిన ఏకైక వ్యక్తి కృష్ణ అయ్యర్. ఈ జైలు అనుభవమే, నేపథ్యమే ఖైదీల హక్కులను విస్తృతపరచడానికి, జైలు సంస్కరణలు తీసుకు రావడానికి, న్యాయ సలహా, సహాయక సంస్థలను ఏర్పాటు చేయడానికి తోడ్పడింది.

ప్రజా ప్రతినిధిగా

1952లో కమ్యూనిస్టు పార్టీ, మజదూర్ ప్రజాపార్టీ, ముస్లిం లీగ్‌ల మద్దతుతో మలబారు నియోజకవర్గం నుండి మద్రాసు శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రతిపక్షంలో ప్రధాన వ్యక్తిగా, సోషలిస్టుగా గుర్తింపు పొందారు. కేరళ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత 1957లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి కమ్యూనిస్టు పార్టీ మద్దతుతో శాసనసభకు ఎన్నికయ్యారు. కేరళలో మొట్టమొదటిసారిగా కమ్యూనిస్టుపార్టీ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. నంబూద్రిపాదు ప్రభుత్వంలో రక్షణ, న్యాయ, ఇరిగేషన్, నావిగేషన్, పవర్, జైళ్లు, సోషల్ వెల్ఫేర్, వ్యవసాయం మొదలైన శాఖలకు మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. దేశంలోనే జైలు సంస్కరణలను మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టారు.

కమ్యూనిస్టుల మద్దతుతో గెలిచినా, మంత్రివర్గంలో బాధ్యుడుగా ఉన్న కొన్ని విషయాల్లో విభేదించేవారు. ముఖ్యమంత్రి నంబూద్రిపాద్ పోలీసు కాల్పుల సంఘటనపై విచారణను తిరస్కరించినప్పుడు, ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాన్ని ఉపయోగించాలని చెప్పినప్పుడు తీవ్రంగా వ్యతిరేకించాడు. దీంతో హోంమంత్రి పదవి నుంచి కృష్ణ అయ్యర్‌ను తొలగించారు. 1959లో కేంద్ర ప్రభుత్వం కేరళలో అధ్యక్ష పాలనను విధించింది. కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దుచేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 356ను మొట్టమొదటిసారిగా ఉపయోగించింది కేంద్ర ప్రభుత్వం. రాష్ట్ర ప్రభుత్వం రద్దు కావడంతో కేరళ హైకోర్టులో ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. కాని 1960లో మళ్లీ శాసనసభకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశారు. కేవలం ఏడుఓట్ల తేడాతో మార్క్సిస్టు అభ్యర్థి గెలుపొందారు. ఈ ఎన్నికను కోర్టులో సవాలు చేయగా కృష్ణ అయ్యర్‌కు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. 'నేను కోర్టు ద్వారా ఎన్నికయ్యాను' అని అభివర్ణించాడు. మళ్లీ 1965లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. సామాజిక న్యాయం కోసం పోటీ చేస్తున్నానని ప్రకటించారు. మొదట

సిపిఐ (ఎం) ఆయన అభ్యర్థిత్వాన్ని సమర్థించినా, ఎన్నికల గుర్తుగా సిపిఐ (ఎం) జెండాను పెట్టుకోవడానికి కృష్ణ అయ్యర్ నిరాకరించడంతో పార్టీ మద్దతును ఉపసంహరించుకోవడంతో ఓడిపోయారు. మళ్లీ కేరళ హైకోర్టులో ప్రాక్టీసు మొదలుపెట్టారు. మూడు సంవత్సరాల తర్వాత 1968, జూలై 12న 52 సంవత్సరాల వయస్సులో హైకోర్టు జడ్జీగా నియామకం జరిగింది. శాసనసభ్యుడిగా రాజకీయ వ్యవస్థ లోటుపాట్లను, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య దూరాన్ని, ప్రజల కష్టనష్టాల గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ అనుభవం ప్రత్యేకమైన, ప్రగతిశీలమైన న్యాయమూర్తిగా పనిచేయడానికి దోహదపడింది.

న్యాయమూర్తిగా

కేరళ హైకోర్టులో, సుప్రీంకోర్టులో వృత్తిపరంగా, సామాజిక దృక్పథంలో, తన సోదర జడ్జీలకంటే భిన్నంగా వ్యవహరించేవారు. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తి, నిష్పక్షపాతం అనే పేరుతో జడ్జీలు ప్రజాజీవితం నుండి దూరంగా, ఒంటరిగా ఉంటారు. న్యాయవ్యవస్థ గౌరవం కాపాడడం కోసం సామాజిక జీవితం నుండి దూరంగా ఉంటారు. కాని, కృష్ణ అయ్యర్ వ్యవహారశైలి హైకోర్టులో, సుప్రీం కోర్టులో తన సోదర జడ్జీల కంటె భిన్నంగా, విశిష్టంగా ఉండేది. జడ్జీగా ఉంటూనే పబ్లిక్ మీటింగ్‌లకు హాజరై ప్రసగించేవారు. పూర్తిగా భిన్నమైన సామాజిక దృక్పథం కారణంగానే తను సాంప్రదాయక సోషలిస్టుగా కాకుండా ప్రజల న్యాయశాస్త్ర సిద్ధాంతకర్తగా, పాత సిద్ధాంతాలను వ్యతిరేకించే వాడుగా, కొత్త ప్రయోగాలతో పద్ధతులతో, ఉత్తమమైన విలువలతో న్యాయవ్యవస్థను, పరిపుష్టం చేయడానికి ప్రయత్నం చేయడం వల్లనే అతనికి విశిష్టమైన జడ్జీగా గుర్తింపు వచ్చింది.

కేరళ హైకోర్టు జడ్జీగా ప్రమాణ స్వీకారం సందర్భంగా తన బాధ్యత ఏమిటో చాలా స్పష్టంగా వివరించారు –

'ప్రస్తుతం న్యాయవ్యవస్థ, దీనికి సంబంధించిన సంస్థలు పాత సంప్రదాయాలతో ఘనీభవించింది. చాల ఖరీదైంది. న్యాయం పొందడంలో విపరీతమైన జాప్యం జరుగుతూ ఉంది. ఇప్పుడున్న న్యాయవ్యవస్థకి కొత్త దృక్పథం కావాలి. కొత్త భాషా, వ్యాకరణం కావాలి. చిన్న చిన్న పరిష్కారాలు కావాలి. నా పదవీ కాలంలో నా శక్తి మేరకు చట్టబద్ధపాలన (రూల్ ఆఫ్ లా)ను కాపాడడానికి, గదుల్లో బందీ అయిన ప్రభుత్వ ఉద్యోగ యంత్రాంగాన్ని ప్రజల దగ్గరికి వెళ్లి సమన్యాయం అందించే విధంగా న్యాయవ్యవస్థలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తాను.'

కేవలం మూడు సంవత్సరాలు హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. సెప్టెంబర్ 1971లో లా కమిషన్ సభ్యుడుగా నియమించబడ్డారు. దీనికి కారణం అతని మిత్రుడు ఎస్. మోహన్ కుమార మంగళం. హైకోర్టులో జూనియర్‌గా ఉన్న జడ్జీలు సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించడం చాలా కష్టం. అందువల్ల లా కమిషన్ మెంబర్‌గా వస్తే ఆ తర్వాత సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉంటుందని కుమార మంగళం సలహా ఇవ్వడమే కాకుండా ప్రోత్సహించాడు. లా కమిషన్ సభ్యుడుగా ఉంటూ ఒక ప్రతిష్ఠాకరమైన రిపోర్టును తయారు చేశారు. (పీపుల్స్ రిపోర్ట్ ఆఫ్ ది ఎక్స్‌పర్ట్ కమిటీ ఆన్ లీగల్ ఎయిడ్, 1973). ప్రస్తుతం ఆర్భాటంగా నడుస్తున్న న్యాయసలహా, సహాయ కేంద్రాలు, లోక్ అదాలత్‌లు కృష్ణ అయ్యర్ అందించిన ఆలోచనా దృక్పథంతోనే నడుస్తున్నాయి. రెండు సంవత్సరాలు మాత్రమే ఈ పదవిలో కొనసాగారు. ఆ తర్వాత కుమార మంగళం సహకారంతో సుప్రీంకోర్టు జడ్జీగా, 1973, జూలై 17న పదవీ బాధ్యతలు చేపట్టారు. 1980, నవంబర్ 15న పదవీ విరమణ చేశారు.

తన పదవీ కాలంలో సుప్రీంకోర్టు ప్రతిష్ఠను పెంచారు. ప్రపంచంలోని ఇతర దేశాల జడ్జీలు కూడ కృష్ణ అయ్యర్ తీర్పులను ప్రశంసించారు. ధనవంతులకు మాత్రమే సుప్రీంకోర్టు అన్న భావన నుండి పేదల సుప్రీంకోర్టుగా పేరు తెచ్చుకుంది. ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉండే సుప్రీంకోర్టు పేదలకు కూడ చేరువయింది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు పేద, బడుగు, బలహీన వర్గాలకు అందుబాటులోకి వచ్చాయి. ఈ గుణాత్మకమైన మార్పుకు చోదకులుగా పనిచేసినవారు జస్టిస్ చిన్నపరెడ్డి, జస్టిస్ డి.ఎ. దేశాయి, జస్టిస్ భగవతి. వీరందరీ కంటే ముందువరుసలో జస్టిస్ కృష్ణ అయ్యర్ ఉన్నారు. కృష్ణ అయ్యర్ ఇచ్చిన తీర్పులు గతంలో తిష్టవేసుకుని ఉన్న న్యాయ సిద్ధాంతాలను విప్లవకరీంచాయి. న్యాయ సిద్ధాంత పరిజ్ఞానానికి కొత్త దృక్పథాన్ని అందించాయి.

సుప్రీంకోర్టు వర్సెస్ రాజకీయ వ్యవస్థ

న్యాయవ్యవస్థను, న్యాయ స్థానాలను, న్యాయమూర్తులను వర్తమాన రాజకీయ, ఆర్థిక పరిణామాల నేపథ్యంలోనే సరిగా అర్థం చేసుకో గలుగుతాం. వ్యక్తికి ఎంత నైపుణ్యం ఉన్న పరిస్థితులు అనుకూలిస్తేనే అది ప్రయోజనకరంగా ఉపయోగపడుతుంది. కృష్ణ అయ్యర్ తీర్పులను, ఆయన సామాజిక దృక్పథాన్ని అర్థం చేసుకోవడానికి మన సుప్రీంకోర్టు గురించి కొంతైన తెలుసుకోవాలి. 1950, 1960 దశకంలో సుప్రీంకోర్టు జమిందారీ రద్దు చేసిన చట్టాలను (భూ సంస్కరణలను) విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లను వ్యతిరేకించింది. మరోపక్క ప్రాథమిక హక్కులను, ప్రత్యేకించి పత్రికా స్వేచ్ఛను నియంత్రించింది. అభివృద్ధి పథకాలను, లేదా ఆదేశిక సూత్రాలను అమలు చేయడానికి తీసుకొచ్చిన చట్టాలను ప్రాథమిక హక్కులకు భంగకరం అని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు తీర్పుల అడ్డును తొలగించుకోవడానికి రాజ్యాంగానికి సవరణలు చేయాల్సి వచ్చింది. రాజ్యాంగ సవరణలను కేవలం న్యాయపరమైన, సాంకేతిక విషయాలు కాదు. ఆర్థిక, రాజకీయ సంక్షోభాలు రాజ్యాంగంపై ప్రభావం వేస్తాయి. రాజ్యాంగ సవరణలు అవసరమవుతాయి. ఈ రాజ్యాంగ సవరణలు రాజకీయ వ్యవస్థ మంచి చెడుల మీద ఆధారపడి ఉంటాయి. నెహ్రూ కాలంలో అభివృద్ధికి కోర్టులు, జడ్జీలు అడ్డుపడుతున్నారని రాజ్యాంగ సవరణలు చేశారు. ఇందిరాగాంధీ తన పదవిని, నియంతృత్వాన్ని కాపాడుకోవడానికి రాజ్యాంగ సవరణలు చేసింది. ప్రతిపక్షాన్ని లొంగదీసుకోవడానికి, లేదా దెబ్బతీయడానికి ఏవో జనాకర్షణ పథకాలను, విధానాలను ప్రకటించింది. బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు చేస్తూ చట్టాలు తీసుకొచ్చింది. ఈ చట్టాలను ప్రాథమిక హక్కులు 14, 19 కి వ్యతిరేకం అంటూ సుప్రీంకోర్టు తీర్పులు ఇచ్చింది. ప్రభుత్వ విధానాలను సమర్థించే జడ్జీలు (కమిటెడ్ జడ్జెస్) కావాలంటే జడ్జీల నియామకాలు తమకు నచ్చిన వారికి ఇవ్వాలి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తప్పనిసరిగా సీనియర్ జడ్జీ అయి ఉండాలనే సంప్రదాయాన్ని పాటించకుండా, ముగ్గురు సీనియర్లు కాదనీ, జూనియర్ జడ్జీని ప్రధాన న్యాయమూర్తిగా నియమించింది. దీంతో సీనియర్ జడ్జీలు పదవికి రాజీనామా చేశారు. న్యాయస్థానాల స్వయం ప్రతిపత్తి దెబ్బతినిందనీ దేశంలోని ప్రజాస్వామిక వాదులు, న్యాయ కోవిదులు విమర్శించారు. కాని, ఇందిరా గాంధీ పట్టించుకోలేదు. ప్రతిపక్షాల గొంతును, ప్రజాందోళనలను అణచివేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో ఇందిరాగాంధీ ఎన్నికను ప్రశ్నిస్తూ, అలహాబాద్ హైకోర్టులో కేసు వేశారు. ఎన్నికల ప్రచారానికి ప్రభుత్వ

యంత్రాంగాన్ని, ఉద్యోగులను వాడుకున్నారనే ఆరోపణ మీద విచారణ జరిగింది. జస్టిస్ సిన్హా అలహాబాద్ హైకోర్టు జడ్జీ ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని, ఆమె ప్రధానమంత్రి పదవిలో కొనసాగకూడదని, ఆరు సంవత్సరాల వరకు ఎన్నికల్లో పాల్గొనే అవకాశం లేదని తీర్పు ఇచ్చాడు. ఈ తీర్పు దేశ రాజకీయాల్లో సంచలనం రేపింది. ఈ తీర్పును ఇందిరాగాంధీ సుప్రీంకోర్టులో సవాలు చేస్తూ, హైకోర్టు తీర్పును నిలిపివేయాలని కోరింది. ఈ పిటిషన్ వేసవి సెలవుల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న కృష్ణ అయ్యర్ ముందు విచారణకు వచ్చింది. అలహాబాద్ హైకోర్టు జడ్జి సినా తీర్పు ఇచ్చే ముందు అజ్ఞాతంలోకి వెళ్లారు. అలాగే కృష్ణ అయ్యర్ మీద చాలా ఒత్తిడి వచ్చింది. ఇందిరాగాంధీకి అనుకూలంగా తీర్పు ఇవ్వకపోతే దేశం అల్లకల్లోలం అవుతుందని సలహాలు ఇచ్చారు. వీటన్నింటికి కృష్ణ అయ్యర్ చలించలేదు. ఇందిరాగాంధీ పార్లమెంట్ సభ్యురాలిగా కొనసాగడానికి అర్హత కోల్పోయిందనీ, అయితే పార్లమెంట్‌లో చర్చల్లో పాల్గొనడానికి, ఓటు వేయడానికి వీలు లేదనీ చెపుతూనే ఆమె ప్రధానమంత్రిగా కొనసాగవచ్చని తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును చాలమంది ప్రశంసించారు. అదే విధంగా విమర్శలకు కూడ గురైంది.

ఈ తీర్పు ఇచ్చిన రెండు రోజుల తర్వాత ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని విధించింది. 39, 42 రాజ్యాంగ సవరణలు తెచ్చి తన పదవిని కాపాడుకోవడానికి ప్రయత్నించింది. ఎమర్జెన్సీ కాలంలో ప్రాథమిక హక్కులకు ఎలాంటి గతి పట్టిందో అందరికీ తెలిసిందే. రాజ్యాంగాన్ని, చట్టాన్ని తమ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి ఎలా ఉపయోగించవచ్చో తెలుసుకోవడానికి ఎమర్జెన్సీ ఒక చక్కటి ఉదాహరణ. అలాగే కోర్టులు కూడ రాజ్యాంగం, చట్టం ఆధారంగానే నియంతృత్వాన్ని సమర్థించడం గానీ, లేదా ప్రజాస్వామిక విలువలను, ప్రాథమిక హక్కులను పరిరక్షించడానికి దోహదం చేస్తాయని తెలుసుకోవడానికి మరొక ఉదాహరణ హెబియస్ కార్పస్ కేసు. సుప్రీంకోర్టు చరిత్రలో ఇంతటి దారుణమైన తీర్పు ఎన్నడూ లేదు. ఈ కేసు ప్రధానంగా ఎమర్జెన్సీ కాలంలో అరెస్టుకు గురైనవారికి కారణాలు చెప్పడం అలా ఉంచి, అరెస్టు చట్టవ్యతిరేకం అని హైకోర్టులో రిట్ పిటిషన్ వేయడానికి కూడ వీల్లేదు అని నలుగురు జడ్జీలు తీర్పు ఇచ్చారు. జస్టిస్ ఖన్నా మాత్రమే మెజారిటీతో విభేదించాడు. విచారణ సందర్భంగా అటార్నీ జనరల్, జస్టిస్ ఖన్నా ఒక ప్రశ్న వేశారు. ఎమర్జెన్సీ అమల్లో ఉన్న కాలంలో పోలీసులు ఎవరినైనా కాల్చి చంపవచ్చా అని అడిగారు. అటార్నీ జనరల్ 'అవును' అని సమాచారం ఇచ్చాడు. అంటే ఆర్టికల్ 21 – జీవించే హక్కును హరించవచ్చు. దేశవ్యాపితంగా ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం ఆందోళన చెలరేగింది. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జనతా పార్టీ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రాథమిక హక్కులకు భరోసా కల్పించింది. ఇటువంటి ఉత్తేకరమైన వాతావరణంలో సుప్రీంకోర్టు తాను కోల్పోయిన ప్రతిష్ఠను తిరిగి సంపాదించుకోడానికి ప్రగతిశీలమైన తీర్పులు ఇవ్వడం సాధ్యమైంది. కృష్ణ అయ్యర్ వచ్చిన అవకాశాన్ని చాలా చాకచక్యంగా వినియోగించుకున్నాడు. సుప్రీంకోర్టును పేదల కోర్టుగా అభివర్ణించారు.

కృష్ణ అయ్యర్ తీర్పులు

కృష్ణ అయ్యర్ ఏడు సంవత్సరాలకు పైగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా దాదాపు ఐదు వందల తీర్పులు స్వయంగా రాశారు. 'జైలు రూలు – జైలు మినహాయింపు' అని తీర్పు ఇస్తూ నా జైల్, ఓన్లీ బెయిల్ అనే నినాదాన్ని ఇచ్చారు. నేరాలకు పాల్పడినవాళ్లు విచారణ ఖైదీలుగా జైళ్లలో మగ్గిపోతున్నారనీ, జైళ్ల పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయనీ వాటిని సంస్కరించాలనీ అనేక తీర్పులు ఇచ్చాడు. ఒంటరి ఖైదు (సాలిటరీ కన్ఫైన్‌మెంట్) జీవించే హక్కుకు వ్యతిరేకం అంటూ ఒంటరిగా ఖైదీ చేయడం వల్ల భౌతికంగా, మానసికంగా మనిషి కుంగిపోతాడని, ఈ పద్ధతికి స్వస్తి పలకాలని ప్రభుత్వాలను ఆదేశించారు. చేతులకు సంకెళ్లు వేయడం తప్పని అది కూడ వ్యక్తి స్వేచ్ఛకు భంగం అంటూ తీర్పులిచ్చాడు. జైలులో క్రూరమైన పద్ధతులు, చిత్రహింసలను తీవ్రంగా విమర్శించాడు. జైలులో వెట్టిచాకిరీ ఉండకూడదని, ఖైదీలకు పనికి తగిన జీతం ఇవ్వాలని చెప్పాడు. మొత్తంగా నేర విచారణ చట్టాన్ని రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల వెలుగులో వ్యాఖ్యానించి, విశ్లేషించి విప్లవకరించాడు. జడ్జీల పోర్టు ఫోలియో సామాజిక మార్పు అని భావించాడు. రాజ్యాంగం మానిఫెస్టో అయితే ప్రజలు నియోజకవర్గం అంటూ తన తీర్పుల్లో విశదీకరించాడు.

కృష్ణ అయ్యర్ దృష్టిలో 'ప్రజలు' అంటే ఎవరు అనే విషయంలో స్పష్టమైన వైఖరి ఉంది. రాజ్యాంగ పీఠికలో 'ప్రజలమైన మేము' అంటే కసాయివారు, రొట్టె తయారు చేసేవారు కొవ్వొత్తులను తయారు చేసే వారు, ఇంకా వెట్టిచాకిరీ చేసేవారు పేవ్‌మెంట్లపై బతికేవారు' అనే అర్థాన్ని చెప్తారు. ఇంకొక సందర్భంలో సమాజంలో బాధలకు గురవుతున్న వారిని సంబోధిస్తూ – నాలుకలేనివారు, చితికిపోయిన వారు, దెబ్బలు తిన్నవారు, పోలీసుల చిత్రహింసలకు బలైనవారు, పేదరికంలో చిక్కుకున్నవారు, అత్యాచారాలకు గురైనవారు, ఫలితంగా గర్భవతులైనవారు, వరకట్న చావులకు గురైనవారు, అగ్నికీలలకు బలైన మహిళలు, చిత్రహింసలకు బలైన ఖైదీలు, మురికివాడల్లో నివశించేవారు, రోడ్లపై నిరాశ్రయులు, వెట్టిచాకిరీ చేసేవారు, చెమటోడ్చే శ్రామికులు, లింగ వివక్షతకు గురైనవారు – వీరంతా మార్క్స్ పరిభాషలో పెద్ద పారిశ్రామిక సైన్యం లేదా విసిరివేయబడ్డ (డిస్పోజెబల్) ప్రజలు. వీరికి హక్కులు అనుభవించే పరిస్థితిని సామాజిక న్యాయాన్ని కల్పించాలనే ఉద్దేశంతోనే రాజ్యాంగాన్ని సాధనంగా, ఆయుధంగా ఎంచుకున్నాడు. 'ఎవరైనా సరే, సాధారణ ప్రజలకు సామాజిక న్యాయాన్ని నిరాకరించినా, నిర్లక్ష్యం వహించినా వారు రాజ్యాంగ వ్యతిరేకులే' అని అంటారు. పేదరికం కారణంగా సమాజంలోనే మెజారిటీ ప్రజలు కోర్టులకు రాలేకపోతున్నారనీ, ఫలితంగా తమ హక్కులను పొందలేక పోతున్నారనే ఆలోచనతోనే ప్రజాహిత వ్యాజ్యం (పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్) అనే కొత్త విధానానికి అంకురార్పణ చేశారు కృష్ణ అయ్యర్.

రతలామ్ మునిసిపాలిటీ కేసులో ప్రజాహిత వ్యాజ్యం గురించి వివరించాడు. కృష్ణ అయ్యర్‌తో పాటు జస్టిస్ చిన్నపరెడ్డి కూడ ఈ తీర్పు ఇవ్వడంలో భాగస్వామి. మునిసిపాలిటీలు బడ్జెట్ లేదు అన్న కారణంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టకపోవడం చట్టాన్ని ఉల్లంఘించడమే. గతంలో బాధితుడు మాత్రమే కోర్టులో ఫిర్యాది చేయడం లేదా రిట్ పిటిషన్ వేయాలనే నియమం ఉంది. బాధితుల తరపున, ప్రత్యేకించి పేదల తరపున, హక్కులు కోల్పోయిన, బలహీన, బడుగు వర్గాల తరపున వాళ్ల హక్కుల కోసం ఎవరైనా కోర్టులో రిట్ పిటిషన్ వేయవచ్చని వెసులుబాటు కల్పించారు. దీన్నే ప్రజాప్రయోజన లేదా ప్రజాహిత వాజ్యం అంటారు. ఈ వెసులుబాటులో హక్కుల కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు పేదల తరపున హక్కుల కోసం ప్రజాహిత వాజ్యాలు వేసి న్యాయం పొందారు. సుప్రీంకోర్టు జడ్జీలు మరింత ముందుకుపోయి ఖైదీలు ఇచ్చిన టెలిగ్రాంలకు, బాధితులు రాసిన

ఉత్తరాలను, పత్రికల్లో హక్కుల ఉల్లంఘన జరిగిన సంఘటనల వార్తలను, తమంతకు తామే రిట్ పిటిషన్లుగా స్వీకరించి బాధితులకు ఉపశమనం కల్పించారు. సుప్రీంకోర్టు, హైకోర్టులు బాధితులకు పోరాట కేంద్రాలుగా మారిపోయాయి. ఈ ప్రయోగాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తులందరూ ఆహ్వానించారు.

సుప్రీంకోర్టు తీర్పుల్లో, రాజ్యాంగ చరిత్రలో మేనకా గాంధీ కేసు ఒక మైలురాయి. ఇందులో కృష్ణ అయ్యర్ ఆర్టికల్ 14, 19, 21 ఇచ్చిన వ్యాఖ్యానం చాలా గొప్పది. అంతేకాకుండా, 1950లో ఎకె గోపాలన్ కేసులో ఇచ్చిన తీర్పును తప్పుపట్టారు. ఎకె గోపాలన్ కేసులో 'నిర్బంధంలో ఉన్న వ్యక్తి (ఖైదీ)కి ప్రాథమిక హక్కులు లేవని అప్పట్లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. సమానత్వం (ఆర్టికల్ 14), స్వాతంత్ర్యాలు (ఆర్టికల్ 19) వ్యక్తిగత స్వేచ్ఛ (ఆర్టికల్ 21) మధ్య సంబంధం లేదనీ, అవి ఒక్కొక్కటిగా ప్రత్యేకమైనవని, అందువల్ల ఖైదీలకు ప్రాథమిక హక్కులు లేవని తీర్పు సారాంశం. కాని మూడు దశాబ్దాల తర్వాత మేనకా గాంధీ కేసులో ఆ తీర్పును తిరగరాశారు. ఆర్టికల్స్ 14, 19, 21ల మధ్య అవినాభావ సంబంధం ఉందనీ, కొన్ని మినహాయింపులతో ఖైదీలకు కూడ ప్రాథమిక హక్కులు వర్తిస్తాయనే విధంగా తీర్పు ఇచ్చారు.

మేనకాగాంధీ కేసులో ప్రధానమైన అంశం అధికారంలో ఉన్నవారు తమకున్న విచక్షణా అధికారాన్ని ఎలా ఉపయోగించాలి. ఆర్టికల్ 21లో చట్టం నిర్దేశించిన పద్ధతి ప్రకారం (ప్రొసీడ్యుర్ ఎస్టాబ్లిష్డ్ బై లా) అంటే ఏమిటి? అనే ప్రశ్నలకు జవాబు ఇచ్చారు. చట్టం ఉద్దేశం గానీ, దాన్ని అమలుచేసే పద్ధతి కూడ న్యాయంగా, సహేతుకంగా ఉండాలనీ చెప్పారు. చట్టాన్ని, దానికి సంబంధించిన నియమ నిబంధనలను అమలు చేసే క్రమంలో ప్రాథమిక హక్కులకు భంగం కలుగకూడదు అన్నారు. విచక్షణా అధికారం సమానత్వం హక్కుకు వ్యతిరేకమనీ, సమన్యాయం కల్పించడంలో అధికారులు రాజ్యాంగ బద్ధంగా, హక్కులను కాపాడాలని చెప్పారు. ఏ చట్టమైన దాని లక్ష్యం, ఉద్దేశం, అమలుచేసే పద్ధతి రాజ్యాంగ బద్ధంగా ఆర్టికల్స్ 14, 19, 21 పరిరక్షించే విధంగా ఉండాలి. ఈ తీర్పు డ్యూ ప్రాసెస్ గురించి వివరించింది. ఈ తీర్పులో కృష్ణ అయ్యర్ ప్రాథమిక హక్కుల ప్రాముఖ్యత గురించి వివరణ అందరూ తెలుసుకోవాలి.

పై తీర్పులతోపాటు కార్మికుల గురించి, పర్యావరణం గురించి, ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాల మధ్య సంబంధం గురించి, అంతర్జాతీయంగా హక్కుల ఒప్పందాల గురించి అనేక తీర్పులు ఇచ్చారు. ప్రత్యేకించి బెంగళూరు వాటర్ సీవేజ్ కేసులో (1978) పారిశ్రామిక సంబంధాల చట్టంలో 'పరిశ్రమ' అనే పదానికి విస్తృతమైన అర్థాన్ని ఇచ్చారు. ఆసుపత్రులలో, స్కూళ్లలో, యూనివర్సిటీలలో పనిచేసే కార్మికులకు ఈ చట్టం వర్తింస్తుందని చెప్పారు. తానే స్వయంగా 'పరిశ్రమ'కు నిర్వచనం ఇచ్చాడు. కాని, ఇంత వరకు పారిశ్రామిక వివాదాల చట్టానికి ప్రభుత్వాల సవరణ తీసుకరాలేదు. పెట్టుబడి – శ్రామికుల మధ్య వివాదాల్లో ఎప్పుడు శ్రామికుల పక్షమే వహించాడు. బాధితులకు అనుకూలంగా తీర్పులిచ్చాడు.

బచ్చన్‌సింగ్ కేసులో ఉరిశిక్షలపై వ్యతిరేకతను తెలుపుతూనే కేవలం అరుదైన కేసుల్లోనే మరణశిక్ష విధించాలనే తీర్పు ఉరిశిక్షల రద్దుకై జరుగుతున్న ఉద్యమానికి స్ఫూర్తిని ఇచ్చారు. అంతేకాకుండా ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలనే విధానాన్ని తన తీర్పుల ద్వారా వ్యవస్థీకృతం చేశారు. ఆయన తీర్పుల సారాంశాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే కనీస మానవ అవసరాలైన కూడు, గుడ్డ, నివాసం ప్రాథమిక హక్కులుగా, స్వేచ్ఛలుగా నిర్వచించాడు.

పదవీ విరమణ తర్వాత

పదవీ విరమణ తర్వాత చాలా మంది సుప్రీంకోర్టు జడ్జీలు ప్రభుత్వం నియమించే కమిషన్లకు చైర్మన్లుగా ఎంపికవుతూ ఉంటారు. లేదా అవకాశాల కోసం ఎదురు చూస్తూ ఉంటారు. కృష్ణఅయ్యర్ అలా ఎప్పుడు ఎదురు చూడలేదు. పదవులు పొందడానికి ఆత్రుత చూపలేదు. మానవహక్కుల కార్యకర్తగా మిగిలిపోయారు. తను చనిపోయేవరకు బాధితుల పట్ల మాట్లాడారు. ప్రభుత్వ విధానాలను విమర్శించాడు. సామాజిక సేవ కోసం ఏర్పాటైన వందలకొద్ది ట్రస్టులకు, సంస్థలకు సలహాదారుగా పనిచేశారు. ఇండియన్ పీపుల్స్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ ట్రిబ్యునల్‌కు సెక్రటరీ జనరల్‌గా బొంబాయిలోని సిపిడిఆర్ కార్యకర్త సెబాస్టియన్ పనిచేశారు.

మనరాష్ట్రంలో విశాఖపట్నంలో చింతపల్లి ఏజెన్సీలో ఆదివాసులు మావోయిస్టులకు సహకరిస్తున్నారనే నెపంతో వారి గుడిసెలను కాల్చివేశారు. దీనిపై పీపుల్స్ ట్రిబ్యునల్ విచారణ జరిపింది. కాని మధ్యలోనే ఈ విచారణను పోలీసులు అడ్డుకున్నారు. అలాగే గుజరాత్‌లో ముస్లింల ఊచకోత సంఘటనపై విచారణ జరిపిన పీపుల్స్ పానెల్‌కు సలహాదారుడిగా ఉన్నారు. చట్టాల మీద, మానవ హక్కుల మీద, న్యాయవ్యవస్థపైన, ఇతర సామాజిక అంశాల మీద రచనలు చేశారు. దాదాపు 70 పుస్తకాలు రాశాడు. 'వాండరింగ్ ఇన్ మెనీ వర్ల్డ్స్' అనే పేరుతో తన ఆత్మకథను రాశాడు. అలాగే తన భార్య చనిపోయిన తర్వాత 'మరణం తర్వాత జీవితం' (లైఫ్ ఆఫ్టర్ డెత్) అనే పుస్తకం రాశారు.

హక్కుల ఉద్యమకారులకు ఆదర్శం

జస్టిస్ కృష్ణ అయ్యర్ జీవితం, బాధిత ప్రజలపట్ల ప్రేమ, వారి హక్కుల పట్ల నిబద్ధత, మనకు ఆదర్శంగా నిలుస్తాయి. రాజ్యాంగం, చట్టాల్లో ఎన్ని పరిమితులు ఉన్నా వాటిని ప్రజలకు అనుకూలంగా విశ్లేషిస్తూ, అనువదిస్తూ న్యాయం చేసే సృజనాత్మక శక్తికి కృష్ణ అయ్యర్ ఒక ప్రతీక. హక్కులనే ఆయుధంతో కోర్టుల్లో న్యాయం కోసం పోరాటం చేయడం ఎలాగో కృష్ణ అయ్యర్ నుంచి నేర్చుకోవాలి. ప్రజా ఉద్యమాల ద్వారా, వాటి ఒత్తిడి ద్వారా వచ్చిన చట్టాలను, అమలు చేసే క్రమంలో ముందుకు వచ్చే వైరుధ్యాలను పసిగట్టి, ప్రజలకు మేలు జరిగే విధంగా ప్రయత్నించడం అవసరం. ఈ బాధ్యత నెరవేర్చడానికి మనకు న్యాయ సిద్ధాంతం గురించిన పరిజ్ఞానం అవసరం. కృష్ణ అయ్యర్ తీర్పులు, వాటిల్లోని విశ్లేషణ, వ్యాఖ్యానం హక్కుల కార్యకర్తలకు విజ్ఞాన భండారంగా పనికొస్తాయి. ఆయన వెలువరించిన తీర్పులపైనే చాలామంది పరిశోధనలు చేసి పుస్తకాలు రాశారు. వాటిని మనం చదవాలి. మన జ్ఞానాన్ని పెంచుకోవాలి.

రోజురోజుకు బలహీనమవుతున్న, ప్రజలకు దూరమవుతున్న రాజ్యాంగ వ్యవస్థలను విమర్శనాత్మకంగా చూడడానికి ఆయన రచనలు ఉపయోగపడతాయి. 1990ల నుండి సుప్రీంకోర్టు నయా ఉదారవాద భావజాలానికి లోనైంది. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణలను సమర్థిస్తూ తీర్పులు ఇచ్చింది. 1980లలో ప్రగతిశీలమైన తీర్పులను తిరగరాస్తోంది. అప్పుడప్పుడూ సంచలనాత్మకమైన తీర్పులు వచ్చినా వాటిని ప్రభుత్వ యంత్రాంగం అమలు చేయడం లేదు. ఇటువంటి సంక్షోభ, ప్రమాదకరమైన సందర్భంలో, ప్రత్యేకించి తీవ్రస్థాయిలో హక్కుల ఉల్లంఘన జరుగుతున్న పరిస్థితుల్లో కృష్ణ అయ్యర్ ఇచ్చిన తీర్పుల అవగాహనతో మనం హక్కుల పరిరక్షణకు సంసిద్ధం కావాలి.

(రచయిత పౌరహక్కుల సంఘం అధ్యక్షులు) వీ

అరుదైన పౌరహక్కుల నేత రెహనా సుల్తానా

ఇటీవల మరణించిన సామాజిక శాస్త్రవేత్త, మహిళల, పౌరహక్కుల నాయకురాలు రెహనా సుల్తానా చేసిన కృషి అపారమైందని అంటున్నారు **లతీఫ్ మహమ్మద్ ఖాన్**

బడీ ముష్కిల్ సే హోతా హై చమన్ మె దీదా-వర్ పైదా అని ఉర్దూలో అల్లామా ఇక్బాల్ రాసిన ద్విపద ఒకటి ఉంది. ఒక మేధావి పుట్టడానికి చాల చాల సమయం పడుతుంది అని దాని అర్థం. ప్రొఫెసర్ రెహనా సుల్తానా విషయంలో అది అక్షరాలా నిజం. హైదరాబాద్ లో 1956లో ఆమె పుట్టిన సమయానికి, ఆ పాతనగరపు ఇరుకు సందుల్లోంచి ఒక విప్లవ మహిళా మేధావి రూపొందగలరని ఊహించడం అసాధ్యం. హైదరాబాద్ రాజ్యం మీద సైనిక దాడి నుంచి ఇంకా బైటపడని ప్రజలను సామాజికంగా, విద్యాపరంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా అణగదొక్కిన కాలం అది. రెహనా బాజీ అని అందరిచేతా ప్రేమగా పిలిపించుకున్న రెహనా సుల్తానా ఆ గడ్డు పరిస్థితులన్నిటినీ ఎదుర్కొని, ఒక హైదరాబాదీ మహిళ ఎంత దుస్థితితోనైనా ఎలా పోరాడగలదో, శత్రువులను ఎలా ప్రతిఘటించగలదో, ప్రజా ఉద్యమానికి ఎలా నాయకత్వం వహించగలదో రుజువు చేసి చూపింది.

దాదాపు పది సంవత్సరాలుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ, డయాలిసిస్ చికిత్స తీసుకుంటూ ఉండేది. ఆమె శరీరమంతటా వ్యాపించిన ఇన్ఫెక్షన్ వల్ల వారం రోజులు బాధపడి అకాల మృత్యువాతపడింది. ఆమె నలభై సంవత్సరాలకు పైగా కార్యకర్తగా ఉంది. ఆమె ఒకవైపు చదువుకుంటూనే తన పద్దెనిమిదో ఏటి నుంచే నిస్సహాయ, పీడిత, నిరుపేద స్త్రీల కోసం పని చేయడం ప్రారంభించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రొ. అష్రఫ్ రఫీ దగ్గర పి ఎచ్ డి చేసింది. ఆమెకు విద్య మీద చాల ఆసక్తి ఉండేది, తాను చదువుకోవడం మాత్రమే కాక ఎంతో మంది స్త్రీలను చదువుకునేలా ప్రోత్సహించింది. హైదరాబాద్ లో పిల్లలకు విద్య నేర్పడం కోసం 1970 ల చివరిలో ఆమె డక్కన్ గ్లోరియస్ స్కూల్ అనే పాఠశాల స్థాపించి వేలాది మంది చదువుకోవడానికి అవకాశం కల్పించింది. ఉర్దూ భాషా వ్యాప్తి కొరకు సంస్థలు నెలకొల్పింది. ఈ సంస్థలలో పిల్లలకు ఉర్దూ నేర్పి, వారిని అలీఘర్ జామియా ఉర్దూ, ఇదారా-ఎ-అద్బియత-ఎ-ఉర్దూ వంటి ప్రామాణిక సంస్థలు నిర్వహించే పరీక్షలకు సిద్ధం చేసి, వారిని పట్టభద్రులను చేసింది. వారు ప్రస్తుతం ఉన్నత స్థానాలలో ఉండడానికి తగిన శిక్షణ ఇచ్చింది.

ఆమె ప్రతి ఆడపిల్లకు చదువుకునే హక్కు ఉందని నినదిస్తూ పోరాడి ఆ ఆశయంలో విజయం సాధించింది. మహిళల హక్కుల కోసం విరామమెరుగని పోరాటాలు చేసింది. అణగారిన స్త్రీలకు తన చెయ్యి అందించింది. ఆమె ఒక ఏకైక ఆశారేఖగా భావించిన ఎందరో మహిళలు ఆమె దగ్గరికి సహాయం కోసం వస్తుండేవారు. ఎన్నో మహిళా సంఘాలకూ సంస్థలకూ ఆమె సలహాదారుగా పనిచేసింది. ఇతర స్త్రీల సమస్యలకూ ముస్లిం స్త్రీల సమస్యలకూ తేడా ఉందని ఆమె గట్టిగా భావించేది. కొన్ని మహిళా సంఘాలు ముస్లిం స్త్రీల ప్రత్యేక సమస్యల మీద కాకుండా వారికి సంబంధం లేని ఇతర అంశాలే ముఖ్యమైనవని చూపుతున్నప్పుడు, ఆమె ముస్లిం స్త్రీలను సంఘటిత పరచి తమ ప్రత్యేక సమస్యల మీద తామే పోరాడేలా, తమ హక్కుల కోసం తామే నిలబడేలా ప్రయత్నించింది.

పీడననూ అన్యాయాన్నీ ఎటువంటి పరిస్థితులలోనూ సహించడానికి వీలు లేదని ఆమె దృఢంగా నమ్మింది. పీడనకు వ్యతిరేకంగా గొంతెత్తడంలో, హక్కుల కోసం పోరాడడంలో ఎవరికీ రుణపడనక్కర లేదని, ఎవరిమీదా ఆధారపడనక్కరలేదని ఆమె భావించింది. ఈ నేపథ్యంలో, ఈ భావాలతో పౌరుల మానవ హక్కులను, పౌరహక్కులను పరిరక్షించడానికి సివిల్ లిబర్టీస్ మానిటరింగ్ కమిటీ స్థాపనకు ఆమె పునాది వేసింది. చివరిశ్వాస వరకూ ఆమె ఈ సంస్థతో కొనసాగి, అధ్యక్షురాలిగా తన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించింది. ఎంత కష్టతరమైన సమయాల్లో కూడ ఆమె భయానికి గురికాలేదు, పరిస్థితులతో రాజీపడలేదు. ధైర్యసాహసాలతో పరిస్థితులను ఎదుర్కొంది. ఆమె రాజ్యాన్ని ప్రశ్నించింది, జవాబుచెప్పేలా చేసింది. పోలీసు అత్యాచారాలకూ, ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకూ, రాజకీయ వర్గపు బాధ్యతారహిత ప్రవర్తనకూ, మత నాయకుల అసమర్థతకూ మౌనానికీ వ్యతిరేకంగా ఆమె ఎప్పుడూ గొంతెత్తుతూ ఉండింది.

సిఎల్ఎంసి తరఫున ప్రతి నిజ నిర్ధారణ బృందానికీ ఆమె నాయకత్వం వహించింది. గుజరాత్ మారణకాండ సందర్భంలో వెళ్లిన నిజ నిర్ధారణ బృందానికి నాయకత్వం వహించి, ఆమె ఎన్నో శిబిరాలను సందర్శించింది. ప్రతిఘటించమనీ పోరాడమనీ అక్కడి మహిళలకు పిలుపు ఇచ్చింది. ఒక ముస్లిం కుటుంబాన్ని సజీవదహనం చేసిన వాటోలి సంఘటనలో, జహీరాబాద్ ఒక ముస్లిం యువకుడిని ఎన్‌కౌంటర్ పేర కాల్చి చంపిన సంఘటనలో, ముస్లింల మీద హిందుత్వ మూకల దాడుల సందర్భంలో, మక్కా మసీదు బాంబు పేలుళ్ల సంఘటనలో, తీవ్రవాదుల అణచివేత పేరుతో ముస్లిం యువకుల మీద జరిగిన వేధింపుల సందర్భాలలో ఆమె ఆరోగ్యం సహకరించనప్పటికీ ప్రతి నిజనిర్ధారణలోనూ పాల్గొన్నది. తెలంగాణ ఉద్యమ సందర్భంలో 2012లో మెదక్ జిల్లా సంగారెడ్డిలో హిందుత్వ శక్తులు ముస్లింల మీద దాడులు చేసినప్పుడు సిఎల్ఎంసి నిజనిర్ధారణ బృందానికి ఆమె నాయకత్వం వహించింది. మండుటెండలో అనారోగ్యంతో ఆమె ఈ నిజనిర్ధారణలో మాతో కలిసి చాల ఓపికగా పాల్గొంది. అక్కడి పరిస్థితులు చూసిన తర్వాత మనం కలగంటున్న తెలంగాణ ఇది కాదు అని వ్యాఖ్యానించింది! తెలంగాణలో హిందుత్వ పెరిగిపోతుండడం పట్ల, ఆ సమస్యపై తెలంగాణ నాయకుల మౌనం పట్ల ఆమె చాల ఆందోళన చెందేది.

ప్రొ. రెహనా సుల్తానాకు మత పండితులు, మదరసా కమిటీలు, మహిళా కార్యకర్తలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, ఉపాధ్యాయ

ఆరోగ్య రంగంలో రావాల్సిన మార్పులు

వైద్యరంగం ప్రైవేట్‌పరం, కార్పొరేటీకరణ చెందడంతో సామాన్య ప్రజలకు వైద్యం దూరమైందనీ, అన్ని వర్గాల ప్రజలకు సరైన వైద్యం అందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందనీ అంటున్నారు **డా. ఎస్. తిరుపతయ్య**

దశాబ్దాలుగా ప్రభుత్వాలు సంక్షేమ రంగాల్ని తమ ప్రాధాన్యతల్లో లేని అంశాలుగా మార్చాయి. ఫలితంగా వైద్యరంగం కూడా మార్కెట్‌కు వదిలివేయబడింది. పేరుకు ప్రభుత్వాసుపత్రి వ్యవస్థ ఉన్నా వాటి ద్వారా అందుతున్న సేవలకు, ప్రజల అవసరాలకు పొంతన లేదు. ఆధునిక ప్రభుత్వాలు మహానగరాలను మరింత మహానగరాలుగా ఎలా తీర్చిదిద్దాలి, పెట్టుబడి దారులకు అత్యధిక లాభాలు వచ్చేలా ఏం చేయాలి, మానవ జాతి ఉమ్మడి ఆస్తి అయిన సహజ వనరులను కొంత మంది గజదొంగలకు ఎలా అప్పగించాలి? వంటి అనేక విధానాల రూపకల్పనలో తల మునకలై ఉంటున్నారు. సామాన్య మధ్య తరగతి ప్రజలు మాత్రం తరతరాల ఆకలి, అనారోగ్యాలకు తోడు కొత్తగా అప్పులు, అభద్రత ఆందోళనలతో అర్థంకాని జీవితంలో గిరికీలు కొడుతున్నారు.

ప్రజారోగ్య రంగాన్ని మెరుగుపర్చబోతున్నామంటూ వైద్య విధానం ఎలా ఉండాలో ప్రజలు, అనుభవజ్ఞులు మేధావులు మాకు 13 రోజుల కాల పరిమితిలో సలహాలు, సూచనలు ఇవ్వండని తెలంగాణ ప్రభుత్వం బహిరంగంగా కోరింది. అందుకు ప్రతిస్పందనగా నాతో పాటు పదిమంది వైద్యుల సహాయంతో రూపొందిన ఒక సవివర నివేదికను 2014 సెప్టెంబరు 27న తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపించాం. దానిని వారు చదివారో లేదో కూడా సందేహమే! మా డ్రాఫ్ట్ అందినట్లు, పరిశీలిస్తున్నట్లు కనీస మర్యాదకు కూడా వారి నుండి జవాబు రాలేదు. వారికి పంపిన నివేదికలో చర్చించిన కొన్ని ముఖ్యాంశాలను మీ ముందుంచుతున్నాం. ఇందులో గల అంశాలు చాలా వరకు రెండు తెలుగు రాష్ట్రాలకు వర్తిస్తాయి. కాబట్టి రెండు రాష్ట్రాల్లోనూ వైద్య విధానంలో రావాల్సిన మార్పులకు ఈ అవగాహన తోడ్పడగలదని భావిస్తున్నాం.

1. ప్రజారోగ్య రక్షణ ప్రభుత్వ బాధ్యతగా కొనసాగాలా లేక పౌరుల వ్యక్తిగతానికే వదిలి వేయాలా?

ప్రజారోగ్యాన్ని మెరుగుపర్చాలని మనం అనుకుంటున్నాం కాబట్టి ఇప్పటికే ఆ లక్ష్యం సాధించిన ఇతర దేశాల, రాష్ట్రాల అనుభవాన్ని పరిగణలోకి తీసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే దాదాపు అన్ని దేశాలు ప్రజారోగ్య రక్షణ బాధ్యతను ప్రధానంగా ప్రభుత్వమే భరించే విధంగా విధానాలు రూపొందించుకున్నాయి. ధనిక దేశాలైనప్పటికీ, ఆ దేశాల్లో చెప్పుకోదగ్గ శాతం పౌరులు వ్యక్తి గతంగా సంపన్నులైనప్పటికి ప్రజారోగ్య రక్షణ వ్యయంలో ప్రభుత్వానిదే ప్రధాన వాటా. అమెరికా, బ్రిటన్, నార్వే, డెన్మార్క్, జపాన్, జర్మనీ, స్విడ్జర్‌లాండ్ వంటి దేశాలలో మొత్తం ప్రజారోగ్య రక్షణ వ్యయంలో ప్రభుత్వ వాటానే మూడువంతుల పైన ఉంటుంది.

వివిధ అభివృద్ధి చెందిన దేశాలు వైద్యరక్షణకు వాటి జిడిపి (స్థూలదేశీయోత్పత్తి) నుండి చేస్తున్న ఖర్చును అందులో ప్రభుత్వం తరపున చేసే ఖర్చు, పౌరులు స్వాంతంగా తమ జేబు నుండి చేసే ఖర్చును కింది పట్టికలో చూడండి.

దేశం	ఆరోగ్య వ్యయం (ప్రభుత్వం + ప్రజలు చేసే ఖర్చు జిడిపిలో శాతంగా)	మొత్తం ఆరోగ్య వ్యయంలో ప్రభుత్వ పరంగా చేసే వ్యయం (శాతంలో)	మొత్తం ఆరోగ్య వ్యయంలో పౌరులు స్వంతంగా భరించేది (శాతంలో)	ఈ దేశాల్లో ఆరోగ్య ప్రమాణాలు	
				ఐఎంఆర్	ఎల్ఇ
నార్వే	9.1	85.0	15.0	2	80
డెన్మార్క్	11.2	85.5	14.5	3	78
ఆస్ట్రేలియా	9.0	66.9	33.1	3	80
బ్రిటన్	9.3	82.5	17.5	4	80
అమెరికా	17.9	46.4	55.6	6	76
జపాన్	9.3	82.5	17.5	2	80
జర్మనీ	11.1	76.3	23.7	3	79
ఫ్రాన్స్	11.6	76.9	23.1	4	79
బెల్జియం	10.6	75.9	24.1	4	78
స్విడ్జర్‌లాండ్	1.9	61.7	38.3	4	81
ఇండియా	3.9	30.0	70.0	42	65

మానవాభివృద్ధి నివేదిక 2014, వరల్డ్ డెవలప్‌మెంట్ ఇండికేటర్స్ 2014 (2013)

ఐఎంఆర్ – శిశు మరణాల రేటు (పుట్టిన ప్రతి 1000 మందిలో సంవత్సరం వయస్సు దాటకుండానే మరణిస్తున్న శిశువుల సంఖ్య), ఎల్ఇ – సగటు జీవితకాలం (సంవత్సరాలలో).

లోకం, మానవ హక్కుల కార్యకర్తలు వంటి విభిన్న బృందాల ప్రజలతో స్నేహ సంబంధాలు ఉండేవి. ఆమె తన సామాజిక బాధ్యతలను అద్భుతంగా నిర్వహించారు. ఆమె ఎల్లప్పుడూ ఏదో ఒక కార్యాచరణలో ఉండేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆమె తన జీవితం మొత్తాన్నీ ప్రజాసేవకు అంకితం చేశారు. ఆమె చూపిన బాటలో పయనిస్తామని, ఆమె ఉజ్వల వారసత్వాన్ని కొనసాగిస్తామని సి ఎల్ ఎం సి శపథం చేస్తున్నది.

క్లుప్తంగా చెప్పాలంటే ప్రొ. రెహనా సుల్తానాను హైదరాబాద్ ఉక్కు మహిళగా అభివర్ణించవచ్చు. ఆమె మృతి దేశానికీ, సమాజానికీ తీరని లోటు. సమీప భవిష్యత్తులో పూడ్చడం కష్టతరమైన శూన్యం అది. రానున్న రోజుల్లో ఆమె లేని లోటు మరింత తెలుస్తుంది. కాని ఆమె దగ్గర శిక్షణ పొందిన కార్యకర్తలు ప్రియతమ రెహనా బాజీ కృషిని కొనసాగించి, పరిపూర్తి చేస్తారు.

(రచయిత సివిల్ లిబర్టీస్ మానిటరింగ్ కమిటీ బాధ్యులు) వీ

ఒకప్పటి సోషలిస్టు దేశాలైన రష్యా-61 శాతం, చైనా 56 శాతం, క్యూబా 95 శాతం ఖర్చును ప్రభుత్వం తరుపున భరిస్తున్నాయి. ఇక మనకంటే చిన్న దేశాలైన థాయిలాండ్‌లో ప్రభుత్వ వాటా 76 శాతం పైన, పెరూ 59 శాతం, మలేషియా 55 శాతం, లిబియా 78 శాతం, ఇరాక్ 55 శాతం, కోస్టారికా అనే చిన్న దేశం 75 శాతం భరిస్తున్నాయి. ఈ విధమైన బాధ్యత తీసుకోవడం వల్లనే ఆయా దేశాల్లో ఆరోగ్య ప్రమాణాలు శిఖరాగ్రాన ఉన్నాయి.

ప్రపంచ దేశాలతో పోలిస్తే మనదేశం పరిస్థితి ఇలా ఉండగా దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణతో సహా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చేసిన వ్యయం, ఆరోగ్య ప్రమాణాలు జాతీయ సగటు కంటే దిగువన ఇలా ఉన్నాయి.

రాష్ట్రం	తలసరి ఆరోగ్య వ్యయం ప్రభుత్వం ఖర్చు కోట్లలో	ప్రభుత్వాసుపత్రి పడకలు- లక్ష జనాభాకి	సగటు జీవితకాలం (2006-10)	ఐఎంఆర్
జమ్మూ కశ్మీర్	845	36	-	39
ఢిల్లీ	840	141	-	25
ఉత్తరాఖండ్	630	84	-	34
ఛండీఘర్	798	225	-	20
కేరళ	454	82	74.2	12
కర్ణాటక	419	86	67.2	32
తమిళనాడు	410	72	68.9	21
ఆంధ్రప్రదేశ్	410	43	65.8	42
జాతీయ సగటు	503	43	66.1	42

కాబట్టి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వాలకు కూడా ప్రజల ఆరోగ్య ప్రమాణాలు పెరగాలనే చిత్తశుద్ధి గనుక ఉంటే ప్రజారోగ్య రక్షణ బాధ్యతను ప్రధానంగా ప్రభుత్వమే తీసుకొనే విధానాన్ని ఎంచుకోవాలి.

2. ప్రభుత్వ ఆసుపత్రులుండాలా? ప్రైవేట్ ఆసుపత్రులుండాలా?

మనలాంటి పేద దేశం, రాష్ట్రాల్లో వైద్య ఆరోగ్య రక్షణను ప్రజల వ్యక్తిగతానికి వదిలేయడం మానవత్వం కాదని అంటున్నాం. పేరుకు ప్రభుత్వ వైద్య వ్యవస్థ ఉనికిలో ఉన్నప్పటికీ అన్ని వర్గాల ప్రజలు వారి ఆరోగ్య అవసరాల్లో దాదాపు 70 నుండి 80 శాతం ప్రభుత్వ రంగానికి వెలుపలనే తీర్చుకోవలసి వస్తున్నది. ఈ పరిస్థితి తారుమారై కనీసం 80 శాతం అవసరాలు ప్రభుత్వరంగంలో తీరితేనే ప్రజలు ఆరోగ్య పరంగా, ఆర్థికంగా కోలుకుంటారు. ఆ విధంగా ప్రభుత్వాలు ముందుకు వచ్చినపుడు అందించ బడే సేవలు ప్రభుత్వ వైద్య వ్యవస్థ ద్వారా అందిస్తేనే ప్రభుత్వం ఆర్థికంగా తట్టుకోగలదు. వైద్య సేవలను 'ప్రైవేట్ ఆసుపత్రుల్లో నేరుగా కొనిగానీ ఆరోగ్య బీమా ద్వారాగానీ ఇన్ని కోట్ల మంది ప్రజలకు అందించడం మనలాంటి పేద దేశానికైనా, రాష్ట్రానికైనా సాధ్యం అయ్యే విషయం కాదు.

ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం, సిజిహెచ్ఎస్ సభ్యులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించి ఆయా ఆసుపత్రులకు చేస్తున్న రీఎంబర్స్‌మెంట్ స్కీంను తక్షణమే రద్దు చేయాలి. కనీసం ప్రభుత్వాసుపత్రులు మెరుగయ్యే వరకు వారిని గరిష్ఠంగా స్వతంత్ర సంస్థలైన నిమ్స్ వంటి సంస్థలను దాటి పంపకూడదు. ప్రతి ప్రభుత్వోద్యోగి లేదా ప్రజా ప్రతినిధి ప్రభుత్వాసుపత్రులకే రావాలి. అప్పుడే వీటిపై శ్రద్ధ పెరుగుతుంది. ప్రభుత్వ ఆసుపత్రులు ప్రపంచ స్థాయి సేవలందిస్తున్నప్పుడు ప్రజలకు ప్రైవేట్ ఆసుపత్రుల అవసరం దానికదే తగ్గిపోతుంది.

3. ప్రభుత్వం ప్రజారోగ్య రక్షణలో ప్రైవేట్ హాస్పిటల్‌లను భాగస్వాములుగా చేయవచ్చా?

ఈ విధానం ప్రపంచంలో ఎక్కడా అమలులో లేదు. లక్ష్యం నెరవేరదు. ఆచరణలో వారిని మేపడమే అవుతుంది. వివిధ దేశాల్లో చేసిన ఇటువంటి ప్రయత్నం ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను మరింత కుంగదీసింది. అయితే ప్రపంచ బ్యాంకు వంటి సంస్థలు బహుళ జాతి వ్యాపారవేత్తలు పేద దేశాల్లో ఇటువంటి విధానాన్ని పిపిపి (పబ్లిక్ ప్రైవేట్ ప్రార్ట్‌నర్‌షిప్) పేరుతో ప్రవేశ పెట్టాలని ఒత్తిడి తెస్తున్నాయి. ఇది అంతిమంగా ఉన్న ప్రజారోగ్య వ్యవస్థకు ఎసరు పెట్టే వ్యవహారం.

ఆరోగ్యశ్రీని ఏం చేద్దాం?

ఆరోగ్యశ్రీ పథకం పిపిపి వంటి ఒక కార్యక్రమమే. ఆరోగ్యశ్రీ పైకి ఆకర్షణీయంగా కనిపించినా దీని ద్వారా లాభపడ్డ ప్రజల శాతం కంటే నష్టపోయిన ప్రజల శాతం కొన్ని వందల రెట్లు ఎక్కువ ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన ఆరోగ్య బడ్జెట్ నుండి దాదాపు 20 శాతం పైన ఆరోగ్యశ్రీకి మళ్లించింది. ప్రభుత్వాసుపత్రి రంగం ఆ మేరకు అధోగతి పట్టింది. ఆరోగ్యశ్రీ ద్వారా ఇప్పటి వరకు రెండు రాష్ట్రాల్లోనూ 7 వేల ఐదు కోట్ల రూపాయల పైన వివిధ ఆసుపత్రులకు పంచిపెట్టారు. వాటిలో 5 వేల ఐదు వందల కోట్ల రూపాయలు అంటే దాదాపు 80 శాతం ప్రైవేట్ ఆసుపత్రులకు చేరింది. ఇది కాక ఆరోగ్యశ్రీ ట్రస్టు, దాని సిబ్బంది వేతనాలు వంటి నిర్వాహణ వ్యయం మరింత అదనపు ఖర్చు. ఆరోగ్యశ్రీ కేసుల్లో జరిగిన చికిత్సల్లో ప్రైవేట్ ఆసుపత్రులు చాలా మోసాలకు కూడా పాల్పడ్డాయి. ఓ మోస్తరు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ ప్యాకేజీకంటే ఎక్కువ ఖర్చు కాగల వ్యాధులకు చికిత్సలు చేయకుండా తప్పించుకుంటున్నారు.

ఆరోగ్యశ్రీలో చేసిన చికిత్సలు చాలా వరకు ప్రభుత్వాసుపత్రుల్లో చేయదగినవే ఉన్నాయి. అయినా అటువంటి ప్రభుత్వాసుపత్రులు దరిదాపుల్లో లేకపోవడం, ఉన్నవాటిలో దొరికే వైద్యం, మర్యాదకు భయపడి ప్రైవేట్‌ను ఆశ్రయించే పౌరులకు ప్రభుత్వం ఆ బిల్లులు కూడా ఆరోగ్యశ్రీ ద్వారా చెల్లించింది. ఇది రాజకీయ ప్రచారానికి గ్లామర్ అద్దింది కాని, ప్రభుత్వ రంగం మరింత డీ-గ్లామరయ్యింది. అలా కాకుండా ప్రభుత్వాసుపత్రుల్లోని వైద్య సేవల నాణ్యత, సమర్థత పెంచి రోగుల పట్ల మర్యాద, జవాబుదారీతనాలను పెంచగలిగితే ప్రజలకు, ప్రభుత్వానికి ఈ అనవసర భారం తప్పుతుంది. ఒక గుండె జబ్బుల డాక్టరు లేదా ఒక న్యూరో సర్జన్ ప్రభుత్వాసుపత్రిలో నియమిస్తే అతనికి ఎంత వేతనం చెల్లించాల్సి వచ్చినా అతను ఒకటి, రెండు రోజులు చేసే సర్వీసులో ఆ వేతనం మాఫీ అవుతుంది. మిగతా పనిదినాల్లో ఉత్పత్తయ్యే సేవలన్నీ ప్రభుత్వానికి ఆదాయం మిగిల్చేవే ఉంటాయి. ఇదే సూత్రం అనేక మౌలిక సదుపాయాల కల్పనకు, వైద్య సదుపాయాలకు వర్తిస్తుంది.

ఇంకా ఆరోగ్యశ్రీని కొనసాగించడం అంటే అనాథల్లాంటి ప్రభుత్వాసుపత్రులకి వచ్చే కొద్దిపాటి బడ్జెట్‌ను దీని ద్వారా బయటకు పంపి 'ప్రైవేట్'ను పెంచి పోషించడమే అవుతుంది. ఇప్పటి దాకా ఆరోగ్యశ్రీ చేసిన పని అదే. కాబట్టి ఎక్కువ మంది ప్రజలకు ఉత్తమ

సేవలందించాలంటే ఆరోగ్యశ్రీని వెంటనే రద్దు చేసి ఆరోగ్య బడ్జెటును అవసరాలకు తగినంత పెంచి అందరికి ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారానే సేవలందించాలి.

అప్పటి వరకు తక్షణంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో లేని లేదా దగ్గర ప్రాంతంలో అందుబాటులో లేని అత్యవసర కేసులకు చికిత్స అందించడంలో మాత్రమే 'ప్రైవేట్' సహాయం తీసుకోవచ్చు. ఇది వారికి లాభం చేకూర్చేదిగా కంటే ప్రజల ఆరోగ్యరక్షణ కోసం వారి సామాజిక బాధ్యతగా ప్రభుత్వం చట్టపరమైన ఆంక్షలతో వర్తింపజేయాలి. దాదాపు ఇటువంటి చట్టాల్నే అమెరికా లాంటి దేశాలు ప్రవేశపెడుతున్నాయి. దీనికి ఇప్పటి ఆరోగ్యశ్రీ మాదిరి ఆన్‌లైన్‌లో ఎమర్జన్సీ పర్మిషన్‌లు తీసుకుంటూ రోగికి వైద్య సేవలందించాలి. దీనికైన ఖర్చు ప్రభుత్వం తరువాత ఈ ఆసుపత్రులకు చెల్లించాలి.

4. ఒక మంచి హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ ఉంటే బాగుంటుందా?

బాగుండదు. మన దేశంలోనే కాదు ఏ ఇతర దేశాల్లోనూ 'హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్' అనేది విజయవంతం కాలేదు. హెల్త్ ఇన్సూరెన్ స్కీముల విధానాన్ని ప్రోత్సహించాలని మనదేశంలోని 'ప్రైవేట్ హాస్పిటల్ ఇండస్ట్రీ' చాలా కాలంగా విశ్వ ప్రయత్నం చేస్తున్నది. అయితే ప్రపంచంలో ఎక్కడా ప్రజలు ఇటువంటి పథకాలను తమ ఆరోగ్య రక్షణకి పనికి వచ్చే సాధనాలుగా చూడడం లేదు. ఒక్క అమెరికాలో తప్ప ఏ ఇతర దేశాల్లోనూ వీటిని ఆశ్రయించిన ప్రజల శాతం ఒకటి రెండు శాతానికి మించదు. అమెరికాలోనూ ఎందుకంటే అక్కడ ప్రభుత్వాసుపత్రులు లేవు. దాదాపు మొత్తం ప్రైవేటే. వాటి బిల్లులు భరించడం అక్కడి ధనవంతులకు కూడా సాధ్యం కావడంలేదు. కాబట్టి అందురూ హెల్త్ ఇన్సూరెన్స్‌లను తీసుకుంటారు. చికిత్సలకయ్యే ఖర్చు ఎక్కువ ఉన్నపుడు ప్రీమియంలు కూడా ఆ మేరకు ఎక్కువ ఉంటాయి. ఎంత ఎక్కువంటే అమెరికాలో ఆ ప్రీమియం కట్టలేనివారూ పెద్దమొత్తంలో ఉన్నారు. అటువంటి 'అమెరికా పేదల'కు ప్రభుత్వమే వారి తరపున ప్రీమియంలు చెల్లించి బీమా సౌకర్యం చేయిస్తుంది. ఏ కారణంవల్లనైనా రెండవది కూడా జరుగకపోతే వారి పరిస్థితి వర్ణనాతీతం.

ఆసుపత్రులు ప్రైవేట్‌లో ఉండి, బీమా కంపెనీలూ ప్రైవేట్ అవడంవల్ల ఈ రోజు అమెరికా ఆరోగ్య వ్యయం వారి స్థూల దేశీయోత్పత్తిలో 17.5 శాతానికి చేరింది. అమెరికా స్థూల దేశీయోత్పత్తి అంటే ఆ దేశం (ప్రభుత్వ, ప్రైవేట్ వ్యక్తుల) మొత్తం సంపాదన. అందులో నుండి ఇంత మొత్తం ఖర్చవుతుంది.

ఇది అమెరికా ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌లో ఏటా 25 నుండి 27శాతం ఉంటుంది. బ్రిటన్ మాత్రం ఆసుపత్రులు ప్రభుత్వ రంగంలో ఏర్పర్చుకుని బీమా కంపెనీల జోలికి వెళ్లకుండా తన ఎన్‌హెచ్‌ఎస్ (జాతీయ ఆరోగ్య సేవా పథకం) ద్వారా జిడిపిలో 9.3 శాతం ఖర్చులో అమెరికాతో సమానంగా ఆరోగ్య ప్రమాణాలను సాధించింది.

వైద్య వ్యవస్థ ప్రభుత్వ రంగంలో ఉంటే 'ఆరోగ్య బీమా'ల అవసరమే ఉండదు. ప్రైవేట్ ఆసుపత్రుల కోసమే కదా ఆరోగ్య బీమాలు. బీమా కంపెనీ ప్రైవేట్‌దైనా ప్రభుత్వానిదైనా ప్రైవేట్ ఆసుపత్రుల బిల్లులు పెరిగితే బీమా ప్రీమీయంలు పెరుగుతాయి. ఆరోగ్య బీమాలో సభ్యత్వం పొందిన వ్యక్తి ఎవరైనా లాభపడ్డున్నారంటే ఇతర సభ్యులు క్లెయిమ్ చేసుకోనప్పుడే సాధ్యపడుతుంది. ఎక్కువ మంది క్లెయిమ్ చేసుకుంటే వచ్చే ఏడు ప్రీమీయం రేట్లు వాచిపోతాయి. అంతేకాని బీమాకంపెనీ వాడు నష్టపోడు. అంతేకాక బీమా ఉందంటే చాలు జరిగే 'ట్రీట్‌మెంట్' సంగతి కొంతమందికి అనుభవమే. కాబట్టి ప్రైవేట్ ఆసుపత్రులు, బీమా కంపెనీలు, బీమా సభ్యులు మాత్రమే భాగస్వాములుగా ఉండే వ్యాపార చక్రంలో ఎవరు లాభపడతారో ఎవరు నష్టపోతారో ఊహించడం కష్టమైన పనికాదు. కాబట్టి ప్రైవేట్ ఆసుపత్రులు వాటిని భరించడానికి 'ఆరోగ్య బీమా' అంటే అది ప్రభుత్వపరంగా పూర్తిగా చెత్త ఆలోచన.

5. జిల్లాకో నిమ్స్ ఎలా ఉంటుంది?

తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు ఒకసారి జిల్లాకో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రంటే మరొక సారి జిల్లాకో నిమ్స్ అంటున్నారు. టి.ఆర్.ఎస్ పార్టీ తన ఎన్నికల మానిఫెస్టోలో తెలంగాణలో ఇప్పుడున్న పది జిల్లాలను 24 జిల్లాలుగా మార్చి ప్రతి జిల్లా కేంద్రానికి ఒకటి చొప్పున మొత్తం 24 నిమ్స్ స్థాయిలో సూపర్ స్పెషాలిటి ధవాఖానాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పుడు వారు ఆ ఊసు కూడా ఎత్తడంలేదు. అయినా కొత్తగా నిర్మించాలనుకునే హాస్పిటల్స్‌ను నిమ్స్‌లాగా అటానమస్ చేస్తామంటున్నారో లేక పూర్తిగా ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేస్తామంటున్నారో స్పష్టత లేదు. సూపర్ స్పెషాలిటి హాస్పిటల్, నిమ్స్ రెండూ పర్యాయ పదాలు కావు. నిమ్స్ సూపర్ స్పెషాలిటి హాస్పిటలే కానీ జిల్లాకో నిమ్స్ ఏర్పాటు చేయడం వల్ల మనం ఆశించే ప్రయోజనం ఒకటి చేసే పని మరొకటి అవుతుంది..

అటానమస్ అంటే 'స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ'. అంటే దాని బిల్లులు అదే వసూలు చేసుకుని ఆసుపత్రి నిర్వహణకు పోను చాలా భాగం మిగుల్చుకొని ఆ ఆదాయం ఆసుపత్రి విస్తరణకు, అభివృద్ధికి ఉపయోగించుకుంటారు. చికిత్సాపరంగా తెల్లకార్డు కలిగిన రోగులకు ఒ.పి. సేవల్లో 25 శాతం, ఐ.పి. సేవల్లో 10శాతం తగ్గింపు పోయినా మిగతా బిల్లులు లక్షల్లో ఉండటం వల్ల నిమ్స్‌కు ఏనాడూ పేద రోగులకు ఉపయోగపడ్డ చరిత్ర లేదు. సేవలపరంగా కూడా ఒకప్పటి స్థాయి ఈనాడు లేదు. నిమ్స్‌లో బిల్లులు పూర్తిగా ప్రైవేట్‌లో నడిచే కార్పొరేటు ఆసుపత్రుల బిల్లులతో పోటీపడతాయి, కానీ మన స్ట్రెచర్‌ను మనమే దొబ్బుకుంటూ వెళ్లాలి. కనుక మనకు జిల్లాకో నిమ్స్ కాదు కావలసింది, జిల్లాకో 'ఉస్మానియా' ఆసుపత్రి కావాలి.

6. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వైద్య సేవల అందుబాటులో అంతరం

తెలంగాణ రాష్ట్రంలో 61శాతం గ్రామీణ జనాభా, 39శాతం పట్టణ జనాభా ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 70శాతం గ్రామీణ జనాభా, 30శాతం పట్టణ జనాభా ఉంది. కానీ రెండు రాష్ట్రాల్లోను చికిత్సకు సంబంధించిన ప్రభుత్వ సంస్థలన్నీ దాదాపు పట్టణాల్లో కేంద్రీకృతమై ఉన్నాయి. దీంతో ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యం కావాలంటే ప్రజలు 50–100కి.మీ. ప్రయాణించి పెద్దాసుపత్రికి రావాలి. లేదా సొంత ఖర్చులతో దగ్గర్లోని ప్రైవేట్ వైద్యుల్ని ఆశ్రయించాలి. ఆచరణలో రెండవదే జరుగుతున్నది. ఆ ప్రైవేట్ వైద్యం సైతం పేద, మారుమూల ప్రాంతాలు ప్రత్యేకించి గిరిజన ప్రాంతాల్లో మచ్చుకు కూడా కనిపించక వైద్య సేవల అందుబాటు సమస్య మరింత తీవ్రంగా ఉంది. ఈ పరిస్థితులలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రాణనష్టం కూడా విపరీతంగా జరుగుతున్నది.

పట్టణ ప్రాంతం కంటే మరణాల రేటు గ్రామీణ ప్రాంతాల్లో 50 శాతం నుండి 100 శాతం ఎక్కువగా ఉంటున్నది. ఎక్కడ వైద్య రక్షణ అత్యధికంగా అవసరమవుతుందో అక్కడ వైద్య రంగం అందుబాటులో లేకపోవడం క్షమార్హం కాదు. కాబట్టి తక్షణమే గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అవసరాల ప్రాతిపదికగా వైద్యులను, ఆసుపత్రులను శాస్త్రీయంగా పంపిణి చేయాలి.

7. వ్యాధుల నివారణకు పెరగాల్సిన ప్రాధాన్యత

ఆధునిక కాలంలో గాలి, నీరు, ఆహారం, పరిసరాల్లో పెరుగుతున్న కాలుష్యం, నేరుగా తాకటం, దోమల వంటి వాహకాల ద్వారా వ్యాప్తి చెందే ప్రాణాంతక సాంక్రమిక వ్యాధులు, మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవటం, పొగ, మద్యం, డ్రగ్స్ వంటి వ్యసనాలతో వచ్చే వ్యాధులు, రోడ్డు ప్రమాదాలు, క్యాన్సర్‌లు మొదలైన అనేక వ్యాధులు రాకుండా నివారించడానికి చేసే ప్రయత్నాలన్నీ వ్యాధి నివారణ శాస్త్రం (కమ్యూనిటి మెడిసిన్)లో భాగం. వ్యాధులను కొనితెచ్చుకుని చికిత్స కోసం పరుగెత్తడం తెలివైన విషయం కాదు. వ్యక్తిగతంగా ప్రజలు, ఉమ్మడి అవసరాలు చూసే ప్రభుత్వాలు అత్యవసరంగా ఇది గుర్తించాలి. వ్యాధి నివారణ కార్యక్రమాలకు చికిత్సకు ఇచ్చినంత ప్రాధాన్యం ఇవ్వాలి.

వైద్య కళాశాలల్లోని కమ్యూనిటి వైద్య విభాగాలను వ్యాధుల నివారణ పరిశోధనా కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి.వీరు ఇచ్చే మార్గదర్శకాలతో రాష్ట్ర, జిల్లాల స్థాయిలో వ్యాధుల నివారణ కోసం ప్రత్యేకమైన పాలనా కార్యాలయాలుండాలి. వీటికి అధిపతులుగా ఎంబిబిఎస్, ఎండి (కమ్యూనిటీ మెడిసిన్) చేసిన వైద్యులను పాలనాపరమైన శిక్షణ ఇప్పించి ఈ స్థానాల్లో నియమించాలి. ఇంతకంటే కింది స్థానాలలో తగిన అర్హతతో కూడిన వైద్య లేదా వైద్యేతర అధికారులను, సిబ్బందిని నియమించాలి. వారి లక్ష్యాలకు తగిన నిధులు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది, వ్యాధి నిర్ధారణ, వ్యాధి నిరోధక యంత్రసామాగ్రి, మందులు ఉండాలి.

బడ్జెట్ కేటాయింపు

ఒక దేశం లేదా రాష్ట్రంలోని ప్రభుత్వానికి తమ పాలనలో గల పౌరుల ప్రాణాలు, ఆరోగ్య రక్షణే అత్యంత ప్రాథమిక విషయంగా ఉండాలి. మిగతా విషయాలు ఏవైనా ఆరోగ్య రక్షణ తర్వాతనే. కానీ ఈ రోజు మన దగ్గర పరిస్థితి అందుకు పూర్తిగా విరుద్ధంగా ఉండి పౌరుల వైద్య రక్షణ (ప్రాణాలు కాపాడు కోవటం) వారి ఆర్థిక స్తోమతకు వదిలి వేయబడింది. ఇంత పేద దేశంలో ప్రజల్ని ఇలా వదిలేసే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అనేక అధ్యయనాల అనంతరం చేసిన సూచనలో 'ఏ దేశమైనా తన ఆరోగ్య రక్షణ వ్యయంలో ప్రభుత్వం చేసే ఖర్చు జి.డి.పి. (స్థూల దేశీయోత్పత్తి) లో 5శాతానికి తగ్గకుండా ఉండాలి' అన్నది.

కానీ మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేసే మొత్తం వ్యయం జి.డి.పి.లో చాలా కాలంగా 0.6-1.0శాతం దాటడం లేదు. ఇక రాష్ట్రాలు చేసే సగటు ఆరోగ్య వ్యయం వాటి మొత్తం బడ్జెట్‌లో 4శాతం దాటితే పాపం తగులుతుందన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విషయాన్నే తీసుకుంటే 2013-14 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో మొత్తం బడ్జెట్ విలువ 1.61 లక్షల కోట్ల రూపాయలు కాగా అందులో ఆరోగ్యానికి కేటాయించింది 6,481 కోట్లు. అంటే సరిగ్గా 4 శాతం. ఇక చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన కొత్త ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా ఇదే ధోరణిని కొనసాగిస్తూ మొత్తం బడ్జెట్ విలువ (2014-15 ఆర్థిక సంవత్సరం) 1,11,824 కోట్లు కాగా అందులో ఆరోగ్య రంగానికి చేసిన కేటాయింపు 4,388 కోట్ల రూపాయలు. అంటే 3.92శాతం. అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2014-15 వార్షిక బడ్జెట్ మొత్తం విలువ రు. 1లక్ష 637 కోట్లలో వైద్య రంగానికి చేసిన కేటాయింపు 4062 కోట్లు. అంటే 4.04 శాతం. ఇదీ వరుస. గత ప్రభుత్వాల సంక్షేమ వ్యతిరేక సాంప్రదాయాల్ని కొనసాగిస్తూ ఎంతో అభివృద్ధి చేయబోతున్నట్లు నటిస్తూ ప్రజలను మోసగిస్తున్నారు. ఈ అనాగరికపు ధోరణి మారాలి. అప్పుడే దేశ, రాష్ట్ర ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడుతాయి. సామాన్య, మధ్య తరగతివారు ఆర్థికంగా ఊపిరి పీల్చుకుంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పినట్లు మొత్తం ఆరోగ్య వ్యయంలో ప్రభుత్వ (కేంద్ర, రాష్ట్రాల) వాటా జి.డి.పిలో ఇప్పుడున్న ఒక శాతం కాకుండా 5 శాతానికి పెరగాలంటే కేంద్రం, రాష్ట్రం విడివిడిగా వారి, వారి బడ్జెట్లను ఇప్పుడు చేస్తున్న కేటాయింపులకు 5 రెట్లు పెంచాలి.

ప్రపంచ ఆరోగ్య సంస్థో, మరొకరో చెప్పారు కాబట్టే కాదు, మన అనుభవంలో పేద, సామాన్య ప్రజలు తమ ఆరోగ్య, ప్రాణ రక్షణలో ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. వారు తమ ఆరోగ్య రక్షణకు ప్రపంచ బ్యాంకు చెప్తున్న గణాంకాల పరిధిని దాటి ఆరోగ్య అవసరాల కోసం అయ్యే ఖర్చులో దాదాపు 80శాతం భరిస్తుండగా, ప్రభుత్వం దాదాపు 20 శాతం మాత్రమే భరిస్తున్నాయి. తక్షణం ఈ పరిస్థితి కనీసం తారుమారు కావాలి. ఆర్థిక స్తోమతలేని కారణంగా ఎవరూ వైద్య రక్షణ కరువై చనిపోకూడదు. అట్లాగే ఇదేదో మేము ప్రభుత్వాన్ని కోరే విచిత్రమైన కోరిక కూడా కాదు. ప్రపంచవ్యాప్తంగా మనం రోజూ కొలచే దేశాలు. కొలవని దేశాలు కూడా ఈ పని చేస్తున్నాయి.

ఇంకా ఈ స్థాయి బడ్జెట్ అనేది అప్పటికే మౌలిక సదుపాయాల వ్యవస్థ ఏర్పడి ఉండి వీటి ద్వారా ఉత్పత్తి అయ్యే ప్రామాణిక వైద్య సేవల కోసమే ఇతర దేశాలు చేస్తున్న ఖర్చు. మన దేశంలో, రాష్ట్రంలో ఇంకా చాలా పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను ఏర్పర్చుకోవాల్సి ఉంది. కాబట్టి తెలుగు రాష్ట్రాల ముందు వైద్యరంగంలో

కొత్తగా మౌలిక సదుపాయాల కల్పన కోసం కావాల్సిన పెట్టుబడి వ్యయాన్ని కూడా ఆశిస్తే రాష్ట్రాల బడ్జెట్‌లలో ఆరోగ్య రంగం కోసం చేయాల్సిన కేటాయింపులు మొత్తం రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లలో 20 శాతం దాటాల్సి ఉంటుంది. మన వైద్య వ్యవస్థ సాధించాల్సిన సేవల నాణ్యత చాలా పెరగాల్సి ఉంది, కాబట్టి బడ్జెట్‌లలో ఇప్పటి వరకు చేస్తూ వస్తున్న కేటాయింపులను 5 రెట్లు పెంచగలిగేతేనే ప్రజలకవసరమైన వైద్య సేవలు వాస్తవరూపం దాల్చుతాయి. ఏ పని చేయాలన్నా ప్రజల పట్ల బాధ్యత, లక్ష్యసాధనలో చిత్తశుద్ధి, అందుకు తగిన నిధుల సమకూర్పు, అవినీతి బురదలో పొర్లక పోవడం అనేవి ప్రాథమిక నియమాలు. ఇవి జరిగినప్పుడే ప్రజలకు ప్రయోజనం. ఈ పని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని కొత్త ప్రభుత్వాలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

ప్రజలకు అత్యవసరమైన, జీవన్మరణ విషయాలను వదిలేసి ప్రజలకు అంతగా అవసరం లేని లేదా ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ అదే అభివృద్ధని భ్రమింపజేస్తూ ఈరోజు మన 'ఆధునిక ప్రభుత్వాలు' దేశంలో, రాష్ట్రాలలో చాలా హడావుడి చేస్తున్నాయి. కాబట్టి మనకు ఏం కావాలో మాత్రమే కాదు ఏం వద్దో కూడా చెప్పగలిగే చైతన్యాన్ని మనమంతా పెంచుకోవాలి. ప్రభుత్వ కార్య కలాపాలపై ప్రజల, ప్రజల పక్షాన ఉండే మేధావుల, సంఘాల నిఘా, ఒత్తిడిని బట్టే ప్రభుత్వాలు తమ వైఖరిని కొంతైనా ప్రజలకు అనుకూలంగా మార్చుకోగలవు. ప్రజారోగ్య వ్యవస్థ సమర్థవంతంగా పని చేసినపుడే రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కుకు అర్థం ఉంటుంది. ఆరోగ్య రక్షణ పౌరుల ప్రాథమిక హక్కుగా గుర్తింపబడాలి. పేద, ధనిక స్థితిగతులతో సంబంధం లేకుండా అందరికి సమానంగా సమర్థవంతమైన, నాణ్యమైన వైద్యసౌకర్యాలు అందుబాటులో ఉండాలి.

(రచయిత మానవ హక్కుల వేదిక సభ్యులు) వీ

మళ్లీ ప్రపంచ బ్యాంకు ఊబిలోకి

***స్వాతంత్ర్య పోరాటంలో విదేశీ వస్తువులూ, వస్త్రాలూ తగులబెట్టిన ప్రజల చేత పాలకులు ఇప్పుడు అభివృద్ధి పేరుతో విదేశీ వస్తువులను దిగుమతి చేసి, వినియోగం చేయిస్తున్నారని అంటున్నారు* వి. హనుమంతరావు**

అమెరికా, చైనా, జపాన్, ఆస్ట్రేలియా దేశాలతో రాజకీయ, ఆర్థిక వ్యాపార సంబంధాలు ఏర్పాటు చేసుకున్నా బొగ్గు గనుల వేలం, ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రభుత్వ షేర్లు అమ్మేయడం, ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ఇన్సూరెన్స్ సంస్థల ప్రవేశం – ఇలా ఎన్నెన్ని చర్యలు తీసుకున్నా ఆర్థిక దుస్థితి దేశాన్ని వెంటాడుతూనే ఉంది. యూరోపియన్ దేశాలు కూడా ఇదే ఊబిలో దిగబడి ఉండడంతో వాళ్ల సహాయం అందే పరిస్థితి లేదు. జిడిపి ఐదు శాతం దాటవచ్చునేమో కాని ఆర్థిక దుస్థితి నుంచి బయటపడే మార్గం కనుచూపు మేరలో లేదు. వేరే గత్యంతరం లేక మోడీ ప్రపంచ బ్యాంక్ కాళ్ల మీద పడ్డాడు. ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టు మీద ఉంటుందా? ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అదే బాటలో మోడీకి ముందే ప్రపంచ బ్యాంక్‌తో పూర్వపు చుట్టరికాన్ని మళ్లీ పునరుద్దరించాలని నిర్ణయించి రు. 20000 కోట్ల అప్పుకు రంగం సిద్ధం చేస్తున్నారు. బ్యాంకు ఇలాంటి దేశాల కోసమే ఎదురుచూస్తోంది. ఇప్పటికీ బ్యాంక్ కార్యాలయం హైదరాబాద్‌లో పనిచేస్తోంది. ఇచ్చిన రుణం సరిగ్గా ఖర్చు అవుతుందా లేదా అని డేగకళ్లతో చూస్తోంది. 1991లో సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత, బ్యాంక్ నేరుగా ఆంధ్రప్రదేశ్‌కు రుణం ఇవ్వడం ప్రారంభించింది. ప్రజలకు విదేశీ మోజు పెరిగింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని 1994లో నేను రాసిన వ్యాసం సందర్భోచితంగా ఉంటుందని భావించి, ఈ కింద ఇస్తున్నా చదవండి.

విదేశీ వస్తువులు, విదేశీ వస్త్రాలు నడిబజార్లలో గుట్టలుగా పోసి, తగులపెట్టి భారత మాత జిందాబాద్, మహాత్మాగాంధీ జిందాబాద్ అని నినాదాలిచ్చి స్వర్ణాక్షరాలతో చరిత్ర లిఖించిన మన భారతదేశం, ఈ రోజున విదేశీ వస్తువులంటే, విదేశీ డాన్సులు, పాటలు, విదేశాల్లో చదువులు, విదేశాలకు వలస వెళ్లిపోవడం అంటే మోజుపడే విధానానికి, సంస్కృతికి దేశాన్ని సాష్టాంగ ప్రమాణం చేయించే రోజులొచ్చాయి.

బ్రిటిష్ వ్యాపారస్తులను, పారిశ్రామికవేత్తలను, ఆ మాటకొస్తే తెల్ల తొక్క కనబడితే చాలు, 'గోబ్యాక్' (మీ దేశం వెళ్లిపో) అంటూ నినదించిన మనదేశం నేడు బ్రిటిష్ వాళ్లకే కాదు. తెల్లతొక్క ఉన్న ప్రతివాడిని మంగళ వాయిద్యాలతో ఆహ్వానించి, వాడి పెట్టుబడులను, వాడి పరిశ్రమలను ఇక్కడ ఏర్పాటు చేసుకొని, లాభాలు తమ దేశాలకు తరలించుకుపొమ్మని వారిని బతిమాలుకొంటున్న దరిద్రపు రోజులు దాపురించాయి.

దేశంలో అసంఖ్యాకమైన ప్రజలు పాదరక్షలు లేకుండా నడిచి పోతుంటారొక పక్క రెండో పక్క మన గడ్డపై తయారవుతున్న పాదరక్షలు చాలక, ఇప్పటికే విదేశీ కంపెనీ అయిన బాటా తయారు చేసే ఖరీదైన బూట్లు చాలక, విదేశాల నుంచి ఓ డజను బూట్ల కంపెనీలను ఆహ్వానించాం. పత్రికల నిండా విదేశీ బూట్ల కంపెనీల ప్రకటనలే. టి.వి.లోనూ అవే ప్రదర్శనలు. మనదేశంలో తయారువుతున్న గోల్డ్‌స్పాట్ కంపెనీ కూల్‌డ్రింక్స్ చాలక కోకాకోలా, పెప్సీకోలా దిగుమతులు.

అసలు తెల్లారిలేస్తే రాత్రి నిద్రపోయే వరకూ మనకు తెలిసీ, తెలియకుండా విదేశీ దిగుమతుల మీద, విదేశీ ధనం మీద, విదేశీ కంపెనీలు తయారు చేసే వస్తువుల మీద మనం బతుకులు వెళ్లదీస్తున్నాం అంటే నమ్ముతారా?

లేవడంతోనే మనం పళ్లు తోముకొనేది కోల్గేట్ బ్రష్, పేస్టు విదేశీ కంపెనీ ఉత్పత్తులే. తర్వాత తాగే టీ విదేశీ కంపెనీల ఆధ్వర్యంలో ఉన్న టీ తోటల నుంచే వస్తుంది. టీ కాచుకోవడానికి వెలిగించే అగ్గిపెట్టె విమ్కో అనే విదేశీ కంపెనీది. మనం తినే బియ్యం, గోధుమ అధిక దిగుబడి వంగడాలు విదేశాల నుంచి వచ్చినవే. ఇవాళా, నిన్న వరుణ దేవుడి పుణ్యమా అంటూ నూనె గింజలు సమృద్ధిగా పండుతున్నాయి గాని అప్పటి వరకూ వంట నూనెలు దిగుమతి చేసుకొంటూనే వచ్చాం. మన పంట భూముల్లో పారే నీరు విదేశీ ఆర్థిక సహాయంతో కట్టిన ప్రాజెక్టుల నుంచే వస్తుంది. మనం వాడే వంట గ్యాస్ పెట్రోలియం ఉత్పత్తి. ఆ పెట్రోలియంను క్రూడ్ రూపంలో మన అవసరాల్లో సగంపైగా దిగుమతి చేసుకొంటున్నాం.

ఆ దిగుమతుల ఆధారంగానే మన కార్లు, బస్సులు, స్కూటర్లు నడుస్తున్నాయి. అది విదేశీయుల చలవే. ఆఫీసులకు వెళ్లేటప్పుడు వేసుకునే దుస్తులు, ధరించే టై భారతీయ వేషధారణా? ఆఫీసులకు వెళితే చూచేవి దిగుమతులు, పెట్టుబడుల గురించి, విదేశీ సహాయం అర్థించే ఫైళ్లే. ఆ దేశం వాడొస్తే కింద నుంచి పైదాకా అందరూ వాళ్ల వెనకాల ఫైళ్లు పట్టుకొని తిరిగేవారే. సీనియర్ అధికారులు, బయట ఉండే నాలుగవ తరగతి ఉద్యోగులు చెప్పే దాని ప్రకారం 'మీటింగులో' ఉన్నారు. కాని అసలు వారు గుర్రం రేసుల్లోనో, టివిలో క్రికెట్ చూస్తునో ఉంటారనేది తెలియని విషయమా? ఈ రెండో బ్రిటిష్ పాలకులు వెళ్లిపోతూ మనలను ఈ ఆటలకు బానిసలు చేసిపోలేదా? స్త్రీలు వేషధారణ కోసం వాడే క్రీములు, స్నోలు, తెల్లగా అయిపోవడానికి వాడే లోషన్లు అన్నీ విదేశీ కంపెనీలవే. పురుషులు కోరేది గిలెట్, సెవనో క్లాక్ బ్లేడులే, వాళ్లు ఉపయోగించే షేవింగ్ క్రీముల మీద ఎక్కువలో ఎక్కువ ఏ కంపెనీ పేరుంటుందో చూడండి. సోపులకొస్తే పీయర్స్, రెక్సోనా, పామాలివ్, అలాగే వాషింగ్ సబ్బులు అత్యధికంగా మార్కెట్‌లో అమ్మకం అయ్యేవి విదేశీవి కాదూ?

స్కాచ్ విస్కి అంటే పడిచచ్చిపోతారు. దేశంలో ఉన్న విదేశీ కంపెనీ సిగరెట్టు చాలక, విదేశాల నుంచి దిగుమతికి కూడా అనుమతిస్తున్నారు. ఆ క్లబ్బుల్లో బ్రేక్ డాన్స్‌లో, అర్ధనగ్న నృత్యాలు, మైకేల్ జాక్సన్ పాటలు (ఇప్పుడు హిందీ పాటలు కూడా మధురమైన భారతీయ సంగీత బాణీలు వదిలిపెట్టి ఇంగ్లిషు సంగీత బాణీల్లో పాడుతున్నారు) ఇవన్నీ భారతీయ సాంప్రదాయాలా? దూరదర్శన్‌లో భారతీయ కార్యక్రమాలు రుచించక, స్టార్ టి.వి., జి.టి.వి. ఇలా అనేక రకాల టి.వి.లు విదేశీ దిగజారుడు సంస్కృతిని ఇంటింటా ప్రచారం చేస్తున్నాయి. (వాటిలో కొన్ని చూడదగిన కార్యక్రమాలు లేకపోలేదు)

పిల్లలు తెలుగులో చదువుకుంటున్నారంటే అది ఇన్‌ఫ్రాడిగ్. మా వాడు, మా అమ్మాయి కాన్వెంట్‌లో ఇంగ్లిషు చదువుతున్నారంటే స్టేటస్ సింబల్. పెద్దయిన తర్వాత విదేశాలు పంపిస్తే ఓ పాతిక లక్షల కట్నం ఖాయం. చదువు కోసమని విదేశాలు వెళ్లడం, వాటంగా ఉండే అక్కడ అబ్బాయినో, అమ్మాయినో పెళ్లి చేసేసుకోవడం లేదా అక్కడి అమ్మాయిలు అబ్బాయిలతో పోలిస్తే, ఇక్కడ వాళ్లయితే బుద్ధిగా ఇంట్లో ఉండి పిల్లల్ని కంటుంటారనే భావంతో ఓవర్‌నైట్ ఫ్లైట్‌లో వచ్చేసి, పెళ్లి చేసేసుకుని వెళ్లిపోవడం ఇది విదేశీ సంస్కృతి కాకపోతే స్వదేశీ సంస్కృతా?

కాంగ్రెస్ పాలకులు సాధించిన అద్భుతమైన విజయం ఏమిటంటే మధ్యతరగతి ప్రజలను ముఖ్యంగా ఉన్నతాదాయ వర్గాలను ఈ విదేశీ సంస్కృతి, విదేశీ ఉత్పత్తులకు బానిసలుగా చేయడం, ఆవిలేనిదే బతకలేమనే పరిస్థితికి వాళ్లను తీసుకుని రావడం, మన సంస్కృతి కన్నా వారి సంస్కృతే బావుందనడం. ఇలా మానసికంగా, ప్రజలను బలహీనులుగా చేసిన నేపథ్యంలో ఆ బలహీనతల సాక్షిగా ఇరవయవ శతాబ్దంలోకి అడుగు పెడుతున్నామనే భ్రమ కల్పించి, వాస్తవంలో 1947 స్వాతంత్ర్యం సంపాధించిన నాటి ముందు నాటికి దేశాన్ని వెనక్కు నడిపిస్తున్నారు.

పూర్వం మన వ్యవసాయోత్పతులను ముఖ్యంగా వ్యాపార పంటలను తమ దేశానికి బ్రిటిష్ పాలకులు తీసుకుని పోయేవారు. ఇవాళ కూడా వ్యవసాయోత్పత్తులను ప్రాసెస్ చేసి ఎగుమతి చేయాలంటున్నారు. తిండి గింజలు పండించే పంట భూములను చెరువులుగా మార్చి, విదేశీయులకు ఇష్టమైన రొయ్యలను పెంచి ఎగుమతి చేయమంటున్నారు. వాళ్లకు జనపనారకు ప్రత్యామ్నాయం లభించడంతో, మన జనపనార పంట, మిల్లులు సంక్షోభంలో పడ్డాయి. వాళ్లకు మన దేశంలో పండే పండ్లు ఇష్టం కాబట్టి వాటిని డబ్బాలో పాక్ చేసి పంపాలంటున్నారు. మన పాలను పాల ఉత్పత్తులుగా చేసి విదేశాలకు పంపించడానికి ఉన్న నియమ నిబంధనల అడ్డంకులను తొలగిస్తున్నారు. వాళ్ల రుచులు, వాళ్ల అవసరాలే గాని భారత ప్రజల అవసరాల సంగతి పాలకులకు పట్టలేదు. ఆ పండిస్తున్నది కూడా ప్రజలు ఎక్కడని పోతారోనని ధరలు ఉట్టిలో పెట్టారు. (కృష్ణాష్టమి పండగ ఇదివరకు సంవత్సరానికి ఒకసారే వచ్చేది. ఇప్పుడు రోజురోజు కృష్ణాష్టమే; ఆ ఉట్టి ఎప్పటికి అందదు. దీనితో సామాన్య ప్రజల ఇళ్లు శివాలయాలుగా మారిపోతున్నాయి.)

ప్రభువుల దిగజారుడు చూడండి. మొదట మన వద్ద అభివృద్ధికి కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానం లేదు. అందుచేత విదేశాల నుంచి తెచ్చుకోవాలన్నారు. మన వద్ద లేని మన ప్రజల జీవనస్థాయి పెంచే సాంకేతిక విజ్ఞానం తెస్తారేమో అనుకుంటే అవి టివిలు కూల్ డ్రింక్‌లు తయారు చేసే టెక్నాలజీలకు దిగజారింది. తర్వాత వాళ్లే వచ్చి పరిశ్రమలు పెడతారని చెప్పి, వాళ్లు రాకుండా, వాళ్ల ఉత్పత్తులు మనదేశంలోకి దిగుమతికి అనుమతించి మన పారిశ్రామిక వేత్తల నోట్లో మన్నుకొట్టారు. విదేశీ సంస్థలు మన రైతుల పంట భూముల్లో వారు ఎగుమతి చేసి లాభాలు సంపాధించుకునే పంటలు పండించుకోవడానికి అనుమతినివ్వగా వారు ఆ భూములను మేమే కొనుక్కొనే అనుమతి ఇవ్వాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. మన నేల తల్లినే అమ్ముకోమంటున్నారు. ఇప్పుడు భూమినేకాదు. భూమి గర్భంలో ఉన్న ఖనిజాలను చమురును బయటకు తీసి ఎగుమతి చేసుకునే అవకాశాన్ని ఇచ్చారు. ఇదివరకు కొన్ని ఖనిజాలను ఇటువంటి ఆర్డర్ నుంచి మినహాయించి ఇప్పుడు ఆ మినహాయింపులను తొలగించారు. ఉదాహరణకు విశాఖ జిల్లాల్లో బాక్సైట్ ఖనిజం తవ్వకం దశాబ్దంపైగా చర్చలో నలుగుతుండగా ఇప్పుడు ఆ ఖనిజాన్ని తవ్వి, దానిని అల్యూమినియంగా మార్చి ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. స్వాతంత్ర్యం పూర్వం ఇనుము, ఉక్కు కర్మాగారాల్లో మాంగనీసు ఖనిజాన్ని విశాఖ నుంచి తీసుకునిపోయేవారు. ఇప్పుడు ఓ పెద్ద ఔటర్ హార్బర్ నిర్మించి ఇనుప ఖనిజాన్ని త్వరత్వరగా దేశం నుంచి జపాన్‌కు తరలిస్తున్నారు. ఇప్పుడు బాక్సైట్ ఖనిజం దేశం సరిహద్దులను దాటి పోతుంది. ఇందుకేనా మనం స్వాతంత్ర్యం కోరింది? భూమి మీద ఉండేదాని ఒకటికి, పదిసార్లు ఉత్పత్తి చేయవచ్చు; పండించవచ్చు. కాని భూమి అడుగున నిక్షిప్తమైన సహజ సంపద ఒకసారి వెలికితీస్తే అంతే. అది శాశ్వత నష్టం. (నాన్ రిన్యూ ఎబుల్ రిసోర్స్)

రష్యాలో సోషలిజం అంతర్ధానమైంది. ఈ దేశంలో, ప్రపంచంలో కొంత మంది సంతోషించారు. కాని, ఆ దేశంలో జనం గొల్లున ఏడుస్తున్నారు. అమెరికా అడుగు పెట్టి జనం సుఖమయ జీవితానికి మంగళ హారతి పాడేసింది. ధరలు ఎన్నోరెట్లు పెరిగిపోయాయి. పెట్టుబడిదారీ విధాన ప్రవేశంతో ఆ అవలక్షణాలన్నీ రష్యాలో వికట్టాహాసం చేస్తున్నాయి. ఇదివరకే ఆ పంథాలో పయనిస్తున్న మనం ఇప్పుడు మరింత వేగంగా దిగజారుతున్నాం.

ఇది వరకు వచ్చేసిందనుకొన్న స్వాతంత్ర్యం ఇప్పుడు ప్రమాదంలో పడింది. మనదేశ విధానాలు ప్రపంచ బ్యాంకు రచిస్తోంది. మన బడ్జెట్లు ప్రపంచబ్యాంక్ పర్యవేక్షణలో తయారు చేస్తున్నారు. మన రాష్ట్రంలో నీళ్లు కావాలంటే, రోడ్డు కావాలంటే, పంటలు పండాలంటే ప్రాజెక్టులు నిర్మించాలంటే, పేదరికం తగ్గాలంటే ప్రపంచ బ్యాంకు రుణం ఇవ్వందే ఒక్క అడుగు ముందుకు వేయలేని పరిస్థితి ఏర్పడింది. విదేశీ కంపెనీలు రాకపోతే మన ఇళ్లల్లో విద్యుద్దీపాలు వెలగవు. విదేశీ అప్పులు రానిదే మన రాష్ట్ర ప్రణాళికలో చేర్చిన పథకాలు అమలు జరగవు. డంకెల్ ప్రతిపాదనలు దేశానికి హానికరమని వాటిని త్రోసి పుచ్చాలనే తీర్మానానికి చేతులెత్తి వోటు చేసిన కాంగ్రెస్ నాయకులే. అవి దేశానికి ఎంతో ఉపయోగకరమని ప్లేట్ ఫిరాయించారంటే అలాంటి నాయకులు దేనికైనా అమ్ముడుపోతారు.

ఈ రోజున ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రం నలుమూలాల నుంచి ప్రదర్శన కరుదెంచిన లక్షలాది ప్రజలు ఈ వినాయకులకూ, ఈ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలతో సరి పుచ్చక, ఉద్యమించిన నాడే మన దేశాన్ని స్వాతంత్ర్యాన్ని రక్షించుకోగలం. అదే మన జీవన పరిస్థితులకు నాంది ప్రస్తావన అవుతుంది.

(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

యువతను ఆకర్షించలేకపోతున్న ప్రజా సంఘాలు

హక్కుల సంఘాలు, దళిత, మహిళా సంఘాలే కాదు చివరికి మార్క్సిస్ట్ ప్రజా సంఘాలు కూడా యువత హృదయాల్ని జయించుకోలేక, వారికి దూరమవడం వెనుక గల కొన్ని కారణాలను విశ్లేషిస్తున్నారు **లోక సంచారి**

పదేళ్ల క్రితం సునామీ వచ్చినప్పుడు ఆ తాకిడికి ఎన్నో దేశాల్లో వేలాదిగా ప్రజలు మరణించారు. భారతదేశంలో కూడా చాలా మందే మరణించారు. వీరంతా (సాంకేతిక అభివృద్ధి కోణంలో చూసినప్పుడు) నాగరికులే. అదే సునామీ అండమాన్ దీవుల్లోని ఒక దట్టమైన అటవీ ప్రాంతంలో నివసించే జరావా అనే ఆదివాసులు ఉండే ఒక దీవిని కూడా తాకింది. అభివృద్ధి కోణంలో చూసినప్పుడు నగ్నంగా తిరిగే ఈ ఆదివాసులు అనాగరికులు. నాగరికులు ఉండే అండమాన్ రాజధానిలో సునామీకి కొందరు చనిపోతే అనాగరికులనబడే జరావా ఆదివాసులు మాత్రం ఒక్కరు కూడా చనిపోలేదు. కారణమేమిటంటే వారు తమ ప్రాంతంలోని కోతుల, పక్షుల మాట విని ప్రాణాలు కాపాడుకున్నారు. సునామీ అలలు ఆ దీవికి దూరంగా ఉన్నప్పుడే, పెద్ద ఉపద్రవం రాబోతున్నదని గ్రహించిన కోతులు, పక్షులు పెద్ద ఎత్తున గుట్టల పైకి వెళ్లడాన్ని గ్రహించిన ఆదివాసులు వాటి అనూహ్య కదలికలను అర్థం చేసుకుని వాటిని అనుసరిస్తూ గుట్టలపైకి చేరుకుని ప్రాణాలు కాపాడుకున్నారు.

జంతు జాతి మాట కూడా వినాలి అనే నమ్రత కలిగిన నాగరికత వారిది. దీన్నే 'ఇయర్ టు ది గ్రౌండ్' (భూమికి చెవి ఉంచి వింటుండాలి) అనవచ్చు. నిజానికి మార్క్సిజం కూడా ఇదే చెపుతుంది. నాగరికత నేర్పిన పొగరు, అహం, కీర్తికాంక్ష, ఈర్ష్య, అసూయ, స్వార్థంను ఎలా శాస్త్రీయంగా జయించవచ్చో మనకు మార్క్సిజం తెలుపుతుంది. కావల్సిందల్లా నిరంతరంగా నేర్చుకోవాలనే నమ్రత.

మార్క్సిజమే తమ సిద్ధాంతంగా, దిక్సూచిగా చెప్పుకునే లీగల్ ప్రజా సంఘాలు ఎందుకు సంఖ్యాపరంగా విస్తరించడం లేదు? ఏ ప్రజలను వారు చైతన్యం చేయాలనుకుంటున్నారో, ఆ ప్రజలపై ఎందుకు ప్రభావం అంతగా చూపలేకపోతున్నారు? ఒకవైపు దోపిడి, అణచివేత, అన్యాయాలు, అక్రమాలు పెరుగుతూ ప్రజల జీవితాలు మరింత కష్టపూరితంగా, దుర్భరంగా తయారవుతున్నాయి. బూర్జువా రాజకీయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం దాదాపుగా పోయినట్టే. (అయినప్పటికీ, వివిధ కారణాల వలన ఓటు వేస్తున్నారు అది వేరే విషయం) భౌతిక పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ, చాలా కాలంగా ఉనికిలో ఉన్న మార్క్సిస్టు సంఘాలు కూడా విస్తరించడం లేదు. మరీ ముఖ్యంగా, యువతరంపై అంతగా ప్రభావం చూపడం లేదు. ఈ సమస్య కేవలం మార్క్సిస్టు ప్రజా సంఘాలదే కాదు. హక్కుల సంఘాలు, దళిత, మహిళా, కార్మిక సంఘాల లాంటివి కూడా యువతపై ప్రభావాన్ని వేసి, వారిని వేలు, లక్షలలో కదిలించలేకపోతున్నాయి. కొన్ని సంఘాల పరిస్థితి ఏ స్థాయిలో ఉందంటే, రానున్న పది సంవత్సరాలలో అవి కనుమరుగై పోవచ్చు లేదా పోస్ట్‌బాక్స్ సంస్థల వలె నామమాత్రంగా మిగిలిపోవచ్చు.

అయితే మార్క్సిస్టేతర సంఘాలు తమ ప్రభావాన్ని కోల్పోతున్నా యంటే అర్థం చేసుకోవచ్చు. కాని మార్క్సిజాన్ని తమ దిక్సూచిగా భావించే ప్రజా సంఘాలు కూడా ఈ పరిస్థితి ఎదుర్కొంటున్నాయంటే తప్పకుండా ఆచరణలో లోపాలున్నట్టే.

ఒక సమస్యకు ఒకే కారణం ఉండాలని ఏమీలేదు. నేను పరిశీలించిన కోణంలో నాకు కొన్ని లోపాలు కారణంగా కనిపించాయి. ఆయా సంఘాల నాయకత్వం, సభ్యుల నిబద్ధత, పాత్రపై గౌరవంతోనే నా పరిశీలన ముందుంచుతున్నాను. ఇది స్నేహపూర్వక సూచన, పరిశీలనలే.

ఒక సంస్థ తాను నేర్చుకునే సంస్థగా (లెర్నింగ్ ఆర్గనైజేషన్)గా నిరంతరం ఆచరణ ద్వారా చూపాలి. అయితే, ఇది మాటల ద్వారా చెప్పినంత సులభం కాదు. మాది నేర్చుకునే సంస్థ అనే ఏ మార్క్సిస్టు సంస్థ వారైనా అంటారు. కొన్ని కోణాల నుండి నేర్చుకునే తత్వాన్ని చూపుతారు కూడా. కాని ఒక సంస్థ నిరంతరంగా ఎదుగుతూ ఉండాలంటే అన్ని కోణాల నుంచి నేర్చుకుంటూ ఉండక తప్పదు. ఏ ఒక్క కోణం నుండి నేర్చుకోవడమనేది (అది కూడా నిరంతరంగా) జరగకపోయినా దాని ప్రతికూల ప్రభావం ఆ సంస్థ/వ్యక్తి భవిష్యత్తుపై (కొన్ని సందర్భాల్లో తీవ్రస్థాయిలో) పడుతుంది. ప్రతి ఒక్క కోణం నుండి, ప్రతి రోజూ ప్రతి సభ్యుడు, సభ్యురాలు నేర్చుకుంటేనే సంస్థ నిరంతరంగా ఎదుగుతుందనే సత్యాన్ని గుర్తించడమే కాదు, ఆ వాతావరణం సంస్థలో సృష్టించాలి. అలాగే ఆ సంస్థ నిరంతరం నేర్చుకునే సంస్థగా ఎదగడానికి కావల్సిన టూల్స్ (పరికరాలను)ను, ఫ్రేమ్ వర్క్‌ను అందుబాటులో ఉంచాలి. ఉదాహరణకు ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం, బ్రెయిన్ స్టామింగ్ చేయడం లాంటి టూల్స్ నిరంతరంగా వాడాలి.

ఫీడ్‌బ్యాక్ అంటే ఏమిటి?

ఫీడ్‌బ్యాక్‌ను సంస్థ సభ్యుల నుండి, సంస్థకున్న అభిమానుల నుండి, ప్రజల నుండి తీసుకోవాలి. దేనిపై తీసుకోవాలి? ప్రతి ఒక్క కోణంపై తీసుకోవాలి. దీనికి ఆకాశమే హద్దు. ఎన్ని కోణాల నుండి తీసుకుంటే అంత లోతైన అంశాలు మనకు తెలుస్తాయి. (దీన్ని 360 డిగ్రీ ఫీడ్‌బ్యాక్ అంటారు) ఈ ఫీడ్‌బ్యాక్ ప్రతి సభ్యుడు నిరంతరంగా కలెక్ట్ చేసేట్టు, దాన్ని సంస్థలోని అందరితో పంచుకునేట్టు చేయడంపైనే ఈ ప్రక్రియ విజయం ఆధారపడి ఉంది. ఉదాహరణకు నేను పరిశీలించిన కొన్ని కోణాలను వివరిస్తాను. ఒక నిజాయితీ, నిబద్ధత కలిగిన మార్క్సిస్ట్ పట్ల ఆయనను అభిమానించే కొందరి నుండి కొన్ని ప్రతికూల అభిప్రాయాలు విన్నాను. ఈ అభిప్రాయాలు అతనికి తెలిస్తేనే అతను తన ప్రతిస్పందన ఇవ్వగలడు. కాని ఈ ఫీడ్‌బ్యాక్ పద్ధతిని అతను కాని, అతను అంకితమై పని చేస్తున్న మార్క్సిస్టు ప్రజా సంఘం కాని, ఏర్పాటు చేయనందున ఆ

అభిప్రాయాలు ఆ నోటా ఈ నోటా వ్యాపిస్తూ పోతున్నవి. ఇంకో కోణం చూస్తే, ఈ మధ్య ఒక సంస్థ పెట్టాలనుకున్న సభను ప్రభుత్వం భగ్నం చేయడం, కొందరిని అరెస్టు చేయడం జరిగింది. ఈ ఘటనపై దాని అభిమానులే సద్విమర్శతో పాటు, అసలు ఆ కార్యాన్నే ఏ ఏ పద్ధతుల్లో చేసి, అంతకన్నా ఎక్కువ ఫలితాలను ఎలా సాధించవచ్చో చెపుతూ తమ అమూల్యమైన ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. ఎవరికి? ఆ సంస్థకు కాదు, దాని నిర్వాహకులకు కాదు. ఎందుకంటే, ఆ సభ నిర్వాహకులకు ఫీడ్‌బ్యాక్ తీసుకునే మెకానిజం కాని, అనుభవం కాని లేదు.

ఇంకో కోణం చూద్దాం. అటు హక్కుల సంఘాలు దళిత, సంఘాల నుండి మొదలుకొని మార్క్సిస్టు ప్రజా సంఘాల వరకు నిర్వహించే సభలకు పీడిత, తాడిత వర్గాలకు చెందిన యువత కూడా చాలా తక్కువ స్థాయిలో వస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఈ సంఘాల పట్ల, దాని నాయకుల పట్ల సదభిప్రాయం ఉన్నప్పటికీ రావడం లేదు. దీనిపై స్పష్టమైన అవగాహన రావాలంటే, కారణాలు తెలువాలంటే అన్ని కోణాల నుండి విస్తృతమైన ఫీడ్‌బ్యాక్ (యువత వద్ద) తీసుకొని పరిశీలిస్తేనే అర్థమవుతుంది. అయితే, నా పరిశీలన ప్రకారం నేటి యువతకు (గతంలోని యువత లాగ) గంటలు గంటలు ఉపన్యాసాలు అవి ఎంత ఆసక్తికరంగా ఉన్నప్పటికీ వినే ఓపిక, ఆసక్తి లేదు. అన్నింటికన్నా అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే నేటి యువత ఉపన్యాసానంతరం ప్రశ్నలు అడిగి తమ సందేహాలు నివృత్తి చేసుకోవాలనుకుంటున్నది. వాస్తవానికి ప్రశ్నలడిగే అవకాశం ఇవ్వడమే నిజమైన ప్రజాస్వామ్య ప్రక్రియ. కాని మార్క్సిస్టు సంస్థలు లేదా వాదులు కూడా ఈ వాస్తవాన్ని గుర్తించలేదు. కాని పెట్టుబడిదారులు ఈ ప్రక్రియను బ్రహ్మాండంగా వాడుకుంటూ యువతను ఆకట్టుకుంటున్నారు. కార్పొరేట్ కంపెనీల అధిపతులు కాలేజీ యువతతో ఎక్కువ సమయం ఉపన్యాసం ఇవ్వకుండా, ప్రశ్నలడగమని యువతను కోరి మరీ జవాబులిస్తున్నారు. ఈ ప్రక్రియను యువత ఇష్టపడుతున్నది. ఇంత ఆసక్తికరమైన, ప్రజాస్వామ్యయుతమైన ప్రక్రియను మార్క్సిస్టులు ఇంకా అవలంబించక పోవడం కూడా వారి ఆదరణ కోల్పోవడానికి ఒక కారణం.

(మార్క్సిస్టు) ప్రజా సంఘాలకు మనస్ఫూర్తిగా అశేష ప్రజానీకం నుండి అన్ని కోణాలలో ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలనే నమ్రతతో కూడిన ఆచరణ ఉంటే ప్రజలు ఆ సంస్థల ఆచరణపై, పని విధానంపై నాయకుల, సభ్యుల గుణగణాలు, ప్రవర్తన, ఆచరణ పై ఫీడ్‌బ్యాక్ ఇవ్వడానికి ఎంతో ఆసక్తితో ఉన్నారు. ఎందుకంటే, వారు తాము ఇష్టపడే ఆ సంస్థలలో అభివృద్ధి చూడాలనుకుంటున్నారు.

ఫీడ్‌బ్యాక్ ఎలా తీసుకోవాలి?

మనం అసహ్యించుకునే పెట్టుబడిదారులు తమ కార్పొరేట్ కంపెనీలలో చాలా వరకు వినియోగదారుల ఫీడ్‌బ్యాక్ కొరకు (ఉచితంగా ఫోన్ చేసి చెప్పే) టోల్ ఫ్రీ నంబర్ సౌకర్యం కల్పించారు. ఇంటర్నెట్ ద్వారా ఫీడ్‌బ్యాక్ ఇచ్చే సౌకర్యం కల్పించారు. కొన్ని కంపెనీలు 'ఓంబుడ్స్‌మ్యాన్' (ఫిర్యాదులను పరిష్కరించే) వ్యక్తిని నియమించారు. ప్రజా సంఘాలు మాత్రం ఇవి పాటించడం లేదు. వ్యక్తిగతంగా చెప్పగలిగే వారి నుండి వ్యక్తిగతంగా ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి. అలా చెప్పలేని వారి కొరకు లెటర్ల ద్వారా, ఈ మెయిల్స్ ద్వారా సోషల్ మీడియా ద్వారా, ఫోన్ ద్వారా ఇలా ఎన్ని మార్గాలు ఉంటే అన్నింటిని వాడుకోవాలి. సంస్థ సభ్యులకు, అభిమానులకు, ప్రజలకు వివిధ మార్గాల ద్వారా వారి ఫీడ్‌బ్యాక్ చాలా విలువైనదనే విషయం నిరంతరంగా తెలియ పరుస్తూ, ఆచరణలో దాన్ని కనబరుస్తూ ఉంటే, అందరిలో నమ్మకం ఏర్పడి మరింత ముందుకు వచ్చి ఫీడ్‌బ్యాక్ ఇస్తారు. వీలైనంత వరకు ఏ మార్పులు ఫీడ్‌బ్యాక్ వలన జరిగాయో బహిరంగ పరచగలిగితే అందరిలో గౌరవం, నమ్మకం పెరుగుతుంది.

యువత నుండి విస్తృతంగా ఫీడ్‌బ్యాక్ తీసుకుంటే ప్రజా సంఘాలు ఎలా ఉంటే యువకులకు ఆసక్తి ఏర్పడుతుందో తెలుస్తుంది. నేటి యువత భాషలో పుస్తకాలలో ఈజీ పదాలు కోరుకుంటున్నారు. వారు మొత్తం అక్షరాలతో నిండిపోయిన పుస్తకాలు చదువాలనుకోవడం లేదు. దాంట్లో బొమ్మలు, ఫొటోలు ఉండాలనుకుంటున్నారు. పుస్తకాల కన్నా విడియో, ఆడియోల రూపకంలో ఇష్టపడుతున్నారు. సంక్లిష్టమైన విషయాన్ని కూడా (కనీసం తమకు అవగాహన, ఆసక్తి ఏర్పడే వరకు) సులభమైన పదాలతో, ఆసక్తి కలిగించగలిగే రీతిలో తమకు చెప్పాలని కోరుకుంటున్నారు. వీటన్నింటిలో మార్క్సిస్టు ప్రజాసంఘాలు యువతను నిరాశపరిచే పద్ధతులే అవలంబిస్తున్నాయి. యువత సమయాన్ని, ఏకాగ్రతని దోచుకునే ఎన్నెన్నో కొత్త ఆసక్తికరమైన మార్గాలను పెట్టుబడిదారులు ముందుకు తెస్తున్నారు. వీటన్నింటిని కాదని ఒక ప్రజా సంఘంతో కలిసి నడవడానికి (పార్ట్‌టైంగా అయినా) ముందుకు రావాలంటే, ఆ సంఘ నాయకత్వం అంతగా ఆ యువత హృదయాన్ని కదిలించితేనే అది సాధ్యమవుతుంది. ఇది జరగాలంటే మార్క్సిస్టు ప్రజా సంఘాలు తమ పని తీరును సమూలంగా మార్చుకోవాలి. (రి-ఇన్వెంటింగ్ ద వీల్ అనవచ్చు) ఏమి చేయాలి, ఎలా చేయాలి అనే అంశాలన్ని విస్తృతమైన ఫీడ్‌బ్యాక్ ప్రక్రియ ద్వారానే తెలుస్తాయి. నేర్చుకోవాలనుకునే ప్రతి సంస్థ, వ్యక్తి నిరంతరంగా నేర్చుకునే, తమను తాము నిరంతరంగంగా మార్చుకునే క్రమంలో అడ్డంకిగా ఉన్న గుణాలను వదిలించుకోవడమనే ప్రక్రియ (దీన్ని అన్‌లర్నింగ్ అంటారు) ను జరపకుండా, దానికి కావలసిన విమర్శ - ఆత్మవిమర్శ లాంటి పరికరాలను నిరంతరంగా వాడకుండా అభివృద్ధి సాధించడం అసంభవం.

ఒకటి మాత్రం సత్యం. పాత పద్ధతులతో కూడా కొత్తతరాన్ని ఆకర్షించగలం, ఎందుకంటే మనం వారి బాధల గురించే మాట్లాడుతున్నాం కదా! వారి గురించి త్యాగాలకు సిద్ధపడ్డాం కదా! అంటే కుదరదు. అలా ప్రతి రోజూ, ప్రతి కోణం నుండి, ప్రతి ఒక్కరి నుండి ఫీడ్‌బ్యాక్ కలెక్ట్ చేసి, సంస్థలో ప్రతి ఒక్కరి నుండి ఆ పని చేపిస్తూ, అందరిలో కూడా నిరంతరంగా నేర్చుకునే వాతావరణం కల్పిస్తేనే ఒక సంస్థ లెర్నింగ్ ఆర్గనైజేషన్‌గా ఎదుగుతుంది. వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను నిరంతరంగా బ్రెయిన్ స్టామింగ్ (విస్తృత మేధోమథనం) ప్రక్రియ ద్వారా ఆచరణకనువైన ప్రోగ్రాంలను చేసుకోవాలి.

ఈ మొత్తం ప్రక్రియలో నాయకత్వం పాత్ర కీలకమైనది. తన విస్తృత అనుభవం ద్వారా ఒక వ్యక్తి నాయకుడవుతాడు. నిరంతరంగా నేర్చుకునే, పరిస్థితుల కనుగుణంగా వేగంగా ఎత్తుగడలు మార్చుకునే గుణం కోల్పోయినా, తగ్గిపోయినా ఆ నాయకుడి గత అనుభవం (అది ఎంత ఉన్నా) ఆ సంస్థకు గుదిబండగా మారి సంస్థ మనుగడనే ప్రశ్నార్థకం అవుతుంది. ఏ (మార్క్సిస్టు) ప్రజా సంఘమైనా అది ప్రజలలో తన ప్రభావాన్ని కోల్పోతుందంటే, అది ముమ్మాటికీ దాని నాయకత్వం వైఫల్యమే తప్పించి ప్రజలదో, దాని కార్యకర్తలదో కాదు. ఒక నాయకుడి

ఉత్తరాంధ్రలో అణు కుంపటి

***ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అణువిద్యుత్‌ను వ్యతిరేకించిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకుండా అణు విద్యుత్తే అభివృద్ధికి ఏకైక మార్గం అంటున్నారని విమర్శిస్తున్నారు* షేక్ కరీముల్లా**

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కొవ్వాడలో అణు కుంపటి రాచుకోనుంది. ఇక్కడ నిర్మించ తలపెట్టిన అణువిద్యుత్ కేంద్ర ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దూకుడుగా ప్రవర్తిస్తున్నాయి. ఇటీవల ప్రధాన మంత్రి మోడీ అమెరికా పర్యటన తర్వాత ప్రాజెక్టు ఏర్పాటులో కదలిక పెరిగింది. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే రెండు జిఒలను జారీ చేశారు. బిజెపి చెలిమితో అణు ప్రాజెక్టు విషయంలో ఆయన చర్యలు వేగవంతమయ్యాయి. మోడీ అమెరికా పర్యటనలో ఒబామాతో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో పౌర అణు సహకార ఒప్పందం అమలుపై తీసుకున్న నిర్ణయాల తర్వాత రాష్ట్ర ప్రభుత్వంలో మరింత కదలిక వచ్చింది. ఈ ద్వైపాక్షిక సమావేశంలో తీసుకున్న నిర్ణయంలో భాగంగా దేశంలో ఎనిమిది అణువిద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది. అందులో అమెరికా రియాక్టర్లతో కొవ్వాడలో ఏర్పాటు చేయతలపెట్టిన అణువిద్యుత్ ప్రాజెక్టు ఒకటి. త్వరితగతిన అమలుకు ఉభయ దేశాధి నేతలు సిద్ధమైనారు. ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు అణు ప్రాజెక్టులల్లో ప్రమాదం సంభవిస్తే నష్ట పరిహారం భాధ్యత తనది కాదని రియాక్టర్ సరఫరా కంపెనీలు వాదిస్తున్నాయి. దీనికి అమెరికా వత్తాసు పలుకుతుంది. దీనిని వ్యతిరేకించకుండా మిన్నకుండి పోయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాభిప్రాయంతో, పర్యావరణంతో సంబంధం లేకుండా వ్యవహరిస్తున్నాయి. ఇంతవరకు ఈ ప్రాజెక్టుకు సంబంధించి భారత్ అణుశక్తి నియంత్రణ మండలికి న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇప్పటి వరకు అనుమతి కోరుతూ కనీసం ధరఖాస్తు చేయలేదు. పైగా ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణకు గత ప్రభుత్వం 272,42 జిఒలను జారీ చేయగా చంద్రబాబు అధికారంలోకి వచ్చీ రాగానే కొనసాగింపుగా జోన్‌గా విడదీస్తూ 186వ జిఒను విడుదల చేయడమైనది. తాజాగా నాగావళి నీటిని అణు ప్రాజెక్టుకు మళ్లిస్తూ జిఒ 53ను జారీ చేశారు.

చంద్రబాబు ద్వంద్వ వైఖరి : ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఈ అణు ప్రాజెక్టును వ్యతిరేకించిన బాబు అధికారంలోకి రాగానే తన వైఖరి మార్చుకుని ప్రాజెక్టు నిర్మాణానికి ఉవ్విళ్లూరుతున్నాడు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు 2010 సెప్టెంబర్ నెలలో శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ నేతలు కొవ్వాడలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని, జిల్లాలో ప్రజల ప్రాణాలకు, పర్యావరణానికి హాని తలపెట్టే ఈ ప్రాజెక్టును చేపడితే సహించేది లేదని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చంద్రబాబు హెచ్చరించారు. 'జిల్లాలో అణువిద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఏమి చేయదలచుకున్నారు'? అని ఆ సభలో ప్రశ్నించారు. అణువిద్యుత్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజా ఉద్యమాలకు టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కొవ్వాడ గ్రామంలో టిడిపి కార్యకర్తల ఆధ్వర్యంలో అణు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష శిబిరం కూడా సాగింది. అలాంటి టిడిపి అధికారంలోకి రాగానే తన వైఖరిని మార్చుకుని ప్రజా సంక్షేమంతో తనకు పనిలేదని, సామాన్యుల ప్రాణాలను గాలికి వదిలివేసే చర్యలు చేపట్టింది. చట్టాలు కోర్టు తీర్పులను గత ప్రభుత్వాలు ఉల్లంఘించిన శిథిలాల మీదే ప్రాజెక్టు నిర్మాణానికి ఆఘమేఘాల మీద ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో ఇటీవల శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు అణు ప్రజెక్టుపై నోరు విప్పవద్దని మంచి ప్యాకేజీ కోసం ప్రయత్నం చేద్దామని తెలుగుదేశం పార్టీ నేతలతో మాట్లాడిన విధానం అన్ని వార్తా పత్రికలలో ప్రచురితమైంది. 'ఏరు దాటాకా తెప్ప తగలేసిన' చందంగా మోసపూరితంగా ఉంది చంద్రబాబు వైఖరి.

భూసేకరణ తంతు : నిరుపేదలకు గూడు కోసం కనీసం రెండు సెంట్ల స్థలం కేటాయించడానికి ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకునే ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టు కోసం న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు ఏకంగా 2,436,77 ఎకరాలను కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. బ్రిటిష్ వారు రూపొందించిన 1894 భూసేకరణ యాక్ట్ ప్రకారం భూమి సేకరించాలని నిర్ణయించారు.

గత అనుభవం జరుగబోయే ప్రయోగాలకు దిశా నిర్దేశం చేసేదిగా ఉండాలి కాని మొత్తంగా ప్రయోగాలనే ఆపేదిగా ఉండకూడదు. ఎందుకంటే, ప్రయోగాలే లేకుంటే మార్పే జరుగదు.

పీడిత, తాడిత ప్రజల సిద్ధాంతమే కావచ్చు. నిజాయితీతో కూడిన ఉద్దేశం ఉండొచ్చు. ప్రాణత్యాగం చేయడానికి కూడా సిద్ధపడిన నిబద్ధత ఉండొచ్చు. వ్యక్తిగత జీవితాన్ని వదిలేసి 24 గంటలు ప్రజల గురించే ఆచరణలో ఉండొచ్చు గాక, అయినప్పటికీ ప్రజల ఆదరణ దొరకక, కాలక్రమంలో సంస్థ బలహీనమై పోవడం, కనుమరుగై పోవడం జరిగిన సంఘటనలు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. దానికి కారణం ఆ సంస్థ నాయకత్వ లోపం. వారు తమ సంస్థను నిరంతరంగా నేర్చుకునే సంస్థగా అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టలేదు. మావో చెప్పినట్టు 'ప్రజల నుండి ప్రజల వద్దకు' అంటే ప్రజల నుండి ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం, బ్రెయిన్ స్టామ్ చేయడం, ఆచరణాత్మక ప్రోగ్రాంలు తయారు చేయడం, ప్రజల వద్దకు వెళ్లడం. ఇది ఒక సైకిల్ చట్రంలా నిరంతరంగా నడుస్తూనే ఉండాలి. లేనట్లైతే ఎలాంటి సంస్థ అయినా క్రమేణా కనుమరుగవుతుంది.

(రచయిత అనేక దేశాల్లో పని చేసిన సామాజిక కార్యకర్త) వీ

ప్రాజెక్టు తలపెట్టిన ప్రాంతానికి చుట్టు 16 కిలోమీటర్ల దూరంలో ఎటువంటి కార్యక్రమాలు చేపట్టరాదని హుకుం జారీ అయింది. ఇదంతా గిరిజన చట్టాలకు విరుద్ధంగా, గిరిజనుల, స్థానికుల అభ్యంతరాలను ఏమాత్రం ఖాతరు చేయకుండా ప్రజాభిప్రాయ సేకరణ ఊసే లేకుండా భూసేకరణకు రంగం సిద్ధమైంది. ఎలాంటి అనుమతులు లేకుండా భూసేకరణ చేపట్టడం చట్ట విరుద్ధమని 2006లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కూడా తుంగలో తొక్కి జిఒలు జారీ చేయడం అయినది. ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియమ నిబంధనలు, చట్టాలు, తీర్పులకు విరుద్ధంగా అధర్మంగా చర్యలను వేగవంతం చేయడంతో ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలలో ఆందోళనలు మొదలైనాయి.

ప్రమాద భరితాలు అణువిద్యుత్ ప్రాజెక్టులు : ప్రస్తుతం ప్రాజెక్టు నిర్మించ తలపెట్టిన కొవ్వాడ పరిసర ప్రాంతాలు భూకంపాలు వచ్చే అవకాశాలున్నట్లు ప్రభుత్వ సంస్థల నివేదికలు చెపుతున్నాయి. సముద్ర గర్భాలలో వచ్చే భూకంపాల వల్ల సునామీలు వచ్చి జపాన్ దేశంలోని 'ఫుకుషియా' మాలలో జరిగిన భారీ అణువిద్యుత్ ప్లాంట్ల ప్రమాదాలు లాంటివి జరిగే అవకాశాలున్నాయని, అలాగే ఉమ్మడి రాష్ట్రంలోని 11 జిల్లాలలో 144 మండలాలలో భూకంపాలు వచ్చే అవకాశాలున్నాయని జాతీయ భూ భౌతిక పరిశోధన సంస్థ గుర్తించింది. ఇందులో ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు, విజయనగరం జిల్లాలోను, రణస్థలానికి ఆనుకుని ఉన్న పరిసరాలు కూడా భూకంపాల జోన్‌లో ఉన్నట్లు జాతీయ భూ భౌతిక పరిశోధన సంస్థ, భారత భూగర్భ సర్వే సంస్థ, జాతీయ రిమోట్ సెన్సింగ్ సంస్థలు గుర్తించాయి. భూకంపాలు వచ్చి భూకంప లేఖనిపై (రిక్టర్ స్కేల్) ఐదుకు మించి తీవ్రత మించితే కొవ్వాడ అణువిద్యుత్ ప్రాజెక్టులో ప్రమాదం సంభవిస్తే, దాని ప్రభావం కాకినాడ నుంచి ఒడిశా రాష్ట్రంలోని ఛత్రపురం వరకు 170 కిలోమీటర్ల వరకు ప్రమాదం సంభవించవచ్చని బ్రిటన్ అణు సంస్థ నివేదిక ప్రకటించింది. పర్యావరణం దెబ్బతిని, ప్రకృతి విధ్వంసమై నేడు తరచూ ప్రకృతి విపత్తులు సంభవిస్తున్న తరుణంలో ఇలాంటి ప్రాజెక్టులు మానవాళికి ముప్పు తెచ్చిపెడతాయి అనడంలో అతిశయోక్తి లేదు.

అణువిద్యుత్ ప్రమాదాలు – ప్రపంచ అనుభవాలు : గత చరిత్ర అనుభవాలను చూస్తే 1986 ఏప్రిల్ 26న రష్యాలోని ఉక్రేన్ ప్రాంతంలోని చెర్నోబిల్ అణువిద్యుత్ ప్లాంట్‌లోని రియాక్టర్‌లో ప్రమాదం సంభవించి ప్లాంట్ నుండి విడుదలైన రేడియేషన్ గాలి ద్వారా ఉక్రేన్ బెలారస్ ప్రాంతాలు, యూరప్‌లోని మరికొన్ని ఇతర ప్రాంతాలకు విస్తరించి 1986 నుంచి 2004 వరకు ఈ ప్రమాదం వలన ప్రపంచ వ్యాప్తంగా సుమారు 9,85,000 మంది చనిపోయినట్లు రష్యన్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ సెస్ వారు ప్రకటించారు. అలాగే దాదాపు 6 లక్షల మంది ప్రభావితమై రేడియేషన్‌కు గురై శ్వాసకోశ, చర్మ వ్యాధులకు గురై బాధలు పడినట్లు ఒక అంచనా.

ఇదిలా ఉండగా 2011 మార్చి 11న జపాన్‌లోని ఫుకుషిమాలోని ప్లాంట్ సునామి, భూకంపాల వల్ల ప్రమాదం జరిగింది. జపాన్ ప్రభుత్వ అశ్రద్ధ వల్ల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం ఆలస్యమై తీవ్రమైన అణు ధార్మికతకు గురయ్యారు. సుమారు 1 లక్ష 50 వేల మంది ప్రజలను సుదూర ప్రాంతాలకు తరలించారు. వారిప్పటికి స్వస్థలాలకు వెళ్లలేదు. పునరావాస కేంద్రాలలోనే దుర్భరంగా బతుకుతున్నారు. ముఖ్యమైన విషయం ఏమిటంటే ప్రమాదాలు జరగకపోయిన అణువిద్యుత్ ప్లాంట్ల వలన అక్కడి పరిసరాలపై అణు ధార్మిక ప్రభావం ఉంటుంది. ఈ కారణంగా ప్రజలకు వ్యాధులు, పర్యావరణానికి పెనుముప్పు ముంచుకు రానుంది. ఇది ముందు తరాలకు శాపంగా మారనుంది. ఇప్పటికే ఒక అనుభవం మనకుంది. ఇది అణు ప్రమాదం కాకున్న దాదాపు అలాంటి ప్రమాదమే భోపాల్ గ్యాస్‌లీక్ దుర్ఘటన. ఇది ప్రపంచంలోనే అత్యంత దారుణమైన, హేయమైన పారిశ్రామిక ప్రమాదంగా చెప్పవచ్చు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో పురుగు మందులు తయారు చేసే 'యూనియన్ కార్బైడ్' పరిశ్రమ నుంచి 1984 డిసెంబర్ 2 అర్ధరాత్రి 'మిథైల్ ఐసో సైనేట్' అనే విషవాయువు టన్నుల కొద్దీ లీకై వెనువెంటనే ఆ సమీప ప్రాంతాలలో నివసిస్తున్న వారు 2,259 మంది మరణించారు. ఆ నిశిరాత్రివేళ మృత్యువులా ముంచుకొచ్చిన ఆ విషవాయువు భారీ నుంచి తమను తాము రక్షించుకోవడానికి వేలాది మంది ప్రజలు హాహాకారాలు చేస్తూ వీధుల్లో పరుగులు తీశారు. అనంతరం అధికారిక లెక్కల ప్రకారం 4 వేల మంది మరణించారు. మరికొన్ని వేల మంది ఊపిరితిత్తుల కాన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధుల భారీనపడి జీవచ్ఛవాలుగా మారారు. తల్లులు కావలసిన ఎంతో మంది గర్భిణిలకు గర్భస్రావాలు అయ్యాయి. ఇప్పటికి అక్కడ 30 ఏళ్లు అయిన జన్యుపరమైన లోపాలతో శిశువులు జన్మిస్తున్నారు. ఇప్పటికి ఆ బాధితులకు కనీస న్యాయం జరగలేదు. ఇది ఎంతో ఘోరకలి. ఒళ్లు గగుర్పాటు కలిగించే ఘటనకు బాధ్యుడైన ఆ కంపెనీ సిఇఒ వారెన్ అండర్సన్ (అమెరికా) ఒక్కరోజు కూడా శిక్ష అనుభవించకుండా, జైల్లో గడపకుండానే రోజుల వ్యవధిలో అతనికి బెయిల్ ఇప్పించి, విమానం ఎక్కించి దేశం దాటించారు అప్పటి మన పాలకులు. ఆనాటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్, (కాంగ్రెస్) అప్పటి కేంద్ర హోం మంత్రి పి.వి. నరసింహారావు, ప్రధాని రాజీవ్‌గాంధీలు అమెరికా పాలకులకు తలవంచి అండర్సన్‌ను దేశం దాటించారని అప్పట్లో మీడియాలో ప్రచారం జరిగింది. ఈ పాపం మూటకట్టుకున్న అండర్సన్ 92 సంవత్సరాల వయస్సులో ఇటీవల 2014 సెప్టెంబర్ 29న మరణించాడు. వందల కోట్ల రూపాయలు దండుకునే బహుళజాతి కంపెనీలు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడడం మనకు కొత్తకాదు. బాధ్యతారాహిత్యమైన మన పాలకులు అమెరికా సామ్రాజ్యవాదంకు, దాని కనుసన్నలలో నడిచే బహుళజాతి కంపెనీలకు సేవకులే కాని మన ప్రజలకు, భారతదేశానికి కాదని గత చరిత్ర చెప్పిన చారిత్రక వాస్తవం. ఇప్పుడు ఈ దుష్ట పాలకుల జాబితాలో మోడీ, చంద్రబాబులు నిలిచారు. దేశ రక్షణ ప్రజల భద్రత గాలికి వదిలి బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసం మోడీ, బాబులు దృఢ సంకల్పంతో ఉన్నట్లు స్పష్టమవుతుంది. అభివృద్ధి పేరిట ఏర్పాటు చేస్తున్న ఈ అణువిద్యుత్ కేంద్రం వల్ల పర్యావరణ సమస్యలు తలెత్తడంతో పాటు విధ్వంసకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని సాక్షాత్తు అణు ఇంధన శాఖ నిపుణులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో ఏదైన ప్రమాదం జరిగితే అణుబాంబు పేలినట్లే అవుతుందని నిపుణుల హెచ్చరిస్తున్నారు. కాబట్టి ఈ అణువిద్యుత్ ప్రాజెక్టును నిలిపివేయాలి. దీనికొరకై పౌర సమాజం, మేధావులు, అన్ని సెక్షన్ల ప్రజలు నిరసనలు, ఆందోళనలతో ఉద్యమించాలి. ఈ పాలకులను నిలవరించాలి. లేకుంటే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. విద్యుత్పత్తికై ప్రత్యామ్నాయ మార్గాలైన సాంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలి. ప్రకృతి పరంగా విరివిగా లభించే సౌరశక్తి, గాలిశక్తి, బయోగ్యాస్, సముద్ర శక్తుల ద్వారా విరివిగా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు. తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు.

(రచయిత ఉపాధ్యాయుడు) వీ

పెయిడ్ న్యూస్‌ను ఆపలేమా?

***ఒకప్పుడు పెయిడ్ న్యూస్ అంటే డబ్బులు ఇచ్చి వార్తలు వేయించుకునేదిగా ఉండేదనీ, కాని ఇప్పుడు పెయిడ్ న్యూస్ అన్న పదానికి నిర్వచనమే మారిపోయిందనీ, దాన్ని నియంత్రించే పరిష్కార మార్గాలు కష్టమైపోయాయనీ అంటున్నారు* టంకశాల అశోక్**

జర్నలిజంలో 'పెయిడ్ న్యూస్'ను ఆపగలవారు ఎవరైనా ఉన్నారా? ఈ ప్రశ్నపై చర్చ అవసరమే లేదు. సమాధానాన్ని వెంటనే, సూటిగా చెప్పవచ్చు. ఆపగలవారెవరూ లేరు. మరి పరిష్కారం ఏమిటి అని అడిగితే, కనుచూపు మేరలో ఏదీ లేదని, మార్పు కోసం ఎదురు చూడడం మినహా మరే మార్గం కనిపించడం లేదని మాత్రమే చెప్పగలం.

ఇది జర్నలిజానికే గాక ప్రజాస్వామ్యానికే హానికరమైన స్థితి. ప్రజాస్వామ్యానికి నష్టదాయకమని స్వయంగా ప్రెస్ కౌన్సిల్ కూడా అంగీకరించింది. కాని ఈ విషయమై ఆ కౌన్సిల్ సైతం ఏమీ చేయలేని దుస్థితిలో ఉంది.

పెయిడ్ న్యూస్ విషయమై 2009 సాధారణ ఎన్నికల తర్వాత దేశంలో చాలా చర్చ జరగడం తెలిసిందే. సీనియర్ పాత్రికేయులు, ప్రెస్ కౌన్సిల్, కేంద్ర ఎన్నికల సంఘం, కొన్ని పత్రికలు ఈ సమస్యపై చేసిన వ్యాఖ్యలు, ఏర్పాటైన విచారణ కమిటీలు, నివేదికలు దేశాన్ని కొంతకాలం పాటు హోరెత్తించాయి. పార్లమెంటులోనూ చర్చ జరిగింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రితో సహా పలువురు నాయకులు, ప్రముఖ పత్రికలు అప్రతిష్ఠపాలు కాగా విషయం అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. కాని అయిదేళ్లు గడిచినాక 2014 ఎన్నికలలోనూ పెయిడ్ న్యూస్ ఆగలేదు. పైగా కొత్త పుంతలు తొక్కినట్లు పరిగణలో వెల్లడైంది. దీనిని ఆపే మొనగాడెవ్వడనే ప్రశ్న వేయడం అందువల్లనే. ఈ ప్రశ్నలో సవాలుకన్న నిస్సహాయత ఎక్కువని అర్థం చేసుకోవడం కష్టంకాదు. ఇదిట్లా జరగడానికి కారణం ఏమిటన్నది అర్థం చేసుకోవలసిన విషయం.

పెయిడ్ న్యూస్ అన్న మాటకు అర్థమేమిటో తెలిసిందే. ప్రెస్ కౌన్సిల్ నియమించిన ఒక కమిటీ చెప్పిన నిర్వచనం ఈ విధంగా ఉంది. 'డబ్బుకోసం కాని, ఇతర ప్రయోజనాల కోసం కాని పత్రికలలో నైనా, ఎలక్ట్రానిక్ మాధ్యమాలలోనైనా వెలువడే వార్తలు, విశ్లేషణలు పెయిడ్ న్యూస్ అవుతాయి.' 2009 ఎన్నికల అనంతరం కౌన్సిల్ ఏర్పాటు చేసిన కమిటీ తన నివేదికలో అన్నమాట ఇది.

వాస్తవానికి ఇది అసంపూర్తి నిర్వచనం. 2009 ఎన్నికల దృష్టిలో ఉంచుకుని తాము పరిమితమైన నివేదికను ఇస్తున్నట్లు కమిటీ పేర్కొన్నది. అయినప్పటికీ అది అసంపూర్ణమైనదే. ఎందుకంటే, ఉదాహరణకు ఆర్థిక ప్రయోజనవర్గాలకు, కంపెనీలకు, మల్టీనేషనల్స్‌కు, పార్టీలకు స్వయం గానే మీడియాలో పలుకుబడి, భాగస్వామ్యాలు ఉండే దశ వచ్చింది. ఈ శక్తులు తాము కోరుకున్న వ్యక్తులు, పార్టీలకు అనుకూలంగా రాయిస్తున్నాయి. అందుకు బదులుగా ఆ శక్తులు మీడియాకు ఆ సందర్భంగా చెల్లించేది ఏమీ ఉండదు. డబ్బు రూపంలో ఉండదు, ఇతర రూపాలలో ఉండదు. కనుక ఈ నిర్వచనంలోకి రాదు. నిజానికి ఈ ధోరణి మన మీడియాలో క్రమంగా పెరుగుతున్నది. 2009 కన్న 2014 వచ్చేసరికి ఇంకా విస్తరించింది. 2009లో ప్రధానంగా ఇంగ్లిష్ మీడియా అట్లుండగా తర్వాత అయిదేళ్లలో తగినన్ని భారతీయ భాషా పత్రికలు కూడా ఈ పరిధిలోకి వచ్చాయి. మునుముందు ఇంకా పెరగడంలో సందేహం లేదు. అటువంటి స్థితిలో ప్రెస్ కౌన్సిల్ నిర్వచనం 2009 ఎన్నికలకు సంబంధించి కూడా పాక్షికమైనదే. ఇక ఇతరత్రా చెప్పనక్కరలేదు. అందువల్ల దానిని సవరించడం అవసరం.

దానినట్లుంచితే, ప్రెస్ కౌన్సిల్ కమిటీ రాసిన అదే నివేదిక, పెయిడ్ న్యూస్ పద్ధతి అరవయ్యేళ్లకు పైగా వేర్వేరు రూపాల్లో ఉందని పేర్కొన్నది! అంటే దాదాపు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచేనన్నమాట. అది ఎన్నికలకు సంబంధించిన పెయిడ్ న్యూస్ కాకపోవచ్చు. కాని డబ్బు లేదా మరొకటి బయటివారు మీడియాకు ఇవ్వడం, అందుకు బదులుగా అనుకూలమైన వార్తలు, పెద్ద వార్తలు, విశ్లేషణలు, సంపాదకీయాలు రాయడం, వ్యతిరేకమైన వాటిని తగ్గించడం లేదా ఆపడం వంటివి మాత్రం ఒక రుగ్మత రూపంలో దశాబ్దాలుగా ఉన్నాయి. కాలం గడిచినా కొద్దీ అవి కొత్త రూపాలలో పెచ్చు పెరిగాయి. ఇదంతా ప్రెస్ కౌన్సిల్ సహా అందరికీ తెలిసిన విషయమే. కాకపోతే 2009 ఎన్నికల సమయంలో మరింత విజృంభించి భరించలేని దుర్వాసన వేయడంతో విచారణ కోసమంటూ కమిటీ వేశారు.

2009లో ఎన్నికలు జరిగాక కమిటీ తన నివేదికను మరుసటి సంవత్సరం ఇచ్చింది. ఎన్నికల సంఘానికి, ప్రభుత్వానికి కొన్ని సిఫారసులు చేసింది. ఆ దరిమిలా ఎన్నికల సంఘం అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులకు సూచనలు పంపింది. కమిటీ నివేదిక కేంద్ర ప్రభుత్వానికి, పార్లమెంటుకు వెళ్లింది. వాస్తవానికి ఆ సిఫారసులన్నీ అతి సాధారణమైనవి తప్ప గట్టివి అనదగ్గవేమీ లేదు. మరి ఆ మేరకైనా జరిగిందేమిటి? 2014 ఎన్నికల వరకు కూడా కాగితం కదలలేదు. ఎవరైతే కదిలించాలో స్వయంగా వారి ప్రయోజనాలు కూడా పెయిడ్ న్యూస్‌తో ముడిపడి ఉన్నందువల్లనే ఈ పరిస్థితి ఉందనుకుంటే పొరపాటు లేదు. ఇతరత్రా కూడా ఎన్నికల సంస్కరణల కోసం ఎన్నికల సంఘం నుంచి, వేరే సంస్థల నుంచి వచ్చిన ఎన్నెన్ని సిఫారసులను ప్రభుత్వాలు, పార్లమెంటులోని రాజకీయ పార్టీలు మూలన పెట్టాయో తెలిసిందే. కనుక ఇందులో ఆశ్చర్యపడవలసింది లేదు.

ఎన్నికలతో నిమిత్తం గల పెయిడ్ న్యూస్ పరిస్థితే ఈ విధంగా ఉన్నప్పుడు ఇక మౌలికంగా, అరవయ్యేళ్లకు పైగా ఉందని కౌన్సిల్ కమిటీ నివేదిక చెపుతున్న పెయిడ్ న్యూస్ మాటేమిటి? రాజకీయ ప్రయోజనాలన్నవి అంతిమంగా ఆర్థిక – సామాజిక ప్రయోజనాలని

ఏ వెలుగులకీ ప్రస్థానం

లౌకిక దేశంగా చెప్పుకుంటున్న దేశంలో జ్ఞానాన్ని అందించే చరిత్ర పుస్తకాలను తగులబెట్టి, అశాస్త్రీయమైన గ్రంథాలకు జాతీయహోదా కల్పించే ప్రయత్నం సమాజాన్ని చీకట్లోకి నెట్టి తమ అధికారాన్ని నిలుపుకోవడానికేనని అంటున్నారు ఎ. రాజేంద్రబాబు

ఇటీవలి కాలంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీతో సహా కొంతమంది కేంద్ర మంత్రివర్గ సభ్యులు వెలిబుచ్చుతున్న అభిప్రాయాల గురించి దేశ వ్యాప్తంగా చర్చ జరగవలసిన అవసరం ఉంది. సిబిఎస్ఇ సిలబస్‌లో చదువుతున్న విద్యార్థులకు జర్మన్ భాష స్థానంలో సంస్కృతాన్ని విధిగా నిర్దేశిస్తున్నట్లు కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి స్మృతి ఇరాని ప్రకటించారు. ఈ సందర్భంగా దాదాపు నూట యాభై ఏళ్ల క్రితం కలకత్తా నగరంలో సంస్కృత మాధ్యమంలో ఒక కళాశాల ప్రారంభించా లన్న అప్పటి బ్రిటిష్ ప్రభుత్వ సంకల్పాన్ని వ్యతిరేకిస్తూ ప్రముఖ సంస్కరణవాది రాజా రామ్మోహన్‌రాయ్ జరిపిన సైద్ధాంతిక పోరాటాన్ని గుర్తుతెచ్చుకోవాలి.

'ఈ దేశాన్ని ఇంకా అంధకారంలో ఉంచడమే మీ ఉద్దేశమయితేనే ఇలాంటి చర్యలకు మీరు పాల్పడతారు' అని ఆనాటి బెంగాల్ బ్రిటిష్ గవర్నర్ జనరల్ లార్డ్ ఆమ్ హెర్ట్స్‌కు రాసిన లేఖలో రామ్మోహన్‌రాయ్ ఘాటుగా విమర్శించాడు. రసాయన, ఖగోళ, గణిత శాస్త్రాలతో పాటు రాజకీయ, ఆర్థిక, తత్వశాస్త్రాలలో పలు నూతన సిద్ధాంతాలు ఈ ఆధునిక యుగంలో ఎందరో జర్మన్ మేధావులు ఆవిష్కరించారు. నేటి సాంకేతిక విజ్ఞాన యుగంలో విద్యార్థులకు జర్మన్ భాషతో పరిచయం ఉండడం అవసరమని దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విద్యావిధాన రూపకల్పనలో సిద్ధాంత కర్తలు భావించారు. మృత భాషగా పేర్కొనబడిన సంస్కృతంలో గత ఆరేడు వందల సంవత్సరాలలో ఏ రంగంలో అయినా కొత్త ఆలోచనను కలిగించే పుస్తకం ఏదైనా వచ్చిందా? సంస్కృతంలో మాట్లాడుతున్న వాళ్లు గాని, సంస్కృతంలో ఆలోచిస్తున్న వాళ్లు గాని ఇప్పుడెవరైనా దేశంలో ఉన్నారా? సిబిఎస్ఇ కరికులంలో ఈ విధాన మార్పు చేయబూనడానికి హేతువు ఏమిటి అన్న ప్రశ్నకు కేంద్ర మంత్రి దగ్గర సమాధానం లేదు. గతాన్ని గుడ్డిగా ప్రేమించే తత్వాన్ని దేశ ప్రజలకు అలవాటు చేయడం తప్ప కేంద్ర ప్రభుత్వానికి వేరే ప్రగతిశీలమైన ఆలోచన లేదనడానికి ఇది తార్కాణం.

ఈ మహాశయురాలే కొద్ది కాలం క్రితం ఒక జ్యోతిష్యుణ్ణి సందర్శించినట్లు, భవిష్యత్తులో తనకు రాష్ట్రపతి అయ్యే యోగం ఉందని ఆయన చెప్పినట్లు లీకులు ఇచ్చి, ఆ వార్తకు ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియాలలో బహుళ ప్రచారం లభించేట్లు జాగ్రత్త పడ్డారు. మానవ వనరుల అభివృద్ధి శాఖకు నేతృత్వం వహిస్తున్న కేంద్ర మంత్రి తన మాటల ద్వారా, తన ప్రవర్తన ద్వారా, తన జీవితం ద్వారా ప్రజలకిచ్చే సందేశం మనదేశ విద్యారంగ లక్ష్యాల కనుగుణంగా ఉండాల్సిన అవసరం లేదా? గతంలో నాయకత్వ స్థానాలలో ఉన్నవారు తమ వ్యక్తిగత విశ్వాసాలు ఎలా ఉన్నా, కనీసం పబ్లిక్ లైఫ్‌లోనైనా మూఢ నమ్మకాలకు దూరంగా ఉండే ప్రయత్నం చేసేవారు. ఈ సందర్భంగా చరిత్రలో నమోదైన ఒక ఉదాంతాన్ని దేశప్రజలు గుర్తుకు తెచ్చుకోవాలి. జ్యోతిష్యాన్ని, ఖగోళ శాస్త్రంలో భారతీయుల పురాతన పరిశోధనలను ఉటంకిస్తూ రాసిన ఒక పుస్తకాన్ని దేశ ప్రథమ ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూకు అంకితమివ్వాలని ఆ పుస్తకాన్ని ప్రచురించిన న్యూఢిల్లీలోని భారతీయ ఖగోళ శాస్త్ర, సంస్కృత భాషా పరిశోధన

వేరే చెప్పనక్కరలేదు. ఈ ప్రయోజనాలన్నింటికి ఇప్పుడు పెట్టుబడి దారీతో, ధన సంస్కృతితో గట్టిముడి ఏర్పడిపోయింది. ఈ మొత్తం క్రీడలో మీడియా ఒక సాధనంగా మారింది. వీటన్నింటి మధ్యగల అవినాభావ సంబంధాన్ని విడదీయగలవారెవరు? ఇంకా చెప్పాలంటే విడదీయాలన్న ఉద్దేశం, చిత్తశుద్ధి నిజంగా ఎవరికైనా ఉన్నాయా? విడదీయడం సాధ్యమా? సామాజికంగా పెను తుఫానో, భూకంపమో అనదగ్గది వస్తే తప్ప ఇది జరిగేది కాదనాలి.

కనుక ఈ కమిటీలు, నివేదికలు, సామాజికుల ఆందోళన వంటివన్నీ నిస్సహాయ ఆక్రందనలు మాత్రమే. కాకపోతే, ప్రజాస్వామిక వ్యవస్థలో వెంటనే ఫలితాలు ఉన్నా లేకపోయినా సమాచారం వెలికి రావడం, విశ్లేషణలు, అవి ప్రజలకు చేరడం ఒక నిరంతర ప్రక్రియగా జరుగుతూ ఉండాలి గనుక, అటువంటి కృషి ఏనాటికైనా ఫలించగలదన్న ఆశాభావాలు కూడా సమాజానికి అవసరమే అయినందున, ఆ మేరకు దీనిని ఆహ్వానించాలి. ఇటువంటి పరిజ్ఞానంతో, చైతన్యంతో సామాజికులు పూనుకుని పార్టీలపై, ప్రభుత్వాలపై, ఆధిపత్య వర్గాలపై, మీడియాపై ఎంత ఒత్తిడి తేగలిగితే అంత ప్రయోజనం ఉంటుంది.

2009 ఎన్నికల సమయంలో కనిపించిన కలకలం ఎక్కువకాలం నిలవక పోవడం, తీవ్రమైన ఒత్తిడిగా మారకపోవడం వల్లనే 2014 ఎన్నికలలో కూడా పెయిడ్ న్యూస్ పద్ధతి కొనసాగింది. ఈసారి ఏమి జరిగిందన్నదానిపై ప్రెస్ కౌన్సిల్ విచారణ వ్యవహారం ఇంకా ముగియలేదు. కాని ఎన్నికల సంఘం మాత్రం 3053 నోటీసులు జారీ చేసింది. వాటిలో 694 కేసులు నిజమేనని నిర్ధారించింది. ఈ విచారణ ఇంకా కొనసాగుతున్నట్లున్నది. ప్రెస్ కౌన్సిల్ నివేదిక కూడా సిద్ధమైనప్పుడు ఈ రెండింటిని కలిపి చూస్తే సర్వ సమగ్రంగా కాకపోయినప్పటికీ కనీసం పాక్షిక దృశ్యం మనకు లభిస్తుంది.

ఒక స్థాయిలో అసలు మీడియా అన్నదే రకరకాల స్వార్థప్రయోజన శక్తులకు బందీగా మారిపోయినప్పుడు, పెయిడ్ న్యూస్ అన్నది ఒక చిన్న వ్యాధి లక్షణం మాత్రమే. వ్యవస్థలో, మీడియా వ్యవస్థలో మార్పులు వచ్చినప్పుడుగాని ఈ పరిస్థితి మారగల అవకాశాలు కనిపించడం లేదు.

(రచయిత సీనియర్ జర్నలిస్టు) వీ

సంస్థ భావించింది. దానికి నెహ్రూ అంగీకరించక, ఆ సంస్థ సంచాలకుడు రాంస్వరూప్‌శర్మకు ప్రత్యుత్తరం రాస్తూ ఈ విధంగా అన్నాడు. 'మీ లేఖలో నాకు జ్యోతిష్యం పట్ల ఉన్న అపనమ్మకాన్ని గురించి ప్రస్తావించారు. అది నూటికి నూరు పాళ్లు నిజం. ఏ రంగంలో అయినా శాస్త్ర పరిశోధనలను ఆహ్వానించాల్సిందే. ఖగోళ శాస్త్రంలో భారతీయులు పూర్వ కాలంలో చెప్పుకోదగినంత ప్రగతి సాధించే ప్రయత్నం చేశారు. అయినప్పటికి నేను ఈ పుస్తకాన్ని అంకితం తీసుకోవడం సరి అయినదని భావించడం లేదు' అని ప్రధాన మంత్రిగా జ్యోతిష్యానికి వ్యతిరేకంగా శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజలలో పెంపొందించడంలో తాను ఆదర్శ ప్రాయంగా ఉండాలని ఆ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించాడు.

నెహ్రూ తన ఆత్మకథ 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' లో శాస్త్రం వెలుగులో జీవితం గడపడం అంటే అది ఒక జీవిత విధానమని, ఒక ఆలోచనా ప్రక్రియ, విభిన్న దృక్పథాలు ఉన్నప్పటికి తన తోటి మనుషులతో కలిసిపోయి ప్రవర్తించే పద్ధతి అని నిర్వచించాడు. శాస్త్రీయంగా జీవించడం అంటే స్వేచ్ఛా మానవుని జీవన విధానం అని అర్థం. జాతి జనులలో శాస్త్రీయ దృక్పథం పెంచాలన్న అభిలాష జవహర్‌లాల్ నెహ్రూకు బలంగా ఉండింది. ఆయన ఆలోచనల కనుగుణంగానే దేశ శాస్త్ర, సాంకేతిక రంగ అభివృద్ధికి మార్గదర్శకత్వం నిర్దేశిస్తూ 1958లో 'శాస్త్రీయ విధాన తీర్మానా'న్ని భారత పార్లమెంట్ ఆమోదించింది. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం సామాజిక మార్పుకు దోహదపడుతుందని ఈ విధాన తీర్మానం (1958) తన లక్ష్య ప్రకటనలో పేర్కొంది. ప్రజలలో శాస్త్రీయ స్పృహ, మానవతావాదం, కొత్త విషయాలను తెలుసుకోవాలన్న కుతూహలం, సంస్కరణాభిలాషను పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని అంబేద్కర్, నెహ్రూల పూనికతో భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 51 ఎ (హెచ్)ను పొందుపరిచారు. అది ఆనాటి నాయకుల ఆలోచన. మరి నేటి ప్రధాన మంత్రి, ఆయన శిష్యులు మాట్లాడుతున్న మాటలు, చేస్తున్న ఆలోచనలు ఏ గమ్యాన్ని సూచిస్తున్నాయి? ప్లాస్టిక్ సర్జరీ అనే వైద్య ప్రక్రియను కనిపెట్టింది భారతీయ సనాతన రుషిపుంగవులేనని, అందుకు 'గణేష్ మహరాజ్' గొప్ప ఉదాహరణ అని అన్నారు.

ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయాలలో మత చిహ్నాలు ఉండకూడదని, ఏ మత సాంప్రదాయాలు పాటించ కూడదని, ఏవైనా పటాలు వేలాడదీస్తే జాతీయ నాయకుల పటాలు మాత్రమే ఉండాలని నియమాలు ఉండేవి. ఎందుకంటే మనది సెక్యులర్ రాజ్యాంగం అని చెప్పే వాళ్లు. జవహర్‌లాల్ నెహ్రూ కాలంలో సెక్యులరిజం అంటే మతరహితమైన స్థితి అని అర్థం ఉండేది. మొరార్జీదేశాయి ప్రధానమంత్రిగా సెక్యులరిజం అంటే అన్ని మతాలకు సమానమైన ప్రాతినిధ్యం అని కొత్త అర్థాన్ని నిర్వచించాడు. ఇప్పుడైతే సెక్యులరిజం అంటే మెజారిటీ మతమే అని అర్థం చెప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. మొన్న మంగల్యాన్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రవేశ పెట్టే ముందు ఇస్రో చైర్మన్ రాధాకృష్ణ తిరుపతికి వెళ్లి ఆ ప్రయోగం విజయవంతం కావాలని ప్రార్థించి వచ్చాడు. ఇస్రో ఒక రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వ సంస్థ. దాని అధిపతి రాధాకృష్ణ ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావాలని మసీదులోనో, చర్చిలోనో, సిక్కు గురు ద్వారాలోనో ఎందుకు ప్రార్థనలు చేయలేదు. తిరుపతి దేవాలయాన్నే ఎందుకు ఎన్నుకున్నాడు అన్న ప్రశ్నకు సమాధానంగా సెక్యులర్ రాజ్యాంగం అంటే మెజారిటీ మత విశ్వాసాలను పాటించడమే అన్న అర్థం స్ఫురించక మానదు. కాదంటే ఒక రాజ్యాంగబద్ధమైన సంస్థకు తన వ్యక్తిగత మత విశ్వాసాలను అంటగట్టడం రాజ్యాంగ వ్యతిరేకమవుతుంది కదా!

ఈ మధ్య సీనియర్ బిజెపి మంత్రి సుష్మాస్వరాజ్ భారతదేశం బహుళ జాతి సమ్మేళనం అన్న వాస్తవాన్ని ఖాతరు చేయకుండా భగవద్గీత పవిత్ర గ్రంథమని, దానిని జాతీయ గ్రంథంగా ప్రకటించాలని సూచించారు. భగవద్గీత హిందూ మతస్థులకు పవిత్రమైందనడంలో ఎవరికీ అభ్యంతరం లేదు. కాని జాతీయ గ్రంథంగా దానికి ప్రత్యేక స్థానం కల్పించాలన్న ప్రతిపాదన అర్థరహితం. అసలు ఏ దేశానికైనా జాతీయ గ్రంథాలు ఉంటాయా? ప్రపంచంలో అలాంటి ఉదాహరణలు ఎక్కడైనా ఉన్నాయా? జాతీయ గ్రంథాలుగా ప్రకటించడానికి కావల్సిన అర్హతలేమిటి? అవలంభించాల్సిన విధానాలేమిటి? లెక్కలేనన్ని భాషలు, కొన్ని కోట్ల పుస్తకాలు చెలామణిలో ఉన్న దేశంలో ఏ భాషలో వెలువడిన పుస్తకానికి జాతీయ హోదా కల్పించాలి! అంతా అగమ్యగోచరమైన ప్రతిపాదన. ఇలాంటి సూచన దేశాన్ని పరిపాలిస్తున్న బిజెపి అగ్రనాయకత్వంలో భాగమైన ఒక సీనియర్ మంత్రి నుండి రావడం నాయకత్వ అపరిపక్వతకు నిదర్శనం.

మానవత దృష్టితో కూడిన శాస్త్రీయ దృక్పథం భారతదేశంలోని ప్రతి పౌరుడు పాటించవలసిన ప్రాథమిక ధర్మం అని రాజ్యాంగం ఆర్టికల్ 51-ఎ(ఎచ్)లో పేర్కొన్న విషయం గాలికి వదిలి వేయబడింది. హార్వర్డ్‌లో చదువుకున్న ఇంకా బిజెపి 'మేధావి' మరొక అడుగు ముందుకు వేసి రొమిల్లా థాపర్ చరిత్ర పుస్తకాలను తగలబెట్టమని పిలుపునిస్తాడు. దేశానికి మార్గదర్శకత్వం చేయాల్సిన నాయకత్వ గణం అంతా ద్వేషాలు, వైషమ్యాలు పెంచే విషమ సముదాయంగా మారిపోతూ ఉంది. ఏ వెలుగులకీ ప్రస్థానం?

ప్రజలలో సైన్స్ పట్ల అవగాహన, శాస్త్రీయ దృక్పథం పెంచాలన్న ప్రయత్నం మేధావుల నుంచి ముఖ్యంగా వామపక్ష మేధావుల నుంచి దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొన్నేళ్ల వరకు బాగానే జరిగింది. అబ్రహం టి. కోవూర్, గోరా లాంటి వాళ్లు శాస్త్రీయమైన ఆలోచన, హేతుబద్ధమైన ఆలోచనా పద్ధతి ప్రజలలో ఒక ఉద్యమంలాగే ప్రాచుర్యం పొందాలని వారి జీవితాంతము ప్రయత్నం చేశారు. 'శాస్త్రీయ జీవిత విధాన ప్రోత్సాహక సంఘం' ఒక దానిని పిం.ఎం. భార్గవ, సతాష్ ధావన్, అబ్దుల్ రహమాన్‌లు 1964లో స్థాపించి ప్రజలలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి కొన్ని సంవత్సరాలు చాలానే కృషి చేశారు. ఉన్నత విద్యారంగ విధాన నిర్ణయాక సంఘం నేషనల్ నాలెడ్జ్ కమిషన్ నుండి దాని అధ్యక్షుడు శామ్‌పెట్రోడాతో విభేదాల కారణంగా ఉపాధ్యక్ష పదవి నుండి తొలగించిబడ్డ పిఎం భార్గవ (ఈయన ఇప్పుడు హైదరాబాద్‌లోనే జీవనం గపుతున్నారు. 1946లోనే అసోసియేషన్ ఆఫ్ సైంటిఫిక్ వర్కర్స్ ఇన్ ఇండియా అనే శాస్త్రవేత్తల ట్రేడ్ యూనియన్‌ను శాస్త్రీయ జీవన విధానం పట్ల ప్రజలలో అవగాహన కల్పించే లక్ష్యంతో స్థాపించారు.

పాలకుల అసంబద్ధమైన, అశాస్త్రీయమైన ఆలోచనలను ప్రజల మధ్య ఎండగట్టే ప్రయత్నం మేధావి వర్గం నుండి నిరంతరం జరుగుతూనే ఉండాలి. ఆర్ఎస్ఎస్‌కు గాని, దాని బహిరంగ వేదిక అయిన బిజెపి, విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ లాంటి సంస్థలకు వాటి సిద్ధాంతాలను ప్రచారం చేసుకునే హక్కు వాటికి ఉండవచ్చు గాక, కాని మానవాళికి ఏది మంచి, ఏది చెడు అన్న విచక్షణా జ్ఞానం ప్రజలలో పెరగడానికి తగు కార్యక్రమాలు చేపట్టడం ఇప్పుడు తక్షణ అవసరం.

(రచయిత రిటైర్డ్ ఇంగ్లిష్ అధ్యాపకులు) వీ

ఎస్.సి. వర్గీకరణపై శాసనసభ తీర్మానం

నవంబర్ 5న ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర మొదటి బడ్జెట్ సమావేశాలలో షెడ్యూల్డ్ కులాల (ఎస్సి) ఎ,బి,సి,డి రిజర్వేషన్ల వర్గీకరణ తీర్మానాన్ని ఉప ముఖ్యమంత్రి టి. రాజయ్య నవంబర్ 29న శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని మూజువాణి వోటుతో సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. గత ప్రభుత్వాలు కూడా ఈ డిమాండ్‌ను శాసనసభలో తీర్మానించాయి.

హైకోర్టు జడ్జిగా జస్టిస్ భోస్లే

ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ దిలీప్ బాబాసాహెబ్ భోస్లే చేత డిసెంబర్ 8న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కళ్యాణజ్యోతి సేన్ గుప్తా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈయన గతంలో కర్ణాటక రాష్ట్ర హైకోర్టులో పని చేశారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయవాదులు, సిబ్బంది హాజరయ్యారు.

మహాధర్నా

సింగరేణిలోని చేసే కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలంటూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద డిసెంబర్ 8న మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న వ్యక్తులు 'సింగరేణిలో కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి, వారిని పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించి, వారికి జెబిపిసిఐ హైపవర్ కమిటీ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ప్రొ. కోదండరాం, మల్లేపల్లి లక్ష్మయ్య, చుక్కా రామయ్య, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులతో పాటు అనేక మంది సింగరేణి కాంట్రక్టు కార్మికులు పాల్గొన్నారు.

పాత్రికేయులు పిరాట్ల వెంకటేశ్వర్లు మృతి

ప్రముఖ పాత్రికేయులు, కృష్ణా పత్రిక పూర్వ సంపాదకులు పిరాట్ల వెంకటేశ్వర్లు డిసెంబర్ 8న హైదారాబాద్‌లో అనారోగ్యంతో చిక్సిత పొందుతూ చనిపోయారు. ఆయన 1940 జూలై 16న కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, ఎన్నునూతల గ్రామంలో జన్మించారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా జీవితాన్ని ప్రారంభించి, అఖిల భారత విద్యార్థి పరిషత్ స్థాయికి ఎదిగారు. ముట్నూరు కృష్ణారావు స్థాపించిన కృష్ణా పత్రికను 1982లో తిరిగి ప్రారంభించి 2012 వరకు నడిపారు.

సంగీత విద్వాంసులు నేదునూరి మృతి

ప్రసిద్ధ కర్ణాటక సంగీత గాయకులు నేదునూరి కృష్ణమూర్తి డిసెంబర్ 8న విశాఖపట్నంలో చనిపోయారు. ఆయన 1927 అక్టోబర్ 10న హైదరాబాద్‌లో జన్మించారు. 1940లో విజయనగరంలోని మహరాజాన్ సంగీత కళాశాలలో శిక్షణ పొందారు. విజయవాడ, విశాఖపట్నం, సికిందరాబాద్‌లోని ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలకు ప్రిన్సిపాల్‌గా పని చేశారు.

తెలంగాణ మంత్రి మండలి విస్తరణ

తెలంగాణ రాష్ట్ర మంత్రి మండలిని విస్తృత పరచడంలో భాగంగా రెండవ దశలో ఆరుగురికి సిఎం మంత్రి మండలిలో స్థానం కల్పించారు. రోడ్లు, భవనాలు, మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి శాఖల మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, గృహ నిర్మాణం, దేవాదాయ, న్యాయశాఖల మంత్రిగా అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, వాణిజ్య, పన్నులు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగా తలసాని శ్రీనివాస్ యాదవ్, విద్యుత్ శాఖ మంత్రిగా సి. లక్ష్మారెడ్డి, గిరిజన అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రిగా అజ్మీరా చందులాల్, పరిశ్రమలు, చక్కెర, చేనేత, జౌళి శాఖల మంత్రిగా జూపల్లి కృష్ణారావులు నియమితులయ్యారు. వీరితో డిసెంబర్ 16న గవర్నర్ నరసింహన్ రాజ్‌భవన్‌లో ప్రమాణం స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి సి.ఎం. కె. చంద్రశేఖర్‌రావు, స్పీకర్ మధుసూదనచారి, మండలి చైర్మన్ స్వామి గౌడ్‌లతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

హైదరాబాద్ బుక్ ఫెయిర్

హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో డిసెంబర్ 17 నుంచి 26 వరకు 28వ 'హైదరాబాద్ బుక్ ఫెయిర్' జరిగింది. ఈ బుక్ ఫెయిర్‌లో 315 బుక్ స్టాల్స్ పాల్గొన్నాయి. తెలుగు, తమిళం, బెంగాలీ, ఇంగ్లిష్, ఉర్దూ, మళయాళం భాషలకు సంధించిన సాహిత్యం, చరిత్ర, అర్థశాస్త్రం మొదలైన పుస్తకాలు లభించాయి. రచయితలు, మేధావులు, కవులు, విద్యావేత్తలు, జర్నలిస్టులు, రాజకీయ నాయకులు సందర్శించారు. అలాగే రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో పాఠకులు సందర్శించారు.

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సమావేశాలు డిసెంబర్ 19 నుంచి 23 వరకు జరిగాయి. ఈ సమావేశాలలో రాష్ట్ర రాజధాని ప్రాంత అభివృద్ధి మండలి (ఎపిఆర్‌డిఎ), వాణిజ్య, విద్యాహక్కు చట్ట సమరణ, మార్కెట్ కమిటీల చట్ట సవరణ బిల్లులను ఆమోదించారు. అలాగే హూదుద్ తుఫాను జాతీయ విపత్తుగా తీర్మానించారు.

గడ్డం వెంకటస్వామి మృతి

కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేంద్ర మాజీ మంత్రి, గడ్డం వెంకటస్వామి (85) (కాకా) హైదరాబాద్‌లోని బంజారహిల్స్‌లోని కేర్ హాస్పిటల్‌లో అనారోగ్యంతో బాధపడుతూ డిసెంబర్ 22న చనిపోయారు. ఆయన 1929 అక్టోబర్ 5న హైదరాబాద్‌లో జన్మించారు. ఆయన రెండుసార్లు ఎంఎల్ఎగా, ఏడుసార్లు ఎంపిగా గెలిచారు. కేంద్ర మంత్రిగా, కాంగ్రెస్ సిడబ్ల్యుసి సభ్యులుగా కూడా పని చేశారు.

పోలవరంపై కమిటీ

పోలవరం ప్రాజెక్టును 2018లోపు పూర్తి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రణాళికను రూపొందిస్తూ డిసెంబర్ 25న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సారథ్యంలో ఒక ఉన్నతాధికారుల కమిటీని నియమించారు. ఈ కమిటీలో ప్రభుత్వ నీటి పారుదల, ఆర్థిక, విద్యుత్ శాఖల ముఖ్యకార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. కేంద్రం చేపట్టబోయే నదుల అనుసంధాన ప్రాజెక్టులలో భాగంగా దీనిని రూపొందించాలని కమిటీ సభ్యులకు తెలియజేశారు. వీ

నక్సల్స్ కాల్పుల్లో జవాన్ల మృతి

డిసెంబర్ 2 నుండి 8 వరకు పీపుల్స్ గెరిల్లా ఆర్మీ వారోత్సవాలను మావోయిస్టు పార్టీ నిర్వహించింది. చత్తీస్‌గడ్‌లోని చింతల్‌నార్, చింతగుప్ప ప్రాంతాలలో నక్సల్స్‌కోసం కూబింగ్ నిర్వహించి డిసెంబర్ 1న తిరిగి వస్తున్న 223 సిఆర్‌పిఎఫ్ బెటాలియన్‌కు చెందిన జవాన్లపై కేశల్‌పాల్ వద్ద నక్సల్స్ మందు పాతర పేల్చి కాల్పులు జరుపడంతో జవాన్లు తిరిగి కాల్పులు జరిపారు. ఈ సంఘటనలో డిప్యూటీ కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్‌తో సహా 14 మంది జవాన్లు మరణించారు. 16 మంది జవాన్లు గాయపడ్డారు.

సిబిఐ డైరెక్టర్‌గా అనిల్‌కుమార్ సిన్హా

కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) కొత్త డైరెక్టర్‌గా 1979 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అనిల్‌కుమార్ సిన్హా డిసెంబర్ 3న బాధ్యతలు చేపట్టారు. ఆయన బీహార్‌కు చెందినవారు. బీహార్‌లో 18 ఏళ్లపాటు ఎస్‌పిగా, అట్లాగే ప్రత్యేక విభాగం డిఐజిగా, ఐజిగాను పనిచేశారు. సిన్హా 2013 మే నుండి సిబిఐ ప్రత్యేక డైరెక్టర్‌గా ఉన్నారు.

మాజీ న్యాయమూర్తి కృష్ణయ్యర్ మృతి

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి వైద్యనాథపుర రామ కృష్ణ అయ్యర్ (100) డిసెంబర్ 4న కేరళలోని కోచిలోని ట్రస్ట్ ఆసుపత్రిలో మృతిచెందారు. ఆయన కేరళలోని పాలక్కాడ్ దగ్గరలోని వైద్యనాథపురంలో 1914 నవంబర్ 15న జన్మించారు. ఆయన న్యాయవాద విద్యను మద్రాస్ లా కళాశాలలో చదివారు. 1937లో న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించారు. ఆయన కేరళలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ నేతృత్వంలో ఏర్పడ్డ తొలి కమ్యూనిస్టు ప్రభుత్వంలో మంత్రిగా చేశారు. 1970వ దశకంలో ఆయన ఏడు సంవత్సరాలు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. ఆయన సూత్రం నిబంధనలను సడలించడం ద్వారా సాధారణ ప్రజలకు కూడా న్యాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. 1975 జూన్ 24న మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పుతో ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించాల్సి వచ్చింది. ఆయన 400 తీర్పులను వెలువరించారు. 70 న్యాయ పుస్తకాలను రాశారు.

కశ్మీర్‌లో సైన్యంపై మిలిటెంట్ల కాల్పులు

కశ్మీర్‌లో డిసెంబర్ 5న కొద్ది గంటల తేడాతో మూడు చోట్ల ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఈ సంఘటనల్లో లెఫ్టినెంట్ కల్నల్ సహా 8 మంది జవాన్లు, ముగ్గురు పోలీసులు మృతి చెందారు. లష్కర్ ఎ తాయిబా కమాండర్ సహా 8 మంది మిలిటెంట్లు, ఒక పౌరుడు మృతి చెందారు.

ఢిల్లీలో కార్మికుల ధర్నా

కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 5న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కార్మికులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. 12 కార్మిక సంఘాలు ఈ ధర్నాలో పాల్గొన్నాయి. కార్మిక చట్టాల సవరణ ఆలోచనను విరమించుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు.

జాతీయ గ్రంథంగా భగవద్గీత!

అధ్యాత్మిక భగవద్గీతకు 5151 ఏళ్లు పూర్తయిన సందర్భంగా డిసెంబర్ 7న ఢిల్లీలో జరిగిన గీతా ప్రేరణ కార్యక్రమం జరిగింది. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న విహెచ్‌పి అధ్యక్షుడు అశోక్ సింగాల్ ప్రధాని మోడీ భగవద్గీతను జాతీయ గ్రంథంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సుష్మా స్వరాజ్ స్పందిస్తూ భగవద్గీతను అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాకు మోడీ బహుమతిగా అందించిన రోజే ఆ గ్రంథానికి జాతీయ గ్రంథం హోదా లభించిందని అన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు

సాహిత్య విమర్శకులు ప్రొ. రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డికి 2014 సంవత్సరపు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. కడప జిల్లాకు చెందిన యోగివేమన విశ్వవిద్యాలయం పరిశోధక విభాగం అధిపతిగా పదవీ విరమణ చేశారు. మార్క్సిస్టు సాహిత్య విమర్శని సుసంపన్నం చేసిన వారిలో ఆయన ఒకరు. మూడు దశాబ్దాలుగా తెలుగు సాహిత్యరంగంలో కృషిచేశారు. ఆయన రచించిన 'మన నవలలు–మన కథానికలు' అనే సాహిత్య విమర్శనా గ్రంథానికి ఈ పురస్కారం లభించినట్టు కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు డిసెంబర్ 19 న ప్రకటించారు. మొత్తం 22 భారతీయ భాషల్లో ఎనిమిది కవితా సంపుటిలు, ఐదు నవలలు, మూడు వ్యాస సంకలనాలు, మూడు కథా సంకలనాలు, ఒక సాహిత్య విమర్శా గ్రంథం, ఒక నాటిక, ఒక ఆత్మకథకు అవార్డులు ప్రకటించినట్లు చెప్పారు.

కె. బాలచందర్ మృతి

ప్రముఖ దర్శకుడు కె. బాలచందర్ (84) డిసెంబర్ 23న చెన్నైలో మరణించారు. ఆయన గత కొద్దికాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆయన బాల్యం నుంచే నాటకాలపై, సినిమా రంగంపై ఆసక్తి ఉండేది. 1949లో చదువు పూర్తిచేసి ముత్తుపేటలోని ఓ పాఠశాలలో ఏడాదిపాటు ఉపాధ్యాయుడుగా పనిచేశారు. అక్కడ కూడా నాటకాలపై ఆసక్తిని వదలుకోలేదు. 1950లో చెన్నై వచ్చేశారు. 1965లో ఎంజిఆర్ నటించిన 'దైవతాయ్' చిత్రానికి మాటలు రాశారు. 1965లో 'నీర్‌కుమిళి' చిత్రంతో దర్శకుడిగా మారారు. తమిళ, తెలుగు, మలయాళం, హిందీ భాషల్లో వంద చిత్రాలకు పైగా దర్శకత్వం వహించారు. రజనీకాంత్, కమల్‌హాసన్, సరిత వంటి ఎందరో అణిముత్యాలు లాంటి నటులను చిత్ర పరిశ్రమకు పరిచయం చేశారు. ఆయనకు ఎనిమిది జాతీయ పురస్కారాలు, పన్నెండు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు, రెండు నంది పురస్కారాలు అందుకున్నారు. 1987లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును అందజేసింది. 2008లో అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో 'జీవిత సాఫల్య పురస్కారం', 2011లో 'దాదా సాహెబ్ ఫాల్కే' అవార్డులు అందుకున్నారు.

జమ్మూ కశ్మీర్, జార్ఖండ్ ఎన్నికల ఫలితాలు

జమ్మూ కశ్మీర్, జార్ఖండ్ అసెంబ్లీలకు ఐదు విడుతలుగా జరిగిన ఎన్నికల ఫలితాలు డిసెంబర్ 23న వెలువడ్డాయి. జమ్మూ కశ్మీర్ 87 స్థానాలున్న అసెంబ్లీలో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి) 28 స్థానాలు, బిజెపి 25, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) 15, కాంగ్రెస్ 12, ఇతరులు 7 స్థానాలు గెలుచుకున్నాయి. దీంతో అధికారంలోకి రావడానికి కావల్సిన 44 సీట్లు ఎవరికీ రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. ఇక జార్ఖండ్‌లో 81 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బిజెపికి 37, దాని మిత్రపక్షమైన ఎజెఎస్‌యుపికి 5 స్థానాలు గెలుచుకొని స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. ఇతర పార్టీలైన జెఎంఎం 19, జెవిఎం 8, కాంగ్రెస్ 6, ఇతరులు 8 స్థానాలు గెలుచుకున్నారు.

అసోంలో ఘర్షణలు

అసోంలో నేషనల్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోలాండ్ మిలిటెంట్లు డిసెంబర్ ఆఖరువారంలో ఆదివాసులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశారు. కోక్రాఝర్, సోనిట్‌పూర్, ఉదల్‌గురి జిల్లాల్లో ఈ దాడులు జరిగాయి. ఈ దాడుల్లో సుమారు అరవై ఐదు మందికిపైగా మరణించారు. మృతుల్లో మహిళలు, పసిపిల్లలు ఎక్కువగా ఉన్నారు. ఈ దాడులను నిరసిస్తూ ఆదివాసులు పోలీస్‌ఠాణా ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ముగ్గురు ఆదివాసులు మరణించారు.

వాజ్‌పేయి, మాలవ్యలకు భారతరత్నాలు

మదన్‌మోహన్ మాలవ్య (మరణానంతరం), అటల్ బిహారీ వాజ్‌పేయిలకు కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ప్రకటించింది. డిసెంబర్ 25న రాష్ట్రపతి కార్యాలయం అధికారిక ప్రకటన చేసింది. దేశ స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న మాలవ్య బనారస్ విశ్వవిద్యాలయం స్థాపనతో దేశ విద్యారంగం దిశ మార్చారు. వాజ్‌పేయి మూడు పర్యాయాలు దేశ ప్రధానిగా బాధ్యతలు నిర్వహించారు. వీ

సార్క్ సమావేశాలు

నేపాల్ రాజధాని కఠ్మాండులో నవంబర్ 26, 27 రెండు రోజులపాటు దక్షిణ ఆసియా దేశాల కూటమి అయిన సార్క్ 18వ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో భారతదేశం, పాకిస్తాన్, శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవులు, అఫ్ఘానిస్తాన్ దేశాలు పాల్గొన్నాయి. దక్షిణాసియా దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలనీ, ముఖ్యంగా ఉగ్రవాదాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలనే ప్రతిపాదనలు వచ్చాయి.

ఇజ్రాయిల్ పార్లమెంట్ రద్దు

ఇజ్రాయిల్‌లో డిసెంబర్ 8న పార్లమెంట్ రద్దుకు జరిగిన ఓటింగ్‌లో మొత్తం 120 సభ్యులకు గాను 93 రద్దు చేయాలంటూ ఓటు వేశారు. వామపక్ష విభాగమైన లేబర్, మెరెతెజ్ పార్టీలు పార్లమెంట్ రద్దు బిల్లును ప్రతిపాదించాయి. ప్రధాని బెంజామిన్ నెతన్యాహు ప్రభుత్వం, పార్లమెంట్ ఏర్పడి రెండేళ్లు కూడ పూర్తి కాలేదు. ఈలోగానే సంకీర్ణ ప్రభుత్వంలో సంక్షోభం మొదలయింది. గత వారం ఆర్థిక, న్యాయశాఖల మంత్రులను తొలగించడంతో సంక్షోభం తీవ్రమైంది. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ వారు తన అధికారాన్నే ప్రశ్నించడంతో ఆయన వారిని తొలగించారు.

ఫ్రాన్స్‌లో ఆర్థిక సంస్కరణలు

ఫ్రాన్స్ ప్రధాని మాన్యువల్ వాల్స్ దేశ ఆర్థిక వ్యవస్థను మరింత మెరుగు పరిచేందుకు, పెరుగుతున్న నిరుద్యోగితను తగ్గించి, ఉపాధి అవకాశాలు పెంచే ప్రణాళికలో భాగంగా డిసెంబర్ 11న ఆర్థిక సంస్కరణలు ప్రకటించారు. ఈ సంస్కరణల్లో భాగంగానే ఆదివారం కూడ వాణిజ్య కార్యకలాపాల నిర్వహణకు అనుమతించడం వంటి చర్యలు ఉన్నాయి. ప్రధాని ప్రకటించిన ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగా తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. దేశవ్యాప్తంగా వేలాది మంది నిరసన ప్రదర్శనలు జరిపారు. దేశాన్ని పాలిస్తున్న వామపక్ష ప్రభుత్వ రాజకీయ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఈ సంస్కరణలున్నాయని ప్రజలు నినదించారు.

జపాన్ ప్రధానిగా మళ్లీ అబే

జపాన్ ప్రధానిగా షింజో అబే మరోసారి ఎన్నికయ్యారు. డిసెంబర్ 14న మొత్తం 475 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అధికార లిబరల్ డెమోక్రాటిక్ పార్టీ (ఎల్‌డిపి) 291 స్థానాలను కైవసం చేసుకుని తన అధికారాన్ని నిలబెట్టుకుంది. దాని మిత్రపక్షమైన కోమీటో పార్టీ 35 స్థానాల్లో విజయం సాధించింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన జపాన్ డెమోక్రాటిక్ పార్టీ 73 స్థానాలు సాధించింది. అబే చేపట్టిన ఆర్థిక విధానాలకు రిఫరెండంగా భావించిన ఈ ఎన్నికల్లో విజయం సాధించడంతో మరింత జోరు పెంచేందుకు అవకాశం దొరికింది.

సిడ్నీ హోటల్‌లో తీవ్రవాది అలజడి

ఆస్ట్రేలియాలోని సిడ్నీలోని ప్రధాన వాణిజ్య కేంద్రం మార్టిన్‌ప్లేస్‌లో డిసెంబర్ 15న ఒక అగంతకుడు షాట్‌గన్, మందుగుండు సామగ్రితో అక్కడి లింట్ చాక్లెట్ కఫేలోకి ప్రవేశించి పదిహేను మందిని నిర్బంధించాడు. పదిహేడు గంటలకుపైగా సాగిన ఈ ఉదంతంలో భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో అగంతకుడు హరోన్ మోనిస్‌తో పాటు ఒక బందీ కూడ చనిపోయాడు.

పెషావర్‌లో ఆర్మీ పబ్లిక్ స్కూల్‌పై దాడి

పాకిస్తాన్‌లోని పెషావర్ నగరంలో డిసెంబర్ 16న ఒక ఆర్మీ పబ్లిక్ స్కూల్‌పై జరిగిన దాడిలో సుమారు 150 మంది చనిపోయారు. ఇందులో 132 మంది చిన్నారి బాల బాలికలు ఉన్నారు. మరో 130 మందికి పైగా గాయపడ్డారు. సైన్యం నిర్వహిస్తున్న ఈ పాఠశాలను లక్ష్యంగా చేసుకొని భారీ ఎత్తున ఆయుధాలతో, పారా మిలిటరీ సరిహద్దు దళ సైనికుల దుస్తుల్లో వచ్చిన ఏడుగురు ఆత్మాహుతి దళ తాలిబన్లు సిబ్బంది, ఉపాధ్యాయులు, చిన్నారులను లక్ష్యంగా చేసుకొని విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. భద్రతా దళాలతో ఎదురు కాల్పుల నుంచి రక్షణగా విద్యార్థులను, ఉపాధ్యాయులను కవచంగా ఉపయోగించుకున్నారు. సైనికుల కాల్పుల్లో ముగ్గురు తాలిబన్లు మరణించగా, మరో నలుగురు తమను తాము పేల్చేసుకున్నారు.

మిలిటెంట్లపై పాకిస్తాన్ దాడి

పాకిస్తాన్‌లోని పెషావర్ స్కూల్‌పై దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్ అఫ్ఘనిస్తాన్ మిలిటెంట్ స్థావరాలపై దాడులు చేసింది. పాకిస్తాన్ వాయువ్య గిరిజన ప్రాంతాల్లో, అఫ్ఘనిస్తాన్ సరిహద్దుల్లోని తాలిబన్ల స్థావరాలపై వైమానిక దాడులు చేపట్టింది. ఈ దాడుల్లో దాదాపు 150 మందికి పైగా తాలిబన్ మిలిటెంట్లు మరణించారు. మరోవైపు అఫ్ఘనిస్తాన్ సైన్యం చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో 140 మందికి పైగా మరణించారు. డిసెంబర్ 20న పాకిస్తాన్ భద్రతా బలగాలు జరిపిన వైమానిక దాడుల్లో తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్తాన్ (టిటిపి) నేత, పెషావర్ స్కూల్‌పై దాడికి ప్రధాన సూత్రధారి అయిన ముల్లా ఫజలుల్లా మరణించాడు.

అమెరికాలో కొనసాగుతున్న నల్లజాతీయుల హత్యలు

అమెరికాలో నల్లజాతీయులపై పోలీసుల కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి. మైఖెల్ బ్రౌన్‌ను కాల్చిన ప్రాంతం సెయింట్ లూయిస్ చేరువలోనే ఆంటోనియో మార్టిన్ అనే 18 ఏళ్ల నల్లజాతి యువకుడిని పోలీసులు అమానుషంగా కాల్చి చంపారు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగాయి. బర్కిలీ శివార్లలో ఉన్న సెయింట్ లూయిస్ ప్రాంతంలో పోలీసులు సాధారణ తనిఖీల నిమిత్తం మొబైల్ గ్యాస్ స్టేషన్ వద్దకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు అనుమానంగా కనిపించడంతో కాల్పులు జరిపామనీ పోలీసులు మరోసారి కట్టుకథలు అల్లారు. ఈ ఘటనతో మరోసారి తీవ్ర ఘర్షణ వాతావరణం అలుముకుంది. మరోవైపు గార్నర్ మృతికి నిరసనగా అమెరికా వ్యాప్తంగా ప్రజలు ఆందోళనలు చేపట్టారు. అమెరికాలోని అన్ని ప్రముఖ నగరాల్లో నిరసన ప్రదర్శలు జరిపారు. న్యూయార్క్, బర్కిలీ, అట్లాంటా, హాలీవుడ్, పోర్ట్‌లాండ్, శాన్‌ఫ్రాన్సిస్కో తదితర పట్టణాల్లో వేలాది మంది వీధుల్లోకి వచ్చి తమ నిరసనలు తెలిపారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : వై.రామచంద్రం, ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(నవంబర్ 1 నుండి నవంబర్ 30, 2014 వరకు తెలంగాణలోని 6 జిల్లాలు (971), ఆంధ్రప్రదేశ్‌లోని 4 జిల్లాలలో (302) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1273)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు		ఆత్మహత్యలు ఇతరాలు		చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	1	6	-	16	24	4	9	3	2	2	2	2	1	3	23	22	-	-	-	2	5
మెదక్	4	36	4	10	14	18	19	-	11	25	22	36	39	18	48	19	-	2	-	8	2
కరీంనగర్	-	15	6	11	9	3	4	3	2	3	3	4	-	12	52	-	-	-	-	-	-
ఖమ్మం	-	-	-	6	8	8	12	2	-	-	-	-	-	1	14	13	-	-	-	-	-
మహబూబ్‌నగర్	2	15	1	18	20	5	8	5	-	-	10	22	19	7	54	10	-	-	-	-	7
రంగారెడ్డి			వివరాలు అందలేదు																		
నల్గొండ			వివరాలు అందలేదు																		
నిజామాబాద్	-	-	-	11	28	-	1	-	3	11	9	-	2	5	25	18	-	-	-	-	2
వరంగల్			వివరాలు అందలేదు																		
తెలంగాణ	**7**	**72**	**11**	**72**	**103**	**38**	**53**	**13**	**18**	**41**	**46**	**64**	**61**	**46**	**216**	**82**	**-**	**2**	**-**	**10**	**16**
అనంతపురం	-	4	-	6	16	2	1	2	1	4	2	2	12	8	34	-	-	-	-	-	-
చిత్తూరు	-	-	-	4	2	8	8	-	-	-	4	8	10	-	27	8	-	-	-	-	-
కడప	-	1	-	2	6	-	-	3	-	1	1	-	-	-	15	6	-	-	-	-	1
కర్నూలు			వివరాలు అందలేదు																		
ప్రకాశం			వివరాలు అందలేదు																		
శ్రీకాకుళం			వివరాలు అందలేదు																		
విశాఖపట్నం	1	-	-	2	6	2	3	-	-	5	2	4	8	4	25	15	-	-	-	16	-
ఆంధ్రప్రదేశ్	**1**	**5**	**-**	**14**	**30**	**12**	**12**	**5**	**1**	**10**	**9**	**14**	**30**	**12**	**101**	**29**	**-**	**-**	**-**	**16**	**1**

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 162 - January 2015 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/12/2014 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2014-16


Date of Posting : 29th, 30th

‘వీక్షణం’ను ఆదుకుందాం
‘వీక్షణం’ నాలుగు కాలాల పాటు నిలిచేందుకు చేయూతనిద్దాం

తెలుగులో ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ వంటి పత్రిక ఉండాలనే ఆలోచనతో, సీనియర్ పాత్రికేయులు వి. హనుమంతరావు సంపాదకులుగా 2003లో ప్రారంభమై, 2005 నుంచి ఎన్. వేణుగోపాల్ సంపాదకత్వంలో నడుస్తున్న రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక ‘వీక్షణం’ తెలుగు సమాజానికి అవసరమైన చర్చావేదికగా పనిచేస్తున్నదని, మనందరితో పాటు ఎందరో పాఠకుల ఆదరాభిమానాలు చూరగొన్నదని మనకు తెలుసు. పన్నెండు సంవత్సరాలుగా నిరంతరాయంగా నడుస్తున్న ఈ పత్రిక ఆర్థిక పరిస్థితి ఇప్పటికీ దినదిన గండంగానే ఉంటున్నది. ఎప్పుడు ఆగిపోతుందో తెలియదని దాదాపు ప్రతినెలా పత్రికలో అచ్చవుతున్న ఆందోళనాకరమైన ప్రకటన, ఈ పత్రికను నిలబెట్టడానికి తోడ్పడమనే అభ్యర్థనలు మా ఈ బహిరంగ ప్రకటనకు కారణం. ఇంతకాలంగా నిర్వాహకులు కష్టనష్టాలు భరిస్తూ సాగించిన కృషికి ఇప్పుడు మన సహకారం అవసరమని చెప్పడానికే ఈ ప్రకటన.

‘వీక్షణం’ ఈ పన్నెండు సంవత్సరాలలో మూడువేలకు పైగా వ్యాసాలను ప్రచురించి ప్రాంతీయ, దేశీయ, అంతర్జాతీయ అంశాలెన్నిటి పైననో తెలుగు సమాజానికి అత్యవసరమైన సమాచారాన్నీ, వివరణలనూ, విశ్లేషణలనూ అందించింది. సంపాదకుడి అభిప్రాయాలే వైనప్పటికీ, తెలుగు సమాజంలో ఉన్న ప్రగతిశీల భావాలకూ, ధోరణులకూ అన్నిటికీ ప్రజాస్వామిక స్ఫూర్తితో వేదిక కల్పించింది. ప్రతిష్ఠాత్మకమైన ఐఎస్ఎస్ఎన్ గుర్తింపు సంపాదించి పరిశోధక విద్యార్థులకు, విశ్వవిద్యాలయ అధ్యాపకులకు అవకాశాలు కల్పించింది. ప్రతి సంవత్సరం రచయితల సమావేశాలు, సంభాషణలు ఏర్పాటు చేసి తెలుగు సమాజంలో సామాజిక శాస్త్ర రచనను ప్రోత్సహించింది. వ్యాసరచనా అధ్యయన తరగతులు నిర్వహించి వ్యాసప్రక్రియ ప్రమాణాలు పెంచడానికి తన వంతు కృషి చేసింది. పత్రికలో లబ్ధప్రతిష్ఠుల రచనలు ప్రచురించడంతో పాటు, విషయమే ప్రధానంగా ఐదారు వందలమంది కొత్త వ్యాసకర్తలకు అవకాశం కల్పించింది. ‘ఒక దళారీ పశ్చాత్తాపం’ వంటి విస్తృత ప్రచారం పొందిన పుస్తకంతో సహా దాదాపు డజను పుస్తకాలు ప్రచురించింది.

తెలుగు సమాజానికీ, మేధో ప్రపంచానికీ, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణకూ ఇంత దోహదం చేసిన ‘వీక్షణం’ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు, ఆ దీపం కొడిగట్టిపోకుండా కాపాడడం సమాజం బాధ్యత. ఇతోధిక పాఠకులను తయారు చేయడం, విరివిగా చందాలు చేర్పించడం, వ్యాపార ప్రకటనలు సేకరించిపెట్టడం, విరాళాలు అందించడం మన కనీస కర్తవ్యం. ‘వీక్షణం’ శ్రేయోభిలాషి, చరిత్రకారులు వకుళాభరణం రామకృష్ణ ‘వీక్షణం’ రచయితల సమావేశాల్లో సూచించినట్టుగా ఆర్థిక ఇబ్బందుల నుంచి సుస్థిరమైన పద్ధతిలో గట్టెక్కాలంటే ‘వీక్షణం’కు ఒక మూలనిధి కూడ ఏర్పాటు చేయవలసి ఉంది. మనంతట మనం మన శక్తి మేరకు గాని, విరాళాలు ఇవ్వగలిగిన మిత్రుల ద్వారా గాని ఈ మూలనిధి విరాళాలు సేకరించి మనందరికీ, మొత్తంగా సమాజానికీ అవసరమైన ‘వీక్షణం’ రాజకీయార్థిక, సామాజిక మాసపత్రికను కాపాడుకుందాం. ఈ చైతన్యజ్వాల ఆరిపోకుండా మన రెండు చేతులూ అడ్డుపెట్టి వెలుగు నిరంతరం ప్రసరించనిద్దాం.



Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao